
విషయానుక్రమణిక

చిత్రములు

వర్ణచిత్రము:—శ్రీమహావిష్ణువు; ‘ ఫెయిజీ ’ కృతరామాయణమునందలి పత్రము, చిత్రము.

సాధారణ చిత్రములు:—మహాత్ముడు మదరాసు ఆయుర్వేదిక్‌ఫార్మసీని తిలకించి వెడలుట; హిందూపత్రికాకార్యాలయమున మహాత్మునిచే జరుపబడిన కీ. శే. యస్. కస్తూరి రంగయ్యంగారి చిత్రప్రతిష్ఠాపన మహోత్సవము; తిరువల్లిక్కేణి సముద్రతీరమున మహాత్ముని మహోపన్యాసము; మైలాపూరు ‘అంజాద్ బాగు’లో మహాత్మునకు తోటవిందు; చెన్నపురి నేపియరుపార్కులో జరిగిన సభయందు మహాత్మునకు స్వాగతపత్ర సమర్పణము; చెన్నపురి తిరువల్లిక్కేణిలో నూలువడకు స్త్రీల పోటీప్రదర్శనము; గోక్లేహాలులో మద్యపాననిషేధ సంఘసభ్యులకు మహాత్ముని హితోపదేశము; ఆదిద్రావిడ జనసంఘమున మహాత్ముని ఉపన్యాసము; కృష్ణాజిల్లా, పెదపాళెం, కృష్ణాశ్రమంతాలూకు నాల్గుచిత్రములు; ఇతరచిత్రములును.



వత్సరాది

వారణాసి సూర్యనారాయణశాస్త్రిగారు

ప్రకృతి లక్ష్మీవిలాస పరంపరలకు
నవనవోన్మేషభాగ్య సంధాయకంబు
విశ్వమానవ హృదయ సంప్రీతికరము
వచ్చె నేఁడిదె నూతన వత్సరాది.

గీ. ఆఱు ఋతువులు నంకము లామనిదొర
నాయకుఁడు గాఁగ వల్లికల్ నవ్యరాగ
భరితముగఁ జూపు నాట్యప్రబంధమునకుఁ
బరభృతము సూత్రధారుఁడై పాడఁదొడఁగె.

గీ. మెల్లమెల్లన మలయ సమీరణుండు
సౌధపర్యంకికా తల శయితలైన
కుసుమగాత్రుల కుచశాటి కొదువఁ దీర్చి
సరస చికురాళి సవరింపు సవదరించె.

గీ. క్రొంజిగురులెత్తి బెడఁగారుగున్న తరుల
యలరుగుత్తుల నత్తావి యలమి కొనియె.
ఉదిత ముదితంబులై మించు యువజనాళి
హృదయముల నూత్న భావసంపదయుఁ బోలె.

గీ. శుభహరిద్రానులేప విస్ఫూర్జితముగఁ
గన్యకామణు లభ్యంగకం బొనర్చి
నింబ కుసుమంబు నూత్న చూతంబుతోడ
గలుపుచున్నారు పూతలై తొలుతఁ గుడువ.

భారతీ ప్రశంస

దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు

ఆంధ్రపుత్రుల సారస్వతాభివృద్ధి
పొంపు చెడియుండఁ బునరుద్ధరింపఁ దలఁచి
అలఘు వినుత శ్రీకరాకృతి వెలసినట్టి
భారతివి భారతీ! నమస్కారమమ్మ!

సీ. కనుగొల్పుచున్నావు కవికుమారుల లేఁచి
భావగీతమ్ములు పాడుఁ డనుచుఁ
గవియించుచున్నావు ఘనులఁ గొందఱఁ బూర్వ
పక్షసిద్ధాంతముల్ వ్రాయుఁ డనుచుఁ
బురికొల్పుచున్నావు బుద్ధిమంతుల స్వాత్మ
దేశచారిత్రముల్ దెలుపుఁ డనుచు
నెనకొల్పుచున్నావు రసికుల జాతీయ
శిల్పనైపుణిఁ బ్రదర్శింపుఁ డనుచు
గీ. నొసఁగుచున్నావు తల్లి! చేయూఁత మాకు
చల్లుచున్నావు, విశ్వవిజ్ఞానబీజ
ములను, యువహృదయక్షేత్రముల ననంత
కరుణమెయి, భారతీ! పత్రికామతల్లి!

చ. పలికెద నిక్కువంబయిన పల్కు మఱొక్కటి ప్రౌఢప్రౌఢసరస
గలకలలాడు నీ మొగముఁ గాంచిన, ముద్దులుమూటగట్టు నీ
పలుకులువిన్న, నెట్టి జడభావునకైన మనంబు పల్లవిం
చు, లలితభావముల్ మొలపుసూపఁగ, విన్నను వాక్కు, భారతీ!

గీ. కోవిదోచిత కల్యాణగుణములెల్ల
పసితనంబుననే నీకుఁ బట్టువడెను
నింతకన్న మహోన్నతి నెనయుమమ్మ
భారతీ! శాశ్వతయశంబు, పడయుమమ్మ!



చెన్నపట్టణము, ఏప్రిల్ ౧౯౨౫

సంపుటము ౨. క్రోధన సంవత్సరము చైత్రమాసము సంఖ్య ౪.

ఆంధ్రకవిత్వ చరిత్రము

భోగరాజు-నారాయణమూర్తిగారు

IX

ఆంధ్రకవితాపోషకులు

ఉ. తమ్మికొలంకునందు, విరిదమ్మివసించి, కిరీటహారప
ద్మమ్ములరాజిలన్, బ్రణవమధ్యమునన్, "బరమాత్మలోనసై
క్యమ్మగుచుండు నీప్రకృతిఁగన్గొనుఁడీ" యనుచుం గవీంద్రలో
కమ్మునకున్ వచించుగతిఁ గన్పడు నిన్ను స్మరింతు భారతీ!

ఏదేశమున నేభాషయందుఁ బరిశీలించినను సాధారణముగా సాహిత్యమును గవిత్వమును రాజాదరణముచేతనే ప్రవృద్ధిగాంచుచుండుట మనము కనిపెట్టఁ గలుగుచుందుము. ఈరాజాదరణము కొన్నిశతాబ్దములవఱకు నత్యున్నతి వహించియుండి, క్రమక్రమముగాఁ బ్రజాదరణముక్రింద మారిపోవుచుండుటకూడ మనము పెక్కుభాషలయందలి కవితాచరిత్రములలోఁ జూడఁగలము. నన్నయనాఁటి రాజాదరణ మాంధ్రకవిత్వమునకును, కాళిదాసాదులనాఁటి రాజాదరణము సంస్కృత కవిత్వమునకును నేఁడు లేకపోవుటయే దీనికిఁ దార్కాణము.

పదునాలుపదునేడవశతాబ్దములనాఁటి రాజాదరణము పందొమ్మిదవ శతాబ్దమున నాంగ్లకవిత్వమునకు లేకుండుటయు నీయంశమున కాధారమైనదే.

ఈసందర్భమున మనయాంధ్రకవిత్వమునకు రాజాదరణదశయనియుఁ బ్రజాదరణ దశయనియు నప్రయత్నముగ రెండుదశలు గాన్పించుచున్నవి. ఈరెండింటిలో నాంధ్రకవిత్వమేదశయం దత్యౌన్నత్యము వహించియుండెనో, యేదశయం దెంతవఱకు క్షీణతనొందెనో, యావృద్ధి క్షీణతల కెన్నెన్ని విధములైన కారణములు కలవో మొదలగు విషయములను జర్చించుట యవసరమగుటయేకాక, రాజాదరణమునుండి ప్రజాదరణములోని కాంధ్రకవిత్వము మేడపైనుండి దుమికిన ట్లొక్కమారే దుమికెనో లేక సోపానక్రమమునఁ గ్రమక్రమముగనే ప్రవేశించెనో, రాజాదరణ దశనుండి తప్పి, యెన్నెన్ని యంతర్దశలను బొందిపొంది కడకుఁ బ్రజాదరణదశయందుఁ జేరుకొనఁ గలిగెనో యను విషయములుగూడ మన మాయాసందర్భముల ననుసరించి విమర్శింపవలసియుండును.

పూర్వకాలపు విశ్వవిద్యాలయములు

ఒక్కకవిత్వమునే కాక పూర్వపురాజులు పెక్కుకళలను శాస్త్రములనుగూడ నభివృద్ధి నొందించుచుండుటచేత నేటివిశ్వవిద్యాలయములవంటి వాకాలములలో లేవని చెప్పుట కవకాశములేదు. మన కప్పటివిశ్వవిద్యాలయస్థానము లగ్రహారములే. ఇయ్యగ్రహారము లున్నతవిద్యాప్రచారమునకై పునర్గ్రహణాధికారము లేకుండ, రాజులచేఁ బండితులకు దానరూపమున నొసంగఁబడినట్టివి. సకల విద్యాతత్త్వవేదులు (Professors) బహువిధ శాస్త్రోపాధ్యాయులు (Lecturers) నొక్కచోఁ గూడి వివిధప్రదేశములనుండి వచ్చు విద్యార్థులకు నభిమతశాస్త్రంబుల బోధించుచు నాయాయగ్రహారములయందు సుఖజీవనము గావించుచుండిరి. పూర్వకాలపుఁ జరిత్రలలోఁ గథారూపముగాఁ జెప్పుకొనఁబడుచుండిన కవులును బండితులునుగూడ నట్టి యగ్రహారవిశ్వవిద్యాలయములయం దుత్తీర్ణులైన మహామహులే కావచ్చును.

చీపురుపల్లి విశ్వవిద్యాలయము

తూర్పుచాళుక్యప్రభువగు మొదటివిష్ణువర్ధనుఁడు వేదవేదాంగేతిహాసన్యాయాద్యఖిల విద్యాప్రచారమునకై యాంధ్రదేశమున విశాఖపట్టణ మండలమునందలి విజయనగర సమీపమునఁగలఁ చీపురుపల్లిగ్రామమున నొకవిశ్వవిద్యాలయము స్థాపించినట్లును, తన వంశస్థుల కెవ్వరికిని బునర్గ్రహణాధికారము లేకుండ నవ్విద్యాలయముకొఱ కాగ్రామమును శాశ్వతదానరూపమున నొసంగినట్లును మన కీక్రిందిశాసనమువలనఁ గొంత తెలియఁగలదు.

Cheepurupally grant of Vishnuvardhana, the Ist (E-c) 632 A. D. :—

"(L-10) To the two sons' sons of Brahmaserman who studied and mastered the Veda and Vedangas—the sons of Durga serman, who was intent upon performing his own proper rites prescribed by his own *Sokha*, which had been duly learned *by him*—Viz., to Vishnuserman and Madhavaserman, who knew the true meaning of the Vedas the Vedangas, the Epics, the Puranas, the Law

books, and many other sacred works, who are of the Gautamagotra, and who belong to the Taithiriya Charana, by me residing at the town of Cherupura in the Poka (?) Vishaya on the occasion of an eclipse of the moon in the month Sravana, this village has been given as an *agrahara* with exemption from all taxes, for the increase of (my) own religious merit and duration of life and good *health* and fame. No obstruction to the enjoyment of it should be caused by any one at all " †

పులకేశి - రాజరాజు

ఇట్టివిద్యాలయములలో సామాన్యముగ సకలవిద్యలు నభ్యసింపఁబడుచుండినను, తద్విద్యాలయనిర్మాణకర్తలగు రాజుల కభిమానమైన శాస్త్రములును, అభిమానమైన మతమును మాత్రము ముఖ్యముగా నెక్కుడు ప్రచారము నొందింపఁబడుచుండెను. నాఁడే కాక నేఁటివిశ్వవిద్యాలయములయందుఁగూడ నీయాచారము లేకపోలేదు కదా? ఏయే రాజుల కేయేశాస్త్రములు నేయేమతములు నభిమానములైయుండెనో మనకుఁ దెలిసిన యెడల నాయారాజులచేఁ బ్రోత్సహింపఁబడిన కవిత్వసైతము నిట్టిదియైయుండునని గుర్తించుటకుఁ గొంతయవకాశము కలుగకపోదు. ఇందు కజ్ఞాతయుగములోని పులకేసియు, నన్నయయుగములోని రాజనరేంద్రుఁడును మనకు నాధారముగాఁ గొనఁదగినవారు. పులకేసి జైనమతాభిమాని. రాజరాజు వేదమతప్రతిష్ఠాపకుఁడు. జైనమతప్రచారమునకై యాతఁడును వేదమతప్రచారమునకై యీతఁడును దమతమయుగములలో విద్యాభివృద్ధి గావించుచుండిరి. అందుచేతనే పులకేసికృతిపొందిన భారతము జైనమతానుకూలముగను, రాజరాజుకృతిపొందిన భారతము వేదమతానుకూలముగను రచింపఁబడినవి. ఆంధ్రకవితాపోషకులలో నగ్రగణ్యుఁడని యెన్నఁదగిన రాజరాజుసైతమును గవిత్వముతోఁ బాటు తదితర విద్యలను, శాస్త్రములను, విద్యాలయములమూలముననో మరియొకవిధముననో ప్రోత్సహించియుండవలయును. అట్లుగానిచో వానియాస్థానమునందు నన్న పార్యనారాయణభట్టాదికవులతోఁ బాటు బహుశాస్త్రములయందు బ్రవీణులైన పండితు లుండుటతటస్థింపదు. అందుచే నాదిరాజవతంసులలోఁ గొందఱు కవిత్వముతోఁ బాటు పెక్కువిద్యలకుఁ బ్రోత్సాహకారులై యుండిరనియు; వానిలోఁ గవిత వారి కభిమానవిద్యయై యలరారుచుండెడిదనియు ననుకొనవచ్చును.

ప్రాచీనవిద్యాపీఠములు

భారతవర్షమునందలి పూర్వపు విశ్వవిద్యాలయములనుగూర్చి "ప్రాచీనవిద్యాపీఠము"లనుపేర మ-రా-శ్రీ. చిలుకూరినారాయణరావు పంతులుగారిచే రచింపఁబడిన యుద్గ్రంథ మీసందర్భమున మనము స్మరింపఁదగినది. ఇందు మనయాంధ్రదేశముతోఁగాని యాంధ్రభాషతోఁగాని సంబంధించిన పూర్వపువిద్యావిశేషములఁ గూర్చి యంతగా లేకున్నను, విద్యాస్థానములని నుతికెక్కిన కాశ్మీరము, కాశి, నాలందా, ధాన్యకటకము, మధుర మొదలైన యున్నతవిద్యాపీఠములంగూర్చియు, నాయావిద్యాపీఠములయందుఁ బ్రచా

† I. A. Vol. No 20 Page 17.

రమునొందింపఁబడుచువచ్చిన విద్యావిశేషములనుగూర్చియుఁ దద్విద్యావిశేషములు ప్రచారము నొందుచుండిన విధానములం గూర్చియు నూతనాంశముల నేకములు సంపాదించి ప్రకటించిన నారాయణరావుపంతులుగారు మన కెంతయు వందనీయులు. నేఁటివిశ్వవిద్యాలయములవంటి వా కాలములో లేవనియు, విద్యాప్రచారమునకై పాశ్చాత్యసంపర్కజనితమైన నేఁటినాగరకత నాఁడు గానరాదనియు భ్రాంతిపడువారికెల్ల నీగ్రంథ ముత్తమాదర్శమని చెప్పఁదగును. ఇందుకు నిదర్శనముగాఁ దద్గ్రంథమునుండి విక్రమ శిలా విద్యాలయములోని విద్యాప్రచారవిధానములను గొన్నింటి నిందు బొందుపరచెదను.

“నాలందాయందువలె నిచటను నాలుకలాశాల లుండెను. భయపాలుని రాజ్యమున వీనిలో నొక్కొక్కకలాశాలకు [1] ద్వారపండితుఁడను నొకయధ్యాపకుఁ డధికారిగా నుండెను. ఈద్వారపండితుల ప్రశ్నలకు [2] సదుత్తరముల నిచ్చువారే యచటిమఠములఁ జేరనర్హులై యుండిరి. మఠమునకు నాలుగుమూలల నున్న నాలుగు కళాశాలలలోనికి నందఱు విద్యార్థులును బోయి చదువుకొన వీలులేకుండెను. ఆరామమధ్యముననున్న ‘శాస్త్రగృహము’నందు ‘ప్రజ్ఞాపారమితసూత్రము’లను ధర్మగ్రంథములఁజదువుటకు శ్రమణులు మాత్రము చేరుచుండిరి. ఈమధ్యకళాశాలలో నధ్యాపకులుగనుండిన యిరువురుపండితులకును మఠమునకుఁ [3] బ్రథమద్వితీయ స్తంభములను నామములుండెడివి. ధర్మపాలునికాలమున నీమఠమునకు శ్రీభద్రజ్ఞానపాదుఁడను వాఁ [4] డధ్యక్షుఁడుగా నుండెను.

ఇచటికి జదువుకొనుటకువచ్చిన విద్యార్థులందఱు నిందే నివసించుచుండిరి. మఠము యొక్క నాలుగుద్వారములయొద్దనున్న నాలుగుసత్రములందును వీ రుచితముగ భోజనము చేయుచుండిరి. ఈసత్రముల నప్పటి రాజులును ధనవంతులును బోషించుచుండిరి”

తమిళ సంగములు

ఇంక నీవిద్యావిషయము లిట్లుండఁ బ్రాచీనకావ్యరచనంగూర్చియుఁ దత్కావ్యప్రాశస్త్యనిర్ణయముంగూర్చియుఁ బైగ్రంథమునం దిట్లు వ్రాయఁబడినది.

“బౌద్ధులకు సంఘారామము లెట్లో తమిళులకు సంగములు పూర్వకాలమున నట్లుండెను. ఇవి పూర్వకాలపు పరిషత్తులకు సరిపోవును. పరిషత్తులందు ధర్మసూక్ష్మము లెట్లు నిర్ణయింపఁబడుచుండెనో యీతమిళసంగములం దాగ్రంథకర్తల గ్రంథముల ప్రాశస్త్యమట్లు నిర్ణయింపఁబడుచుండెను. ఈసంఘసభ్యుల యామోదమును బడయనిగ్రంథము ప్రసిద్ధిలోనికివచ్చుటకు వీలులేకుండెను. ఇందలి సభ్యులు శాస్త్రములయందుఁ బ్రవీణులై తాము మొదటకావ్యరచనయందు బ్రఖ్యాతివడసినవారై యుండిరి. వీరు కేవలము నాయాగ్రంథములను బరీక్షించుచుండిరేకాని విద్యాగురువులుగానుండలేదని తెలియవచ్చుచున్నది.”

1 Entrance examiner.
2 Entrance examination questions.
3 The Chief and the assistant lecturers
4 The principal.

"ఏగ్రంథములు దేశవాఙ్మయమునందుండఁదగినవో యెట్టివుండఁగూడదో నిర్ణయించుటకుఁ బూర్వకాలమున నాంధ్రదేశమున సంఘము లుండినట్లు కాన్పించదు. అట్టి ప్రతిష్ఠాపనయొకటి యావశ్యకమా కాదా యను సంశయముతో మనకుఁ బనిలేదు. కావ్యకర్తలయూహాల నరిట్టనెంచి, వాఙ్మయస్వరూపమును నిర్ణయించుటకుఁ గొందఱు పండితులు సమర్థులైయుండఁజాలరు. కావ్యమామోదింపబడుటయు నుపేక్షింపఁబడుటయు ప్రజలచిత్తమునకు వదలివేయవలసియుండును. అప్పుడే స్వతంత్రవాఙ్మయము బయలువెడల వీలగును. ఆంధ్రవాఙ్మయము మిట్టిస్వాతంత్ర్యముతోడనే వ్యవహరించినది."

ఇట్లు తమిళసంఘములవంటి పరిషత్తులు గ్రంథప్రాశస్త్య నిర్ణయమునకై పూర్వమాంధ్ర దేశమున లేకుండెననియు, అట్టి పరిషత్ప్రతిష్ఠాపనయొకటి యావశ్యకమా కాదా యను సంశయముతో మనకుఁ బనిలేదనియు, కావ్యకర్తల స్వాతంత్ర్యమున కిట్టిపరిషత్తులు భంగకరములనియు సెలవిచ్చిన నారాయణరావు పంతులుగారే మరియొకచోట నిట్లు వ్రాయుచున్నారు.

"ఈరీతిగా నతివైభవోపేతుఁడై బ్రాహ్మణమతము నాంధ్రలోకమున వ్యాపింపఁజేయ సమకట్టి రాజరాజొక విద్వత్పరిషత్తు నేర్పఱిచి, వారితోఁ దెనుఁగుకావ్యమును రచింపవలసిన పద్ధతుల నేర్పఱచి, యాపద్ధతుల మీఁదనే భారతరచన నడపించుచుఁ, దానును విద్వాంసుఁడగుటచేఁ దనకుఁ దోఁచినచోట కొన్ని పద్యములను జేర్చుచు, నీ పరిషత్తునకుఁ దన వంశము నాశ్రయించి చిరకాలముండిన వంశమున జనించి, యనురక్తుఁడై సకల పురాణేతిహాస కథా కథనదక్షుండై నిత్యసత్య వచనుఁడును మతిమంతుఁడునై యుండుటయే కాక శబ్దశాసన బిరుదమునకుఁ బాత్రుఁడైయుండిన నన్నయభట్టు సభ్యునిగా నియమించి, తెనుఁగుభాషకు మహోపకారము గావించెను."

రాజనరేంద్రుని పరిషత్తులు

పైవచనము స్వవచనవ్యాఘాతమేమో యని సంశయింపవలసి వచ్చుచున్నది. పూర్వమునుండియు రచింపఁబడుచుండిన గ్రంథములలో మనకులభించినది ప్రథమగ్రంథమని కొందఱిచేతను, ఆంధ్రమునఁ గావ్యరచన సృష్టించుటచేతనే ప్రథమగ్రంథమని కొందఱిచేతను, భావింపఁబడుచుండిన నన్నయరచిత భారతభాగము తోడనేకదా మన యాంధ్ర వాఙ్మయము ప్రారంభించుచున్నది. అభిప్రాయములు వేఱైనను బ్రథమగ్రంథమని యుభయ పక్షములవారిచేత నంగీకరింపఁబడుచుండిన భారతమే రాజరాజు స్థాపించిన పరిషత్తునందు మృదుమధుర రసభావ భాసుర నవార్థ వచన రచనా 'విశారదు'లైన మహాకవుల యెదుటఁ జదువఁబడి, వారిచే విమర్శింపఁబడి పరిష్కరింపఁబడినపుడు, గ్రంథప్రాశస్త్య నిర్ణయము పరిషత్తుల మూలమునఁ గావించు నాచారము మన యాంధ్ర వాఙ్మయమున లేకుండెనని యెట్లు చెప్పఁగలము? వైయాకరణులు పౌరాణికులు తార్కికులు నాదిగాఁగలుగు విద్వాంసు లనేకులు తనయాస్థానమునందుండినను బలువురు

కవులచే నుత్తమకావ్యములు వ్రాయించుటకును దాను వ్రాయించిన కావ్యములు ప్రసిద్ధి వడయుటకై చక్కఁగాఁ బరిష్కరింపఁ బడుటకును రాజమహేంద్రమునందలి కవీంద్రుల నెల్లఁ జేరఁదీసి రాజరాజొక సమాజము స్థాపించెనని 'రాజమహేంద్ర కవీంద్ర సమాజ సురత్న్మజ'యని నన్నయగావించిన సంబోధనమువలనఁ దెల్లమగుచున్నది. రాజరాజు ప్రోత్సాహము వలన భారతముతోఁ బాటుగ మరికొన్ని గ్రంథములుఁగూడ రచింపఁబడి యుండును. లేదా రచించు ప్రయత్నములైనను జరిగియుండును. నన్నయ గావించిన విద్వత్సభాస్తవము వలనఁ గూడ నానాఁడు కవితా సంబంధమగు నిట్టి సభలు తరుచుగా జరుగుచుండెననుటకు మరింత యాధారము కలుగుచున్నది.

చ. పరమ వివేక సౌరభవి
భాసిత సద్గుణ పుంజవారి జో
త్కర రుచిరంబులై సకల
గమ్య సుతీర్థములై మహామనో
హర సుచరిత్ర పావన ప
యః పరిపూర్ణములైన సత్సభాం
తర సరసీరుహంబుల ము
దంబొనరం గొనియాడి వేడుకన్.

రాజరాజు చోళరాజుల యల్లుండగుట చేత, తమిళ గ్రంథములు పరిషత్తులమూలమున నిర్ణయింపఁబడుచుండిన యాచారమును దాను గనిపెట్టి, కావ్యప్రాశస్త్యనిర్ణయమునకై యిట్టి పరిషత్తులు తన రాజధానియందును జరుపుచుండెననియుఁ జెప్పవచ్చును.

రాజాస్థానము లేనిపరిషత్తులు

మొత్తముపైఁ గావ్య విమర్శకుఁ దమిళ సంగములవంటి పరిషత్తులు పూర్వ రాజాస్థానములేయని వాఙ్మయ విశారదులకు స్ఫురింపక మానదు. తమిళ సంగములు చేయుచుండిన పనులు మనయాంధ్రరాజుల యాస్థానముల యందుఁ గొంతవఱకుఁ గావింపఁబడుచుండెడివి. తిక్కనవంటి మహాకవిసైతమును దన కావ్యము లిట్టిపరిషత్తులయందుఁ బరిష్కృతములైనట్లుగ

"......కావ్యంబు పరసులైన
కవులచెవులకు నెక్కినఁ గానినప్పుఁ
డెందుఁ బరిణతిగల్గు కవీశ్వరుండు."

అను వాక్యమూలమున సూచించుచున్నాఁడు. కాని తిక్కన కావ్యములను విమర్శించిన పరిషత్తు, ఆకాలమునందు యథాక్రమముగ స్థాపింపఁబడి యుండినట్టిదియో, లేక స్వకావ్యప్రాశస్త్యనిర్ణయమునకై తిక్కనచేఁ దాత్కాలికముగ నెలకొల్పఁ బడినట్టిదియో మనము చెప్పలేము. ఏదియైనను బరిషదాచారమునకు మాత్రము తిక్కన బద్ధుఁడు కాకపోలేదని పై వాక్యమువలనఁ దెలియుచున్నది.

విద్వత్కవి మండలియందుఁ దన కావ్యమును వినిపించుచుండ నందలి కవులు తన కవిత్వము నాక్షేపించుట చేత నేకదా శ్రీనాథుఁడు

"ప్రౌఢిఁ బరికించి సంస్కృత భాషయందు
పలుకు నుడికారమున నాంధ్రభాషయందు
ఎవ్వరేమనుకొన్న నాకేమికొదువ
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష."

అను పద్యము చెప్పుటకుఁ గారణమైనది. దీనిం బట్టి పదునైదవ శతాబ్దమునందుఁగూడఁ గావ్యప్రాశస్త్యనిర్ణయ సభ లుండుచుండెనని మన మేల యనుకొనరాదు? పదునాఱవశతాబ్దమునందుఁ గృష్ణరాయల యాస్థానమునందలి కవులంగూర్చియు వారివారి కవితలంగూర్చియుఁ

ప్రాయికముగాఁ జెప్పఁబడుచుండిన కథలం బట్టి, తదాస్థాన కవిమండలి రచనా ప్రాశస్త్య నిర్ణయము తరుచుగాఁ గావించుచుండెనని స్పష్టమగుచున్నది. నిండోలగంబున సకల విద్వత్కవి సమక్షమునందు రాజునెదుట రామరాజ భూషణుఁడు తన వసుచరిత్రమును జదువుటకు నియోగింపఁ బడినట్లును జదువుటకుఁ బ్రారంభించినతోడనే ‘శ్రీభూపుత్రి’ యను పద్యమును రామకృష్ణుఁ డాక్షేపించినట్లు చెప్పఁబడుచుండిన కథయు, రఘునాథరాయల యాస్థానమునఁ గవులమధ్య చేమకూర వేంకటకవి తనవిజయవిలాసమును వినిపించుచుండఁగా నందలి ‘కంగుల్ దీరిన పైకిణీరవిక’ యను పద్యములోని ‘కంగు’ శబ్దప్రయోగమును గూర్చి యాకవు లాక్షేపించిరని చెప్పఁ బడుచుండిన కథయుఁగూడఁ బ్రస్తుతాభిప్రాయమును బలపరచుచున్నవని నామనవి. ఈకథలు నిజములైనను గాకపోయినను, ఒకానొక కవి రచించిన కావ్యము కొందఱు కవులమధ్యఁ జదువఁబడు చుండుటయుఁ, జదివింపఁబడి పరిష్కృతమైన పిమ్మటనే ప్రభువులు తత్కృతి పతిత్వము నంగీకరించుచుండుటయు, రాజాస్థానములయం దాచారమని మాత్రము చెప్పక తప్పదు. మన యాంధ్ర దేశమం దట్టి యాచారము లేకుండినయెడల నిట్టికథలు కల్పింపఁబడుట కైనను వీలుండదుకదా?

ఆంధ్రవాఙ్మయ స్వాతంత్ర్యము

ఇది యిట్లుండ తమిళసంగములవంటి పరిషత్తులు మనయాంధ్రదేశమునందు లేకపోవుటచేతనే యాంధ్రవాఙ్మయము స్వాతంత్ర్యముతో వ్యవహరించినదని నారాయణరావు పంతులుగారు సెలవిచ్చిరి. ఆంధ్రవాఙ్మయము స్వతంత్రతతో వ్యవహరించినదియో యస్వతంత్రతతో వ్యవహరించినదియో యింత సూక్ష్మముగా నిర్ణయించుట న్యాయముకాదు. మన వాఙ్మయ మహాసౌధమును నిలువఁబెట్టి యుంచిన ముఖ్యస్తంభములనఁదగు సద్గ్రంథములే కొన్ని స్వాతంత్ర్యరహితములు కొన్ని స్వాతంత్ర్యసహితములు. ‘రాజరాజలోక విద్వత్పరిషత్తు నేర్పఱచి, వారితోఁ దెనుఁగు కావ్యమును రచింపవలసినపద్ధతుల నేర్పఱచి, యాపద్ధతుల మీఁదనే భారతరచనను నడపించుచు’ అను వాక్యములవలన నన్నయ రచించిన భారతభాగము కేవల మస్వతంత్రగ్రంథమని నారాయణరావు పంతులుగా రూహించినట్లకదా? వాస్తవముగూడ నంతియే. కాని తిక్కన భారతముగాని, పోతనభాగవతముగాని యొకరి యాజ్ఞకును, ఒకరేర్పఱచిన పద్ధతులకును లోఁబడి రచింపఁబడినట్టివి కావు. అవి కేవలము స్వతంత్ర గ్రంథములు. మహా కావ్యముల యందే యిట్టిభేదములుండ నింక సామాన్యగ్రంథముల స్వతంత్రతా స్వతంత్రత లెవరు గణింపఁగలరు? మఱియు ముఖ్యోద్దేశ మొక్కటియే యైనను, తమిళసంగములకును మన రాజాస్థానకవి సంఘములకును గావ్యవిమర్శన నియమములయందువ్యత్యాసముండితీరవలెను. గ్రంథరచనకై యొకేవిధమైన నియమములను గొన్నిటి నేర్పఱచి యానియమములకు బద్ధములైనవానినే తమిళసంగములు పరిగ్రహించుచుండెనుగాఁబోలు! శాస్త్రసంబంధమైన కొన్ని

నిబంధనములుండిన నుండుఁగాక. కావ్య రచనయందు మన యాంధ్రకవులకుమాత్ర మంత విపరీతమైన విషమపద్ధతు లెప్పుడును దటస్థింపలేదు. మొత్తముపైఁ దమిళవాఙ్మయమునకుఁ గలిగినంత స్వాతంత్ర్య భంగము మన వాఙ్మయమునకుఁ గలుగలేదని చెప్పవచ్చును.

ఆంధ్రవాఙ్మయమునందలి వివిధమార్గములు

కవితా విలాసమే ముఖ్య వ్యసనముగాఁ గడపిన యాంధ్రరాజులు తమతమ యాస్థానములయందుఁ గవులఁ బ్రోత్సహించుచు నొక్కొక రొక్కొకవిధమైన నూతనత్వమును వాఙ్మయమునకుఁ గలిగింపుచు వచ్చిరి. సాహితీ ప్రపంచమున విమర్శదృష్టితో సంచరించు వారి కాయానూతనత్వములు గోచరింపక పోవు. మామిడి సింగనామాత్యు నాస్థానమున వెలువడిన శృంగార నైషధాంధ్రీకరణము, రాయల యాస్థానమున వెలువడిన స్వారోచిష మనుసంభవ ప్రబంధము వేంకటాద్రి మహీవల్లభు నాస్థానమున వెలువడిన రాఘవ పాండవీయ ద్వ్యర్థి కావ్యము మొదలగు పరస్పర భిన్నములైన యుద్గ్రంథములు మన వాఙ్మయమునం దవిచ్ఛిన్నముగాఁ గానవచ్చుచుండుటయే యట్టి విషమపద్ధతు లెన్నఁడును నాంధ్రకావ్యరచనకు లేకుండెనని చెప్పుటకుఁ బ్రబలతార్కాణము. ఇట్లు సకల విధముల నొక్క తమిళ వాఙ్మయమునేకాక దేశీయ వాఙ్మయముల నన్నింటినిమించి యన్నింటికంటెనునత్యంతమైన మార్దవముమాధుర్యము ప్రాబల్యము ప్రసిద్ధియు నాంధ్రవాఙ్మయమునకుఁ జేకూరుటకు నాంధ్రరాజుల నిరుపమానమైన కవితాపోషణమే ముఖ్యకారణము.

అజ్ఞాతయుగములోని కవితాపోషకులు

అజ్ఞాతయుగమునందలి కవితాపోషకులం గూర్చి ప్రసంగింపవలసివచ్చినప్పుడు వివాదాస్పదుఁడైయున్న సత్యాశ్రయుని, యుద్ధమల్లుని మొదటఁ దలంపక తప్పదు. ఈయిరువురును గాక యాంధ్రకవిత్వప్రచారమునకుఁ దోడుపడినవా రింకెవ్వరైనఁ గలరాయను విషయమునుయుగవిభాగవ్యాసములోఁ గొంత చర్చించితిమి. ఈయజ్ఞాత యుగమునందు బౌద్ధయుగమని జైనయుగమని రెండుయుగములుండియుండవలయుననియు, ఈబౌద్ధజైనుల మూలమున నాంధ్రకవిత్వమునకుఁ గొంత ప్రచారము కలిగియుండవలయుననియు మన మూహించితిమి. అందుచే నజ్ఞాతయుగమునందలి కవితాపోషకులలో బౌద్ధులనుగూడ మనము చేర్చుకొనవలసియుండును. వీరిలో జైనులు మనయాంధ్రకవిత్వమునేకాక తమ మతప్రచారమునకై దేశీయకవితలనన్నింటిని గూడ నభ్యసించుచుండిరి. అందుచే నొక్క యాంధ్రకవిత్వచరిత్రమునేకాక కర్ణాటాది దేశీయకవిత్వచరిత్రములలో నెయ్యది వ్రాయవలసివచ్చినను నజ్ఞాతయుగమునందుఁ దత్కవితాపోషకులు జైనులని చెప్పకతప్పదు.

The Editor of Pampa's Adipuranam says—"Among the various elements which contributed to the growth and development of the Kannada literature, the adoption of the Kannada language by the Jain settlers of the Kannada country both for secular and religious purposes, seem to have been the earliest and most effective whatever the Jains colonised, they were great patrons of learning and literature. To-day we have in Kannada a great number of classical works

written by Jain authors than those written by authors of any other denomination."

నన్నయయుగమునందలి కవితాపోషకులు

ఇట్టి నిశ్చయముతో నజ్ఞాతయుగమును గడచి, నన్నయయుగమగు పదునొకండవ శతాబ్దమునఁ బ్రవేశించినంతనే యాంధ్రసాహిత్యోద్ధారకుఁడగు రాజరాజు మనకుఁ బ్రథమ కవితాపోషకుఁడుగాఁ గానవచ్చుచున్నాఁడు. బౌద్ధజైనులమూలమునఁ దత్పూర్వమాంధ్ర కవితాప్రచారము కొంతవఱకు జరిగియుండునని మనమూహించుచుండినను గావ్యములను వ్రాయించి కృతిపతిత్వమును వహించిన కవితాపోషకులగు రాజు లెవ్వరైనఁ గలరాయని చర్చించుటకు మాత్ర మాధారము లేమియుఁ గానరావు. యుద్ధమల్లుఁడు గ్రంథములు వ్రాయించినట్లుగాని, కృతిపతిత్వము వహించినట్లుగాని యెందును గోచరింపదు. అందుచే నాంధ్రమునం దుద్గ్రంథములనువ్రాయించి కృతిపతిత్వమునుబొందు నాచారమునకు రాజనరేంద్రుఁడే మార్గదర్శకుఁడని చెప్పవలసియున్నది. ఈతఁడేమార్గమును గర్ణాటకవితాపోషకులైన పులకేసిప్రముఖులనుండి యవలంబించియుండును. రాజరాజునకు సమకాలికుఁడగు భోజరాజుసైతము క్షేమేంద్రకవిచే నొకకావ్యమును గృతినొందెనని చెప్పెదరు. ఈకావ్యమెట్టిదో మనకింతవఱకుఁ దెలియదు.

శైవవాఙ్మయము

రాజనరేంద్రుఁడవలంబించిన యీకృతిస్వీకారాచార మేకారణముననో కాని వానితరువాత రమారమి రెండువందలసంవత్సరములవఱకు ననఁగా మనుమసిద్ధివఱకు నితరరాజులెవ్వరు నవలంబించినట్లు కానరాదు. ఈమధ్యకాలములో రచింపఁబడిన కావ్యములుసైతము నతిస్వల్పసంఖ్యాకములగుటచేఁ గవితాపోషకులైన రాజులు మిక్కిలియరుదుగా నుండియుందురు. ఈస్వల్పగ్రంథజాలమైనను రాజాస్థానములందు రచింపఁబడినదికాక, కేవలభక్త్యావేశమునఁ జెలరేగిన శైవవాఙ్మయమగుటచేఁ దత్తత్కావ్యకర్తలగు శివకవులు తమశైవకావ్యములను గృతియొసంగ రాజులకడకుఁ గొనిపోవునవసరములేనివారై యుందురు. మఱియు మనయాంధ్ర వాఙ్మయమునం దంతటంగల శైవగ్రంథములనేకములు భగవదంకితములుగనే రచింపఁబడియుండుటచేత శివకవులు భవకవులచందమునఁగాక నరాంకితము నిరసించుచుండిరేమో యని తోఁచుచున్నది.

మఱియు నీనన్నయయుగమునందలి పండితారాధ్యవిరచితమగు శివతత్త్వసారము పాలకురికిసోమనాథుని బసవపురాణాదులు మొదలగు కేవల శైవమతగ్రంథములమాటయటుండ, పావులూరిమల్లన తనగణితశాస్త్రమునుగూడ శివాంకితముగానే రచించెను. నన్నెచోడుని కుమారసంభవమును నట్టిదియే. అందుచే నీరెండువందల సంవత్సరములలో ననేకకావ్యములకుఁ గృతిపతిత్వమువహించిన రాజవాళియే రాజరాజు తరువాతఁ జేర్కొనవలసిన ముఖ్యకవితాపోషకుఁడు.

మనుమసిద్ధిపూర్వులు కవితాపోషకులు

ఈయుగములో శైవగ్రంథములుకానివి రంగనాథ భాస్కరుల రామాయణములు

మాత్రమేయని తోఁచుచున్నది. వీనికృతిపతులైన కోనబుద్ధరాజ సాహిణిమారులంగూర్చిన చారిత్రకాంశములు వివాదాస్పదములైయున్నవి. కవిభల్లటవిరచితమగు బేతాళపంచవింశతికిఁ గృతిపతియైన చాళుక్యవిక్రమాదిత్యుని సైతము మన మేతద్యుగకవితాపోషకులలోఁ గణింపవలయును. నిర్వచనోత్తరరామాయణమున మనుమసిద్ధివంశమును వర్ణించుచుఁ దిక్కన వానిపూర్వులలోఁ గొందఱిని గవితావిదులుగాఁ జేర్కొనియుండెను. సామాన్యకవితా విదుండగుటయే కాక మనుమసిద్ధి ముత్తాతయగు తిక్కభూవిభుఁడు

"సకల విద్యాపరిశ్రమము జెల్వఁగ వేల
కవిసార్వభౌమాంక మనిఁ జెల్ల"

అని వర్ణింపఁబడుటచేతఁ దననాఁటి కవులకెల్లరకును మేటియై కవిసార్వభౌముఁడై యాంధ్రకవితాప్రచారమునకై కొంతవఱకుఁ బాటుపడియుండును. ఈ తిక్కభూవిభుఁడు మనుమసిద్ధికి ముత్తాత యగుటచేత వీరేశలింగముపంతులుగారి పద్ధతిప్రకారము తరమునకిరువదియైదుసంవత్సరముల చొప్పున గణించినను, 1200 సంవత్సరప్రాంతమువాఁడని తేలుచున్నది. కావున వీనిని నన్నయయుగములోని కవితాపోషకులలోఁ జేర్చుట కభ్యంతర ముండదు. ఈతిక్కరాజు తండ్రియైన మనుమసిద్ధియు

'కరుణ దీనానాథకవిబంధు జనచకో
రములకుఁ జంద్రాతపముగఁ జేసె'

అను తిక్కనవాక్యములోఁ గవిపన్నానుఁడుగా వర్ణింపఁబడుటచేత నీతఁడును నేతద్యుగ కవితాపోషకులలోఁ జేరవలసినవాఁడే. ఇట్లు మనుమసిద్ధి పూర్వులెల్లరును గవులుగను గవితాభిమానులుగను దద్వంశావతారమునందుఁ దిక్కనచే నుతింపఁబడిన వారగుటచే నప్పటికించుమించుగ నూఱుసంవత్సరములకుఁ బూర్వమునుండియుఁ బ్రస్తుత యుగమునందుఁ జేర్పఁదగినట్టియు, మనుమసిద్ధి వంశమునకు సంబంధించినట్టియుఁ, గవితాపోషకు లగు న రాజులు కొందఱు కలరనియు, వారు కొన్ని కావ్యములను వ్రాసిగాని వ్రాయించిగానియుండురనియు నూహింపవచ్చును. కృష్ణామండలమునందలి పట్సహస్ర దేశాధీశ్వరుండగు బద్దెభూపాలుఁడు రచించిన నీతిశాస్త్ర ముక్తావళియు సుమతిశతకమును నాంధ్రదేశమునఁ బ్రచారమునందుంచుటచేఁ బైనివివరించిన కవితాపోషకులకంటె నీతఁడు ముఖ్యముగా గణింపఁదగినవాఁడు.

మనుమసిద్ధి

ఈనన్నయయుగమునందుఁ జేర్కొనఁబడిన యితర రాజులు కవితాపోషకులైయుండరని యూహించుటయే కాని మరియొకవిధమైన ప్రబలనిదర్శనము లేమియుఁ గానరానందున మనకవిత్వచరిత్రమునందు రాజరాజు తరువాత సుప్రసిద్ధకవితాపోషకుఁడు మనుమసిద్ధియేయని చెప్పవలసియున్నది. ఈమనుమసిద్ధితోడనే తిక్కనయుగము ప్రారంభించుచున్నది. కవిబ్రహ్మరచించిన నిర్వచనోత్తరరామాయణమునకుఁ గృతిపతిత్వమును గాంచు మహాభాగ్యమును బొందుటచేతనే యీసిద్ధిరాజు సకలవిధముల నన్నయయుగములోని

రాజరాజుతోఁ దులఁదూఁగుచున్నాఁడు. కాని వానికింబోలె భారతకృతిపతిత్వము మాత్ర మీతనికి లభింపలేదు. మహాభారతమునందు నన్నయకంటెఁ దిక్కన వహించిన పవిత్రభావమే యిందుకు ముఖ్యకారణము. భారతాఖ్యంబగు లేఖ్యంబైన యామ్నాయమును నరాంకితముగా రచించుచు వచ్చుటచేతనే నన్నయ యుద్యమము నిర్విఘ్నముగాఁ గొనసాగక పోయెనని తిక్కన యూహించి యుండును. నన్నయవలెనే యతఁడును రాజోద్యోగియై యదివఱకొక గ్రంథమును బతికిం గృతియిచ్చి క్రమక్రమముగఁ గలిగిన హృదయ సంస్కారమువలన నట్టి నరాంకిత మేహ్య మనియుఁ గావ్యగౌరవమునకొక పెద్దలోపమనియు నందు మహాభారతమువంటి పవిత్రగ్రంథమునకు నట్టి సంబంధము లేశము నుండరాదనియు నిశ్చయించి సోమయాజి తన భారతభాగమును దైవాంకితముగనే రచింప నారంభించెను. అది యునుంగాక తన రచింపందలంచిన మహాభారతమును నరాంకిత మొనర్పనని చేసికొన్న నిశ్చయమును దత్కావ్యమునందుఁ దాను వహించిన గౌరవభావమును బరికించి పరమేశ్వరుండు తన్ను శ్లాఘించినట్లుగఁ దిక్కన యీ పద్యములలో సూచించుచున్నాఁడు.

క. పారాశర్యుని కృతియై
భారతమను పేరఁ బరగు పంచమవేదం
బాంధ్ర్యము జనులకుఁ ద
ద్గౌరవ మూహించి నీ వఖండితభక్తిన్.

గీ. తెనుఁగుబాస వినిర్మింపఁ బనుపు టరయ
భవ్యపురుషార్థతరుపక్వఫలముగాద
దీని కెద నియ్యకొని చేయ్కొనిన కృతిప
తిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ!

మనుమసిద్ధి - భారతకృతి పతిత్వము

భారతము నాంధ్రీకరించు సంకల్పము తిక్కనకుఁ గలిగినట్లు తనకుఁ దెలిసినంతనే రాజరాజ నరేంద్రునివలెఁ దత్కృతిపతిత్వ మహాభాగ్యమును బొందవలెనను నాశ సిద్ధిరాజునకు సైతమును బుట్టియుండకపోదు. నన్నయతో సమానుఁడగు మహాకవి తనయాస్థానమునఁగూడ నుండుటయు, నన్నయవలెనే యాతఁడును నమ్మహాకావ్యరచనకుఁ బూనుకొనుటయు, నన్నయరచించిన భారతభాగమునకుఁ గృతిపతిత్వము వహించిన రాజనరేంద్రుని యశశ్చంద్రిక లాంధ్రరాజ్యముల నెల్లెడల వ్యాపించియుండుటయు, తానును రాజరాజువంటి కవితాభిమానాయత్త చిత్తుండైన మహారాజై యుండుటయు, మనుమసిద్ధికి భారతకృతిపతిత్వకాంక్ష యేలకలిగింపకుండును? అతఁడు కీర్తికాముఁడు కాఁడా? కాని తిక్కనకుఁ దానెంతటి ప్రభువైనను, సకలవిధముల వానిచేనుద్ధరింపఁబడినవాఁడగుటవలన మనుమసిద్ధి వానియందు గౌరవాభిమానములే కాక భయభక్తులు సైతమును గలిగియుండి, యొకప్పుడు తనకృతిపతిత్వకాంక్ష నాతఁడుపేక్షించినయెడలఁ దనకది లాఘవమని యెంచి,

"ఏనిన్ను మామయనియెడు
జిచికిఁ దగనిమ్ము భారతీకన్యను"

అని పూర్వమువలె విస్పష్టముగా నడుగక, మఱియొకవిధముగాఁ దనయభీష్టమును వానికి స్ఫురింపఁ జేసియుండును.

అమ్మహాకావ్యమును బరమేశ్వరార్పిత మొనర్పవలయునను సంపూర్ణసంకల్పముతో రచనాకౌతుకమువహించిన తిక్కనప్రభువాంఛితము నెఱింగిన పిమ్మటఁ గొంతవడికు డోలాయమానమానసుం డైనట్లుగ నీక్రిందిపద్యము సూచించుచున్నది.


"క. అనిరచనా కౌతుకమున
మనమలరఁగ నీప్రబంధమండలి కథినా
థునిగా నేపురుషుని చే
ర్కొనువాఁడనొ యను తలంపు కూరినమదితోన్."

నన్నయవంటి లోకజ్ఞుఁడు తన ప్రభువు నభీష్టము నీడేర్చి వానికత్యంత విఖ్యాతి చేకూర్చియుండఁ దానును నంతవాఁడై తన ప్రభువున కట్టి కీర్తిగౌరవములఁ గలిగింపకుండుట యుక్తమా యని తిక్కనవంటి స్వామిభక్తుఁడు సందేహించియుండకపోఁడు. అందుచేఁ దన ప్రభువును గౌరవించి కావ్యమునో, కావ్యమును గౌరవించి ప్రభువునో యుగౌరవింపవలసిన యువస్థ తటస్థించుటచేతఁ దన ప్రబంధమండలి కథినాథుఁడుభూపతియాజగత్పతియా?ఏపూరుషుని చేర్కొనవలయునో యను తలంపు కూరిన మదితో, సోమయాజి యించుక నిమీలితనేత్రుం డైనంతనే దైవసాక్షాత్కారము వాని సందేహమునెల్లఁ దొలంగించెను. ఆస్వప్న వృత్తాంతమును వినినంతనే తద్భ్యాకాంతుఁడును సంతసించి, తనకృతిపతిత్వకాంక్షను విసర్జించి, భారతరచనలోఁ దిక్కనను హెచ్చరించుచు నమ్మహాకావ్యనిర్మాణమునకు వలయు సౌకర్యములనెల్లఁ జేకూర్చుచుఁ గొనసాగింపఁజేయుట చేతనే పనుమసిద్ధి కలంకములేని యశమ్మును సంపాదింపఁగలిగెను!-

సంసారజలధి

సంద్రంబులోమున్గ భయమొందగాను
ఒడ్డునేనిల్వగా గోరితినేను
సంద్రంబులోమున్గి చూచితే అడ్డు
ఒడ్డుపై నేమి లేదనుకొంటినేను
సంద్రంబుపై దేలి చెప్పినానండి
ఒడ్డుపై వారి కచ్చటివింత నేను
సంసారసాగరం బునుగూర్చికూడ
అటులనే గ్రహియించి నానండి నేను.

(సాధకుడు)



ముక్కు తిమ్మనార్యుఁడు

మండలేముల వేంకటశాస్త్రి గారు, బి. ఏ., యల్. టి.

ప్రబంధకవుల ననుసరించియు రసపోషణము నకైకొన్నియవసరములయం దితఁడు భిన్నమార్గము నవలంబించియుండెనని వెనుకటిభాగమున దిక్ప్రదర్శనముగఁ దెలుపఁబడినది. తన ప్రబంధమున కుత్కృష్ట లక్షణముల నితఁ డెట్లు సంఘటించెనో కొంతవఱ కిచట విమర్శించెదము.

కథ

ఈ ప్రబంధమునఁగల కథలోఁ గవికల్పితమగుభాగము చాలతక్కువ. కేవలము యథార్థమగుకథ యటులనే యుండనిచ్చినచో రసవంతముగ నుండుట యరుదు. కావున తిమ్మనార్యుఁ డీసందర్భమున నవసరములగు ఘట్టములలో మిగుల రసవంతముగఁ జేసెను. శ్రీకృష్ణుఁడు తనజవరాండ్రనందఱి నయ్యైవిధములఁ దనుపుచు, నొకనాఁడు రుక్మిణీరమణి మందిరమున నుండఁ గలహాసనముని యచటికి వచ్చి, మన్ననవడసి, పారిజాతకుసుమము నొకదానిని సమర్పించెను. "ఎవ్వరికి దీనినిత్తునా" యనునారాట మతనిమానసమునఁ దోఁచెను. అతనియనుజ్ఞచే నారదుఁ డాకుసుమమును రుక్మిణికి సమర్పించి, దానివైభవమును వర్ణించి యది తాల్చినకతమున దేవేరులం దామె మిన్న యని పొగడఁజొచ్చెను. కృష్ణున కియ్యది ప్రీతిఁ గొలుపకపోయినను, సహించి యూరకుండెను. కారణము, స్పష్టము. ఈవృత్తాంతము నితరస్త్రీజన మెఱిఁగిన ముప్పుగలుగు ననుభయ మతనిడెందమునఁ గలదు. అట్టిసందియమును దిగులును మనోవీథిని బాడము చుండఁగఁ గృష్ణుఁడు సత్యభామమందిరమునకు వచ్చినతోడనే, తనసంశయము నిక్కమని యతఁడు గ్రహించునటుల మందిరము పాడువారియుండెను. పేరలుకఁ జెందిన సత్యభామ నతఁ డనునయించుటయు, తనపాదముల కెరఁగినభర్తశిరమును వామపాదమున నామె తొలఁగద్రోయుటయు మొదలగు శృంగారరసప్రధానములగు ఘట్టములు చక్కఁగ వర్ణింపఁబడినవి. పారిజాతము నపహరింపఁ గృష్ణుఁడు కృతనిశ్చయుఁ డాయెనని మనకుఁ దెలిసినతోడనే ప్రథమాశ్వాసము ముగిసినది. శ్రీకృష్ణుల ప్రయాణసన్నాహమును, ప్రయాణమును ద్వితీయాశ్వాసమునఁ దెలుపఁబడినవి. సత్యభామకై కృష్ణుఁ డొనరించిన మేరునాకవర్ణనము లిందుఁగలవు. అష్టదిక్పాలకులును శౌరిని దర్శించుటయు, నలని యవతారవిశేషములఁ గొనియాడుటయు, వైజయంతమున విడిసిన శ్రీకృష్ణుఁడు సత్యభామఁగూడి విహరించుచు,

పారిజాతమును జూచుటయు మూఁడవయాశ్వాసమునఁ దెలుపఁబడినవి. జలక్రీడాది విహారములు నాల్గవ యాశ్వాసమున సమంజసముగ వర్ణింపఁబడినవి. శ్రీకృష్ణుఁడు పారిజాతము నపహరించుటయు, నందనవనపాలకులతని నడ్డగించుటయును, నీవృత్తాంతము నెఱిఁగి దేవేంద్రుఁ డతనితోఁ బోర సమకట్టుటయు, సైన్యముల సిద్ధపఱచుటయును గూడ నీయాశ్వాసమునఁ గలవు. యుద్ధమును, అందలి శ్రీకృష్ణవిజయమును, సత్యభామ వనమునఁ బారిజాతమునుఁ బ్రతిష్ఠించుటయును బంచమాశ్వాసమున వర్ణింపఁబడినవి. సత్యభామ పుణ్యకవ్రతానుష్ఠానము సలుపుటతోఁ గథ ముగిసినది.

కవివర్యుఁ డీకథను నిర్వచించుటలోఁ గొన్ని విశేషములఁ జూడవచ్చును. నాయెఱిఁగినంతవఱకుఁ బ్రథమాశ్వాసమునఁ గథనింత వఱకుఁ దెలిపిన ప్రబంధములు చాలఁదక్కువ. అలుకఁజెందిన సత్యభామను కృష్ణుఁ డెట్లనునయించుననియు, నామె యాతనియెడ నెట్లు ప్రవర్తించుననియుఁ దెలిసికొనఁ బాఠకులకుఁ గుతూహలము గలుగునని గ్రహించి, తనకథయం దనన్యసామాన్యమగు పరిణామమును గల్పించిఁ దానిని బాఠకు లెఱుఁగుటకు వ్యవధి యుండరాదని తలఁచి, యనావశ్యకము లగు వర్ణనములను లోపింపఁజేసి, కవివర్యుఁడు ప్రశస్తి వడసెను. సామాన్యపుఁగవులు రుక్మిణీమందిరమునఁ గృష్ణుఁడు విహరించు ఘట్టమును సవిస్తరముగ వర్ణించి, నారదాగమనముతో మొదటియాశ్వాసము ముగించి యుందురు. మఱియొక విషయము; శ్రీకృష్ణుఁడు ప్రయాణమునకై కృతనిశ్చయుఁ డాయెనని తెలిసిన పిదప జలకమాడుట, భోజనము మొదలగునవి వర్ణింపఁబడినవి. సాయంకాలము, అంధకారమును, సతీసమేతుఁడై గృష్ణుఁడు నందనవనమున శృంగారవిహారము సలుపుటయు మొదలగునవి సమయోచితములుగను, సంగ్రహములుగను, మిక్కిలి మనోహరములుగ నుండునట్లును వర్ణింపఁబడినవి. ఆయాసందర్భములయందలి కథావేగమున కయ్యవి భంగముఁ గలిగించునవి కావు. మఱియు హృద్యములుగ నున్నవి. కావున, కథావేగమునకు భంగము గలుగని వర్ణనలనుమాత్రము తిమ్మనార్యుఁడు సమంజసములుగఁ జేయునని మన మెఱుఁగఁ దగును.

పాత్రములు

ప్రబంధములందుండు పాత్రములఁ గూర్చి విమర్శకు లొక రీతిగన వ్రాసియున్నారు. "పాత్రములన్నియు నొక్కతీరుం దాల్చిన బొమ్మలు. అలంకార శాస్త్రప్రకారము చెక్కఁబడినవి. ఆయాకావ్యములలోని పాత్రములు నిర్జీవములట్లుండుటతోఁ బోయిన నెంతో పుణ్యము. అన్ని కావ్యములందలి పాత్రములు నొండొంటి ననుకరించు ప్రతిబింబములు. పేరుఊరుమాత్రము మార్చియుందురు......స్వభావము, చరిత్రము, నడవడి, తీరు, మొదలగు లక్ష్యగుణములన్నియు నెరవలిసొత్తులు" ఈయభిప్రాయము పెక్కుప్రబంధములయెడ యథార్థమని తోఁచును. దీనిననుసరించిచూచినచో, పాత్రములన్నియు ననితర

తుల్యములుగ నుండవలయును. మఱియు, నవి నిర్జీవములట్లుండక తీగలవలె నల్లునవిగా నుండవలెను. అట్లయిన, సత్యములై మనోహరములుగ నుండును. స్వభావము ననుసరించవలెనన్నచో నయ్యవి మిశ్రములై యుండవలయు. మన ప్రబంధమునఁ బ్రధానములగు శ్రీకృష్ణసత్యభామాపాత్రము లెంతవఱకు నిర్దుష్టములో, యించుక చూడవలయును.

శ్రీకృష్ణుఁడు భగవంతుని యవతారము. అతనియందు దైవమానుషచర్యలు మిశ్రితములై యున్నవి. తా నవతారపురుషుఁడని, తనసతీతిలకములు, నితరులును సామాన్యముగఁ దలఁచుట కవకాశము కలుగకుండునట్లతఁడు బ్రవర్తించును. బహుళముగఁ గళత్రవంతులగు మానవు లొందు కష్టసుఖములన్నియు నితఁడు స్వేచ్ఛగా ననుభవించెను. కథానాయకుని పాఠకుల కెఱుకపఱుచుచు, నతనియంగసౌష్ఠవముఁగాని, గుణలక్షణ కథనముఁగాని కవి చేసియుండలేదు. అట్లుచేయుట సామాన్యలక్షణపద్ధతి. ఆమహాత్ముఁ డెల్లర హృదయసీమలను నిత్యనివాసియై యుండుటచే నియ్యది యప్రస్తుత మగును. ఈవర్ణనకుఁ దొడఁగుట చర్వితచర్వణమగు మార్గము. నరకాసురునింటనుండిన "నెలజవ్వనమున్ బాలివోని వారి"ని "తన్వరునిగ గోరువారి"న్ని, బదియాఱువేన్వర లలనామణుల నతఁడు వివాహమాడి యుండెనని తొలుదొల్తఁ జెలుపుట చక్కఁగ నున్నది. కథాసందర్భమునకు నాయకునిఁగూర్చి యీవఱకుఁ బాఠకు లెఱిఁగినఁ జాలును. సౌఖ్యరసైకలోలుఁడై నారదుని పంపున నతఁ డిట్లొనరించెనని వ్రాయఁబడి యుండుటచే నాయకుని కిందు దోషముగలుగదు. ఎనమండ్రు పట్టమహిషులతోడను, వీరితో నతఁ డెట్లు ప్రవర్తించెనని పాఠకు లెఱుఁగఁ గోరుదురని తలఁచి.

శా. ఏయేవేళల నేసరోజముఖి యేయేలీలలం గోరుఁ దా
నాయావేళల నాసరోజముఖి నాయాలీలలం దేల్చి యే
చాయం జూచినఁ దానయై మెలఁగుచున్ సౌఖ్యాబ్ధి
నోలాడుచో, గాయత్తుండయి పెక్కురూపముల
మాయా కల్పనాచాతురిన్.

అని వర్ణించెను. మాయాకల్పనాచాతురి లేనిచో నిట్టికౌశల మలవడ నేరదు. దీనివలనఁ గృష్ణునియందు మానవస్వభావము పూర్ణముగఁ బొందు పఱుపఁబడినది. రుక్మిణీమందిరమున నతఁడు వినోదించుచుండఁగా నారదుఁడు విచ్చేయఁ దానును సతియు లేచి, నమస్కరించి, యాతనిఁ బరిచరించి, యనుమతి వడసి, తా నెత్తినయవతారమున కనువగు ప్రాకృతపూరుషుని విధము ననుకరించుచు,

క. సురసంయమివర! మీ రిట
కరుదేరఁగ నిప్పు డేఁగృతార్థుఁడ నైతిన్
నిరతంబు మీరు నాపైఁ
గరుణ గలిగియునికి యిదియ కారణము సుమీ.

అని పలికెను. నారదునిరాకకుఁ గల కారణము దానెఱిఁగియు, నెఱుఁగనివానివలె నటించి, యతనిరాకచేఁ దనమందిరముఁ బవిత్రమాయెననియుఁ దాను గృతార్థుఁడ నైతిననియుఁ బలికి సామాన్యమగు గృహస్థధర్మము వెలయించెను. తనగృహమున కతిథియగు సాధసిద్ధునితో బ్రవరుఁ డాడినవిధము జ్ఞప్తికిఁ

దెచ్చుకొనిన, నీయవసరములు సమానములని తోఁచును. నారదుఁడు కృష్ణుని యువతారవిశేషములఁ గొనియాడి, పారిజాతము నర్పించినతోడనే, నాయకుని మానసమున నారాట ముదయించి యతని మానుషలక్షణములను రెట్టించెను. ఆపాత్రము నిర్జీవమట్లు బిఱ్ఱబిగిసియుండక, స్వభావసిద్ధమగు మానవునివిధము ననుకరించుచున్నది. ఇంతవఱకుఁ బ్రతివిషయము నీయర్థమునే బలపఱుచుచున్నది. కృష్ణుఁ డీఘట్టములలో దివ్యపురుషునట్లు ప్రవర్తించియుండలేదు. ఇది ప్రశంసాపాత్రము. సత్యభామ మందిరమునకుఁ బోవునప్పు డతనిమనోధర్మముఁ జూడుఁడు! "కేతనపటాంచల చంచలమై" యతనితాల్మి యొప్పెను. తత్తరము "తురఁగజవంబు మున్ గడవఁ ద్రోచి కడఁగు" చుండెను. మనసు "తిరిగెడు బండికండ్లపగిదిన్" భ్రమియించుచుండెను. ఈవర్ణన మెంతసత్యము; ఎంత స్వభావసిద్ధము; మానుషస్వభావము నెట్లు ప్రకటించుచున్నది! నవిమర్శకదృష్టితోఁ జదివి యీపద్యమునఁ గల రసమును గ్రహించిన పాఠకుల కెల్లరకు కృష్ణుని పాత్రము తమహృదయముల కనతిదూరమై యున్నదని తప్పక తోఁచును. ప్రత్యక్షమగు పురుషుఁడా? కవికల్పితపాత్రమా? యనిసందియపడు నట్లుండును. తనసందియము యథార్థమని గ్రహించి పేరలుకఁ జెందిన తన కాంత ననునయింపఁబోయి పరిచారికచేతనున్న తాళవృంతముఁ గైకొని వీవఁజొచ్చెను. శృంగారరసప్రధానమగు గంభీరోపన్యాసము నలిపెను. మాటామాటావాదిత్వము, చెలిమెకఁ దనకుఁ గలకూర్మియు, విధేయతయును, ఆమె పనుపు సెల్లించుట తనకుఁ బ్రాభవ మనుటయు, మున్నగునవి కాముకుల నైజలక్షణములు. కృష్ణుఁడు వీనినెల్లఁ బ్రకటించెను చూడుఁడు.

చ. మన మరయందలంచి రొకమార్గము
    వన్నితొ? నవ్వటాలకో?
నను వెఱపించెదో? యకట! నాయెడ
    నిక్కము దప్పు గల్గెనో?
వనజదళాయతాక్షి! పగవాఁడనె?
    నన్నిటులేల చూడవే? వొ
క్కనిముసమైన నీవు దయఁ
    గన్గొనకుండిన నిల్వనేర్తునే!

చ. పలుకులతేనె లుట్టిపడఁ బల్కువు నేఁ
    డిదియేమి? వాలుగ
న్నుల నను సిగ్గునాల్కొనఁ
    గనుంగొనవేల? యురస్థలంబుఁ జ
న్నుల నెదురొత్తి మక్కువ ననుం
    బిగిగౌఁగిటఁ జేర్చవేటికే?
చిలుకలకొల్కి! యెవ్వ రెడఁజేసిరి?
    నీకిటులేల చింతిలన్.

చ. మనమున మాటలం గ్రియల మన్ననలీ నొకనాఁడు
నెట్టి కామినులకు గౌరవంబు మెఱమెచ్చులకై ప్రద
రింతుఁ గాని ప్రాయనియనురక్తి నీయెడన యగ్గలమై
కనుపట్టు నాకు నీ, పనిచిన పంపు సేయుటయుఁ
బ్రాభవమౌ టది నీ వెఱుంగవే.

శృంగారరస ప్రధానమైన యీ పాత్రమున కారసము పోషించుట కన్నియవకాశములు కల్పింపబడినవి. తనచేఁ గల ప్రయత్నములన్నియు వ్యర్థము లగుటచే ఆ "జగన్నాటక సూత్రధారి యదునందనుఁ డర్మిలి మ్రొక్కె" ననికూడఁ జెప్పఁబడియున్నది. సత్యభామ తనవామపాదమున నతనిఁ దన్నుటయు అదియే తనకు మన్ననఁగాఁదలఁచి

యతఁడామెను గోప ముఖుగుమని ప్రార్థించుటయు మొదలగు నవసరములలో శృంగారరస మపూర్వముగా వర్ణింపఁబడెను.

శ్రీకృష్ణునిపాత్రము వీరరసముతోఁ గూడ నొప్పుచున్నది. కావుననే యతఁడు పారిజాతమును దప్పక తెచ్చెదనని బాసచేసి, పయనమాయెను. సతీసహితుఁడగుచు దిక్పాలకులమన్నన వడసి, వైజయంతమున విడిసి యున్నతఱి, పారిజాతము నతఁ డపహరించెను. సురవీరులతో నతనికి ఘోరమగు సమరము గలిగెను. అతని బలప్రతాపము లెట్లు వర్ణింపఁబడియుండెను! చూడుఁడు!

సీ. కనిపి ఓడెౌఁ జఁ దాగ్నేయాస్త్ర మడరింప
 నది శార్ఙ్గ తేజంబునందు డిందె
గనలి వృద్ధశ్రవుం డనిలాస్త్ర మేసిన
 నది యురగాహ్వయహానాస్త్రమందు డిందె
వలిగి బలారి శౌరాస్త్రంబు నిగుడింప
 నది శౌరి వలచూపయందు డిందె
నడరి యింద్రుండు బ్రహ్మాస్త్రంబు పయిగొల్ప
 నది మురాంతకునాభియందు డిందె
ఆ. బాక దపనము క్త పాశుపతాస్త్రంబు
 హరినిజార్థతనువునంద డిందె
నేమి సేయవచ్చు నీశ్వరుం డఖిలాత్ముఁ
 డతని గెల్వఁ దనకు నలవి యగునె?

సీ. తలలు వీడంగ విద్యాధరులే పఱచిరి
 గ్రస్తులకాం క్రైరి ఖచరవరులు
చట్టుపై పోకలై చనిరి గంధర్వులు
 గరుడులు పంచబంగాళమైరి
కన్నదిగతిగాఁగఁ గిన్నరు లరిగిరి
 పన్నగేంద్రులు పటాపంచలైరి
పోయినపోకలై పోయిరి సిద్ధులు
 దిక్కుమొకములైరి దిగధిపతులు.

గీ. హరిహయుఁ డొంటి నాయత్తుఁ డగుచు వచ్చి
 మునిమునుల సంప్రార్థనావచో ముఖురులైరి,
పూనితన మీఁదవచ్చు దంభోళినిట్లు
 పంకజోదరుఁ డొడిసి చేపట్టుటయును.

ఇది వీరరసము! ఇటులనే యర్థము సరగ్రహముగ వర్ణింపఁబడి హృద్యముగనున్నది. వీరరసమునకుఁ జక్కనిసహకారి యౌదార్యము; కనుక శ్రీకృష్ణునిపాత్రమున కిదికూడఁ బొందుపఱుపఁబడినది. పరాజితుఁడగు బలారి శరణు వేడి రక్షింపుమని జనార్దనుని వేడుకొనఁగా నతనివలనఁ దప్పేమియు లేదనియును, "నీమఱంద లీకొమ్మ, వదాన్యభూరుహము కోరినఁ దెచ్చితిఁగాని, కొమ్ము నీసొమ్మని వజ్రమిచ్చి మధుసూదనుఁడా తరువీఁ దలం"చెను. మేటియుద్ధమున గెలిచిన పారిజాతము నొక్కమాటలో నింద్రుని కిచ్చివేయు సమకట్టుట యుదారస్వభావమును బ్రకటించును. ఈ పాత్రమున నింకొక్క విశేషము జూచి విరమింతము. పుణ్యకవ్రతానుష్ఠాన సమయమున సత్యభామచేఁ దాను ధారవోయఁబడి నారదునికి వలయు పరిచర్య సేయుట కొడంబడుట గడువిచిత్రము. హాస్యమున కతఁడుగూడఁ బనులఁ గొనుచుండెను! భక్తపరాధీనుండగు భగవంతుఁడు నారదునియభీష్టముల నెరవేర్చుట సామాన్యమేయైనను, కథా సందర్భమునఁ గృష్ణునిపాత్రమున కీవిశేషముగూడఁ బొందుపఱచియుండుట ప్రశంసాపాత్రము.

"సతీతిలకమగు సత్యభామపాత్రము నిటులే యనన్యసామాన్యముగ నిరూపింపఁ బడినది. కొంతవఱ కామె సామాన్యస్త్రీవలెనే

యతఁ డామెను గోప ముడుగుమని ప్రార్థించుటయు మొదలగు నవసరములలో శృంగారరస మపూర్వముగా వర్ణింపఁబడెను.

శ్రీకృష్ణునిపాత్రము వీరరసముతోఁ గూడ నొప్పుచున్నది. కావుననే యతఁడు పారిజాతమును దప్పక తెచ్చెదనని బాసచేసి, పయనమాయెను. సతీసహితుఁడగుచు దిక్పాలకులమన్నన వడసి, వైజయంతమున విడిసి యున్నతఱి, పారిజాతము నతఁ డపహరించెను. సురవీరులతో నతనికి ఘోరమగు సమరము గలిగెను. అతని బలప్రతాపము లెట్లు వర్ణింపఁబడియుండెను! చూడుఁడు!

సీ. కినిసి [illegible] డాగ్నేయాస్త్ర మడరింప
        నది శార్ఙ్గి తేజంబునందు డిందె
గదిసి పృషదశ్వుం డనిలాస్త్ర మేసిన
        నది యదూద్వహునూర్పునందు డిందె
వలిగిబలారిశౌరాస్త్రంబు నిగుడింప
        నది శౌరి పలమూడ్కి యందు డిందె
వడరి యింద్రుండు బ్రహ్మాస్త్రంబు పయిగొల్ప
        నది మురాంతకునాభి యందు డిందె
ఆ. పాకదమనముక్త పాశుపతాస్త్రంబు
    హరినిజార్ధతనువునందు డిందె
    నేమి సేయవచ్చు నీశ్వరుం డఖిలాత్ముఁ
    డతని గెల్వఁ దనకు వలవి యగునె?

సీ. తలలు వీడంగ విద్యాధరులే పఱచిరి
        గ్రగ్గలకాంద్రైరి ఖచరవరులు
చట్టుపై బోకలై చనిరి గంధర్వులు
        గరుడులు పంచబంగాళమైరి
కన్నదిగతిగాఁగఁ గిన్నరు లరిగిరి
        పన్నగేంద్రులు పటాపంచలైరి
పోయినపోకలై పోయిరి సిద్ధులు
        దిక్కుమొకములైరి దిగధిపతులు.

గీ. హరిహయత్రాణనాయత్తు లనుచు వచ్చి
    మునులు సంప్రార్థనావచోముఖరులైరి,
    పూనికల మీఁదనవ్వు దంభోళినిట్లు
    పంకజోదరుఁ డొడిసి చేపట్టుటయును.

ఇది వీరరసము! ఇటులనే యర్థము సంగ్రహముగ వర్ణింపఁబడి హృద్యముగనున్నది. వీరరసమునకుఁ జక్కనిసహకారి యౌదార్యము; కనుక శ్రీకృష్ణునిపాత్రమున కదికూడఁ బొందుపఱుపఁబడినది. పరాజితుఁడగు బలారి శరణు వేఁడి రక్షింపుమని జనార్దనుని వేఁడుకొనఁగా నతనివలనఁ దప్పేమియు లేదనియును, "నీమఱంద లీకొమ్మ, వదాన్యభూరుహము కోరినఁ దెచ్చితిఁగాని, కొమ్ము నీసొమ్మని వజ్రి మిచ్చి మధుసూదనుఁడా తరువీఁ దలం"చెను. మేటియుద్ధమున గెలిచిన పారిజాతము నొక్క మాటలో నింద్రుని కిచ్చివేయ సమకట్టుటయుదారస్వభావమును బ్రకటించును. ఈ పాత్రమున నింకొక్క విశేషము జూచి విరమింతము. పుణ్యకవ్రతానుష్ఠాన సమయమున సత్యభామచేఁ దాను ధారవోయఁబడి నారదునికి వలయు పరిచర్య సేయుట కొడంబడుట గడువిచిత్రము. హాస్యమున కతఁడుగూడఁ బనులఁ గొనుచుండెను! భక్తపరాధీనుండగు భగవంతుఁడు నారదునియభీష్టముల నెరవేర్చుట సామాన్యమేమైనను, కథా సందర్భమునఁ గృష్ణునిపాత్రమున కీవిశేషముగూడఁ బొందుపఱచియుండుట ప్రశంసాపాత్రము.

"సతీతిలకమగు సత్యభామపాత్రము నిటులే యనన్యసామాన్యముగ నిరూపింపఁ బడినది. కొంతవఱ కామె సామాన్యస్త్రీవలెనే

సంచరించియు ననన్యసామాన్యములని చదువరు లేకగ్రీవముగ నొప్పుకొనకతప్పనిలక్షణములఁగూడఁ గలిగియున్నది. 'కులమును రూపమున్ మగనికూరిమియున్ గలదాన నంచు' నామెకుఁ గొంతదర్పము గలదు. మఱియు శ్రీకృష్ణుని సతీతిలకములయం దామె సౌందర్యవతియనియు, మిగుల మానవతియనియు మహనీయసౌభాగ్యవతియనియుఁ గూడ వర్ణింపఁబడినది. కావుననే తనపతి సలిపినయవజ్ఞ యించుకైనను సహించు స్వభావము గలదికాదు. ఈమెగుణకీర్తన మెందైనఁ గవిచే నొక్కచోఁ జేయఁబడియుండలేదు. కాని మానవతియని గ్రహించుటకుమాత్రము చాలయవసరములు గల్పింపఁబడినవి. తన శృంగారవనమునందు "చంద్రోపలవేదిపై సరసగోష్ఠిన్ బోటియున్ దాను" నుండఁగా, దక్షిణనేత్రస్పందన మాయెను. తోడనే యామె యేమనుచున్నదో చూడుఁడు! ఈవఱ కింకను బారిజాతవృత్తాంత మామె కించుకయుఁ దెలియదు.

చ. అకట! యదేమియో యెఱుఁగనయ్యెడఁ దొయ్యలి!;
దక్షిణాంగమౌ,యకనకనప్రకంపనగుణసూచన లేమి యొ?
వల్లగావు! సా,కెసి మఱి జాలిఁబొందెడి యొకకీడి జలం
బెదు; ప్రాణవాహుఁ డొం,డొకచపలాక్షిఁగూడి నను
నొల్లనిచెయ్దము లేమిచేసెనో.

మగనికూరిమి తనయం దధికముగఁగల దని సత్యకు గరువతనముగలదని కవి వర్ణించి యుండుట యెంత హేతుసహితమైయున్నది! తన బోటివలనఁ బారిజాత వృత్తాంతము నెఱిఁగినతోడనే యామె మానసమునఁ గ్రోధముద్భవించినది. ఇది యాసునఁబుట్టినదని మనము గ్రహించదగును. అంతటి గరువతనము గల యామె కిట్టిమాటలు వినఁబడినచో, నొక్కపెట్టునఁ గ్రోధశోకము లుద్భవించియుండుట సామాన్యము. ఒకప్పు డవి మతిభ్రమను గలిగించునంతటి శక్తిగలవై యుండును. కొంత మానహానియును మగనికూర్మికిఁ గొంత భంగమునుఁ గలిగియుండుటచే, సత్యభామ "వ్రేటువడ్డ యురగాంగన"వలెనుండెనని వర్ణింపఁబడినది. ఈవర్ణన మెంత రసభరితము! ఎంతభావగర్భితము! తానంతటి మానహానిసైచి ప్రాణములు నిలుపుకొనఁజాలననియు నిర్లక్ష్యముగ నుసురుల విడువ సమకట్టియున్నట్లును సత్యభామ యెటులు ప్రలాపించుచున్నదో చూడుఁడు:

ఉ. ఇన్ని దినంబులున్ సవతు లిందఱిలోఁ గడుగారవమ్ము
నన్, గన్నియ నన్ను వల్లభుఁడు గన్నులఁగప్పు కొనం
గ నుండి, యా,యన్నెయ వాసియున్ దలఁగి, వారు
ననున్ దల లెత్తిచూడఁగా, సన్నలఁజాయలన్ బలుక
నైతురొ? ప్రాణము లెంతతీపొకో.

ఉ. ఓచెలి! శౌరి కిచ్చెనట నొక్కలతాంతముఁ దెచ్చి
నారదుం; డాచపలాక్షి కిచ్చెనట యాతఁడు నవ్విరి;
యిట్టిమాట లా, హా! చెవులన్ వినంబడియుఁ బ్రాణము
దాల్చెదమేన నింకఁగా, నోచితి నింక నెట్టివి గనుంగొన
నెమ్మెయి నున్నదాననో.

తన మగనికూరిమి యితరులయందుఁ గూడఁ గలదని తెలిసినచోఁ గులసతి యోర్వఁజాలదనుట కిది మంచిదృష్టాంతము. మానవ కాంతఁబోలె యెట్లు విలపించుచున్నది! స్త్రీస్వభావ మిందుఁ జక్కఁగఁ బొందుపఱుపఁబడినది. వారి సంభాషణములు, వారి యభి

ప్రాయములు, నాశయములును జక్కఁగ వ్యక్తపఱుపఁబడినవి. స్త్రీస్వభావము నింత చక్కఁగ గమనించి యీయుత్తమలక్షణముల సత్యభామపాత్రమునఁ బొందుపఱచియుండుట కవివర్యుఁడగు తిమ్మనార్యుని ప్రతిభకు మేటి నిదర్శనము. ఈవిషయము హేతుసహితమని మనము గ్రహించుట కనువగుఘట్టమునుండి కొన్ని పద్యములమాత్రము క్రింద నుదాహరించెద. పాఠకులే గ్రహించెదరుగాక! తన భర్తచేఁ బారిజాతము సవతి కియ్యఁబడినదని వినినపు డామె ప్రలాపించినవిధముఁ జూడుఁడు!

క. ముని యేమి సేయు! రుక్మిణి
గొనఁ గా నేమి! ధూర్తగోపాలుఁడు చే
సినచెయ్ద మేమిచెప్పుదు!
వనమేటి కుండె ప్రాణమైన పగఁజిల్లయినన్.
ఆ. ౧. ప. ౮౭.

క. పరికింపరు తమజాడలు
తరుణుల తగులములు నమ్మఁదగదండ్రు; వనిజ్
శరసంబుడచలచిత్తులు
పురుషులెపో; వారినమ్మఁబోలదు చెలియా!

క. కలకాల మొక్కఁగతిఁబా
సలతో దారంబుమాత్ర పతివదిలోనన్
మెలఁగెడు పురుషులు గలుగుట
తొలుజన్మము నోముఫలము తోయజనేత్రా!

క. ధనమిచ్చి పుచ్చుకొన్నను
మనమున నోర్వంగవచ్చు మగఁడింతులకున్
జనవిచ్చి పుచ్చుకొన్నను
మనవచ్చునె! యింక నేటిమాటలు చెప్పుమా.

సతీతిలకములు దమకుఁగలిగిన భంగపాటునకుఁ గొంతవగతురు. అది తమ సవతుల కెఱుకపడినచో వారిదుఃఖము రెట్టించినదగును. ప్రాణనాథుఁడు దమ కగౌరవము గలుగుచుండఁ జూచియు, వినియుఁ దటస్థుఁడై యుండినచో నా క్రోధాగ్ని మఱియు దీపించును. మగనిచే నవమానింపఁబడిన సతి కెల్లరచేతను గూడ అగౌరవమే కలుగునను సిద్ధాంతము చేయుట స్త్రీస్వభావము. కావుననే "మగఁడు కొట్టినచో మాధవకబళపువాఁడు గొట్టు" ననుసామెత. సత్యభామగూడ నిట్టిసందర్భమున నేమనుచున్నదో చూడుడు!

చ. అతులమహానుభావమని యవ్విరిఁదానొక పెద్దఁజేసియు,
న్మతుఁడయి నిచ్చకం బొదవ మాడిన యిచ్చిన
నిచ్చెఁగాక తా, నతఁడు ప్రియంబుగల్గునెడ కర్పణఁ
జేసినఁ జేసెఁగాక యా, మతకరివేలుపుం దపసి మమ్ముఁ
దలంపఁగ నేల యిప్పుటన్.

పైఁ గనిన భాగమునందంతటను సత్యభామ మిగుల గఱువయని సూచింపఁబడినది. కావ్యమందంతట నిటులనే యేకరీతిగా నామె పాత్రము నిరూపింపఁబడినచో, మన కా పాత్రమునందును గవియందును గూడ గణ్యత చాల తఱిగియుండును. కేవలము సామాన్యమగు ప్రవర్తనమును గవి యులవడఁ జేసినచోఁ గవికల్పితపాత్రము మన హృదయసీమలయందు నిత్యముగ నివాసము గలిగియుండఁజాలదు. అందువలనఁ గవివర్యుఁ డీ పాత్రము ననన్యసామాన్యముగ నుంచుటకుఁ బ్రయత్నించి దాని కనువగు లక్షణము లొకటిరెండు మాత్రము పొందుపఱచెను. మగనికూర్మి నట్లు చూరఁగొనినదని వర్ణింపఁబడిన సత్యభామ యంతటి మానవతి, కింతటియవమానము గలిగినచో, నట్టియలుక సామాన్యముగఁ దీరిన విశేష ముండఁబోదు. అనునయించుటకుఁ బరుషపాత్ర మెక్కుడు

ప్రయత్నము సేయువలయును. కావున నే డోలాయమానమానసుఁడగు శ్రీ కృష్ణుఁడు సత్యభామమందిరమునకువచ్చుచుఁ బాలభయ పడుచుండెనని వర్ణింపఁబడినది. నిత్యకల్యాణి యగు నామెవిలాసము క్రోధావేశమువనుండ నెట్లు వికృతమయ్యెను, చూడుఁడు!

ఉ. మాసినచీర గట్టుకొని మౌనముతోడ విరక్తభావయై
నా సెనకట్టుగట్టి నిడువాలికగస్తురిపట్టువెట్టి, లోఁ
గానిలి చీకటింటికడ కంకటిపై జలదాంతచంద్రరే
ఖాసదృశాంగియై పొరలె గాఢమనోజవిషాదవేదనన్.

చ. నీరుహపత్రలోచనకుఁ
చెల్లనుమోహము సంఘటిల్లె, జె
క్కసమున గెవ్వగల వాడమె,
కంపము పుట్టెఁ, జెమర్చె మేను, మా
నసమున విన్నఁబాటొదవె,
నా కెఁగ దుస్ బరితాపవేదనల్
మనసిజపుష్పబాణహతి
మత్సరమున్ విన మగ్గింపఁగన్.

చ. వెడవెడఁ గన్నుమాయఁ గను
విచ్చు నగన్ దలయూఁచుఁ బొన్నుపైఁ
బడు ముసురంచు లేచుఁ బడు
బాటున దత్తరమున్ జలంబులో
నడరఁగఁ గోపసేగమున
నగ్గలమైన మనోజబాధలన్
బడి మదహస్తిహస్తగత
పద్మినియున్ బలె సొంపు చెంపఱన్.

సత్యభామయున్న యవస్థను గవి వర్ణించిన విధము ననుసరించి మనఃఫలకమునఁ జిత్రించుకొనిన నీవర్ణన మెంతవఱకు స్వభావసిద్ధమో మనకుఁ దెలియఁగలదు. క్రోధావేశమున నామె "మధ్యందినభాను మండలకరావళిఁ హావళివాడియున్న తీగెం దలపించు" చుండెనట. తనవల్లభునిరాక పారిజాతవాసనలచే గ్రహించి, విస్మయమంది యామె మునుంగు ద్రోచి నల్గడలఁ జూచునరికి "సంభృతతాలవృంతుఁ"డగు కాంతుడు చూపట్టెను. దైవోపహతి నొంది, బంధుపరామర్శచే విషాదమధికముగఁబూను పామరస్త్రీజనము ననుకరించుచు నామె కన్నీరు నించినది. తిరుగ ముసుఁగిడినది. ఏమికారణము? భర్త తనక్రోధమును గమనించి, యనునయింపఁ గృతనిశ్చయుఁడై యుండెనని యామె గ్రహించినది. ఇఁక నెంత బింకముఁ బూనినను గార్యము ఫలించుననుటలో సందియము లేదు. శ్రీకృష్ణుఁడు గంభీరోపన్యాసమును జేసెను. లాభము లేకపోయెను. ఆమె యనుగ్రహము రవంత దప్పినచో నిలువఁజాలనని తెలిపియుండెను. ఇంత మాత్రమున నామె క్రోధముచల్లారినచో నేమి విశేషము గలదు? తన్నవమానించినవారికిఁ దనచే సరియగు భంగపాటు గలిగినఁగాని మానవతి క్రోధము చల్లారకుండుట గొప్ప మనస్తత్త్వము. అందుచేత నే గ్రంథములందుఁ గని వినియెఱుఁగని నూతనపరిణామ మీపాత్రమునకుఁ గవి పొందుపఱచెను.

ఉ. పాటలగంధి చిత్తమునఁ బాటిలు కోపభరంబు దీర్ప
నై, ప్పాటను బాటఁగాని మృదుపల్లవకోమలతల్పద
ద్వయియా; పాటలకాంతి మాళిమణిపంక్తి వన్నియ
బెట్టె నాజగ, న్నాటకసూత్రధారి యదునందనుఁ
డర్మిలి మ్రొక్కె మ్రొక్కెవన్.

మ. జలజాతాసన వాసవాది సురపూజాభాజనంబై తన
ర్చులతాంతాయుధుకన్న తండ్రి శిరమచ్చో వామ
పాదంబునన్, దొలఁగం ద్రోచె లతాంగి; యట్లయ
గు నాథుల్ నేరముల్ సేయఁ, బేరలుకం జెందిన
యట్టి కాంత లుచితవ్యాపారము ల్నేర్తురే?

ఇట్టిపరిణామము కేవలము విపరీతము. అనన్యసామాన్యము. పాఠకుల కిట్లుతోఁచిన స్వభావ విరుద్ధముగఁ దనపాత్రము ప్రవర్తించుదోషము గలుగునని తలఁచి, యీస్థితిని గవి యెట్లు సమర్థించెనో గ్రహించునది. క్రోధావేశమున నిట్టి ప్రవర్తనము సహజమేయని పాఠకులచే గ్రహింపఁగలిగి యుండుటచే, మనోధర్మముల ను గవి పాటించెనని తెలియుచున్నది. సామాన్యుఁడగు కవీశ్వరుఁ డిట్టియౌచిత్యమును దన పాత్రమునకు సంఘటించుటకు వెనుదీయును. సత్యభామ క్రోధరసము క్రమముగ విజృంభించి, యొక్కసారి పొంగి పొరలినది. కావుననే తనభర్తను వామపాదమునఁ దన్నినది. ఇదియే క్రోధరస ముప్పొంగిన యవసరము. ఇంకను బ్రాణనాథుఁ డనునయించుచునే యుండెను. తోడనే క్రోధము పలుచఁబడుచుండెను. తొలుత మాటాడనోడిన సత్యకుఁ దన భర్తను దూరుటకు శక్తి గలిగినది. తాను బ్రాణముల విడుచుటకుఁ గూడ సిద్ధపడియుండెననియును, మానవతికి ప్రాణముకంటె మానమే యధికమనియు నుపన్యసించి తన్నంత చుల్కన చేసెఁగదా యను తలఁపున క్రోధరస మింకొకసారి పొరలివచ్చుటచే, "సంతర్బాష్ప యగుచు, నవనతముఖియై, ఘనతరగద్గదికా నిస్వనమున మరి మాటలాడ శక్యముగామిన్.

ఉ. ఈసునఁబుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబుచే, గాసిలి యేడ్చెఁ బ్రాణవిభు కట్టెదుటన్ లతాంగి పంకజ, శ్రీసఖమైన మోముపయిఁ జేలచెఱంగిడి బాలపల్లవ, గ్రాసకషాయకంఠ కలకంఠవధూకలకాకలీధ్వనిన్.

ఆక్రోశమున కిదియు మంచి పరిణామము. దీనితోఁ గ్రమముగ సారసము నీరసమగుచుండుట సామాన్యము. ఇదియెంత స్వభావ సిద్ధము!

మఱియొక విషయము. సత్యభామవీరపతి వ్రతాలక్షణము లధికముగఁ గలమానిని. గఱువతనముగూడ మెండు. కావునఁ బారిజాతాపహరణోద్యోగమున దనభర్త ననుసరించి నాకమునకుఁ బోయియుండుట సహజమే. నరకాసురుని గెలుచునవసరమునఁ బ్రాణనాథునికి సాయపడినమేటి! నారదుఁ డీవిషయమును ధ్రువపఱచుచు "అదికైనన్ బలి నిన్నుఁ బాసి చనునో" యని సత్యభామను బ్రశంసించెను. నాకభటులు శ్రీకృష్ణునడ్డగించు నవసరమున సత్యభామ వారితోఁ బలికినవిధముఁ గనుఁగొనుఁడు.

సీ. వినుఁడు సురేశ్వరవనపాలకులు! వార్ధిఁ
బొడమిన యాదివ్యభూరుహమున
కింద్రాణి యొజ్జ తే? యింద్రుండు సెవ్వఁడు
తోడియుండదను గౌస్తుభము సెవ్వఁ
డక్షుఁడై ధరియించె, నరఁడె చేకొనఁగాక
తెక చేర యిదియేమి యొకరిసొమ్ము?
యిది నాదువిభుచేత నీవదాన్యనగంబు
నోడియుంచుకొని తేఁగదున్న దాన!
గీ. బలుకు లేటికిఁ దా వీరపత్ని యేని!
విశాలాక్షి దేవి తనదు ప్రాణేశుఁడైన
మానవు నిటఁ బంపి సత్యభామాభిధేయం
వలన ఘరలంగఁ గొనుట పో వాసితనము.

ఇదియుఁగాక సత్య చేజరిగిన పుణ్యకవ్రతానుష్ఠాన మామెయందు భక్తిరసమును వృద్ధిచేయఁదగియుండెను. ఆవ్రతవిధాన మందుల కనుకూలముగనే నారదునిచే నివేదింపఁ

బడెను. సత్యకు గలుసతనము చాలవఱకుఁ దఱిగి వినయసంపద యబ్బుటయే పుణ్యక వ్రతానుష్ఠాన ఫలసిద్ధియని శ్రీకృష్ణుఁడును, నారదుఁడును దలఁచియుందురు. అదియ యథార్థమని మనముగూడ గ్రహించుట యుక్తము.

పాత్రనిరూపణమునందుఁ దిమ్మనార్యునికిఁ గలపాండిత్యమును దిక్ప్రదర్శనముగఁ దెలుప నింతవఱకుఁ బ్రయత్నింపఁబడినది. తక్కుంగల పాత్రములు నిట్లు నిరూపింపఁబడె నవని గ్రహింపఁదగును.

వ ర్ణ న ము లు

గూడ సమయోచితముగ దిమ్మనార్యునిచేఁ జేయఁబడియున్నవి. సామాన్య ప్రబంధములలో నివియే ముఖ్యము. ఇందు సమంజసము లనిపించునట్లున్నవి. అనఁగా నియ్యవి కథావేగమున కాటంకముఁ గలుగఁజేయఁ జాలవు. మఱియు సంగ్రహములును, భావగర్భితములును, మనోహరములు నైయున్నవి! ప్రబంధములయందు సాధారణమయిన అష్టాదశవర్ణనలునుకలవు. ఒకటి రెంటినిమాత్రము చూడుఁడు! ద్వితీయాశ్వాసమున నక్షత్రములను వర్ణించు నవసరమున :

సీ. కార్కొన్నకటికి చీకటి మొగల్మొత్తంబు
గురిసిన వడగండ్లగుంపు లనఁగఁ
గవజక్కవలు వాయఁగర నాళములఁ బొందు
రుంపాఁదు పటికంపుటుండ లనఁగ
నెల్లెడ మిన్నేటియిసుమున నచ్చర
కొమ లిడ్డ వన్నెలకుప్పలనఁగ
దరిని వెన్నెల వెండితీగలు నిగిడించు
చదలు కమ్మన్ను కెజ్జము లనంగ

గీ. జగము గెల్వంగ దండెత్తు మగనిమీఁద
లీల రతిచల్లు దీపవ్రా లనంగ
వేఁడివెలుఁగ గెండఁగ్రాగినవిన్ను వేన
కొక్కెసెడు చెమట బొట్టులనాఁ జుక్క లమరె.

స్వభావసిద్ధములగు మనోధర్మములను గూడ నతఁడు వర్ణించినవిధము నిదివఱకుఁ జూచియే యున్నారము.

ఇన్నివిధములఁ దిమ్మనార్యుఁడు దన కృతికి వన్నెపెట్టి ప్రశస్తి వడసెను. సంగ్రహమయ్యు రసభరితమగు కథయును ఔచిత్యమునకుఁ బెట్టినపేరులగు పాత్రములును కవి కల్పితములయ్యుఁ బాఠకుల హృదయసీమల నాటుకొనఁజాలు లక్షణముల నయ్యవి వెల యించుటయును బ్రశంసాపాత్రములు. చేయఁబడినవర్ణనము లప్రస్తుతములుగాక, సందర్భశుద్ధిగలిగి, కథావేగమున కించుకంతయు భంగము గలిగింపనివిగా నుండుటయుఁ గవివర్యుని యసాధారణప్రతిభకు మేటినిదర్శనము. శైలి వీనికనుగుణమై, ద్రాక్షాపాకముగ నుండుటచేఁ బాఠకులకు మరియు హృద్యము. "ముక్కు తిమ్మనార్యు ముద్దుపల్కు" అను సార్థకబిరుదమును జదువరులెల్లరు యథార్థమని గ్రహించుటకుఁ దగిన నిదర్శనములు పెక్కు లీవఱకే చూపఁబడినవి. ప్రబంధకవుల యం దుత్తమస్థానమీ కవివర్యునకుఁగలదా యని సందేహించువారుండరని నాయభిప్రాయము. అట్టివా రుండిరేని, యీ ప్రబంధము నామూలాగ్రముగ, సవిమర్శకదృష్టిని జదివినచో నీవ్యాసమునఁ దెలుపఁబడినది కేవలము యథార్థమని తోఁచును.

మహాసతి సీత

కలువలపల్లి రంగనాథశాస్త్రి గారు

జనకక్ష్మాపాలమౌళిసుత సాధ్వి రఘూద్వహుఁడైన రామభ
ద్రుని నెడఁబాసి నెవ్వగలఁదూలి యశోకవనిం దదార్తిక్
దనమదిలోన రేవగలు దప్పక తారకమంత్రరాజమున్
మననము సల్పుచున్ మొగి దినంబులు పుచ్చుచునున్నయత్తఱిన్. ౧

ఉ. మారుని బారిపాలగుచు మంచియుఁ జెడ్డయుఁ నెంచఁబోక శృం
గారవనంబుఁ జేరి దశకంఠుఁడు సీతను గాంచి పల్కె నే
వీరుఁడ విశ్వజేత నీక వేఱుగఁ జూడక నన్ను భర్తగాఁ
గోరి వరింతువేని సుమకోమలి! కోరఁగనేల భోగముల్. ౨

శా. నీమాటల్ జవదాటసుమ్ము సతమున్ నిక్కమ్ముగా నమ్ముమీ
ధీమంతుల్ విని సన్నుతింపఁగ నినున్ దేవేరిఁగాఁ జేయుదున్
నామీఁదన్ వలపూనవింతయుఁ గటా! నాయంతవాఁ డీగతిన్
గామింపన్ వెస నియ్యకోవలవదే, కాంతామణీ, జానకీ! 3

చ. నెలఁతరో! నీపదాబ్జములు నిచ్చలుఁ దప్పక మూఁడుపూటలున్
కొలుతురు నాప్రియాంగనలు కూరిమి నీవు ప్రసన్నచిత్తవై
నిలుకడ నన్ను నేలునెడ నీకనుసన్న మెలంగువాఁడఁ గో
ర్కెల నొడఁగూర్చువాఁడఁ బెఱత్రోవఁ జరింపను నమ్ము నెమ్మదిన్. ౪

చ. కలికిరో! కాననమ్మునను గాసెడు వెన్నెలవోలె మాంజవో
జ్జ్వలమగు మేనిసౌష్ఠవము జవ్వనమున్ వృథసేయ నేటికిన్
వలచినవానిఁ బాయఁదగవా! మగవారలు గోరినం గదున్
జలకనఁ జూతు రాండ్రనుట చొప్పడె నీయెడ! నిక్కువమ్ముగన్. ౫

ఉ. కానలలోన నిచ్చలును గాయలు దుంపలు వేళ్లు మెక్కుచున్
మేనుగృశింపఁగా నునికి మేలని యెంచితివేల కోమలీ!
దానవభర్త రావణుఁడు దానుగ దీనునిమాడ్కి వేఁడినన్
పూనిక సుంతయేని తలఁపున్ వెలిపుచ్చ విఁకేమి చెప్పుదున్ ౬

ఉ. నమ్ము మనమ్మునం గలధనమ్ములు మేలిమిమేడలుం బ్రసూ
నమ్ములతోఁట లర్హ వసనమ్ములు రత్నవిభూషలున్ సుగా
నమ్ములసాధనమ్ములు ఘనమ్ముగ నన్ను గణింప నీయఁధీ
నమ్ముగఁ జేయువాఁడ సుదినమ్ము తలంపఁగ నేఁడు జానకీ! ౭

చ. జలనిధిదాఁటి నీవిభుఁడు జానకి! వచ్చునె లంకలోనికిన్
తలఁకకవచ్చెనేనియును నాయెదుటన్ నిలువంగనేర్చునే
నిలువగనేర్చినన్ గెలువనేర్చునె మానవకీటమింతయున్
దెలియనిదానవీవు జగతిన్ ననుఁబోలిన వీరు లుందురే. ౮

చ. మగఁటిమి నన్ను నెవ్వరును మార్కొనిపోరున గెల్వలేరు ము
జ్జగములు మున్నె గెల్చితిని శౌర్యముపేరిమిఁ జెప్పనేల శూ
రగణములోన మేటి నిఁక రాముఁడు గీముఁడు నాకులెక్కయే
మగువలమేలుబంతి! అనుమానము మానుము మానసంబునన్. ౯

ఉ. కానలకేగుమంచు నలుకైక వచించిన రాజ్యహీనుఁడై
దీనతనెల్ల దిక్కులను ద్రిమ్మరు రాముని మాని మానినీ!
మానుగ నన్నుఁగూడి మనుమా, వినుమా, ననుఁబోనివానినిన్
గానఁగలేవు నిక్కము జగాన మఱొక్కరునేనిఁ బూనికన్. ౧౦

మ. అని యీరీతి మదాతిరేకమున దైత్యస్వామి కామార్తుఁడై
తనయిష్టంబును దెల్ప, సాధ్వియగు సీతాకాంత యాలించి వా
నినుడుల్ సైఁపక తాల్మిఁబూని విబుధానీకంబు లెన్నంగ ని
ట్లను గోపావిలచిత్తయై మొఱకుఁగా నవ్వాని భావింపుచున్. ౧౧

ఉ. వానిఁదృణీకరించుగతి వామవిలోచన గడ్డి పోచఁ జేఁ
బూని మొగంబుమాటువడుపోలిక నడ్డుగనిల్పి ధర్మముల్
వీనుల కెక్కఁగం గుమతివృత్తిఁ దొఱంగి చరింపఁగన్ సమా
ధానమొసంగు సీత నయతత్త్వవిదుల్ బళియంచు మెచ్చఁగన్. ౧౨

మ. మనుమార్గంబునుబట్టి వర్తిలెడి యస్మన్నాథునిన్ రామభ
ద్రుని గారుణ్యసముద్రు దీనజనబంధున్ సవ్రతంగొల్చి నీ
మను మార్గంబును జూచికొమ్ము నయమున్ మర్యాదయుంగల్గి స
జ్జన గణ్యుండవుగమ్ము దానవకులేశా? రావణా! యింతటన్. ౧౩

(సశేషము)

సుశీలారూపసులు

పారనంది జగన్నాథస్వామి గారు, యం. ఏ, యల్. టి.

(రెండవసంపుటము మొదటిసంచిక తరువాయి)

అంకము ౪

రంగము 1

సముద్రము కనబడుతూఉండేటట్లు ఉన్నడాబా

(రూపసి సుశీల ప్రవేశింతురు; ఒకరినొకరు కలిసికొందురు.]

సుశీలా చూచేవా, సూర్యుడు సముద్రములోనుంచి ఏలాగు లేస్తున్నాడో; చూడు. ఆసముద్రతరంగములు అంతగా కదలకుండా ఉన్నందువలన చల్లనిఆనందము అనుభవిస్తున్నట్లు కనబడుతున్నవి. ఈఉదయముకూడా ఎంతపరిమళమయమైనట్టిన్నీ నిర్మలమయమైనట్టిన్నీ ఏకాంతములో మునిగిఉన్నదో చూచేవా. ఈ నిశ్శబ్దముమాస్తే, ప్రపంచము అంతా ఏకాంతముగానే ఉన్నట్లు తోస్తున్నది. ఎవరేమాటాడినా దానిద్వారా ఆ నిశ్శబ్దము వ్యక్తమవుతూఉన్నది. ఇంతచక్కగా ఈ ఉదయమేకాకుండా, ఈ రోజుఅంతా ఉంటుందికాబోలు, చూడూ, నేను వెళ్లే రోజు ఇవ్వాళేగదూ!

సుశీల:—నీవు వెళ్లనేవద్దు.

రూపసి:—నాగది కిటికీలోనుండి నీవు రావడముచూచి నిన్ను కలుస్తానని వచ్చేను. సుశీలా, నాకేమో భయమువేసింది. ఆ పడిపోతున్న గోపురము గోడమీదినుంచి వంగి చూస్తున్నావు; నీ ఊర్ధ్వకాయమంతా వ్రేలాడింది. గోడరాళ్లు జారిపోతున్నట్లు నాకు అయింది. ఎన్నడూ నే నెరగని భయము నా హృదయములో లేచింది. పెదవులాడినవికావు. తెల్లపోయేను. అప్పటికీ కిటికీలోనుండి మొగముపెట్టి పెద్దకేకవేసేను. నీకు వినబడలేదో, వినబడి నీకు నా అభిప్రాయము అర్థముకాలేదో. ఏమిటిచేస్తున్నావు అక్కడ.. విధి చాలా చపలమైనది సుమా, దానిని అట్టే పురికొల్పకూడదు. ఇది మూడో మారు నిన్నా గోపురముమీద నేను చూడడము. ఏమిటచేస్తున్నావు అక్కడ. ఆరాళ్లు లాగుచున్నట్లు అగుపడ్డది. ఆ మహాకాశములో దేనికోసము వెదుకుతున్నావు?

సుశీల:—అవును, వెదుకుతున్నాను... వాళ్లు చెప్పేరుకారూ నీతో? నాకోసము నీవేమీ భయపడకు; ఏమీ భయకారణము లేదు. గోపురము గట్టిగానే ఉన్నది. వాళ్లకి తెలియదు; పడిపోతున్నాదని వాళ్లు అనుకొంటారు కాని అంత శిథిలము కాలేదు. మన అందరికంటె ఎక్కువ కాలము నిలిచి ఉంటుంది, నాకు తెలుసును. దానినెందుకు నిందించడము? అది ఎవరికీ ఏమీ అపకారముచేయలేదే!...పోనీ కాని, నీవు చూస్తూఉంటే ఒక వింతసంగతి ఉన్నది. అది నీకు తెలియలేదు, చూసేవా? ఐదారు రోజులక్రిందట ఇక్కడికి ఒకవింతపిట్ట వచ్చింది; దానికెంతవిసుగు లేదో కాని, ఎప్పుడూ నాగోపురము చుట్టూ రువ్వు రువ్వుమని పరిగెత్తుతూ ఉంటుంది. దాని రెక్కలు ఆకుపచ్చగా ఉంటవి; నేను వర్ణించి స్పష్టముగా చెప్పలేను. దానిసంగతి అంతా వింతగానే ఉన్నది. అది రోజురోజుకు పెరుగుతున్నట్లు కనబడుతుంది. అది ఏదేశము నుంచి వచ్చిందో చెప్పమంటే ఎవరూ చెప్పలేరు. అది గోడసందులో గూడు పెట్టింది కాబోలు; అక్కడ నేను వంగి చూస్తూ ఉంటిని...

రూపసి:—ఇదేనా ఈగోపురము బంగారము తాళంచెవి. దీనితోనేనా నీవు ఆడుతుండేదానవు.

సుశీల:—అవునవును; నీవు ఇక్కడికి వచ్చిన నాడే దానిని పడేసేను.

రూపసి:—నాకది ఇస్తావా?

సుశీల:—నీకివ్వాలీ? ఎందుకూ?

రూపసి:—నేను వెళ్లేదాకా నావద్ద ఉంచుకొంటాను.

సుశీల:—ఎందుకూ?

రూపసి:—ఎందుకో నాకేతెలియదు... నేను ఇక్కడనుంచి చాలాదూరము వెళ్లిపోయిన తరువాత కావలస్తే అప్పుడువెళ్లుదువుగాని ఆ గోపురముమీదికి అందాకా వెళ్లకు; అందాకా ఆపచ్చరెక్కలపక్షిఊసుపెట్టకు.

సుశీల:—ఇదిగో తాళంచెవి, రూపసీ, అయితే నీవద్ద ఉంచుకో. ఇవ్వడానికి నాకేమి అభ్యంతరములేదు చూడు. కాని అది ఎంత బరువుగా ఉందో!

రూపసి:—అవును, చాలా బరువుగానే ఉంది.

సుశీల:—రూపసీ, ఏదీ ఒక్కముద్దు.... నీకు దుఃఖము కలుగజేసేనా ఏమిటి?

రూపసి:—నీ వెప్పుడూ ఒకరికి దుఃఖము కలుగజేయలేదే. అదేమిటి నీకండ్లనిండా నీళ్లు ఎందుకు వస్తున్నవి?

సుశీల:—ఏమీలేదు, నిన్ను ముద్దాడుతూ సూర్యునివైపు చూసేను. మళ్లా ముద్దు పెట్టుకో. మదనునివద్దకు వెళ్తాను; తానూ పెందరాడే లేస్తానని అన్నాడు రూపసీ, వెళ్లివస్తా.

రూపసి:—(తాపీగా) సరే, నేనూ వెళ్తా.

[సుశీల వెళ్లింది. సుశీల దూరముగావెళ్లిందాకా ఉండి, తరువాత డాబాక్రింద ఒకకోనకు

వెళ్లి ఆబంగారం తాళంచెవివైపుఅదేచూస్తూ, గభాలున సముద్రములోనికి విసిరివేసింది. తానూ వెళ్లిపోయింది.]

రంగము 2.

ఇంట్లో ఒకగది

[తాతమ్మ నిద్రలో ఉంది. మంచముముందుకి చిన్నపిల్ల చెయ్యిపట్టుకొని సుశీల వచ్చింది.]

సుశీల:—చిన్నపిల్లా, తాతమ్మను ఒకమారు ముద్దుపెట్టుకొందాము; ఇప్పుడు ముద్దు పెట్టుకోకపోతే, మనము వెళ్లిపోయిన తరువాత మరి ముద్దుపెట్టుకొనేవారు ఎవరు ఉన్నారు? అందరికంటె ఎక్కువగా ఆమెకే మనముద్దులు అవసరము. ఆమెతో ఏమీ చెప్పకుమీ... రూపసికి భయమట; అలాగని చెప్పి నాగోపురము తాళంచెవి నాదగ్గిరనుంచి తీసుకొంది. కాని ఆపోయిం దనుకొన్న మొదటి తాళంచెవి నాకు దొరికింది; అందుచేత ఎవరికీ తెలియకుండా మనము గోపురముమీదికి వెళ్లగలము. అక్కడికి వెళ్లితే ఆపచ్చని పక్షిని నేను పట్టుకొంటాను...

చిన్నపిల్ల:—వెంటనే నాకిస్తావుగదూ?

సుశీల:—నీవు ఏమీ మాట్లాడకుండా ఉంటే నే నీకిస్తాను. జాగ్రత్త; చెప్పకుమీ ... తాతమ్మ లేపుతాను......చిన్నపిల్లా నా ముఖము ఏలాగుంది? ఎవరైనా చూసి నేను విచారముగా ఉన్నానని అనుకొంటారా ఏమిటి?

చిన్నపిల్ల:—చిన్న అక్కయ్యా, నీకు సంతోషము కలుగజేసేమాట ఏదైనా ఉందా నేను చెప్పడానికి? ఉంటే చెప్పు.

సుశీల:—అలాగు కాదు, నీవు నిజము చెప్పాలి. చూడు, నాకేమో విచారముగా ఉన్నాదని తాతమ్మ అనుకోకూడదు. సాధారణముగా లోకములో తప్పఅభిప్రాయము పడుతూ ఉంటారు; సుఖముగా ఉన్నప్పటికీ పైవారు ముఖముచూసి ఎందుకు విచారిస్తున్నావు అని అడుగుతారు; విచారము లేదన్నా నమ్మరు.. నాకు దుఃఖముగా ఉన్నట్లు నీకు అగుపడలేదుకదా?

చిన్నపిల్ల:—ఏది అక్కయ్యా, బాగాచూడనీ

సుశీల:—ఏమిటి చూస్తావు? నీకు ఏమైనా తెలుస్తుందా?

చిన్నపిల్ల:—దగ్గిరగా రమ్మా అక్కయ్యా, బాగా చూస్తాను.

సుశీల:—ఏదీ, ఈలాగుదా, నిన్ను ఎత్తుకొని ముద్దాడుతాను. అయినా నీవేమీ చూడలేవు, చూడు.

చిన్నపిల్ల:—అక్కయ్యా, నీవు చాలా సుకుమారముగా ఏడుస్తావు కాబట్టి, నీవు ఏడుస్తున్నా, ఏడుస్తున్నట్లు ఎవరూ పోల్చలేరు.

సుశీల:—నేను ఏడవేలేదు. చూడు. తరువాత నీవు ఒక్కర్తవే ఉన్నప్పుడు నిన్ను వాళ్లు ఇవ్వాళ అడిగితే "అక్కయ్య ఏమైనా చెప్పిందా? అక్కయ్య ఏమిటి చేసింది, అక్కయ్య దుఃఖపడుతూ ఉండేనా? అక్కయ్య తెల్లబారిపోయిందా?" ఈలాగు ప్రశ్నలు వారువేస్తే, నీవు వెంటవెంటనే జబాబులు చెప్పకుమీ; అందులోకీ వాళ్లు బెదిరిపోయి ఉంటేనూ, వెడవెడలాడుతూ

ఉంటేనూ, నీవు వెంటనే జవాబులు చెప్పి వేయవద్దు... అంతే కాకుండా నేను కులాసాగా ఉంటిననే చెప్పు. చక్కగా కనిపెట్ట గలిగేవాళ్లందరికీ నేను కులాసాగా ఉన్నాననే తోస్తుంది; ఎల్లప్పుడూ నవ్వుతూ ఉన్నాననే తోస్తుంది. చూడు మన మెప్పుడూ నిజమే చెప్పుతూ ఉండాలి. ఇదిగో తాతమ్మను లేపడానికి వెళ్తున్నాను, నీవు జాగ్రత్త... అబ్బా, ఎంత ఒంటరిగా ఉంది తాతమ్మ. ఆమెను అందరూ విడిచి పెట్టివేసేరుగదా! [తాతమ్మను చాలా సేపు ముద్దాడి] తాతమ్మా! [తాతమ్మ లేవలేదు] నేనే, తాతమ్మా!...ఎంత గాఢముగా నిద్ర పోతున్నది...తాతమ్మా, వెళ్తానని చెప్పడానికి వచ్చేను.

తాతమ్మ:—[లేస్తూ] ఆ! నీవా! సుశీలవా?

సుశీల:—అవును, తాతమ్మ. చిన్నపిల్లా, నేనూ ఇద్దరముకలిసి షికారు వెళ్తామని చెప్పడానికి వచ్చేము.

తాతమ్మ:—ఎటువైపు వెళ్తారు?

సుశీల:—ఎటో ఇంకా అనుకోలేదు. కాని మామూలుకంటె దూరముగా వెళ్తాము. సాయంత్రములోపున ఇంటికిరాము. నీకు కావలసినవన్నీ ఉన్నవికదా? నాస్థానే రూపసి ఉన్నదికదా, నీసంరక్షణచూస్తూ ఉంటుంది. వెళ్లేముందర పరుపు దుప్పట్లు దులిపి ప్రక్క మళ్లా వేదునా? నొప్పి లేకుండా ఎత్తి ప్రక్క వేసి మళ్లా పరుండ పెట్టడము నాకొక్కర్తెకే తెలుసును బాగా. నరేనులే, రూపసికూడా నేర్చుకుంటుంది. ఆమె చాలా తెలివైనదే; ఒక్కమారు చేయనిస్తే, సులువుగా గ్రహిస్తుంది. ఆమెను ఒకమారు పిలుస్తునా చూస్తుంది?

తాతమ్మ:—వద్దువద్దు. నీవు తిరిగి వచ్చిందాకా పడుక్కొంటాను.

సుశీల:—వెళ్తానూ, వెళ్తాను తాతమ్మ.

తాతమ్మ:—మంచిది; రాత్రిపడకుండా వెళ్లి పోరమ్మా.

[చిన్నపిల్లచేయిపట్టుకొని, సుశీల గబగబ వెళ్లిపోవస్తుంది]

రంగము 3.

లోగిట్లో ఒకగదివసారా

[దారిలో మదనుడు కలుస్తాడు]

మదనుడు:—ఎక్కడికి అంతవేగిరముగా వెళ్తున్నావు?

సుశీల:—ఎక్కడికీలేదు. ఎండతప్పకోవాలని, ఆచెట్లనీడలోకి వెళ్లేను.

మదనుడు:—అబ్బా, ఎండఎంతతీక్ష్ణముగా ఉంది! నిజముగా గోడలలోని రాళ్లు కరిగి పోతున్నవా, సముద్రమంతా అగ్నిమయము అయిపోయిందా అనేటట్లు ఉంది. అడవులలో ఎల్లప్పుడూ ఉండవలసిన చల్లదనమంతా జ్వాలలుగా మారిపోయిందా ఏమిటి? ప్రపంచమంతా మ్రింగివేసే సింహమువలె సూర్యుడు ఆకాశమందు ప్రజ్వలిస్తున్నాడు. ఎక్కడైనా ప్రాతఃకాలసురభి నిలిచి ఉంటే నీమోవియందే ఉన్నది, సుశీల; రమ్మా, ఏదీ ఒక్కముద్దు ఇమ్మా.

సుశీల:—ఉహు- ఇప్పుడుకాదు నేను వెడిపోవాలి. వేళలేదు. వాళ్లు నాకోసము కనిపెట్టుకొని ఉంటారు..... సాయంత్రము ముద్దులాడవచ్చును.

మదనుడు:—విశేషమేమిటి, సుశీలా?

సుశీల:—ఆహా, అదా! చాలాచిన్న సంగతి. దానిపనిసరి.

మదనుడు:—ఏమిటంటావూ?

సుశీల:—ఏమిటా? ఏమీలేదు.... ముద్దులాడు వేగిరముగా.

[తాను గట్టిమని, తొందరగా ముద్దుపెట్టుకొంటుంది]

మదనుడు:—చూసేవా... రక్తమువచ్చింది!

సుశీల:—ఏమిటి!

మదనుడు:—రక్తము!... ముత్యములవంటి నీ చక్కని దంతములవల్ల చిన్నగాయము అయింది.

సుశీల:—ఛా, ఏమిక్రూరురాలను!... మదనా, నొప్పా?

మదనుడు:—పోనిత్తూ. ఏమాత్రము దెబ్బ అది!

సుశీల:—కాదు, మదనా. నేను క్రూరురాలను... వేళఎంత?

మ॥నుడు:—సుమారు పండ్రెండు.

సుశీల:—పండ్రెండే. నేనుపోవాలి... నాకోసము వాళ్లు కనిపెట్టుకొనిఉంటారు. వెళ్తాను మదనా.

మదనుడు:—సుశీలా, సుశీలా, ఎక్కడికి ఆ వెళ్లడము?

సుశీల:—[పాడుకొంటూ, చిన్నపిల్ల చెయ్యి పట్టుకొని, వేగిరంవేగిరముగా సుశీల వెళ్లిపోయింది. మదనుడు చూస్తూనిలబడ్డాడు. కొంచెముసేపు ఉండి వెళ్లిపోయినాడు.]

రంగము 4

గోపురముమీద

[సుశీల చిన్నపిల్లల ఇద్దరి ప్రవేశము]

సుశీల:—చిన్నపిల్ల, ఏమిటిచేదాము? ఇక్కడికివచ్చివేసేము, ఇకచేయవలసినదేమిటో ...చూసేవా, ఎక్కడచూచినా ఎంత కాంతిగా అన్నివస్తువులూఉన్నవో! భూమి ఆకాశము సముద్రము అంతటా ఒకవిధమైన తేజస్సు విస్తరించి ఉన్నది. అన్ని రోజులకంటె ఎక్కువ ఆహ్లాదకరముగా ఉండడానికి ఏమిటో ఈరోజు విశేషము?

చిన్నపిల్ల:—ఏది, అక్కయ్యా, ఆపచ్చని పిట్ట?

సుశీల:—అదుగో, అక్కడఉంది. మనకిఇంకా అగుపడదు. కొంచెముసేపుపోయినతరువాత ఆగోడమీదనుంచి వంగివంగిచూదాము. చూడు చుట్టూ ఏలాగుఉందో. మనమేడ, చుట్టూ ఆవరణము, తోటలు, అడివిఅంతాచూడు, కనబడుతున్నవి. గట్లమీదఉన్న పూలమొక్కలన్నీ ఏలాగు పువ్వులతో నిండిఉన్నవో చూడు. భూమి ఎంత పచ్చగాఉంది ఇవ్వాళ!... రూపసి నాకు అగుపడలేదే... అదిగో మదనుడు, చూడు రూపసికోసము కాచిఉన్నాడు. వంగిపో, మనము దాగుందాము; ఇక్కడ ఉన్నామని వానికి తెలియకూడదు. నాతి

దగ్గిరే ఉన్నాడు. అక్కడే నేను రూపసిని లేపేను....

చిన్నపిల్ల:—చిన్నక్కయ్యా చూడే. తోట కాపువాడు మొక్కలు ఊడుస్తున్నాడు చూడే.

సుశీల:—ఆమొక్కలూ పెరగడమూ, పువ్వులు పూయడమూ, అంతా నీవు చూస్తావు, చిన్నపిల్లా నాకోసము నీవు ఆపువ్వులు కోదుగాని... అబ్బా, మరిభరించలేను... ఉ. చూడు, ఈ వైపునుంచి చూడు. ఇటువైపు సముద్రముతప్ప మరేమీలేదు [గోపురము రెండోవైపు వెళ్తారు]. సముద్రము ఎంతబాగాఉంది? ఎక్కడా ఏమూలా దుఃఖము కానరాదు. పచ్చగాను గంభీరముగాను, చక్కగాను, ఆసముద్రము ఉంటూఉంటే, మరిధైర్యము ఉండదు. చిన్నపిల్లా, ఏది ఏలాగైనా సముద్రము అది మాత్రము ఆలాగే రాత్రి అయేదాకా చల్లగా నవ్వుతూనే ఉంటుంది. చూడు ఆచిన్న చిన్నతరంగాలు...అబ్బా, నాచేతకాదుసుమా అబ్బా... పువ్వులు, సముద్రము ఒప్పకుండా ఉన్నవి. ఈ పట్టపగలు ఆపని చేయడానికి ధైర్యము చాలకుండా ఉంది.

చిన్నపిల్ల:—అక్కయ్యా, ఇవిగో కాకులు ఇవిగో ఈలాగువస్తున్నాయి. ఎన్నిఉన్నాయి; ఎన్నో; ఒకవెయ్యిఉంటాయా!

సుశీల:—సముద్రము అవతల ఒడ్డునుండి ఎగిరి వచ్చేయి. మనకోసానికి వార్తలు తెస్తున్నట్లు ఎగిరిఎగిరి వస్తున్నట్లు ఉన్నవి చూడు.

చిన్నపిల్ల:—వార్తలుకాదు. చిన్నచిన్న చేపలు అవి... గోడసందులలోనుండి కాకిపిల్లలు తల్లులకోసము కాకా అని అరుస్తున్నవి. చూసేవా అల్లాపెద్దకాకి, ఎంత చేప ఉందో దాని ముక్కులో! నీకు కనబడలేదూ! అదిగో, చూడు అదిగో. అప్పుడే తినివేసేయి. పెద్దకాకులు తినలేదు, తనకేమీ ఉంచుకోందికాదు చూడే అక్కయ్యా, అది తల్లా.

సుశీల:—తాతమ్మతో, ఏమిటి చెప్పేను?

చిన్నపిల్ల:—అక్కయ్యా, ఎందుకు ఏడుస్తున్నావే?

సుశీల:—ఏడవలేదే. ఆలోచిస్తున్నాను, వచ్చివేసేముందర తాతమ్మను ముద్దాడేనా లేదా?

చిన్నపిల్ల:—ముద్దాడేవు.

సుశీల:—ఎన్నిమార్లో!

చిన్నపిల్ల:—ఒక్కమారే; మనకు వేళ చాలక......

సుశీల:—సుకుమారముగా ముద్దాడి ఉండలేదు కాబోలు

చిన్నపిల్ల:—తొందరతొందరగా వచ్చివేసేము, అక్కయ్యా.

సుశీల:—ఉ. ఉ. బాగాలేదు. కూడదు... తాతమ్మ ఒక్కర్తే ఉంటుంది; ఈసంగతి ఎప్పటికీ నామనస్సులో ఉండిపోతుంది.

మామూలుకంటె ఎక్కువ కోమలముగా ఉండకుండా ఉండివెళ్లిపోతే, వాళ్లపై ప్రేమ లేకపోవడముచేతనే వెళ్లిపోయేమని వాళ్లు అనుకొంటారు. వారు అలాగు తలచకూడదు; ప్రేమలేదని వారికి నమ్మకముఉండకూడదు. ప్రేమ మరీఎక్కువైనప్పుడే, కోమలముగా ఉండడానికి ఎక్కువగా జంకుతాము. ఇంతకూ, తప్పేమో. వాళ్లు ఏమిచేసినా, వాళ్లుఉన్నన్నాళ్లూ మనము ఆఖరున చెప్పినమాటే జ్ఞాపకముపెట్టుకొంటారు. మాఅమ్మపోయేముందర నాకు అలాగే అయింది, చిట్టచివరకు ఒకచిన్ననవ్వునవ్వకుండానేపోయింది; నాకెప్పుడూ అదేజ్ఞాపకము ఉండిపోయింది; మాఅమ్మ నవ్వలేదుకదా అని నాకించ. అంతకు పూర్వము చేసినదంతా మరి లెక్కలేదు ...అంతేకాకుండా రూపసినిగురించి ఏమి చెప్పేనో? నాకు జ్ఞాపకములేదు. మళ్లా తాతమ్మను చూడాలి... ఉన్నవాళ్లా, వారిసంగతివారిదే. వారికి ఈసంగతేమీ తెలియకూడదు... కాని ఆమె ఒక్కర్తే ఉన్నది; అమెకోరకు కాదుగదా నేను ఈ గోపురముమీదికి రావడము కిందికి వెళ్లడమున్నూ...చూసేవా, ఇది అసాధ్యముగా ఉంది. రా, మనము వెళ్లి తాతమ్మను చల్లగా, కోమలముగా ముద్దాడుదాము, రా. [నిష్క్రమింతురు.]

రంగము 5.

లోగిట్లో ఒకగది.

తాతమ్మ నిద్రలోఉంది. సుశీల, చిన్నపిల్ల ప్రవేశింతురు

సుశీల:—[తాతమ్మను లేపి] తాతమ్మా!

తాతమ్మ:—సుశీలా, వచ్చివేసా, ఎంతోసేపటి నుంచీ నీకోసము ఎదురుచూస్తూఉన్నాను.

సుశీల:—తాతమ్మా, వెళ్తానని చెప్పినప్పుడు కోమలముగా ప్రవర్తించి వెళ్లలేదని నేను కించపడుతున్నాను, నన్ను క్షమించుము.

తాతమ్మ:—ఏమి, సుశీల, కోమలముగానే ఉంటివే! నీమనస్సులో ఏదో నిన్ను బాధిస్తున్నదిగాని...

సుశీల:—నామనస్సులో ఏమీలేదు. తాతమ్మా, నీవంటే నాకెట్టిప్రేమ ఉందో నీకు తెలియజేయాలని తప్ప మరేమీలేదు.

తాతమ్మ:—నాకు తెలుసునుగా నీ వెన్నోమార్లు నీప్రేమ వ్యక్తపరచినావు; నాకెప్పుడూ సందేహములేదే.

సుశీల:—నిజమేకాని ఇప్పటివరకు నామట్టుకు నాకే తెలియలేదు.

తాతమ్మ:—పిల్లా; ఏదీ దగ్గిరగా రాఅమ్మా. ఈపాడుచేతులు పడిపోయిన దగ్గిరనుంచీ, నాకు ఇష్టమైనవారిని కౌగలించుకో లేకున్నానని నీకు తెలుసునుగదా, పోనీ, నీవే కౌగలించుకో, సుశీలా; నీవేదో వింతగా ఉన్నావు ఇవ్వాళ; అందుచేతా నాపై నీకు గలప్రేమ నీకు తెలిసింది అంటావు?

సుశీల:—ఆహా అది కాదు. నాకు ఇంతకు పూర్వమే తెలుసును కాని సాధారణముగా ఒకసంగతి తెలిసియున్నా స్పష్టముగావ్యక్తముకాకుండా ఉంటుందిచూడు. అది అందుచేతనే అకస్మాత్తుగా ఒకనాడు వ్యక్తమై ఉండవలసినంత దయగా ఉండ

లేదనిన్నీ చేయవలసినంత చేయలేదనిన్నీ, చూపవలసినంత ప్రేమ చూపలేదనిన్నీ, ఇవన్నీ ఒక్కమారు స్పష్టముగా తెలుస్తవి. అప్పుడు అంతా మించిపోకుండా ఉన్నప్పుడే తిరిగి ప్రారంభించాలని తోస్తుంది. నాకు తల్లీ తండ్రీ ఎవరూ లేరుగదా తాతమ్మా, నీవుకూడా లేకపోయిఉంటే తల్లి అంటేఏమిటో నాకు తెలిసే ఉండకపోయిఉండును. సుశీలను ఒక్కమారైనా విడిచిపెట్టకుండా పెంచి పెద్ద చేసేవు. నీవు ఉండబట్టే దుఃఖముగా ఉన్నప్పుడు ఎవరివద్దకువెళ్లితే సుఖము కలుగుతుందో తెలుస్తూఉండేది.

తాతమ్మ:—అమ్మా ఆలాగుకాదు. నన్ను విడిచిపెట్టిపోకుండా ఉన్నదానవు నీవే.

సుశీల:—ఎందుకు ఆలాగుచెప్తావు. నాకోసము అంటిపెట్టుకొని ఉన్నదానవు నీవే అని నేనుబాగా ఎరుగుదును.

తాతమ్మ:—నీవు ఈమధ్యాహ్నము ఎందుచేతనోకాని వింతగాను, చాలా నిండుగాను ఉన్నావు; అయినా విచారిస్తున్నట్లు కనబడలేదు.

సుశీల:—నేను ఎప్పుడూకూడా సుఖముగానే ఉన్నాను; సుఖమంటే ఏమిటో నాకిప్పుడు తెలిసింది.

తాతమ్మ:—సుఖము నీకు దూరమైనదని కాదుగదా నీ అభిప్రాయము?

సుశీల:—ఛా, ఎంతమాత్రమూకాదు. నేను ఇప్పుడు కనుక్కొనగలిగేను, తాతమ్మా...పోనీకాని నీకు సుఖమేనా చెప్పవూ.

తాతమ్మ:—ఎప్పుడంటావు?

సుశీల:—ఇన్నాళ్లూ, తాతమ్మా.

తాతమ్మ:—ఎప్పటిమాటఅంటున్నావు?

సుశీల:—ప్రాణము ఉన్నప్పుడు.

తాతమ్మ:—అందరికీ సంభవించేవిధాన నాకు కూడా దుఃఖముకలిగినదినాలు ఉండేను, కాని నీవు నన్నువిడిచిపెట్టకుండా ఉండడముచేత నాకు ఎప్పుడూ సుఖముగానే ఉండెనని నేను చెప్పగలను.

సుశీల:—నీసౌఖ్యానికి నేనంతకారకురాలనని నీవు తలస్తూఉండకూడదు; ఎందుచేతనంటే నేను ఒకవేళలేకున్నా, రూపసి ఉంటుందిగదా.

తాతమ్మ:—సుశీలా, ఆమెనెప్పుడూ నాకాళ్ల మీదవేసుకొని జోకొట్టలేదే.

సుశీల:—అయినా, నీవామెను ప్రేమించాలి.

తాతమ్మ:—నీకు ఆమెపై ప్రేమ ఉందికాబట్టి నాకూ ప్రేమఉన్నది ఆమెపై.

సుశీల:—అన్నిటికంటె ఎక్కువగా ఆమె యెడల నీకుప్రేమఉండాలి, ఎందుచేతనంటే ఆమెవల్లనే సౌఖ్యమంటే ఏమిటో నాకు బాగాతెలిసింది...ఆమె ఎంతోచక్కనిది. అంతచక్కనిదికాబట్టె ఆమెను నేను ఎరిగిననాటినుండి, కన్నీరుతోనిండిన నేత్రములతో ఆమెప్రక్కను నివసిస్తున్నాను.

తాతమ్మ:—సుశీలా, నీచేతులు ఎందుకే ఇంత వేడిగా ఉన్నవి?

సుశీల:—నాకెంతో సుఖముగాఉంది కాబట్టి.

తాతమ్మ:—నాచిన్నపిల్లా, నీవంటేనాకు సర్వమూగదా అమ్మా.

సుశీల:—తాతమ్మా, నావల్లనీకు ఎప్పుడైనా దుఃఖముకలిగిందా?

తాతమ్మ:—నాకేమీ జ్ఞాపకములేదమ్మా.

సుశీల:—అవును. నీవు జ్ఞాపకముతెచ్చుకో. ఎందుకంటే, మనము ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తామో వారికే ఎక్కువగామనము దుఃఖము కలుగజేస్తాముకూడా; తాతమ్మా, నీకు ఎప్పుడుఎక్కువగా నొప్పికలుగజేసేనో, చెప్పుమీ.

తాతమ్మ:—నాకు దుఃఖముకలుగజేసేనని అంటూ నీవు ఏడిచినప్పుడే నాకు ఎక్కువ నొప్పి కలుగజేసేవు. కాని నీతప్పుకాదే అప్పుడు... మరేమీ జ్ఞాపకములేదు.

సుశీల:—మరెప్పుడూ ఏడవను.

తాతమ్మ:—గడియారములోని దిమ్మ ఆడేటట్లు సుఖముకూడా ఇటూఅటూ ఆడుతూ ఉంటుంది. అందుచేత సాధ్యమైనంతవరకూ కన్నీరురానీయకుండా మనము ప్రయత్నము చేయాలి.

సుశీల:—నీవన్నమాటనిజమే. సౌఖ్యము తిరిగీ నీకూవారికీకూడా సమకూడిన తరువాత, వాళ్లని ఒకనాడు నీప్రక్కకూర్చుండబెట్టుకొని, వారికి ఒక అనాధబాలికకథ చెప్పు...

తాతమ్మ:—ఏమిటి అంటున్నావు, సుశీలా?

సుశీల:—ఏమీలేదు, నాచిన్నతనము రోజుల గురించి ఆలోచిస్తున్నాను.

తాతమ్మ:—అవును సుశీల, నేనుకూడా చాలామార్లు ఆచిన్ననాటి రోజులగురించి ఆలోచిస్తూఉంటాను. అప్పటికి ఇంకా నాకీరోగము రాలేదు. నిన్ను ఎత్తుకోగలిగేదానను; నీవెంట పరుగెత్తగలిగేదానను. నీవు ఉండబట్టి మళ్లా తల్లివలె ప్రవర్తించగలిగేను. నీకూ ఒకనాడు ఎప్పుడో వ్యక్తమవుతుంది తల్లిగా ఉండడమంటేఏమిటో; అప్పుడు విసుగుఅన్నమాటే ఉండదు. ఇంతఎందుకు చావువచ్చినాసరే బిడ్డను లాలించేటట్లు లాలిస్తారు....అంతా మెల్ల మెల్లగా కొంచెము కొంచెము పోతుంది.

సుశీల:—అవును, తాతమ్మా, దుఃఖము కూడా క్రమంగా పోయిపోయి, తుదకు మరి ఉండదు. కాని మంచిమాత్రము నిలిచి ఉంటుంది, ఉన్నవాళ్లందరూ సుఖముగా ఉంటారు.

తాతమ్మ:—ఎవరన్నారు అలాగు?

సుశీల:—రూపసి చెప్పింది, నేను నేర్చుకున్నాను.

తాతమ్మ:—నీ నేత్రములు ఏమి ప్రకాశిస్తున్నవి?

సుశీల:—[పైకివస్తూఉన్న రోదనధ్వనినిఅణచివేసి] ప్రపంచమంతా నేను ఒక్కలాగే, ప్రేమిస్తున్నాను కాబట్టి నానేత్రములు ఆలాగుఉన్నవి.

తాతమ్మ:—నీవు ఏడుస్తున్నట్లు ఉంది,సుశీలా?

సుశీల:—లేదే తాతమ్మ; ఏవో రెండుచుక్కలుకన్నీరుజారితే, అవి ఆనందబాష్పములే.

తాతమ్మ:—ఏదీ కౌగలించుకో...ఆ, మరింత గాఢముగా, మరింత...నావద్ద ఉండిపో.

చిన్నపిల్ల:—నాకో ముద్దు.

సుశీల:—[చిన్నపిల్లను మెల్లిగా తప్పించి] ఉండు. తాతమ్మ నన్నే ముద్దులాడాలి ఇవ్వాళ. ముద్దులన్నీ నీవే అయేరోజు వస్తుంది ఉండు...తాతమ్మా, ఇక వెళ్తాను.

తాతమ్మ:—సుశీలా! ఏమిటది! ఎక్కడికి వెళ్తావు?

సుశీల:—వెళ్తాను.

తాతమ్మ:—సుశీలా, ఉండు. అబ్బా, వెళ్ల వద్దు. నాకిష్టములేదు. నీవు వెళ్లవాటము కాదు. [లేచి చేతులు చాచాలని ప్రయత్నముచేస్తుంది కాని చాచలేదు.] అబ్బా, చాచలేను. చూచేవా సుశీలా, నాకు ఇష్టములేదు. వద్దు.

సుశీల:—తాతమ్మా, నాకున్నూ, ఇష్టము లేదు... వెళ్తా... రాత్రికులాసాగా నిద్రపో... కలలేమీ కనవద్దు... వెళ్తా వెళ్తా.

[చప్పున, చిన్నపిల్ల చేయిపట్టుకొని, పైకి వెళ్లిపోతుంది.]

తాతమ్మ:—సుశీలా...సుశీలా...

[మెల్లిగా తనలో తాను ఏడుస్తూ ఉంటుంది. వెలుతురు క్రమముగా తగ్గిపోతూ ఉంటుంది]

రంగము 6

లోగిట్లో ఒక వసారా

[చిన్నపిల్ల చెయిపట్టుకొని సుశీలప్రవేశిస్తుంది...ఎదురుగుండావస్తున్న రూపసినిచూచి చిన్నపిల్లతో కూడా ఒకపెద్దస్తంబముప్రక్కదాగుంటుంది.]

రూపసి:—[దగ్గరగావచ్చి] నీవా సుశీలా, ఎందుకుదాగున్నావు?

సుశీల:—రూపసీ, ఎందుకో నాకేతెలియదు...నీవు ఒక్కర్తవే ఉండాలని నీకు ఉన్నాదని అనుకొన్నాను.

రూపసి:—ఎక్కడికివెళ్తున్నావు? చిన్నపిల్ల క్రీకంటిని చూస్తున్నది. ఏమి, మీరిద్దరూ కలిసి ఏదైనా కుట్రపన్నేరా ఏమిటి?

సుశీల:—ఎవరితోను చెప్పనని ఖరారుచేసేను.

రూపసి:—చిన్నపిల్లా, ఎక్కడికితీసుకొనివెళ్తున్నావు సుశీలను? [చిన్నపిల్లమాట్లాడదు] ఏమి, నీవూ చెప్పవూ?

సుశీల:—పెద్దవాళ్లవలె రహస్యముదాచడము ఏలాగో చిన్నపిల్లకుకూడా తెలుసును.

రూపసి:—సాయంకాలము కాంతిదైనా, నీవు తెల్లబారినట్లు కనుపిస్తున్నావు, సుశీల.

సుశీల:—నిన్ను ముద్దుపెట్టుకోవాలని ఉంది, రూపసి.

[చాలా సేపుఒకరినొకరుముద్దుపెట్టుకొంటారు]

రూపసి:—సుశీలా, నీమోవి ఎంత కోమలంగాను, ఎంతమనోహరముగాను ఉందో.

సుశీల:—నీదిన్నీ రూపసీ,... నాకు చాలా కులాసాగా ఉన్నది.

రూపసి:—ఒక తేజస్సునీపైఆవరించినట్లున్నది.

సుశీల:—తాతమ్మను చూచేవా?

రూపసి:—లేదు. ఇప్పుడు వెళ్లేదా?

సుశీల:—ఎందుకూ, వద్దు. అవసరము లేదు. నిద్రపోతున్నది...మదనునికొరకు చూస్తున్నావా?

రూపసి:—నీవో సుశీలా ?

సుశీల:—అతనిని కలిసినప్పుడు నాతరపున నీవు అతనిని ముద్దాడుము...నేను లేనప్పుడు అతనిని ముద్దాడేదానవు నీవుగదా అని నాకు చాలా సంతోషముగా ఉన్నది... నీవుఅంటే నాకు చాలా అనురాగము సుమా! చూచేవా చిన్నపిల్లకు చాలా తొందరగాఉంది; చూడు నాచెయ్యిపట్టుకొని లాగుతున్నది. రూపసీ, వెళ్తాను. మళ్లా ఇప్పుడే కలుసుకొంటాను.

[చిన్నపిల్ల చెయ్యిపట్టుకొని, పాటపాడుకొంటూ సుశీల వెళ్లిపోతుంది. పాట వినబడక పోగానే రూపసికూడా వెళ్లిపోతుంది.]

రంగము—7

గోపురముమీద

[సుశీల చిన్నపిల్ల ప్రవేశింతురు.]

సుశీల:—చిన్నపిల్లా, కాలము సమీపించింది. మళ్లా వాళ్లదగ్గిరికి ఇక వెళ్లను, వాళ్లను చూచినవ్వేట మరిఉండదు ...ఎంతచలిగా ఉంది. ఇక్కడ దక్షిణగాలి వేస్తున్నది ఆ కెరటాలమీద వెలుతురు ఏలాగు పడుతున్నదో చూచేవా! పువ్వులు కనబడవు. మనుష్యులమాటలు వినబడవు. ఎక్కడచూచినా నిశ్శబ్దము, విచారము నిండిఉన్నవి...ప్రొద్దున్నకీ, ఇప్పటికీ ఎంత భేదము!

చిన్నపిల్ల:—అక్కయ్యా, ఆపక్షీఏది ?

సుశీల:—బాగా చీకటిపడ్డదాకా ఉండాలి. సూర్యుడు బాగా సముద్రము అడుగుకి చేరాలి. వెలుతురు పూర్తిగా పోవాలి. అప్పుడు పక్షి పైకివస్తుంది. ఆపక్షికి వెలుతురంటే భయము; ఎన్నడూ సూర్యకాంతి తగిలి ఎరగదు.

చిన్నపిల్ల:—అయితే అక్కయ్యా, నక్షత్రాలు ఉంటేనో ?

సుశీల:—నక్షత్రాలు ఉన్నాసరే (ఆకాశము వైపుచూచి) నక్షత్రాలు లేవే; ఆకాశము లోనుంచి పొడుచుకొనిరావాలనికాచి కనిపెట్టుకొని ఉన్నవిగదా. అవును మనము తొందరపడాలి; అవి వచ్చివేస్తే మరి కష్టమవుతుంది.

చిన్నపిల్ల:—అబ్బా, చాలా చలిగాఉంది.

సుశీల:—ఇక్కడ కూర్చుందాము! ఈగోడ చాటున గాలి తగలదు. ఆకాశముమీద ఎరుపు రేఖ పోయినదాకా కాచిఉందాము. చూచే సూర్యుడు ఎంతమెల్లిగా అస్తమిస్తున్నాడో! కనబడకుండా సూర్యుడు పోయినతరువాత, పక్షికొరకు నేను వెతు

కుంటాను. నాపాలువ నీకుకప్పుతాను, దా; నాకు మరి అక్కర లేదు.

చిన్నపిల్ల:—అంత గట్టిగా దగ్గరగా ఎందుకు పట్టుకొన్నావు అక్కయ్యా?

సుశీల:—ఏమీలేదు! నా సౌఖ్యము నాకు ఎక్కువైంది. ఈరోజు ఉన్నంత సుఖముగా ఎప్పుడూ నేను ఉండలేదు. చూడు, నావైపు చక్కగాచూడు. నేను నవ్వుతున్నానుకాను? తప్పకుండా నవ్వుతున్నాను. నీవుకూడా ఎందుకునవ్వవు?

చిన్నపిల్ల:—ఏమిటి అంతగబగబ మాట్లాడుతున్నావు?

సుశీల:—అంత తొందరగా మాట్లాడుతున్నానా...మరి వేళలేదు తాపీగా మాట్లాడ డానికి.

చిన్నపిల్ల:—నా పువ్వులన్నీ ఎందుకు తెంపివేస్తున్నావు?

సుశీల:—ఏమి పువ్వులు? ఇవా! నీవి అన్న మాట మరిచిపోయినాను.

చిన్నపిల్ల:—ఏడవవద్దే, అక్కయ్యా,ఎందుకే.

సుశీల:—ఏడవలేదే. ఏడుస్తున్నానని ఎప్పుడూ నమ్మకు. నేను విశేషముగా నవ్వుతూ ఉండబట్టి ఏడుస్తున్నట్లు నీకు కనుపిస్తున్నది కాబోలు.

చిన్నపిల్ల:—నీకళ్లు ఏడుస్తున్నట్లు ఎందుకు ఉన్నవి?

సుశీల:—నాకళ్లు చేసేపనికి నేనెట్లుపూచీ?... ఒక్కటి జ్ఞాపకముపెట్టుకో. నేను దుఃఖపడుతూ ఉంటినని ఎవరితోనైనా చెప్పినావు అంటే నీకు చాలా చాలారోజులవరకు దెబ్బలవుతవి. శిక్షతప్పదు.

చిన్నపిల్ల:—ఏమి?

సుశీల:—నీకు తరువాత తెలుస్తుంది. అట్టే మరిప్రశ్నలు అడగకు. నీవు ఇంకా చిన్నదానివి; అందరికీ తెలిసినన్ని సంగతులు నీకుతెలియవు. నీఈడున నేను ఉన్నప్పుడు నాకూ తెలియలేదు. నేను ఏమిచేస్తానో అదికాదు నీకు కావలసినది...చూడు, ఎవరికీ చెప్పకుండా ఉండడము చాలా దుఃఖముగా ఉంటుంది కాబట్టి, ఎవరికైనా చెప్పాలనిఉన్నా, నీతో చెప్పకూడదు.

చిన్నపిల్ల:—అక్కయ్యా, సూర్యుడు మరి అగుపడడే.

సుశీల:—ఉండు. కొంచెము సేపు ఉండు. సూర్యుడు పోతూఉంటే, మరొకటి సమీపముగా వస్తూఉన్నది. అది బాగా దగ్గిరగా వస్తే నాకు బాగా కనుపిస్తుంది ... నిన్ను ఇక్కడికి తీసుకొరావడము మంచిపనికాదు కాబోలు. ఎవరైనా ఒకరు రావడము మంచిది; ఎందుకంటే ఇక్కడ ఏమి జరిగిందో వాళ్లు తెలుసుకోవాలని తంటాలు పడతారు. కాని వారికి ఏమీ తెలియకూడదు...చెల్లెమ్మా, నేను ఏమిటి అంటున్నానో నీకు ఏమీ తెలియదుగదా...కాని ముందుముందు ఒకనాడు ఇదంతా జ్ఞాపకమువచ్చి నీకు తెలుస్తుంది; ఇప్పుడు నీకు అగుపడ్డా అర్థముకానిది అంతా అప్పుడు

తెలుస్తుంది: అప్పుడు నీకు దుఃఖముకలుగుతుంది. నీవు చూడబోయేది ఎప్పటికీ మరిచిపోలేవు. నీవు పెద్దదానవు అయినతరువాత ఇందుకని ఎన్ని కన్నీళ్లు పెట్టుకొంటావో! నిన్ను ఇది ఎంత దుఃఖపెట్టుతుందోగదా! అందుచేత నన్ను క్షమించమని నిన్ను అడుగుతున్నాను. దీనిసంగతి ముందు తెలిసినప్పుడు నీవు పడేదుఃఖబాధకు నన్ను క్షమించుము.

చిన్నపిల్ల:— అక్కయ్యా, మళ్లా కాకులు గుంపులుగుంపులు వస్తున్నాయే.

సుశీల:— రేపుకూడా వస్తవి.

చిన్నపిల్ల:— ఊ.

సుశీల:— రేపుకూడా పాడతాయి.

చిన్నపిల్ల:— ఊ.

సుశీల:— పువ్వులు రేపుకూడా విడతాయి.

చిన్నపిల్ల:— అవునే, అక్కయ్యా.

సుశీల:— అయితే ఒకటి అందులో చిన్నది ఎందుకు కావాలి?

చిన్నపిల్ల:— అక్కయ్యా, ఒక్కసన్నని రేఖే ఉంది.

సుశీల:— అవును. వేళయింది...నీవే తొందరపెట్టుతున్నావు; ఆనక్షత్రములకు కూడా ఓర్మి ఉన్నట్లు లేదు. చిన్నపిల్లా, నాకు చాలాచాలా కులాసాగా ఉంది. వెళ్తానూ.

చిన్నపిల్ల:— నాకూ అలాగేఉంది. వేగిరముగా, మళ్లా నక్షత్రాలు వచ్చివేస్తవి.

సుశీల:— భయపడకు చిన్నపిల్ల; వాటికంటవారినేను పడను...దా, ఈమూల కుర్చో, చలిగాఉంది, నాషాలువ కప్పతాను ... నాపైనీకు నిజముగా ప్రేమఉందా? సరేనులే, జబాబు అక్కరలేదు. వద్దు నీవు చెప్పవద్దు...ఇదిగో ఈపెద్దరాయి ఇక్కడ పెడతాను. ఇది దాటిరాకు. ఆ సందున్నచోట నేను వంగుతాను...నేను మరి కనబడకపోతే భయపడకు. మరేమీలేదు. నేను అవతలప్రక్కకు వెళ్లేను అన్నమాట. ...నాకోసము కనిపెట్టుకొని కూర్చొకు. మెట్లమీదనుంచి నీవు ఒక్కర్తెవే దిగి వెళ్లు...నేను ఏమిచేసేనో అని నీవు తొంగిచూడకు. గోడదగ్గిరారాకు ...వస్తే నీకేమీ కనబడదు సరేకదా, నీకు శిక్ష కూడా అవుతుంది ... నీకోసము క్రింద ఉంటాను. చిన్నపిల్లా, ముద్దుపెట్టుకో. తాతమ్మతో చెప్పు...

చిన్నపిల్ల:— ఏమిటి చెప్పమన్నావు, అక్కయ్యా?

సుశీల:— ఏమీలేదు...ఏదో మరచిపోయేను అనుకొన్నాను. [సముద్రమువైపు ఉన్న దగ్గిరావెళ్లి, వంగినది.] అబ్బా, ఎంత లోతుగా ఉంది, ఎంతచలిగాఉంది!

చిన్నపిల్ల:— అక్కయ్యా!

సుశీల:— అదిగో, నాకు కనబడినది ... కదలకుమీ.

చిన్నపిల్ల:—ఏమిటి?

సుశీల:—ఉండు...ఇంకా బాగా వంగాలి... చిన్నపిల్లా! చిన్నపిల్లా! రాళ్లు కదిలి పోయినాయి! పడిపోతున్నాను! ఆ!

[గోడప్రక్క జారిపోయినది. పడిపోయిన ధ్వని వినబడినది. బాధ తెలియజేసే ధ్వని ఒకటి లోతునుండి వినబడినది. ఇక నిశ్శబ్దము.]


చిన్నపిల్ల:—[లేచి, ఏడుస్తూ.] అక్కయ్యా! చిన్నక్కయ్యా! ... ఎక్కడ ఉన్నావు?. నాకు భయము వేస్తున్నాది! అక్కయ్యా! ...[గోపురముమీద ఒక్కర్తే ఏడుస్తూ ఉన్నది.]

ఋతుసౌభాగ్యము

పేట బాపయ్య గారు

ద్విపద

మండుటెండ లవన్ని మాయమై పోయె
గండుగోయిల లెల్ల గర్వించి కూసె
కారుమబ్బుల తోడ గగనతలంబు
కనులపండుగు జేయు గనువారి కెల్ల
దరుణశాద్వలములు ధరణిపై నిండి
పసరుకాంతుల దిశల్ బయలు పెట్టెడును
ప్రాణికోటుల కెల్ల బర్వమైపోయె
నచట జూచిన నీర మెలమి గాన్పించు
చెరువులు గుంటలు చెలువొప్పె నీట
నినుడెంతసుముఖుడో యీరోజులందు
"దుక్కులు పదునున దున్నంగవలయు
కాలాన వెదలన్ని కావింపవలయు
తరుణాన వర్షాలు గురిపించి మమ్ము
గగనంపు తల్లిరో కాపాడవమ్మ"
యనుచు లోలోపల నానంద మెసగ
భూదేవినమ్మిన పుణ్యసంతతులు
సేద్యమే వృత్తిగ జీవించుసుతులు
సాధుసంపదయంత స్వాంతముల్ నిండి
మోముదమ్ములయందు మూర్తిభవింప
కరమున మొనకోల కర్రను దాల్చి
కన్నబిడ్డలయట్లు గారాబముగను
కనులలో ధరియించి కాపాడు కొనెడి
పసుల జంటలవెంట బయన మైనారు
ప్రకృతిరో! నీచిత్ర పరివర్తనమున
సకల సౌఖ్యంబుల సమకూర్చు నటులు
చల్లని యీఋతుసౌభాగ్య మొకటి
అఖిలమానవకోటి కాధార మగుచు
అఖిల ప్రపంచంబు నలరింపజేయు



తిరువల్లిక్కేణి సముద్రతీరమున మహాత్ముని మహోపన్యాసము
అధ్యక్షుడు శ్రీ మౌలానా యాకూబ్ హుస్సేనుగారి ప్రారంభోపన్యాసము

ప్రెస్ ఫోటో బీరో, చెన్నపురి.



మైలాపూరు 'అంజుద్ బాగు'లో మహాత్మునకు తోటవిందు

న్యాయమూర్తి రామేశంపంతులుగారు మహాత్మునకు కుడిప్రక్క నున్నారు

ఏ. రత్నా అండు కో, చెన్నపురి.

కవిజనాశ్రయ విమర్శన ఖండనము

జయంతి రామయ్య గారు, బి. ఏ., బి. యల్.

7-వ సంవత్సరమునం దాంధ్రసాహిత్యపరి వేములవాడ భీమకవి కృతమని ప్రసిద్ధిగన్న నాశ్రయమను ఛందోగ్రంథమును బ్రకటించిరి. నే గ్రంథమునకు "సంపాదకత్వము" వహించి మూల ములు నిర్ణయించుటయే కాక పీఠిక నొకదానిని గూడఁ జేర్చినాఁడను. నేను చేసిన గ్రంథపరిష్కార మందును, రచించిన పీఠికయందును దోషములున్నవనియు గాని "నిదివర కెవ్వరును సూక్ష్మముగ విమర్శించి యుండ లేదు" గనుక యాపని నెరవేర్చుభారము తనమీఁదఁ బడినదని తలంచి చిలుకూరి నారాయణరావుగా రొక విమర్శనము రచించి రక్తాక్షిసంవత్సర ఫాల్గుణమాస భారతిపత్రికలోఁ బ్రకటించినారు. నే నావిమర్శనము బయలుదేరిన వెంటనే చూచుట తటస్థించినది. విమర్శనము కేవల మసంబద్ధము, నిరాధారము, నిస్సారముగ నున్నది. దానితత్త్వ మిట్టిదని లోకమునకుఁ గొంచెము తెలుపుట మంచిదని యూహించి యావిమర్శనమునకుఁ బ్రత్యుత్తరమిచ్చుచున్నాను.

నారాయణరావుగారు చేసిన యాక్షేపముల(1) పాఠనిర్ణయమును గుఱించినవి కొన్ని (2) పీఠికను గుఱించినవి కొన్ని - యీప్రకారము రెండువిధములుగా నున్నవి - పుస్తకాపేక్ష లేకుండ వాదప్రతివాదములు సులభముగా గ్రహించుటకు వీలగునట్లు తొలుతఁ గవిజనాశ్రయములోని మూలభాగమును, పిదప దానిపై నారాయణరావుగారి యాక్షేపమును, తరువాత దానిఖండనమును జూపెదను.

నారాయణరావుగారి మొదటి యాక్షేపము అవతారికలోని మూఁడవ పద్యమును గుఱించినది. ఆ పద్యము

1. మూలము:—

వేములవాడను వెలసిన
భీమేశ్వరు కరుణఁగల్గు భీమసుకవినేఁ
గోమటి రేచన కీఁడను
నీమహిఁ గవు లెన్న ఛంద మెలమి రచింతున్.

అని యున్నది. ఈపద్యము క్రింద నీవిధముగా ననఁగా "వేమన వాడయని మాతృక - వేములవాడ, లేములవాడ యని వ్యావహారిక నామములు - ఈగ్రామము హైదరాబాదు రాజ్యములో ...... నున్నది. అందు సుప్రసిద్ధమయిన భీమేశ్వరాలయము కలదు."; అని టిప్పణము గలదు.

ఆక్షేపము:—

"మాతృక వేమనవాడ: దిద్దుబాటు వేములవాడ, వేములవాడ, లేములవాడయని వ్యావహారిక నామములు అని అడుగున సూచన—గ్రామనామములో కూడ మాతృకలో మార్చుటకు వీరికి స్వాతంత్ర్యమేమో? వేమనవాడ యను గ్రామమాకాలమునుండి యుండకూడదా? వేములవాడభీమకవి ఈగ్రంథమును రచియించి యుండునని వీరికి గట్టినమ్మిక యుండుటచేత ఈ దిద్దుబాటు జరిగినది" అని—

ఖండనము:—

అవును. గ్రంథము భీమకవి కృత మనునమ్మకము నాకుఁగలదు—నానమ్మిక యెట్లున్నను, అవతారికా పద్యముల యుద్దేశమదియే కదా! రేచన రచించినట్లుగా భీమకవి యీగ్రంథమును రచించెనని చెప్పుటయే యీపద్యముల ప్రయోజనము. భీమకవియింటి పేరు వేములవాడవారనియు నతఁడు వేములవాడ గ్రామనివాసియనియు నన్ని మతముల వారి యభిప్రాయము. వేములవాడ గోదావరీ మండలము లోనిదని కొందఱును, కరీంనగరము మండలములోనిదని కొందఱును చెప్పుచున్నారు; గాని, గ్రామనామము వేములవాడయనుటలో నభిప్రాయభేదము లేదు. వేమనవాడ యను వాదమింతవరకుఁ బుట్టలేదు. వేములవాడలు రెండును తెలుఁగుదేశములో నున్నవి. భీమకవియుఁ దెలుఁగు

దేశమువాఁడే. అవతారికా పద్యములొక్క ప్రతిలోమాత్రమేయున్నవి. అదియైనను అరవదేశమందు దొరకినది. దానిలో వేమనవాడయను పాఠముగలదు. ఆపాఠము వ్రాయసకాని ప్రమాదమువలనఁ బుట్టినదని చెప్పకతప్పదు. అరవదేశమందీ ప్రతివ్రాసినవానికి గ్రామనామము వేములవాడయో వేమన వాడయో తెలియకుండుట యసంభవముకాదు. భీమకవియే యాపద్యములరచించినయెడల వేమనవాడయని ప్రయోగింపఁడుకదా! కవిప్రయుక్తపాఠమేదియో కనిపెట్టి, యది తప్పైనను ఒప్పైననుసరె, దానిని గ్రహించుట గ్రంథసంస్కర్తధర్మము. కావున నిచ్చట వేమనవాడను వేములవాడగాదిద్దుట న్యాయమే- వేమనవాడ పాఠమే మంచిదనుబుద్ధిమంతులు బయలుదేరిన యెడల వారియుపయోగార్థమా పాఠముగూడ సూచింపఁబడినది:—

నారాయణరావుగారి రెండవ యాక్షేపమునకు మూలమయిన 6-వ యవతారికా పద్యము:—

2. మూలము:—

రేచనసంతోషింపఁగ
భూచక్రములోన భీమపురహరు కృపచే
నేఛందము సుకవుల ("లుఁ'తెప్పు)బ్రదు
కేఛందము తెరువుదాని నేరచియింతున్.

అనియున్నది.

"సంతోషింపఁగ"నన్నచో మాతృకలో "సంతోషిల్లఁగ" యని యున్నట్లు టిప్పణములోఁ జూపఁబడినది.

ఆక్షేపము:—

"నన్నయభట్టులోనే "సంతోషిల్లు" అని ప్రయోగములు గలవు. తర్వాతి కవులలో యీప్రయోజనము (?) బహుళముగా నున్నది." అని యాక్షేపము—

ఖండనము:—

కవి "సంతోషింపఁగ" యని ప్రయోగించి యుండునను నూహతోనే యీ సవరణ చేయఁబడినది. ఇది స్వల్పవిషయము. గనుక విస్తరించి చర్చించుట యనవసరము.

3. మూలము:—

పై పద్యమందే "సుకవుల [...] అన్నచోట మాతృకలో "సుకవులు బ్రది[...] యున్నదని టిప్పణమునఁ గలదు.

ఆక్షేపము:—

దానిపై నారాయణ రావుగారి [...] మును చూడుఁడు—

"బ్రదికే" అనేరూపము గ్రాంథికము కాద[...] "చ ఛ" లకు ప్రాసకూడకనిన్నీ మీరనుకొనడముచేత [...]గిన దీ దిద్దుబాటు." ఇందు రెండాక్షేపములున్నవి.

మొదటిది "బ్రదికే" యను రూపము సాధువయి[...]నను, సాధువుకాదని నేను దిద్దినానని. ఇది ముందు విచారింతము—

ఖండనము:—

"బ్రదికే" వంటి రూపములు కుప్పలు తిప్పలుగ సుకవుల గ్రంథాలలో నున్నవని నారాయణ రావుగారు వ్రాసినారు. ఉదాహరణములేవియు నిచ్చియుండలేదు. ఆరూపము సాధువనియు, కడపటి ఎత్వమునకు విడిగా స్వరయతి కలదనియు నారాయణరావుగారు బుజువు పఱిచినప్పుడొప్పుకొనవలసినదే కాని, యీదిద్దుబాటునకది యొక్కటియె కారణముకాదు. మాతృక పాఠమును బట్టి 'తెరువు' అను శబ్దమున కన్వయము కుదరలేదు. 'ఛందము తెరువు' అని సమాసము సత్కవి చేయఁడు. తెరువునకు విడిగా నన్వయము లేదు. దిద్దిన పాఠములో సయితము అన్వయక్లిష్టత కొంచెము లేకపోలేదు. కాని మాతృకలోని పాఠమునకంటె మేలు. దిద్ది పద్యమున కర్థము లేకుండఁ జేసినానట. పండితుల కర్థము తెలియకపోదని నానమ్మకము.

1. "చ, ఛ" లకు ప్రాసము కూడదనుకొని యీ సవరణచేసినానని యింకొక యుపపత్తి కల్పించి, వర్గ ప్రథమ ద్వితీయాక్షరాలకును, తృతీయ చతుర్థాక్షరాలకును ప్రాసమైత్రికలదనిచూపుట కేమేమో వ్రాసి "రామయ్య పంతులుగారు "చ, ఛ"లకు ప్రాసము కూడదనుకొని కవిజనాశ్రయములోని పద్యమును దిద్దినారు" అని ముగించినారు. ఈ వ్రాఁత నారాయణరావుగారు

ఎట్లు వ్రాసినారో తెలియదు. దిద్దిన పద్యములో మొదటి రెండు పాదములలోను ప్రాసస్థానమందు "చ" కారమున్నది. మూఁడునాలుగు పాదములలో "ఛ" కారమున్నది. ఇది "చ, ఛ" లకు ప్రాసయయినదికాదా!

5. మూలము:—

7, 8 పుటలయందుఁగల నీ టిప్పణ మున్నది,— "ఈ (22 వ) పద్యమునకు ముందు చ, జలలో నీ క్రింది పద్యములు రెండునుగలవు.

(1) చను మగణము శ్రీనాథా
యనిన ముకుందా యనంగ యగణము రగణం
బనవొప్పు మాధవాయనఁ
జనునోవరదాయనంగ సగణం బగుచున్.

(2) తగణము శ్రీకృష్ణయనఁగ
నగు జగణంబును మురారి యనఁగా జగతిన్
భగణము శ్రీపతియనఁగా
నగణంబగు నృహరియనఁగ నలినదళాక్షా!

ఇందు మొదటిపద్యము అనంతుని ఛందమునందును గలదు. జైనుఁడగు కవి విష్ణు ప్రతిపాదకములగు పద్యముల రచించుట యసంభవము. కనుక యీపద్యములు ప్రక్షిప్తములని యూహింపఁదగును." అని

ఆక్షేపము:—

"ఇంతేకను కవి శ్రీనాథా.................. అనుపదములను ఆయా గణముల కుదాహరణములుగా చూపియున్నాఁడే కాని తన మతమును ప్రతిపాదించ లేదే. పోనీ; తాను జైనుఁడనను అభిమానము కవికుండదేమో అనిన తనవిషయమై "వాక్ఛ్రీ వల్లభ.............. అను(?) మొదలైన విశేషములను చెప్పుకొనియే ఉన్నాఁడు. కవిజైనుఁడైనంత మాత్రమున విష్ణువుపేరుకూడ తలఁపఁగూడ నంతపట్టుదల ఉండక పోవచ్చును.........." అని.

ఖండనము:—

పూర్వోదాహృతపద్యములు రెండును విష్ణుపరములని నారాయణరావుగా రొప్పుకొన్నారు. కావున నావిషయము చర్చింపనక్కఱలేదు. ఆరెంటిలో మొదటి పద్యము అనంతునిఛందమునందున్నది. కవిజనాశ్రయకర్త ముందువాఁడా, అనంతుఁడు ముందువాఁడాయను వాదము ప్రస్తుతము విడిచిపెట్టి విచారింపఁగా కవిజనాశ్రయము నుండి యనంతుఁడైనను, అనంతుని ఛందోదర్పణము నుండి కవిజనాశ్రయకర్తయైనను ఆపద్యమును సంగ్రహించి యుండవలెను. కవులిద్దఱు నాపద్యము నేయొకరికిఁదెలియకుండ నింకొకరు రచించుట యసంభవము. అట్టికవు లాపద్యమువంటి పద్యమును జెప్పలేక యొకరిపద్య మింకొకరపహరించిరనుట యతిసాహసము. ఆపద్యము ఛందోదర్పణమునందుండుట మిక్కిలి యుచితము. కవిజనాశ్రయమందుండుట యుచితముగాదు. కాఁబట్టి యీపద్యము ఛందోదర్పణములోనిదనియు, లేఖకు లెవ్వరో ప్రమాదమున కవిజనాశ్రయమందుఁ గలిపిరనియు నూహింపక తప్పదు. రెండవపద్యముకూడ విష్ణుపరమే కదా! అందు సంబోధనముకూడ విష్ణునకే కదా; కవిజనాశ్రయములోని సంబోధనములన్నియు రేచనకేగాని దేవతలకు లేవు. ఆ పద్యము కవిజనాశ్రయములోనిదని చెప్పుటెట్లు? జైనుఁడగు రేచనకు వైష్ణవమతమందు ద్వేషము లేకపోవచ్చును గాని యన్యదేవతాపరముగాఁ బద్యములుచెప్పుట యసంభవము.

6. ఆక్షేపము:—

"వాక్ఛ్రీపత్నీ వల్లభా, శ్రీసంసేవ్య వక్షా" ఇత్యాది సంబోధనలు గ్రంథమం దచ్చటచ్చటఁ గలవు. అవి దేవతాప్రతిపాదకములు కావా? యని యింకొక యాక్షేపము.

ఖండనము:—

నారాయణరావుగా రుదాహరించిన సంబోధనలలో నొకటి రెంటికిఁ దప్పఁదక్కిన వానికి మనుష్యపరముగా నర్థము చెప్పవచ్చును. అట్లు చెప్పుటే యుచితము. అట్లుచెప్పక "వాగ్వధూవల్లభా" యనఁగా బ్రహ్మయనియు, "శ్రీనివాసా" యనఁగా విష్ణువనియు నర్థము చెప్పినయెడల కృతిపతి యొకప్పుడు బ్రహ్మయు నొకప్పుడు విష్ణువును గావలసి వచ్చునుగదా! అయినను, నేను కనిపెట్టినవి గాక మఱికొన్ని ప్రక్షిప్తములు గ్రంథమం దుండవచ్చును.

7. ఆక్షేపము:—

పూర్వోదాహృతాక్షేపమును విస్తరించి వ్రాసి చివర "శ్రీపాదపంకజావాసమధుకరుండు" అను దానికి "జినపాద" అని దిద్దినారని మాకుసందేహము. (పుట 66)" అను వాక్యముతో ముగించినారు. 66 పారటలో ఎత్తుగీతి.

"శ్రీసమేతుఁడైన జినపాదపంకజా
వాసమధుకరుండు వాసవప్ర
హాసభాసితేచఁ డనవద్యుఁ డక్కవి
ప్రాసనీసమమును బరఁగఁ జెప్పె." అని యున్నది.

1 ప్రతిలో మొదటిపంక్తిలో శ్రీపాదయను పాఠమున్న దని యడుగున టిప్పణమున్నది.

శ్రీపాదయను పాఠమును తీసివైచి మాతృకలలో నెచ్చటను లేని జినపాదయను పాఠము నేను కల్పించినా నని నారాయణరావుగారి వాదము.

ఖండనము:—

"శ్రీపాద" యనుపాఠము ౧వ ప్రతిలో మాత్రమే యున్నదని వ్రాసితిని గదా. తక్కిన ప్రతులలో "జినపాద" యను పాఠమున్నదనియే కదా దీనికర్థము. ఆ ప్రతులు నారాయణరావుగారు చూచినారా? వానిలో నీపాఠమున్నదా లేదా? లేనిచో "సందేహ" మేల స్పష్టముగానే చెప్పవచ్చునే. ఉన్నచో నాపాఠము నేను కల్పించి నానన్నమాట యసత్యమే కదా! అనుమానము కలిగినప్పుడు తన్నివృత్తిచేసికొనుట కుపాయములుండఁగా వాని నిరాకరించి "ఇది కల్పితము, అది యబద్ధము" అను మాటల నేమిగా భావింపవలయునో వివేకులు నిర్ణయింతురుగాక.

8. ఆక్షేపము:—

"పుట. 21 లో ప్లుతయతి కుదాహరణముగా భాస్కరరామాయణములోని "ఏజనకాత్మజన్" అనుపద్యమును కవిలక్ష్యముగా నిచ్చినట్లొక ప్రతిలోనుండగా పంతులవారు దానిని తొలఁగించినారు. పుట- 26 లోని వచనమును పద్యములును "కావ్యాలంకార చూడామణి యందుఁగూడ గన్పట్టుచున్నవి, కావున నిందుఁ బ్రక్షిప్తములైనవేమోయని సంశయింపఁ దగియున్నది." అని వ్రాసియుగ్రంథమునుండితొలఁగించక విడిచినారు. వీరిట్లు చేయుటకు కవిజనాశ్రయకర్త భాస్కరునికిని, విన్నకోట పెద్దన్నకును తరువాతివాఁడైపోవునేమో అనుభయము తప్ప మఱియొక కారణముకానరాదు." అని.

ఖండనము:—

ఆపద్యములు ప్రక్షిప్తములనుటకు ముఖ్యకారణము పీఠిక 17 పారటలో నిట్లుచెప్పియున్నాను. "కవిలక్ష్య లక్షణములురెంటిని తానే చెప్పెనుగాని యితరులు రచించిన పద్యములు లక్ష్యములుగాఁ దెచ్చికొనియుండలేదు. వికటకవులు కొన్ని వింతలుకల్పించి కవిజనాశ్రయమునఁగలిపినారని యప్పకవి వ్రాసినది యథార్థము" అని కవిజనాశ్రయమందు, ప్రక్షిప్తము లున్నవన్నవాఁ డప్పకవియొక్కఁడేకాదు. అతనికిఁ బూర్వుఁడయిన వెల్లంకి తాతంభట్టు కవిచింతామణిలో నిట్లుచెప్పెను.

"భీమన యఖండంబు మొదలైన కొన్నిపలుకు లక్షణలక్ష్యంబులు చెప్పఁడు. వానికిఁ గొందఱు ప్రజ్ఞాలవదుర్విదగ్ధు లసంగతంబుగాఁ జెనిచి తగిలించినారందున నతని యంకితంబులు లేవు గావున వానిని బ్రమాణీకరింపవలవదు"

మూలము:—

54-వ పారటలో కాకుదోషమున కుదాహరణము

వెలయఁగఁ * జెఱకువిలుకొని
యలరమ్ములుచేతఁబట్టి యంగజుఁడు విరా
హులనేయు నేర్పుకడిమిన్
దొలమెలయఁగ ననవఁగాకు దోషంబయ్యెన్.

అనుపద్యమునిచ్చి పారటయడుగున 7-వ టిప్పణమున "మూలములో జిగురాకనియున్నదిగాని యది పొరపాటు" అని వ్రాసినాను.

ఆక్షేపము:—

దీనిపైయాక్షేప మిట్లున్నది.

* చెఱకు అనుపాఠము నేను కల్పించినదిగాదు. ఇతర పాఠాంతరములతోఁ గలిపి కొన్ని ప్రతులయందున్నది. చూ. 6వ టిప్పణము.)

"పుట- ౩౪ లో 'వెలయఁగఁ (చెఱాకు) విలుగొని' అనుకందపద్యపాదమునుజూడుఁడు. మూలములో 'చిగురాకు' విలు అని ఉన్నదట. అదిపొరపాటుట. ఎందుచేతనో ? తెనుగు కవులు మన్మథుని 'చిగురాకువిలుకాఁడు చిగురువిలుకాఁడు, చిగురు విలుతుఁడు,' అనివర్ణించిరేే ఉన్నారే ! 'చిగురాకు విలుకానిచేతి చక్రమురీతి' అని శశాంకవిజయము 3-వ ఆశ్వాసము. ఇట్లే ఎన్నైన ఉదాహరణము లీయవచ్చును. పోనీ, మీరుచేసినసవరణ అయినా బాగున్నదా ? 'చెఱకు' అని వ్యవహారము, ప్రయోగములు. 'వెలయంగఁ జెఱకువిలుగొని' అని సవరణ చేసిన ఒకరీతిగా ఉండియుండును." అని

ఖండనము:—

చిగురాకుశబ్ద మపశబ్దమనియు- చెఱాకు శబ్దము సుశబ్దమనియుఁ బొరఁబడి నేను పాఠము దిద్దినానని నారాయణరావుగారి నిశ్చయము. నారాయణరావుగారికి ఈ పద్యము దోషమున కుదాహరణము, దోషమున కుదాహరణముగా దుష్టరూప మేకదాయియ్యవలసినది. ఆసందర్భమున తిక్కన్నే యొప్పు. ఈదోషమునకే యనంతుఁడు చెప్పిన పద్యము చూడుఁడు:

"క. పాలుపుగఁ బోగానడంపలు
లలన ముడిచివనే మకారలాంఛనుఁ డొండన్
జలమునఁ జెఱాకువిల్లన
నలవిడుఁవలఁ గాకుదోషమంద్రు ముకుందా.

9. ఆక్షేపము:—

ఆ భీమకవి గోదావరీమండలము వాఁడా, లేక నైజాము దేశమువాఁడా యనువిషయము నెత్తుకొని "భీమన నైజాము రాష్ట్రమువాఁడను ప్రతీతి శ్రీరామయ్యపంతులుగారాప్రాంతములవారియొద్దనుండి ఉత్తరములను బయలుదేరతీసినతరువాతే వచ్చినదిగాని అంతకుపూర్వము లేదు. ఇట్టి 'ఉత్తరములను' పుట్టించియే పంతులుగారు ఓరుగల్లువాదములో కొంతవరకును కృతకృత్యులైరి. వారి ఓరుగల్లువాదము సరియైనదని కాని, కాదని కాని, యిచ్చట చెప్పుట మా ఉద్దేశము కాదు. ఆవిషయమై మఱియొకసారి ముచ్చటింతుము. పూర్వకాలపు నిదర్శనములను చూపక వాదములో కక్షసహింపగలవారి 'ఉత్తరములను' పుట్టించుటమాత్రము సరికాదని మనవిచేయుచున్నాము." అని నారాయణరావుగారు వ్రాసిరి.

ఖండనము:—

ఈ యాక్షేపములో రెండపవాదములు గర్భితములయియున్నవి. ఈయుత్తరములలోని విషయము లసత్యములనియు, వేములవాడవారలు కల్పించిరనియు నొకటి, ఆ కల్పనకు నేను కారకుఁడనని యొకటి. ఈ యుత్తరముల యుత్పత్తినిగూర్చి పీఠిక 10-వ పొరటయందుగల నేనిట్లు వ్రాసినాను. "భీమకవి వెలిగందలప్రాంతమువాఁడై నట్లుగ నచ్చటఁ బ్రమాణములేమైన నున్నవేమో తెలిసికొనిరావలయునని పరిషత్పక్షమున 1915 సం. జూలై నెలలో దూపాటి తిరుమల వేంకటరమణాచార్యులుగారిని బంపఁగా నాయన వేములవాడ గ్రామనివాసులలోఁ గొందఱచే నొకపత్రము వ్రాయించితెచ్చెను. ఆపత్రములోని భాగములే పైనుదహరింపబడినవి." అని.

వెలిగందల వేములవాడ ప్రాంతమందు భీమకవి యాదేశమువాఁడని ప్రతీతియున్నప్పుడు దాని కక్కడివారు వ్రాసినయుత్తరము లేప్రమాణము కాకపోయినచో నట్టిప్రతీతి యున్నదని నేను చెప్పినమాట ప్రమాణముగు నా, నారాయణ రావుగారికి ఈయుత్తరముల నెందుకుఁ బ్రమాణములుగా గ్రహించినాఁడనో చూడుఁడు—"వీరు వ్రాసినదంతయు విశ్వాసపాత్రమని చెప్పుట కవకాశము లేదు గాని, భీమకవి యాప్రాంతము వాఁడను ప్రతీతి యచట నిప్పటికి నున్నదనుట కిది ప్రబల ప్రమాణము కాకపోదు" అని వ్రాసినాను—దీనికిఁ బండితులేమందురో యందఱకును విదితమే.

10. ఆక్షేపము:—

భీమకవి గోదావరీ మండలమువాఁడా, కరీం నగరము మండలమువాఁడా యనువిషయమును గొంతచర్చించి నారాయణరావుగారు చివరకిట్లు తేల్చినారు:

"ఇప్పటికి తేలిన అంశములివి: గోదావరిజిల్లాలో వేములవాడ ఉన్నది. కరీం నగరము జిల్లాలో వేములవాడ ఉన్నది. ఇచ్చట ద్రాక్షారామ మున్నది; అచ్చటను ధాక్షారామమను వాడుక పురాణములలో నున్నది. ఇక్కడ భోగస్త్రీలున్నారు ; అచ్చటను ఉన్నారు.

ఇచ్చట జైనులుండే వారు; అచ్చటను ఉండేవారేమో? ఇక్కడ అప్పలవారున్నారు. అక్కడ అప్పలవారున్నారు. ఇక్కడ భీమేశ్వరాలయమున్నది. అక్కడను భీమేశ్వరాలయ మున్నది. భీమకవి యిక్కడి వాఁడని యిక్కడి ప్రతీతి అనాది. అక్కడివాఁడని ప్రతీతి యిప్పుడైనా బయలుదేరినది. రాజరాజనే వాఁ డిక్కడనుండే వాఁడని చరిత్రాధారములేని యొకకథ అక్కడ మున్నది. సారంగధరకథ అక్కడిదే అని అక్కడి ప్రతీతి అట – ఇచ్చటిదే అను ప్రతీతి ఎప్పటినుండి వచ్చుచున్నదో తెలియదు. ఈసారంగధరకథ ఏప్రాంతమున కాప్రాంతములోనే తయారగుచున్నది. ఇక నేమిఁకతి ? భీమకవి యెక్కడివాఁడు ? " అని.

దీనిలో నపసిద్ధాంతములు నప్రమాణ వాక్యములు నెన్నియున్నవో చూడుఁడు: "ఇచ్చట జైనులుండేవారు; వారు అచ్చటను ఉండేవారేమో!" అట. ఈ వాక్యమందు ఇచ్చటకు'అచ్చట' యనియు, 'అచ్చట'కు 'ఇచ్చట' యనియు మార్చినచోఁ గొంతవఱకు సత్యమునకు సరిపోవును. గోదావరీ మండలమందు జైనులుండెడి వారనుట కనుమానప్రమాణమే ప్రమాణము, కరీంనగరము మండలమం దిప్పటికిని జైనకోమట్లు గలరు. ఈవిషయమును నారాయణరావుగారు తాఱుమాఱు చేసినారు,

ఆక్షేపము:—

భీమకవి యిక్కడివాఁడని యిక్కడి ప్రతీతి; అక్కడివాఁడని ప్రతీతి యిప్పుడైనా బయలుదేరినది,

ఖండనము:—

అక్కడివాఁడను ప్రతీతి యిప్పుడు బయలుదేరిన దెచ్చట ? ఇక్కడ అనఁగా గోదావరీ మండలమందు. కరీంనగరము ప్రాంతమందదియనాదియే, ఏ దేశమందా దేశమువాఁడను ప్రతీతియనాదిగానేయున్నది.

ఆక్షేపము:—

"రాజరాజనే వాఁడక్కడనుండే వాఁడని చరిత్రాధారములేని యొకకథ అక్కడమున్నది.

ఖండనము:—

చరిత్రాధారము నారాయణరావుగారికిఁ దెలియదుగాని లేకపోలేదు. రాజరాజు నాఁడుపుట్టిన శాసనముల ప్రతిబింబములు నాయొద్దనున్నవి. కావలసినచో నారాయణరావుగారికిఁ జూపెదను. ఆరాజరాజుచేఁ బ్రతిష్ఠింపఁబడినది యాగ్రామమందలి రాజరాజేశ్వర లింగము.

ఆక్షేపము:—

"సారంగధరకథ ఇచ్చటిదే అనుప్రతీతి ఎప్పటినుండి వచ్చుచున్నదో తెలియదు."

ఖండనము:—

దానికిఁ జరిత్రాధారములు నారాయణరావుగారికిఁ గనుపడినవా? వేఁగీదేశపు రాజు రాజరాజునకు సారంగధరుఁడను కొడుకుగాని చిత్రాంగియను భార్యగాని యున్నట్లు శాసనములం దెచ్చటను లేదు. ఈకథ చరిత్రమునకు విరుద్ధమే.

11. ఆక్షేపము:—

"భీమకవి ప్రతాపరుద్రుని కాలములో నున్నవాఁడని చెప్పుటకుఁగల కారణములు కొన్ని మంచివి లేక పోలేదని వ్రాసి నారాయణరావుగారు దానినిట్లువివరించినారు. "చక్కదనంబు దీవియగు సాహిణిమారుఁడు" అను పద్యమును రామయ్యపంతులుగారుతెగినకారణముచూపక,అప్పకవిని ధిక్కరించి విడిచిపెట్టినారు. ఇదిమాకు సమంజసముగా కాన్పించలేదు.

అప్పకవి యొకసందర్భమున ప్రామాణికుఁడును మఱియొక సందర్భమున అప్రామాణికుఁడును నగుచుండవలయునా ? అదియును మనసిద్ధాంతమును బాధించుపట్లనేనా ?,

ఖండనము:—

"చక్కదనంబుదీవి" యను పద్యమును నేను తగిన కారణముచూపకయే అప్పకవిని ధిక్కరించి విడిచిపెట్టినానఁట. నేనా పద్యమును విడిచిపెట్టలేదు. అది భీమకవి చెప్పియుండఁడని సిద్ధాంతముచేసినాను. దీనికి నేను జూపిన హేతువులు చూడుఁడు.

ఉ. చక్కదనంబుదీవియగు సాహిణిమారుఁడు మారుకైవడిం, జొక్కపడంగలండు బలమున్ బలమున్ గలయాచళుక్యపుం,జొక్కనృపాలుఁ డుగ్రుఁడయి చూడ్కుల

మంటలు రాలఁజూచినన్, మిక్కిలి రాజశేఖరుని వీఁడికి వచ్చిన కీర్తి పోవునే.

అని చాటువు భీమకవి చెప్పినట్లూహించి సాహిణిమారుఁడు ప్రతాపరుద్రుని కాలములో నుండినట్లు సోమదేవ రాజీయమునఁ జెప్పఁబడియున్నదనియు నందువలన వానిఁ దును భీమకవియుఁగూడఁ బదునాల్గవ శతాబ్దాదియందుండినవారని నిశ్చయింప వలసియున్నదనియు (వీరేశలింగముగారు) వ్రాసినారు. ఈపద్యము భీమకవి చెప్పినదనుట కప్పకవి సాక్ష్యము తప్ప వేఱొకసాక్ష్యము లేదు. అప్పకవి భీమనకాలమువాఁడు గాఁడు. సాహిణిమారుని కాలమువాఁడును గాఁడు. వారిరువురకు నెంతో తరువాతివాఁడు. నన్నయభట్టాంధ్ర శబ్దచింతామణి కలియుగమున కాదిని రచియించె నని వ్రాసిన యాతఁడితఁడే. ఈత డన్నమాత్రాన నాపద్యము భీమన రచియించినదే యని యెట్లు విశ్వసింపవలెనో తెలియదు. ఈయప్పకవియే కదా భీమకవియు నన్నయభట్టును సమకాలికులని వ్రాసెను. దానికిని దీనికిని నెట్లు సమన్వయము చేయవచ్చును. ఇట్టి సాక్ష్యమును బట్టి తీర్మానములు చేసినయెడల సత్యము తేలదు. ఈ కారణములు నారాయణరావుగారి దృష్టిచేత "తగిన" కారణములు కావట.

12. ఆక్షేపము:—

"ఇక ఘనుఁడన్ వేములవాడ వంశజుఁడ... వెలుంగాధీశ (తెలుంగాధీశ, కళింగాధీశ) యను పద్యముపై రామయ్య పంతులుగారు చేసిన చర్చను కొంత విచారింతము" అను వాక్యముతో నారాయణరావుగారింకొక యాక్షేప మారంభించినారు. ఈ విషయమై నేను వ్రాసినదానిని నిందు సమగ్రముగా నెత్తి వ్రాయుచున్నాను.

ఇఁక భీమకవికాలమును నిర్ణయింప వలయును. పూర్వోదాహృతమగు—

ఉ. ఘనుఁడన్ వేములవాడ వంశజుఁడ
దాక్షారామ భీమేశ నం
దనుఁడన్ దివ్యవిషామృతప్రకట
నానా కావ్య ధుర్యుండ భీ
మన నాపేరు వినంగఁ జెప్పితిఁ
గళింగాధీశ కస్తూరికా
ఘన సారాది సుగంధ వస్తువులు
వేగం దెచ్చి లాలింపురా.

అను పద్యము మూఁడవ పాదములోఁ గొంచెము పాఠభేదముఁ గల్పించి యదియే ముఖ్యాధారముగా భీమకవి నన్నయభట్టుకంటెఁ బూర్వుఁడని గురుజాడ శ్రీరామమూర్తిగారును, ఈపద్యమును మఱికొన్ని పద్యములను నాధారము చేసికొని భీమన పదునాల్గవ శతాబ్దమువాఁడని కందుకూరి వీరేశలింగము పంతులుగారును వ్రాసినారు. ఈరెండు మతములు గూడ నసమ్మతములే. శ్రీరామమూర్తిగారి పాఠముప్రకారము పైపద్యములో "భీమన నాపేరు వినంగఁజెప్పితి వెలుంగాధీశ" యని యుండవలయును— "వెలుంగాధీశ" యనఁగా "విమలాధీశ" యని యర్థమఁట. విమలాధీశుఁ డనఁగా రాజనరేంద్రుని తండ్రియఁట— ఈహేతువుచే భీమన నన్నయభట్టుకంటెఁ బ్రాచీనుఁడఁట. ఈవాదమం దెన్నిదోషము లున్నవో చూడుఁడు. రాజనరేంద్రుని తండ్రి విమలాదిత్యుఁడు గాని విమలాధీశుఁడు గాఁడు. విమలాధీశుఁడన విమలాదిత్యుఁ డెట్లగునో తెలియకున్నది. విమలాధీశుఁడన నర్థమేమి? ఇదియొకదోషము. విమలాధీశునకు వెలుంగాధీశుఁ డను పేరెట్లు కలిగినదో తెలియదు. తెలుంగు రాయఁ డనినట్లు వెలుంగు రాయఁడని కాని వెలుంగురాజని కాని రూఢనామ మున్నదా? లేదు. విమలశబ్దము విశేషణము. వెలుఁగుశబ్దము విశేష్యము. ఈరెంటికి నర్థములో భేదమున్నది. భీమనవంటి మహాకవి విమలాదిత్యుని సంబోధింప నవసరమున నతనికి సరియైన పేరు పెట్టియే పిలుచును గాని యిట్లవకతవకగా నేల మార్చును. ఇది రెండవ దోషము—

వెలుంగాధీశ యనునప్పుడు సంధి యెట్లు కుదిరినది? వెలుంగు + అధీశ, యని గదా పదచ్ఛేదము. సంస్కృతసమాసము చేసినచో "వెలుంగ్వధీశ" యని కావలయును. తెలుఁగు సమాసము చేసినయెడల "వెలుంగధీశ" యగును. వెలుంగ + అధీశ" యని రెండుపదములు సంబోధనాంతములే యన్న పక్షమున "వెలుంగయధీశ" యని యుండవలెను. "వెలుంగాయధీశ" యని యుండిన నుండవచ్చును. ఏవిధముగాఁ

జూచినను "వెలుంగాధీశ" యని కానేరదు. ఇది మూడవ దోషము. త్రిదోషసహితమయిన యీపాఠము శ్రీరామమూర్తిగారి మనస్సున కెట్లునచ్చినదో తెలియకున్నది.

ఈపద్యములో "వెలుంగాధీశ" యనుటకు బదులుగాఁ "తెలుంగాధీశ" యనుపాఠమును జెప్పి, తెలుంగురాయఁడు 14-వ శతాబ్దమువాఁడు గావున భీమనయు నాకాలమువాఁడే యని వీరేశలింగముగారు నిర్ణయించిరి. ఈ పాఠమునకు శ్రీరామమూర్తిగారిపాఠమునకుఁబట్టిన మొదటి రెండుదోషములును బట్టవు. కాని మూఁడవ దోషము తప్పక పట్టును. భీమకవి యిట్టిదుష్టప్రయోగము చేయఁడు. చేయునని యూహించుట యసమంజసము"—అని.

13. ఆక్షేపము:—

దీనిపై నారాయణరావుగారి యాక్షేపమిదిగో—"వారు'వెలుంగాధీశ తెలుంగాధీశ', అనునవి వ్యాకరణదుష్టములని త్రోసివేసిరి. వెలుంగు + అధీశ, తెలుంగు + అధీశ-అనివారిపదచ్ఛేదము—వెలుంగ + అధీశ, తెలుంగ + అధీశ" అని మా పదచ్ఛేదము. ఇచట వెలుంగ, తెలుంగ అనునవి సంబోధనాంతములు కావు. అవిదేశనామస్వరూపములే అని మా మతము. త్రిలింగశబ్దభవము తెలంగ, తెలుంగ అని యగును. బర్మాదేశములో తెలంగ, తలైంగ అనితెలుఁగువారికి పేరు. గౌడభాషలలో తెలుఁగువారికి 'తెలంగ' అనియే నామము. 'తెలగా' లను వర్ణమువారు ఆంధ్రదేశీయులే. వారు తెలుఁగువారే. 'తెలుంగ' అనునది దేశనామమైనప్పుడు 'తెలుంగాధీశ' అను సమాసమునిర్దుష్టమగును. అట్లే 'వెలుంగ' మాఱను. దానికి 'వెలంగ' అను రూపాంతరము. వెలఁగవాడ, వెలుంగవాడ అనుపదములే వెలుంగోడ, వెలఁగోడ అని యగును. ఆవాడవారే వెలుగోటివారు. ఇచట 'వెలుంగ' అనఁగా వెలగచెట్టు అని యర్థముకాదని మా అభిప్రాయము. 'వెలంగ' అను జనులుండు "పూడి"యే "వెలంగపూడి, వెలగలపూడి" అని యైనది."

ఖండనము:—

నేను ఖండించినది శ్రీరామమూర్తిగారి పాఠమును వీరేశలింగముగారి పాఠమును. వారి పాఠముల ప్రకారము "వెలుంగు, తెలుంగు," శబ్దములు ఉకారాంతములే కాని అకారాంతములు గావు. అకారాంతవాద మిప్పుడు నారాయణరావుగారికి స్ఫురించినదికాని నేఁటివఱకు మఱెవరికిని బొడగట్టలేదు. ఉకారాంతవాదములను ఖండించిన నావాదమును నారాయణరావుగారి యకారాంత వాద మెట్లుబాధించునో తెలియదు. దానిని స్పృశింపనే స్పృశింపదు.

అకారాంత వాదమువలన సిద్ధించినదేమిటి? వెలుంగాధీశుఁడనఁగా వెలుంగదేశరాజనియు, తెలుంగాధీశుఁడనఁగా తెలుంగదేశ రాజనియునుకదా యర్థము. ఆరాజు లెవ్వరు? ఏకాలమువారు? అది తెల్పుట కాధారము లున్నవా? లేవిచో, గ్రుడ్డెద్దు చేనఁబడిన ట్లీయార్భాట మెందుకు?

14. ఆక్షేపము:—

"తెలుంగాధీశ, అనుపాఠము సరియైనప్పుడు 14-వ శతాబ్దములోని తెలుంగురాయఁడే ఈతెలుంగాధీశుఁడైనప్పుడు, భీమకవికూడా 14-వ శతాబ్దమువాఁడే అగునుగదా! అట్లే 'వెలుంగాధీశ' అనుపాఠమును సరియైనప్పుడు కాలనిర్ణయము చేయుట కష్టమేయగునుగాని, 14-వ శతాబ్దమువాఁటి ఒకవెలుంగాధీశుని కా పదమేల చెందకూడదో చెప్ప వీలులేదు." అని

ఖండనము:—

ఔను. మేనత్తకు పుంస్త్వము వచ్చినప్పుడు పినతండ్రియగును. అంతవఱకును మేనత్తయేకదా!

15. ఆక్షేపము:—

"ఎలమఞ్చి పురాధీశ్వరుఁడగు చోడగంగను రాజు శాకాబ్దములు 1418 ప్రాంతములో నున్నట్లు శాసనములు తెలుపుచున్నవి. ఇతనికి సర్వలోకాశ్రయవిష్ణువర్ధనమహారాజని బిరుదున్నది. ఎలమఞ్చి కళింగములోనిదే. భీమకవిచూచిన కళింగములోనిదే. భీమకవి చూచిన కళింగగం గీతఁ డేల కాకూడదు" అని యొక యాక్షేపము.

ఖండనము:—

తా ముదాహరించిన శాసన మెచ్చటనున్నదో చెప్పినప్పుడు దానిజూచి విమర్శించినపిదప నారాయణ

రావుగారి శంకకు సమాధానము చెప్పఁబడియుండును. కాని, శాసన మెక్కడనున్నదియుఁ జెప్పక, యందులోని విషయమును జెప్పక గోడను నీళ్లలోనుంచి కొమ్ములు చూపి బేరము పెట్టినట్లు వాదించినఁ బ్రత్యుత్తర మిచ్చుట కష్టము.

16. ఆక్షేపము:—

కళింగరాయఁడు, కాళింగరాయఁడు అను పేళ్లుగలవారు కొండ అరవదేశములో క్రీ.శ. 14-వ శతాబ్దమువందున్నట్లు కొన్ని శాసనములవలనఁ గనుపడుచున్న దని వ్రాసి, చిట్టచివరకు "మనభీమకవి యీకళింగరాయని పద్దకేపోయెనేమో?" యని నారాయణ రావుగారు మఱియొక శంకను బుట్టించుకొన్నారు. భీమకవి నాదరించినవాఁడు కళింగగంగుగాని కేవల కళింగ రాయఁడు కాఁడు. కళింగగంగనఁగా గంగ వంశజుఁడైన కళింగదేశపు రాజు. అరవదేశమందలి కళింగ రాయఁడు గంగవంశమువాఁడుకాఁడు. కళింగదేశపు రాజునుగాఁడు. అరవవాఁడు. సామంతరాజో లేక మంత్రియో. అతని కళింగరాయ నామము నేతిబీరకాయ పేరు వంటిదే.

భీమకవి ప్రభు వీరఁడని నారాయణరావుగారు నిర్దేశించినయెడల నానిర్దేశమును జర్చింపవచ్చును. అట్లు నిర్దేశింపక కళింగశబ్దముతో సంబంధ మేమాత్ర మున్నను సరే వాఁడు కాఁగూడదా! వీఁడు కాఁగూడదా! యని సంశయించువారికి సమాధానము చెప్పు టెట్లు?

17. ఆక్షేపము:—

"కవిజనాశ్రయములో పది యతులును, కావ్యాలంకారచూడామణియందు పండ్రెండు వళ్లును, అనంతుఁ డిరువదినాలుగు విశ్రమములును, ఆమీఁద కొందఱు కవిగ్రామణు లిరువదియేడును విశ్రమములు చెప్పినట్లు అప్పకవిచెప్పి తాను నలభైయొక్క యతులను వివరించినాఁడు. కవిజనాశ్రయములోని యతులసంఖ్య అన్నిటిలోను తక్కువది కాబట్టి భీమకవి అందరికంటె ప్రాచీనుఁడు—అని రామయ్యపంతులుగారి వాదము. ఈవాదమును చాలమంది అంగీకరించినారు" అని వ్రాసి, "కాని చిన్నమనవి—సులక్షణసారకర్త

"కృతుల ముప్పదియొక్కటి యతులందవరు
సత్కవుల సమ్మతంబున (జలధిశయన)"

అని చెప్పినాఁడు. అందుచేతవాతఁడు అప్పకవికి పూర్వుఁడని చెప్పనగునా?" యని నారాయణరావుగా రొక చిన్నిశంక నంటించినారు.

ఖండనము:—

పాపము! ఈవ్రాఁత వ్రాసినప్పు డీయన అప్పకవీయము తిన్నఁగాఁ జూడలేదు. అప్పకవీయములో సులక్షణసారము పేర్కొనఁబడినది. కాఁబట్టి అప్పకవీయముకంటె సులక్షణసారము ముందుదయినట్లా వెనుకదయినట్లా! ఎవరినడిగినను సమాధానమువచ్చును.

18. ఆక్షేపము:—

దానికి సంబంధించినదే యింకొక శంక.

"రంగరాట్ఛందస్సులో ఇరవైయెనిమిది యతులు చెప్పఁబడినవి. అందుచేత కస్తూరిరంగకవికూడ అప్పకవికి బూర్వుఁడగునా?"

ఖండనము:—

ఈ శంకగూడ దోషగర్భితమే!?

రంగరాట్ఛందస్సులో 28 యతులు చెప్పఁబడినవట! ఇది నారాయణ రావుగారు పుస్తకము చూచినట్లు తోఁపదు. అచ్చుపడిన పుస్తకములో 35 యతులున్నవి. ఆంధ్రసాహిత్యపరిషత్పుస్తకభాండాగారమందలి యొక వ్రాఁతప్రతిలో 36 యతులున్నవి. కస్తూరి రంగకవి 28 యతులు చెప్పలేదు. కాని, నారాయణ రావుగారట్లు వ్రాయుటకుఁ గారణము లేకపోలేదు. కస్తూరి రంగకవి పూర్వకవులు చెప్పిన యతుల వివరించుచు "నన్నయభట్టు "లక్షణసారంబు" నుండి యొకపద్య ముదాహరించి" అని "27 విధములుగా చెప్పివున్నవి." అని వ్రాసి, యా పూర్వమతము లన్నిఁటిని బూర్వపక్షము చేసి తనమతమును బ్రతిపాదించెను. నారాయణరావుగారు ఆ పూర్వపక్షము, సిద్ధాంతమని భ్రమపడి దానికొకటిచేర్చి 28 యతులుచేసినారు. ఇది యెట్లున్నను, రంగకవి చెప్పినయతులు అప్పకవి యతులకంటెఁ గొంచెమే. రంగకవియు అప్పకవి తరువాతివాఁడే. అయినను అప్పకవిని గూర్చి కాని అప్ప

కవియమము గూర్చిగాని రంగకవి కేమియుఁ దెలియదు. తెలిసియున్నచో, అప్పకవి మతము ముదాహరించుటయో నామతము నవలంబించుటయో లేక ఖండించుటయో జరిగియుండును. రంగరాట్ఛందస్సునం దప్పకవి మాటయే లేదు. కాఁబట్టి యప్పకవిమతము రంగకవికిఁ దెలియదని నిశ్చయింపవలసి యున్నది. అప్పకవిని విడిచిపెట్టినచోఁ బూర్వకవు లందఱికంటె రంగకవియే యెక్కువయతులు చెప్పినాఁడు. కావున, యతుల సంఖ్య కాలక్రమమున హెచ్చినదను నావాదమును రంగరాట్ఛందస్సు బలపఱుచుచున్నది గాని ఖండించుట లేదు.

19. ఆక్షేపము:—

"రామయ్య పంతులుగారి ప్రకారము మధ్యాక్కరలో నాలుగవ గణము మొదట యతి ఉండుట ఆధునిక మతము. నన్నయభట్టులో అయిదవ గణము మొదట నున్నది. ఎఱ్ఱాప్రెగడలో నాలుగవ గణము మొదట నున్నది. భీమకవి గ్రంథములో మధ్యాక్కరనాలుగవగణము మొదట యతి ఉండుటచేత, భీమకవి, నన్నయ, ఎఱ్ఱాప్రెగడల మధ్య నుండవలయు నటు. ఎఱ్ఱాప్రెగడ తరువాత నేల ఉండకూడదో తెలియరాకున్నది" అని.

ఖండనము:—

కవిజనాశ్రయములో మధ్యాక్కర నాలుగవ గణము మొదట యతి విధింపఁబడుటచేత భీమకవి, నన్నయ ఎఱ్ఱాప్రెగడలకు నడుమ నుండవలయునని నేను చెప్పియుండలేదు. కవిజనాశ్రయములోఁ జెప్పఁబడిన యతులసంఖ్యయు, మధ్యాక్కరలోని యతిస్థానమును, తద్గ్రంథకాలము నిర్ణయించుటకుఁ గొంతవఱకు కమపాల పడుననిచెప్పి, యావిషయము కొంతచర్చించి చివరకు "ఈరెండు హేతువులంబట్టి, భీమన నన్నయభట్టు తరువాతివాఁడును విన్నకోట పెద్దనకుఁ బూర్వుఁడును నైనట్లు తేలుచున్నది" అని యుపసంహరించినాను.

కవిజనాశ్రయకర్త మధ్యాక్కరలో నాలుగవ పాదము మొదట యతి చెప్పుటచేత నన్నయభట్టునకుఁ దరువాతివాఁడనియు, పదియతులు మాత్రమే చెప్పుటచేత విన్నకోట పెద్దనకుఁ బూర్వుఁడనియు దీనిభావము. ఇందెఱ్ఱాప్రెగడ ప్రసంగమే లేదే. నారాయణరావుగారి యాక్షేపమునకు మూలమేది?.

తాను ఖండింపఁబూనినది చక్కఁగా జదువకయు, చదివినదాని కర్థము చేసికొనకయు, అర్థమయినదానినైన సరిగా ననువదింపకయు, పూర్వాపర సంబంధములు పాటింపకయు, తప్పునదియేదియో, తగులునదియేదియో యెఱుంగకయు, నారాయణరావుగారీ విమర్శనమును రచియించినారని మనవిచేయుచున్నాను.

నా సొమ్ము

పూడిపెద్ది వెంకటరమణయ్య గారు

ఎవని జగమాశ్రయించెడు నెవఁడు జగతి
నాశ్రయించెడు నొండొంటి నరయుకొఱకు
ఎవఁడు ప్రకృతినిగల్పించు నెవనిఁ బ్రకృతి
కల్పనముసేయు నుభయరాగమ్ముకొఱకు
ఎవఁడు సృష్టించు లోకమ్ము సృష్టి యెవనిఁ
జేయు నన్యోన్య సంకల్పసిద్ధికొఱకు

ఎవఁడు విశ్వంబుగా మారు నెవనియట్లు
విశ్వమగుఁ బరస్పరము సంప్రీతికొఱకు
అట్టి పరమేశుఁ బ్రకృతి నే నాత్మలోనఁ
దలఁతు గొంతెత్తిపాడుదుఁ దన్విదీర
మననముం జేతు నాపాదమస్తకమ్ము
నైక్య మొనరించుకొని చొక్కి యనుభవింతు.

మోసగాండ్ర కథలు

పండిత పురాణం సూర్యనారాయణ తీర్థులు గారు

౧

శ్రీమంతమైన మాళవదేశములో ఉజ్జయిని అను గొప్పపట్టన మొకటి కలదు. ఆపట్టణమున కుత్తరముగా దట్టమయిన-ఒకవనము ఉండెడిది. ఒకప్పుడా అడవిలో నాలుగువైపులనుండియు వచ్చి రెండువేల ఐదు వందలమంది మోసగాండ్రు బసచేసినారు. ఆ ధూర్తులు మహామాయా-ధురంధరులు. మిక్కిలి నిర్దయులు. వారిని బోలిన విశ్వాసఘాతుకులు మఱియెచ్చటను ఉండరనియే చెప్పుకొనుచుండెడువారు. ఆ మహానుభావులు చేయఁజాలని దురాగతకార్యములు భూలోకములోనే కాదు; ఏలోకములోను ఉండవందురు. మాటలలో బృహస్పతి వంటివారినిగూడ నిరక్షరకుక్షులనిపించఁదగినంతటి నేర్పు గలవారు. పలురకముల ధూపములు, అంజనములు, మార్గములు మొదలయినవానిలో సిద్ధహస్తులు. స్తంభిని, అవస్వాపిని మొదలయినవిద్యల నెఱిఁగిన పండిత ప్రకాండులు. గొంతు, రంగు, వేషము మార్చి ప్రతివారిని మోసపుచ్చఁజాలినవారు. ఈ-అందఱకును అయిదుగురుముఖ్యాధికారులు గలరు. 1. మూలదేవుఁడు, 2. కండరీకుఁడు, 3. ఏలాపాథుఁడు, 4. శంసుఁడు, 5. ఖండవాణ— అని వారి పేళ్లు.

ఈ అయిదుగురికిని అయిదేసివందలమందిచొప్పున ఒక్కొక్కగుంపు కలదు. అయిదవగుంపులో అందఱును స్త్రీలే. ఆగుంపున కధికారిణి ఖండవాణ అను స్త్రీ. ఈ అయిదుగురు ధూర్తనాయకులును, మోసములో చాల ఆరితేఱినవారు. కాని, వారిలో మూలదేవుఁ డనువాఁడు నిరుపమానుఁడు. వానితో పోటిచేయఁదగిన మోసగాఁ డింతవఱకును బుట్టియుండనే లేదట!

వీరందఱును తిరుగుచుఁ దిరుగుచు, ఎక్కడనుండియో వచ్చి ఉజ్జయినీపట్టనమునకు సమీపముగానున్న వనములో బసచేసియుండఁగా, అమాంతముగా ఏనుఁగుతొండాలవంటి వర్షధారలు ప్రారంభించినవి. చూచుచుండఁగానే నూతులు, బావులు, చెఱువులు, నదులు మొదలయిన జలాశయములన్నియు నిండిపోయినవి. నదీప్రవాహము పొంగి పొరలుచు చుట్టుపట్లనున్న గ్రామాదులను ముంచివేయుచున్నది. ఎక్కడచూచినను నీళ్లేతప్ప, మఱేమియు కనఁబడుటయే లేదు. వేయేల? ఏకార్ణవమయిపోయినట్లు కనుపట్టినది. సుగమమార్గము లన్నియు దుర్గమము లయిపోయినవి. మనుష్యు లిండ్లనుండి బయటికివచ్చుట కష్టతరమయిపోయినది. ఈయింటిమీఁదికాకి, ఆయింటిమీఁదను వ్రాలకుండ నున్నదన్నట్లున్నది సమయము. ఇట్టి ఘోరవర్షము కారణముగా ఆధూర్తులందఱును విచారగ్రస్తచిత్తులయి "మనుజులుకూడ బయటికి రాఁజాలనంతటి యిట్టి ఘోరవర్షసమయమున, మన మెవ్వరిని మోసపుచ్చి ఉదరపూజ చేసికొనఁ గలుగుదుము? ఇట్టికష్టసమయమున మన కెవ్వ రిచ్చటికిఁ దెచ్చి భోజనము పెట్టి పుణ్యము కట్టుకొందురు? ఆఁకలిబాధ సహింపఁజాలక ప్రాణములు కంఠగతము లగుచున్నవే!" అని దుఃఖింప మొదలిడినారు. అప్పుడు ధూర్తశిరోమణి యగు మూలదేవుఁ డనువాఁ డిట్లన్నాఁడు.—

మూల:—సోదర- సోదరీమణులారా! ఇప్పుడు మనభోజనవిషయమున నే నొక-ఉపాయ మాలోచించియున్నాను, వినుఁడు. ఇప్పుడు మన మైదుగురమును చూచినదిగాని, విన్నదిగాని, అనుభవించినదిగాని, ఒక్కొక్కకథ చెప్పుదము. ఆకథ విని మనలో ఎవఁడు "ఈ సంగతి యెట్లంగీకరింపఁదగియుండును?" అని సందేహించునో, వాఁ డద్దానిని అసత్యమని ఋజువు చేయవలయును. అతఁడే మనకందఱకును భోజనమునకగు కర్చీయ్యవలసియుండును. ఆకథలను మనలో ఎవరయినను భారతము, రామాయణము, భాగవతములను పురాణగ్రంథము

లనుండి ప్రమాణముచూపి సత్యముఅని సిద్ధాంతముచేయునో, ఆశ్చర్యమును కలిగించుమాటలచేతను మనకు మనోరంజన చేయునో, ఆతఁ డందఱిలోను ఎక్కువబుద్ధిగలవాఁడుగా ఆలోచింపఁబడును. మఱియు, ఆతఁడు భోజనమును కగు కర్చియ్యవక్కఱలేదు.

కండరీకుఁడు:—అయ్యా! తమరు చాల మంచి ఉపాయ మాలోచించినారు. ఇక్కడ చేరిన అందఱిలోను తమరే పెద్దలు కనుకను తమరు చూచినదిగాని, విన్నదిగాని, అనుభవించినదిగాని యేదయినను ఒకకథ సెలవియ్యవలెను.

మూల:—అటులేని చెప్పుచున్నాను, సావధానముగా వినుండు. నేను మంచివయస్సులో నున్నప్పుడు నిరంతరము మనసున కిష్టమయిన వస్తువులు సంపాదించు ప్రయత్నములో నుండెడివాఁడను. ఇట్లుండఁగా—ఒకనాఁడు ఘోరముగ వాన కురియుచున్నది. నేను నాయజమానుని సంతోషపెట్టఁదలఁచుకొని నెత్తిమీఁదను ఒక మూట పెట్టుకొన్నాను. అది, నేను వానలో తడియకుండ నుండుటకై ఒకచేత గొడుగు పట్టుకొన్నాను. రెండవచేత జారీచెంబు మొదలయిన కావలసినవస్తువులు పట్టుకొని యింటినుండి బయటికి బయలుదేరినాను. కొంచెముదూరము నడచి దారిలో చూచునప్పటికి—అయ్యా! ఎక్కడినుండియో కాని నడకొండవంటి మదించినయేనుఁ గొకటి నావైపు పరుగెత్తుకొని వచ్చుచున్నది. సరి; ఇఁక నేమున్నది? దానిని జూడఁగనే నామీఁది ప్రాణాలు మీఁదనే యెగిరిపోయినవి. అపుడు నాకు కలిగినభయ మింతింత యని చెప్పఁజాలను. ఒడలంతయు గడగడవడఁక మొదలిడినది. "దైవమా! ఇపు డేమి చేయుదును? నాయీశరీరము నెచ్చట దాఁచుకొఁగలను? ఎవరిని శరణు పొందుదును?" అని యేమేమొ ఆలోచించుకొనుచు నుంటిని. అంతలో యేనుఁగు బొత్తిగా దగ్గఱకు వచ్చినది. అపుడు మృత్యుభయమువలన నా కేమియుఁ దోఁచినది గాదు. నాచేతనున్న జారీచెంబు క్రిందను ఉంచి దానిలోఁ దూఱినాను. "ఇంక భయములేదు; బ్రతికితినిరా దైవమా! అనుకొన్నాను." కాని, ఏనుఁగుమాత్రము బుద్ధిలో నాకంటె తక్కువది అనుకొన్నారేమో? కాదుకాదు. నే నట్లు జారీచెంబులోఁ దూఱుట చూచి అదియు వెంటనే నన్ను వెంబడించి జారీచెంబులోఁ దూఱినది, "ఇది యేమిరా దైవమా! ఇందులో దాఁగుకొన్నను నాప్రాణములు దక్కునట్లు కనుపడకుండ నున్నదే! సరి; యీ యేనుఁగుతో నాబ్రదుకు?" అనుకొనుచు, ఎట్లయినను ఏనుఁగునోటను పడకుండ తప్పించుకొందమని, ఆజారీచెంబులోనే యీమూలనుండి ఆమూలకు, ఆమూలనుండి యీమూలకును పరుగెత్తుట ప్రారంభించినాను. ఈప్రచారములో, ఎట్లయిన నేమి? ఆఱు మాసములవఱకును ఏనుఁగుతొండమున కందకుండ తప్పించుకొనుచు నుంటిని. తుద కొకనాఁడు ప్రాణము విసిగి నే నాజారీగొట్టమునుండి బయలుదేఱి బయటికివచ్చి పాఱిపోవ మొదలిడినాను. ఆయేనుఁగుకూడ ఊరకుండ లేదు. నావెంటనే జారీగొట్టమునుండి బయటికి వచ్చినది. ఆసమయమున జారీగొట్టమునుండి దానిశరీరమంతయు బయటికి వచ్చినది గాని, తోఁక తాలూకుది ఒక్కవెండ్రుక మాత్రము దానిలోఁ జిక్కుకొన్నది. సరి; ఇం కేమున్నది? ఏనుఁగురావుగారు కైదయిపోయినారు! అది ఆవెండ్రుక నందునుండి తప్పించుకొని బయటికి వచ్చుట కష్ట మయిపోయినది. ఈలోఁగా నేను జాలదూరము పాఱిపోయినాను. ఎట్లయిన నేమి లెండు, అప్పటికి నాభయము తొలఁగిపోయినది. అటువంటి ఆపదనుండి తప్పించుకొని కొంతదూరము వెళ్లునప్పటికి ఎదుటను గంగానది అడ్డముగా నున్నది. అందలి నీరు చాల లోఁతుగా నున్నట్టు కనుపట్టినది. ఇంటికిఁ జేరుకొనుటకు మార్గాంతరము లేనేలేదు. అప్పుడు నామనస్సు చాల వ్యాకులపడినది. ఎంతసేపు ఒడ్డున నిలువఁబడి ఆలోచించినప్పటికిని నా కేమియు ఉపాయము తోఁచినదేకాదు. తుదకు సాహసించి గంగానదిలో దిగఁబడినాను. చేతులతో నది దాఁటి, యెట్టులయిన నేమి? యజమానుని యింటికిఁ జేరుకొన్నాను. అక్కడ నే నాఱునెలల వఱకును ఆఁకలి దప్పులబాధ సహించి, ఏనుఁగుతొండములలావున నెత్తిమీఁదను పడుచున్న వర్షధారా పరంపరను సహించి నాయజమానునికి వందనములు చేసినాను. అటు తరువాతను, ఆయనయొద్దను క్షమాప్రార్థన చేసి వారిసెలవు పొంది బయలుదేఱి యీ ఉజ్జయనీ నగరము సమీపమున మీ అందఱితోను కలిసికొన్నాను. నేను చెప్పిన యీకథ

నిజమే అయినచో ఏదయినను ఉదాహరణముగాఁ జూపి అందఱను నమ్మింపుము. అసత్యమే అయినచో, అనఁగా, నేను చెప్పినకథ అంగీకరించుటకు నీకిష్టము లేనిపక్షమున ఈ ధూర్తస్వాము లందఱకును భోజన సదుపాయము చేయింపుము."

కండరీకుఁడు—అయ్యా! తమ రిప్పుడు చెప్పిన కథలో నా కంతమాత్రమును సందేహము లేదు. భారత-రామాయణాది గ్రంథములు చదివినవా రెవ్వరును, తమరు చెప్పిన వచనములను అసత్యము లని అనఁజాల రని నే ననుకొను చున్నాను.

మూలదేవుఁడు—మంచిది; అటులేని జారీ చెంబులో ఏనుఁగు ఏలాగున ఇమిడినదో, మఱియు, అందులో అది ఆఱునెలలదాఁక నెట్లు తిరుగుచు ఉన్నదో, ఆజారీ కొమ్మునుండి నేను, ఆయేనుఁగు ఏలాగున బయటికి రాఁ గలిగితిమో, ఏనుఁగు మొసంతయు బయటికి వచ్చి దాని తోఁకవెండ్రుక ఒక్కటిమాత్రమే యెట్లు చిక్కుపడి పోయినదో, నేను గంగానదీ ప్రవాహమును చేతులతో నెట్లు దాఁటఁ గలిగితినో, ఆఱునెలలవఱకును నే నాఁకలి దప్పులబాధను, ఆవర్షము తాలూకు బాధను ఎట్లు సహింపఁగలిగితినో పైనుదాహరించిన గ్రంథములనుండి తగిన ప్రమాణము చూపింపుము.

కండ—మనము వినుచున్న భారతరామాయణాది గ్రంథములు నిజమయినపక్షమునఁ దమ రిప్పుడు చెప్పిన కథయు సత్యమే కావచ్చును. ఏమందురా? తమ విషయమున జరిగిన కథవంటికథలు పై గ్రంథములలో ఎన్నో ఉన్నవి. వినుండి—పైగ్రంథము లొకదానిలో ఇట్లున్నది:—బ్రహ్మదేవుని ముఖమునుండి బ్రాహ్మణులు బయటికి వచ్చినారు. భుజములనుండి రాజులు బయటికి వచ్చినారు. తొడలనుండి వైశ్యులు బయటికివచ్చినారు. పాదములనుండి శూద్రులు బయటికి వచ్చినారు. జగదుత్పత్తికి ముందు లెక్కకు మిక్కిలిగా నాలుగువర్ణముల మనుష్యులను బ్రహ్మదేవుని శరీరములో ఇముడఁగా, తమజారీచెంబులో తమరు ఏనుఁగు మాత్రమే యిముడుటలో ఆశ్చర్య మేమున్నది? ఇంకొకటి చిత్తగింపుఁడు.

ఒకప్పుడు బ్రహ్మదేవుఁడు "నేను గొప్పవాఁడ" ననియు, విష్ణుమూర్తి "నేను గొప్పవాఁడ" ననియుజగడ మాడుటకు ప్రారంభించినారు. తుదకు వారిద్దఱును తగవు తీఱక తిన్నఁగా శివునియొద్దకువెళ్లి చెప్పుకొన్నారు. శివుఁ డప్పు డాయిద్దఱివాదములను విని "మీయిద్దఱిలో ఎవరు నాలింగము తాలూ కంతమును చూచి వచ్చెదరో అతఁడే గొప్పవాఁడు" అన్నాఁడు. ఆమాట వినఁగానే బ్రహ్మ మీఁదుభాగమునకు బయలుదేఱి దేవమానమున వేయుసంవత్సరములు నడచినాఁడు. కాని శివలింగము తాలూకు కొస కనుపడినదిగాదు. విష్ణుమూర్తి క్రిందుభాగమున పాతాళలోకమువైపు బయలుదేఱి వేయుసంవత్సరముల వఱకును నడచినాఁడు కాని, అతనికిని కృతకృత్యత కలుగకుండనే మరలవలసివచ్చినది. ఇఁకఁ జెప్పవయ్యా! అటువంటిలింగము గనున్న శివుఁడు పార్వతియర్ధశరీరములో నిమిడినప్పుడు తమ జారీచెంబులో ఏనుఁగిముడుటలో ఆశ్చర్య మేమున్నది? పంచమవేదమయిన భారతములో శ్రీవ్యాసభట్టారకుఁడు "వెదురుకణుపులలోనుండి కీచకుఁడు మొదలగు నూటుగు రన్నదమ్ములు పుట్టినారు;" అనివ్రాసియున్నాఁడు. ఆకథ యిట్లున్నది:— విరాటరాజుగారి పట్టపుదేవికి బిడ్డలు పుట్టలేదు. అందులకై అతఁ డొకఋషి ఆశ్రమములోనికి వెళ్లి ఆయనను ఆరాధించినాఁడు. ఆఋషి ప్రసన్నుఁడై ఒకలాడువు మంత్రించి రాణికిమ్మని యిచ్చుచు—"ఇది రేపేని అడవిలో పొదలో కూర్చుండి భక్షింపవలెను. అట్లుచేసిన పక్షమున మీకునూటుగురుబిడ్డలు పుట్టుదురు" అని చెప్పినాఁడు. రాజుపెండ్లాము ఋషిచెప్పిన చొప్పుననే అడవికిపోయి, ఒకవెదురుపొదలో కూర్చుండిఆయన యిచ్చిన లాడువు తిని యింటికిచేరుకొన్నది. ఆసమయమున, ఆవెదురుపొదలోనే గాంగిలుఁడనుఋషికూర్చుండి చాలకాలమునుండి తపస్సుచేయుచున్నాఁడు. అక్కడకు సమీపమునందే ఒకనది ప్రవహించుచున్నది. ఒకానొక-అచ్చరవచ్చి దిగంబరయై నదిలో స్నానముచేసి ఒడ్డున నిలువఁబడినది. ఋషిదృష్టి అలౌకికరూపవంతురాలయిన దానిమీఁదను ప్రసరించినది. అందువలన ఆయనచిత్తములో గామవికారముగలిగినది. హృదయము చలించినకారణమున క్రిందఁబడియున్న సచ్ఛిద్రమయిన వెదురుబొంగున నూఱు పిండము లేర్పడినవి. అటుతరువాత నాఋషితనమనస్సును, సంబాళించుకొని తనదారిని తాను పోయినాఁడు. నూఱు పిండములుగల వెదురక్కడనే పడియున్నది. తరువాత నెట్లో యీసంగతి విరాటరాజునకుఁ దెలిసినది. వెంటనే

ళా జానదుఅను దసమందిరమునకుఁ దెప్పించినాఁడు. అందుండి సర్వాంగోపాంగ సహితులయి నూటుగురు బిడ్డలు పుట్టినారు. వారిలో పెద్దవాని పేరు కీచకుఁడు. (కీచకమనఁగా బొంగువెదురు. అందుండి పుట్టినందున వానికా పేరు పెట్టినారు.) తక్కినతొంబదితొమ్మండ్రపేరులు ఉపకీచకులు. పెద్దవాఁడు తొమ్మిదివేల గజముల మానిసియఁట; విరాటరాజుగారి భార్య యీనూటుగురు బిడ్డలను తనవారినిగాఁ బెంచి పోషించుచు వచ్చినది. ఒక వెదురులో ప్రసవసమయమునందు నూటుగురుబిడ్డ లున్నప్పుడు ఒక జారీచెంబులో ఒక్క తమరు, ఏనుఁగుమాత్రమే యిమిడియుండుటలో ఆశ్చర్యమేమున్నది? ఇదిగాక, శివభగవానుఁడు తన జటాజూటములో వేయిసంవత్సరముల వఱకు గంగానదిని ఉంచుకొన్నట్టు పురాణములలో ప్రసిద్ధమయి ఉండనే యున్నది కూడను. ఇట్లుండగా తమరు, ఏనుఁగు జారీచెంబులో ఆఱుమాసములవఱకును తిరుగుచు ఉండుటలో ఆశ్చర్య మేమున్నది? మఱియు; శివుఁడు గంగానదిని వేయిసంవత్సరములకాలము తనజటాజూటములోనే త్రిప్పుచు ఉండఁగలిగినప్పుడు తమ రాఱునెలలుమాత్రమే యేనుఁగును జారీచెంబులో వెంటను త్రిప్పుకొనుటలో ఆశ్చర్యమేమున్నది? అసంభవమని యేల యనఁగలరు?

మాల:—మంచిది; నీవు చెప్పిన దంతయు నంగీకరింపవచ్చును గాని జారీకొమ్ములో ఏనుఁగుతోఁక వెంట్రుక యెట్లు చిక్కుకొన్నదో చెప్పుము చూతము.

కండ:—నీమది కలిగినయీసంశయము నివారించుటకై నే నొకపురాణకథ ఉదాహరించెదను—చిత్తగింపుఁడు; మహాప్రళయము తటస్థించినపుడు—అనఁగా, భూమి, తేజస్సు, వాయువు, ఆకాశము, స్థావరములు, జంగమములు మొదలయిన ప్రపంచ మంతయు అభావమును పొంది జలమయ మయినప్పుడు విష్ణుభగవానుఁడు నీటిపైని కూర్చుండి తపస్సు చేయుచున్నాఁడు. ఆసమయమున ఆయననాభికమలమునుండి బ్రహ్మ, కమండలము, దండము చేతఁబట్టుకొని బయటికి వచ్చినాఁడు. ప్రయత్నపూర్వకముగా బ్రహ్మ యెట్లో బయటికి రాఁగలిగినాఁడు కాని; ఆతనిచేతనున్న కమండలము విష్ణుభగవానుని నాభిలో చిక్కుపడిపోయినది. పూజనీయములయిన మన పురాణములలోనే యిట్లున్నపుడు తమజారీచెంబునుండి యేనుఁగు బయటికి వచ్చి, దానితోఁకవెండ్రుక కొమ్ములో చిక్కుపడియుండుట అసంభవ మెట్లగును?

మాల:—సరే కాని జారీకొమ్మునుండి నే నెట్లు బయటికి రాఁజాలితిని?

కండ:—ఏమీ? చాల బాగుగనే రావచ్చునే. నే నావిషయమున మహాభారతమునుండి ప్రమాణము చూపించెదను, చిత్తగింపుఁడు: ఒకప్పుడు బ్రహ్మతపస్సు చేయుచున్నాఁడు. వేయిసంవత్సరములు కడచిపోయినవి, దేవతలకుఁ జాల విచారము కలిగినది. "ఎట్లయినను ఇతని తపమునకు విఘ్నము కలిగింపవలయును; లేనిపక్షమున ముందుముందు చాల చిక్కులు తటస్థించును" అని అన్యోన్యము ఆలోచించుచుండఁగా ఇంద్రుఁడు "ఇతనితపోభంగమునకు స్త్రీయే పరమోపయోగమయిన శస్త్రము; గౌతముఁడు, వసిష్ఠుడు, పరాశరుఁడు, జమదగ్ని, కశ్యపుఁడు, అగస్త్యుఁడు మొదలయిన మహర్షులు, హరిహరాదులు, వీరు- వారు అననేల? అందఱును స్త్రీలకు దాసులే- దాసులే అన్నంతమాత్రము చాలదు- దాసానుదాసు లని చెప్పినను చెప్పనేవచ్చును; తప్పులేదు. ఇది అందఱును ఒప్పుకొన్న సంగతియే. స్త్రీ లెట్టివారికైనను తమయిచ్ఛకు వచ్చినట్లు పిచ్చి యెత్తించి ఆడింపఁజాలుదురు. మహాదేవునివంటివాఁడు సయితము స్త్రీని చూడఁగానే కాలు జాఱిపడిపోక తప్పదు. ఈసంగతి మీరును ఎఱిఁగినదే. ఒకప్పుడు శివుఁడు యజ్ఞము చేయుచుండఁగా వాయువశమున కట్టుకొన్న బట్ట తొలఁగిన సందర్భములో పార్వతి కనఁబడినది. వెంటనే ఆయనచిత్తము కామవికారాయత్త మయిన కారణమున కలశములో నుండి ద్రోణాచార్యుఁడు పుట్టినాఁడు. కాఁబట్టి బ్రహ్మతపస్సు భంగపఱుచుటకును ఎవతెనయినను యువతినే యేర్పాటు చేయుట మంచిది." అని అన్నాఁడు. ఇట్లని స్వర్గలోకములోని వేశ్యలలోఁ దిలోత్తమ అనుదానిని పిలిపించి "ఓసీ! నీవు పోయి బ్రహ్మచేయుచున్నతపస్సు భంగపరచి రమ్ము." అని ఆజ్ఞాపించినాఁడు. తిలోత్తమయు ఇంద్రాదిదేవతల ఆజ్ఞను శిరసావహించి వేడుకగా ముస్తాబయి బ్రహ్మయెదుటికిఁ బోయి నృత్య మారంభించినది. ఆసమయమున దానిసర్వాంగములను, నానాప్రకా

రములయిన హావభావవిలాసములను జూడఁగానే బ్రహ్మదేవుని మనస్సు కామవికారగ్రస్తమయిపోయినది. అపుడాయన నిశ్చేష్టితుఁడైపోయి తిలోత్తమపైని రెప్పవాల్చకుండఁ జూడమొదలిడినాఁడు. అపుడు తిలోత్తమ తనప్రయోగించిన శృంగారాస్త్రము లమోఘముగాఁ బనిచేయుట చూచి యాతనియెదుటనుండి దక్షిణదిక్కునకుఁ బోయి నృత్యము చేయమొదలిడినది. అపుడు బ్రహ్మ తన మొగ మటువైపు త్రిప్పుట ఉచితమయినపని కాదని ఆలోచించి అటువైపునఁగూడ నొక క్రొత్తమొగము తయారుచేసికొని దాని రూపామృత పానముచేయుటకుఁ బ్రారంభించినాఁడు. అంతలో నది వెనుకకుఁ దిరిగినది. ఆయన అటువైపునఁగూడ ఒక మొగము తయారు చేసికొన్నాఁడు. ఇంతలో నాహాంశకారి ఉత్తరమువైపు తిరిగినది. అటువైపునఁగూడ మొగము తయారు చేసికొన్నాఁడు. ఓహో! మన మెటువైపు తిరిగిన అటువైపే మొగము తయారు చేసికొనుచున్నాఁడే! అని అది మీఁదుగాఁ బోయి, ఆకసముపైని నాట్యము ప్రారంభించినది. బ్రహ్మయ్యగా రదివఱ కెప్పుడో దానికి దాసుఁడయి పోయినాఁడు. దానిని జూడకుండ నతఁ డెట్లూరకుండఁ గలఁడు? అప్పుడు తప్పని సరిగా ఆలోచించి మీఁదువైపునకుఁగూడ అయిదవమొగము తయారుచేసికొనవలసిన అవస్థకుఁ బాలుపడినాఁడు. బ్రహ్మ యీప్రకారముగాఁ గామవశంవదుఁడైపోయియుండుట చూచి యీశ్వరుఁడు తనగోళ్లచేతను మీఁదువైపున నున్న అయిదవ మొగము గిల్లివేసినాఁడు. అందుపైని బ్రహ్మకుఁ గోపము కలిగినది. ఆయన కన్ను లెఱ్ఱచేసి శిరసునుండి స్రవించుచున్న చెమ్మట తర్జనిచేఁ దుడిచి భూమిపైని విదలించినాఁడు. ఇఁక నేమున్నది? అందుండి, శ్వేతకుండలి అను పురుషుఁ డొకఁడు బలవంతుఁడు పుట్టి బ్రహ్మదేవుని యొద్దను సెలవంది యీశ్వరుని వెంటను బరుగెత్తినాఁడు. శివుఁడు పాఱిపోయినాఁడు. అట్లు పరుగెత్తి పరుగెత్తి తిన్నఁగా బదరికాశ్రమములోఁ బ్రవేశించి యందు విష్ణునిఁ జూచి "బావా! రక్షింపవా?" అని అతనిని శరణు చొచ్చినాఁడు. అంతట విష్ణుదేవుఁడు తన కపాలమునుండి ఒకరక్తనాడిని తెఱచినాఁడు. దానినుండి రక్తము ప్రవహింప మొదలిడినది. శివుఁడు గోళ్లచే గిల్లి తెచ్చిన బ్రహ్మతలా కయిదవముఖము క్రింద నున్నదిగదా! అది ఆరక్తముతో నిండినది. దేవమానముచేతను, వేయి సంవత్సరములకాలము విష్ణుని కపాలమునుండి వచ్చిన నాడినుండి రక్తము ప్రవహించుచునే యుండెను. కాని క్రిందితల పూర్తికాలేదు. అది చూచి శివుఁడు తనవ్రేలిచే దానిని తుడిచినాఁడు. ఆసమయమున బ్రహ్మతల, విష్ణుని రక్తధార, శివుని అంగుళి, ఈ మూఁడింటి సంయోగము వలనను రక్తకుండలి అను పురుషుఁడు పుట్టినాఁడు. వాఁడును శివుని ఆజ్ఞను బొంది శ్వేతకుండలితో యుద్ధమారంభించినాఁడు. దేవమానమున వేయేండ్లు యుద్ధము జరిగినది. అపుడు దేవతలు వచ్చి యుద్ధ మాఁపినారు. ఆయిద్దఱిలోను ఒకనిని దేవేంద్రునకును, రెండవవానిని సూర్యునకును అప్పగించినారు. అప్పగించునపుడు "ఎప్పుడు భారతయుద్ధ మగునో అప్పుడు మీ రీయిద్దఱను యుద్ధము వృద్ధి యగుటకై భూలోకమునకుఁ బంపవలయును" అని చెప్పినారు. అనంతరము భారతయుద్ధమునకు ముందు, సూర్యుఁడు కుంతిచే నాహూతుఁడై దాని రూపలావణ్యాదులు చూచి మోహితుఁడై వదలిపోలేక దానిని బెదరించి యెట్లో దాని నంగీకరింపఁజేసి తానువచ్చినపని నెఱవేర్చుకొని వెళ్లిపోయినాఁడు. అదివఱలో సూర్యునిలోఁ బ్రవేశించియున్న రక్తకుండలి అనుయోధుఁడు కుంతిగర్భములోఁ బ్రవేశించినాఁడు. కుంతి తొమ్మిదినెలలు పూర్తి అయినతరువాతను వానిని దనకర్ణము (చెవి) మార్గమున కన్నది. అందుచేతనే ఆబాలుఁడు కర్ణుఁడయినాఁడు. అంతచిన్నకర్ణద్వారమున కర్ణునియంతటిశూరుఁడు, వీరుఁడు అయినబాలుఁడు రాఁగా, జారికొమ్ము నుండి తమరు బయటికివచ్చుట కభ్యంతర మేముండును?

మూల:—సరే; అన్నింటికిని సమాధానము చెప్పినావు; అంతమహాప్రవాహముతోఁ గూడియున్న గంగానదిని నేను చేతులతో దాఁటి యెట్లు ఒడ్డు చేరఁగలిగితిని?

కండ:—అయ్యో! ఇదికూడ అడుగుచున్నారే? తమరు రామాయణ మెప్పుడును చదివికాని; వినికాని ఉండలేదా? రామాయణములో రామచంద్రుని ఆజ్ఞపైని సీతజాడ తెలిసికొనుటకై ఆంజనేయుఁడు లంకలోనికి వెళ్లినాఁడు. అవెళ్లినప్పుడు నూఱామడదూరముగల సముద్రమును తనచేతులతోడనే దాఁటి వెళ్లినాఁడు. సీత ఆతనివలన శ్రీరామునియావద్వృత్తాంతమును విన్నతరు

వాత "నీ వీసముద్రమును ఎట్లు దాఁటి రాఁగలిగి నావు?" అని ప్రశ్నించినది.

శ్లో. శివ ప్రసాదా త్పవనప్రసాదా
ద్భర్తుశ్చ తే దేవి! మహాప్రసాదాత్,
త్రిభిః ప్రసాదై రనుగమ్య తోయం
తీర్ణో మయా గోష్పదవ త్సముద్రః."

అమ్మా! నీయనుగ్రహమువలనను, మాతండ్రియయిన వాయుదేవుని అనుగ్రహమువలనను, దేవీ! నీభర్తయగు రామునిమహాప్రసాదమువలనను, మొత్తమువీఁద వీ మువ్గురిదయవలనను నే నీసముద్రమును గోష్పదము (గోవుఅడుగు) దాఁటినట్లు దాఁటివచ్చినా నని సమాధానము చెప్పినాఁడు హనుమంతుఁడు. అంతసముద్రము నే అతఁడు గోష్పదము దాఁటినట్లు దాఁటినమాట నిజ మయినప్పుడు తమ రామాత్రపుగంగానదిని దాఁటుటమాత్రము నిజమెందులకుఁ గాఁగూడదు?

మూల:—నే నాలుసెలలనుఋకును జలధారలను దలమీఁద నెట్లు ధరింపఁగలిగినాను?

కండ:—ఒకప్పుడు దేవతలందఱును కలిసి గంగాదేవి నీ భూలోకమునకు దయచేయు మని ప్రార్థించినారు. "భూలోకమువారి క్షేమమునకై నేను గ్రిందికి వచ్చుటకు సిద్ధముగా ఉన్నాను; కాని నే నాకాశమునుండి క్రిందను బడునప్పుడు నన్ను ధరించు వా రెవరో చెప్పండి." అని గంగ అన్నది. "ఆపనికి నేను సిద్ధముగా ఉన్నాను" అని శివుఁ డన్నాఁడు. ఆప్రకారముగానే దానిని దన జడలలో ధరించినాఁడు. ఎన్నాళ్లు? దివ్యవర్ష సహస్రపరిమితకాలము. అంత పెద్దదయిన ఆకాశగంగానదిని శివుఁడు తనతలపైని ధరించినమాట యొఱింగినవారికి తమ నాలుమాసములు జలధారలను ధరించినా రన్నమాట ఆశ్చర్యకరమయి యుండదు. కాఁబట్టి తమరు చెప్పినసంగతు లన్నియు సత్యములు; యథార్థములు, అసత్యములు కావు. అణుమాత్రమయినను ఇందులో అబద్ధము అన్నమాట ఉన్న దని యెవ్వరును అన సాహసింపరు. ఏమంటారు?

మొదటికథ సరి.

గోవు మాలచ్చిమి

నండూరి వెంకటసుబ్బారావు గారు, బి. ఏ.

మనిసికైనాలేని మంచిపోకిళ్లు
గోవుమాలచ్చిమికి కోటిదణ్ణాలు
యెంకితోకూకుండి
యింత సెపుతుంటే
తనతోటిమనవల్లె
తలదిప్పతాదీ. గోవు.

యెంకి సరసాలాడ
జంకుతావుంటే
సూసిసూడకకన్ను
మూసి తెరిసేది. గోవు.

కూరి కూకుని నేనె
పోరుపెడుతుంటె
తల్లిడుపు పిల్లల్లె
తెల్లపోతాదీ. గోవు.

మనిసికైనాలేని మంచిపోకిళ్లు
గోవు మాలచ్చిమికి కోటిదణ్ణాలు.

చిత్రలీలాస్తవము

దుర్భా సుబ్రహ్మణ్యశర్మ గారు

సుఖముఁ దుఃఖము రెంటిఁ గూర్చి విషయస్తోమంబు నిర్మించి, మా
నకసాహాయ్యకసమీహ జీవుల కెడందన్ నెక్కొనన్ జేసి, సా
రెకు వారల్ విఫలాశులై మొఱలిడన్ గ్రీడన్ వినోదించెదీ
వకటా! యెంతటి క్రూరకర్ముఁడవు! దేవా! చిత్రచర్యానిధీ!

మ. అలరుంబోఁడుఃపొందు నింద్యమని వేదాంతంబులన్ జెప్పి, యు
గ్గలపుంగామము జీవచిత్తములలోఁ గల్పించి, వారల్ నెలం
తలకున్ దాసులుగాఁ జరింప నిరయద్వారంబు చూపించెదా
వల, నీయూర్జన మేమిచెప్పవలె! దేవా! చిత్రచర్యానిధీ!

మ. కలవో? లేవో? యెఱుఁగరానితమమున్ గల్పించి, లేదన్నవా
రల శిక్షించెద వింతకన్నఁ గలదే క్రౌర్యక్రమం బిట్టి నీ
కలుషోద్యోగము జీవకర్మఫలముంగాఁ జెప్పి నిన్నెన్న వి
హ్వాలతత్త్వజ్ఞుల నేమనంగవలె! దేవా! చిత్రచర్యానిధీ!

ప్రభాతము

బ్రహ్మవిద్యావిభవంబునం బొదలు వి
జ్ఞాని లావణ్యతేజంబువోలెఁ
గనుసన్నమాత్ర జగముఁ బరిపాలించు
సరసమౌ వాగ్విలాసంబు వోలె
గిలిగింతచనవులఁ గలికి మొగ్గ నలర్చు
పవన కిశోరంపుఁ బాటవోలె
జగతినంతయుఁ జిత్రశాలఁ జేసెడు బాల
కృష్ణు మోహనవేణు గీతివోలె
దివ్యపురుషుని చిత్తఃపుం దేఁటవోలె
భవ్యకరుణారసంపు వైభవమువోలె
సరస సత్కార్యఫల వికాసంబువోలె
వఱలు నఖిలోకమధుర ప్రభాతకాంతి.

—సుధాసిని.

శ్రీకృష్ణదేవరాయల విద్యాగోష్ఠులు

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

౧

ఈయుపేర సరస్వతీపత్రికలో నిదివఱకు గొన్ని యపూర్వవిషయములను బ్రకటించితిని. మఱికొన్ని యిక్కడ వెల్లడించుచున్నాను. కృష్ణదేవరాయలు సాహిత్యమందేకాక సంగీతమందును మిక్కిలియభిరుచిగలవాఁడు. ఈవిద్యాస్థానమున బండారులక్ష్మీనారాయణుఁడని యొకసంగీతవిద్వాంసుఁ డుండెను. రాయలయంతఃపురస్థానమున నాయన నాట్యరసాధిపత్యము వహించియుండెడువాఁడు. అతఁడు రచించినది సంగీతసూర్యోదయమని యొకసంస్కృతగ్రంథ మిప్పుడు దొరకినది. దానిపీఠికలో విద్యానగరము, కృష్ణరాయలదిగ్విజయములు, వర్ణితములయినవి. రాయలదిగ్విజయవర్ణనములలో నపూర్వవిషయము లొండురెండు గానవచ్చుచున్నవి. సంగీతసూర్యోదయకారునకు అభినవభరతాచార్య, రాయబయకార, తోడరమల్ల, సూక్ష్మభరతాచార్య, బిరుదములు గలవు. కృష్ణరాయ లీయనకు బంగారుపల్లకీ, ముత్తెపరులజల్లులుగలవి రెండు ముత్తెపుఛత్రములు, మదపుటేనుగులు, మలహారీవాద్యము ఒసఁగెను. ఈయన విష్ణుభట్టారకుల యొద్ద దత్తిలకోహలాది భరతమతగ్రంథములను సవ్యాఖ్యముగా నధ్యయనము చేసినాఁడు. తాళాధ్యాయము, నృత్తాధ్యాయము, స్వరగీతాధ్యాయము, జాత్యధ్యాయము, ప్రబంధాధ్యాయము, అనియయిదధ్యాయములతో నీతఁడు సంగీతసూర్యోదయము రచించినాఁడు. ఈయన గ్రంథావతరణికనుండి కొన్ని శ్లోకములు:—

శ్లో. కర్ణాటాఖ్యాయదేశేప్రాఖ్యజనే
శ్రీతుంగభద్రావృతా,
మాతంగోన్నతమాల్యవచ్ఛిఖర
శ్రీహేమకూటాన్వితా;
పంపాధీశ్వర విట్ఠలేశ్వర కృపా
దృష్టిప్రభావాంచితా,
శ్రీవిద్యానగరీ విభాతి ధరణీ
ధమ్మిల్లమాణిక్యవత్.

* * * *

కృష్ణరాయలదిగ్విజయములు

శ్లో. శాకే ౭హో[illegible]కలాకలాపయుక్త
స్వప్రా(ప్రా)ణం పపతి విజిత్య గంగరాజమ్;
భిత్త్వా శివసముద్ర ముత్కటం ప్రా
గావాసం కృతమత విక్రమం శివాజాన్.

శ్లో. దుర్గం జిత్వాథ పోఽపా పునరుగిరివరం
ఛత్ర రాహుత్తరాజం,

బందీకృత్యాస్య పుత్రాన్ యుధి నగరవరే
కొండవీడ్కొండపల్ల్యోః;
శ్రీవగ్రాహం గృహీత్వా గజపతితనయం
పొట్టునూర్పట్టణాగ్రే,
విశ్వశ్లాఘ్య ప్రతాపో విరుదయుతజయ
స్తంభ ముచ్చై రకృతాసీత్.

శ్లో. సోఽయం కృష్ణనరేశ్వరో గజపతిం
జిత్వా తదీయశ్రియా,
సాకం తస్యసుతాం ముదూహ్య యవన
క్ష్మాపం సహాసం తతః;
గోల్కొండాస్థలవాసినం సరభసం
జిత్వాను విద్రావ్యతం,
హస్తైకృత్వాన్ స తదీయదుర్గ మతులం
......మారుమాద త్తవాన్.

శ్లో. కృష్ణా ముత్తీర్య సోఽయం యవనజనపదం
వహ్ని సాత్కృత్య సర్వం,
పేనుగొండాంబాదసించా ద్వారు(?) నగర సమా
ఖ్యాని దుర్గాణి జిత్వా;
భక్త్యో ర్వైరైః పారసీకం కలుబరగపురీం
ద్రాక్షపాదార్ధమానః?, [మహిమా
కాంతా(క్రాంత్వా?)వ్యాకృష్టవాన్ దోర్బలఘన
శ్రీన్ సురత్రాణపుత్రాన్:

గ్రంథకర్త

శ్లో. తస్య శ్రీకృష్ణరాయస్య కృపా క్షీరాబ్ధిచంద్రమాః;
లక్ష్మీనారాయణో నామ వర్తతే సరసాగ్రణీః.

... ...

సదాభినవశబ్దాది భరతాచార్య నామకమ్,
విరుదం ధరణీచక్రే ధత్తే చక్రమి వాద్యతః.

శ్లో. శ్రీమత్కృష్ణనరేశ్వరస్య దయయా
స్వర్ణాంచితాం పాలకీం,
ముక్తా గుచ్ఛకృతానుబద్ధవలయం
ముక్తాతపత్రద్వయమ్;
శశ్వ న్మత్త మతంగజాన్ స్థలహారీ
వాద్యం నిజాంతఃపుర,
స్థానే నాట్యరసాధిపత్య మసకృ
ల్లక్ష్మీపతిః ప్రాప్తవాన్.

శ్లో. సంగీతాగమ లక్ష్యలక్ష్మనిపుణై
శ్శ్రీరింగ్షభట్టారకైః
జ్ఞాత్వా దత్తిలకోహలాది భరత
గ్రంథాన్ సుటీకాన్వితాన్
భూమా కీర్తిశశీకరక్షణధియా
గ్రంథః కృతోఽయం మయా,
......యోగ్యతాధికతర
స్సంగీత సూర్యోదయః.

గద్యము

ఇది శ్రీమద్విప్రకులవర్య భండారు విట్ఠలేశ్వరనందనమాతృభరతా (లిఖితా?)చార్య రాయబయకార్తతోడర మల్లాభినవభరతాచార్య శ్రీ లక్ష్మీ నారాయణ విరచితే సంగీత సూర్యోదయే—

ఇంకొక విశేషము

ఈ భండారులక్ష్మీనారాయణుఁ డిట్లు కృతికర్తయగుటేకాక మఱి కృతిభర్తయునయిన ట్లెఱుఁగఁబడుచున్నాఁడు. భానుకవియని యొక తెనుఁగుకవి యాతనికంకితముగాఁ బంచతంత్రిని దెనిఁగించినాఁడు. చిట్టయమంత్రి (చిట్టమరసు?) ప్రేరణచే, నరసింహభట్టు, నరసమంత్రి, అవధానముకృష్ణఘనుఁడు, భరతము విష్ణుభట్టు (ఈతఁడే లక్ష్మీనారాయణునకు సంగీతాగమము నుపదేశించినవాఁడు) అనువారు సమ్మతించి ప్రోత్సాహపఱుపఁగాఁ లక్ష్మీనారాయణుఁ డీభానుకవిని దనపేరఁ బంచతంత్రిని దెలిఁగింపఁగోరినాఁడట! భానుకవి తనకృతిపతి సంగీతసూర్యోదయము రచించనని చెప్పలేదుగాని యాతనిబిరుదములను, అభినవభరతాచార్యాదులను దఱచుగా గ్రంథమునఁ జేర్చుచున్నాఁడు.

క. పతికంటె మంత్రి బోసిన
క్షితి యాతని దైరసర్ప సిద్ధము సతి దాఁ

బలికంటె నవరత్నమైనను
బలికార్యము చేయుము మాత్నభరతాచార్యా!

విద్యానగరము నీతఁ డిట్లు ప్రశంసించి నాడు :

సీ. పంపావిరూపాక్ష భైరవవిఠ్ఠలే
        శ్వరముఖ్య దేవతా వ్రజము చేత
  పరిపంథిగర్వవిభాళన శ్రీకృష్ణ
        రాయభూధవభుజారక్ష చేత
  ఘటనటకౌశ్యలిప పౌరాణిక కవిసత్వ
        చతుర సత్కవీశ్వరుల చేత
  సంతతమదవాహి చారుసుందాలను
        టాబవ ప్రకట ఘోటముల చేత
గీ. రమ్యమైయుండు విద్యాపురంబునందు
  నిమ్మహాకృతి భానుకవీశ్వరుండు
  తెనుఁగుబాస నొనర్చెను వినుతికెక్క-
  నవని నాచంద్రతారార్కమగుచుఁ దనర.

ఈపంచతంత్రిలో కథలోఁ గూడ నీతి పద్యములు కృతిపతిసంబోధనముతో నున్నవి. "కరణికలక్ష్మి, సూక్ష్మలిఖితాచార్యా! విట్ఠయ లక్ష్మధీమణీ," - ఇత్యాదులు. ఇట్టి సంబోధనములవలన నీతఁడు సంగీతాచార్యుఁడే కాక మంత్రియు నని యెఱుఁగ నగుచున్నది.

మాదిరికొక్క పద్యము:—

సీ. విద్వత్కవులయందు విశ్రాణనంబును
        బ్రత్యర్థివిభులందు బాహుబలము
  శరణాగతులయందుఁ గరుణాకటాక్షంబు
        నృపకార్యములయందు నీతిగరిమ
  బంధుసంతతియందు పరమసంతోషంబు
        నాశ్రితులందుఁ బాయనికలంపు
  ధర్మమార్గమునందుఁ దగినచిత్తంబు
        సత్యవాక్యములందు జతురతయును
గీ. గలిగి యొవ్వాఁడు మెలఁగు జగత్త్రియమున
  నతనికీర్తులు లుబ్ధమోహాంధతమస
  పటల మణఁగింపఁ జంద్రికాప్రభలయట్లు
  లలితగుణధుర్య విట్ఠయలక్ష్మణార్య!

* * * *

౨

కృష్ణరాయలు రాజ్యమేలుచుండఁగా నీశ్వరదీక్షితుఁడను సంస్కృతవిద్వాంసుఁ డొకఁడు వాల్మీకిరామాయణమునకు బృహద్వివరణమని లఘువివరణమని రెండువ్యాఖ్యలు రచించినాఁడు. శ్రీకృష్ణరాయల కలువదిగడియలలో రామాయణ మేడుకాండలు వినిపించి యాయనప్రోపునఁ జిత్రకూటమున (హంపి) నుండి రామాయణవ్యాఖ్యలు తాను రచించినట్లాతఁడు చెప్పుకొన్నాఁడు.

శ్లో. బృహద్వివరణంచైవ తథా వివరణం లఘు;
  వ్యధాద్రామాయణే వ్యాఖ్యాద్వయ మీశ్వరదీక్షితః.
శ్లో. కర్ణాటాధీశ్వరే రాజ్యం కృష్ణరాయే ప్రశాసతి;
  రామాయణం చిత్రకూటే వ్యాఖ్యాదీశ్వరదీక్షితః.

* * * *

3

నగరు, తగరు, తొగరు, పగరు, అని చరణాద్యక్షరములుండునట్లు రామాయణ, భారత, భాగవతపరములుగా మూఁడుపద్యములు చెప్పుమని పెద్దన సమస్యయిడుఁగఁగా నట్లే చెప్పి సత్కృతుఁడయిన చింతలపూఁడి యెల్లయకవికి శ్రీకృష్ణరాయలు రాధామాధవుఁడని బిరుదనామమిడెను.

శా. రాధామాధవ మద్యుతాంకితముగాఁ
        బ్రౌఢక్రియం జెప్పి త
  న్మాధుర్యంబునఁ గృష్ణరాయవిభుఁ గ
        ర్ణాటేశు మెప్పించి నా
  నాధాత్రీప్రతిమాన సత్కవులలో
        నక్షీణ భూషణశ్రేణితో
  రాధామాధవనామమందిన జగ
        త్ప్రఖ్యాత చారిత్రుఁడన్,

ఈరాధామాధవకవికృతులు రాధామాధవము, విష్ణుమాయావిలాసనాటక ప్రబంధము, తారకబ్రహ్మరాజీయము, ననునవి దొరకియున్నవి.

* * * *

౪

ఆముక్తమాల్యద కృష్ణదేవరాయరచిత మని గ్రంథమందున్నను బెద్దనరచించినదని లోకమునఁ బ్రతీతికలదు. వ్యాఖ్యాతలు లాక్షణికులు, కొంద ఱట్లే గ్రంథములందును జెప్పినారు. ఆముక్తమాల్యదా వ్యాఖ్యాత శ్రీనివాసకవి:

ఉ. ఉరువగు విష్ణుచిత్తకథ
 యోద్వహనంబును సంస్కృతాంధ్రవా,
గ్గరిమ నలంక్రియారసప
 ఖంబగు నట్లుగఁ బెద్దనార్యుఁడు,
ధ్ధురధిషణతఁ రచించె నది
 దుర్ఘటబోధముగావునన్ ధరన్,
స్థిరమగుచుండునట్లు
 గనుకే నెదఁ డీక సవిస్తరంబుగాన్.

గుడిపాటి వెంకటకవి టీక

గీ. ప్రేమ నల్లసాని పెద్దన యాముక్త
 మాల్యదాఖ్యకృతి నమంచితముగఁ
 జేసె నీవు టీక చేయుము చెఱకునఁ
 బండు పండినట్టులుండఁగాన.

సీ. కరమర్థిఁ గవిరాయగండపెండేరంబు
 చెల్లించుకొన్నట్టి బల్లిదుండు
కవులలోపల నాంధ్రకవితాపితామహ
 బిరుదాంకుఁడైన గంభీరమూర్తి
మనుచరిత్రాదిసమ్యక్కావ్యరచనలఁ
 జల్పినవైష్ణవ చక్రవర్తి
కృష్ణరాయలు తనకేల్దమ్మిచే నెత్తఁ
 బల్లకి యెక్కినభాగ్యశాలి,

గీ. అలఘుఁ డలసాని పెద్దన యాఘనుండు
 మహిమఁ జేసినయాముక్తమాల్యదా ప్ర
 బంధ మెంచటఁ దరీయద్ధీపటిమ యొచటు?
 నాకు శక్యంబె దానికిఁడీక సేయ?

రంగరాట్ఛందస్సులోఁ గూడఁ బెద్దన చెప్పిన యాముక్తమాల్యద యనియున్నది.

* * * *

౫

విశాఖపట్టణమండలమున "ప్రపంచదర్పణ"మని యొకసంస్కృతగ్రంథము ప్రాచ్యలిఖిత పుస్తకశాలవారికి దొరకినది. అది సంధానగ్రంథము. ప్రాచీనగ్రంథముల నుండి యనేకవిషయము లందు సంకలనము చేయబడినవి. అం దీక్రింది శ్లోకము లున్నవి:

అల్లసాని పెద్దనార్యేణ సత్యావధూపరిణయే:
శ్లో. అంగులీషు కురంగాక్ష్యా శోభతే ముద్రికావళీ;
 ప్రోతేవ బాణైః పుష్పేషో ర్మాన్యస్త్రలక్ష్యపరంపరా.

అల్లసాని పెద్దనాఖ్య సా ప్యేవముక్తం రసమంజర్యామ్:

శ్లో. ఉడురాజముఖీ మృగరాజకటి
 ర్గజరాజగతిః కుచభారనతా;
 యది సా రమణీ హృదయే రమతే
 క్వజపః క్వతపః క్వసమాధిమతిః.

మొదటిశ్లోకముగల గ్రంథముపేరు సత్యావధూప్రీణన మయియుండునేమో! ఆముక్తమాల్యదలో కృష్ణరాయల కృతులుగా నీ గ్రంథములుగలవుగదా!

"సీ. పలికితుచ్ఛేత్రోపమల"—ఇత్యాదిపద్యమున—
 "ధ్వనివ్యంగ్యసేవధిగాఁగఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు"— "మఱియు రసమంజరీముఖ్యమధురకావ్య, రచన మెప్పించుకొంటి గీర్వాణభాష"—

ఈ సంధానగ్రంథమున నీ పేళ్లతోఁ బెద్దనార్యకృతులను బేర్కొనుట వింతగదా! కృష్ణరాయకృతులలోనివిగాఁ గూడ నందు శ్లోకములున్నవి.

కృష్ణరాయస్యాలంకారసారసంగ్రహే—

సిందూరం రవి బిందు మానన మసౌ
  ధమ్మిల్ల రాహోర్గ్రహో,
న్యగ్రోధం గ్రసతీతి తచ్చ విబుధై
  శ్శిక్షిత మాశ్వాతికమ్;
కోకే చంచలతా ధవివ్యతి హాతా
  త్స్వైరత్కుంతలే కర్షణం
కాం ... హే
  అంగే మహోన్సంగరః.

ఇందుఁజూపఁబడినశ్లోకములు సుభాషిత రత్నభాండాగారమునఁగూడనున్నవి. "అంగులీషు" ఇత్యాదిశ్లోకము బిల్హణునిదిగా నందుఁ జెప్పఁబడినది. తక్కినవి యెవ్వరు రచించినవో యందు లేదు.

ఆగ్రంథసంధాతబేధ్రుఁడు. ప్రసిద్ధగ్రంథకర్తల పేళ్లతో నెక్కడివో తెలియరాని మంచిశ్లోకములఁగూడ నాతఁడు గూర్చియుండునని సందేహించుటకందుఁ గొన్నిచోట్ల నెడము గలుగుచున్నది. ఈశ్లోకము లట్టివయియుండవచ్చునేమో!

ఈ వేళ కనుపించునా?

తు ర గా వెం క ట రా మ య్య గా రు

పూతవయసే, వెన్న
  పూసమవసే, కెంపుఁ
దమ్మిరేకులకండ్ల
తళుకులే తెలుపునే.
  బాలకృష్ణునిబిలువవే!
  కోకిలా! ప్రణయరాధను నిలుపవే!

2. వలపించి మాయమై,
విలపింప జేయుటా?
కలికమ్ములోకైన
గానరాకుండుటా?
  దారుణమ్మని తెల్పవే!
  కోకిలా! తగదుతగదని చెప్పవే!

3. మఱచినానే మేను
మఱచినానే మనసు
బ్రతుకెల్ల నతనికే
వదలి యిట్లయితినే
  మఱువవద్దని చెప్పవే!
  కోకిలా! కరగురీతులనాడవే!

4. గుట్టులేదే మనసు
పట్టలేకున్నానె
వెట్టులీకన్నెటి
యెల్లిదుదానసే
  యమునలో బడుమందువా?
  కోకిలా! అతని నిచటకు దెత్తువా?

5. విడిచినానే సిగ్గు
విడిచినానే సిరులు
నిలువనీడే లేక
విలపించుచుంటినే,
తెలుపనైనా తెలుపవే!
కోకిలా! అలుక లుంటే పాపవే!

6. మొదలె తెలియని నన్ను
మోహాలలో నిల్పి
రాగాల దీయించి
రాకుండబోవునా?
నీవైన వచియింపవే!
కోకిలా! సాధించి తోడితేవే!

7. నమ్మినానే మాట
కమ్మదనములు, వలపు
లమ్మినానే వాడు
నమ్మడే, కఠినుడే
రాధమన సెఱిగింపవే!
కోకిలా! సాధించి తోడితేవే


8. మేఘాలమేడలో
మెఱుపు దీపాలలో
కాలసుందరి యిచ్చు
కాలు వినవేగనో
పిలువనైనా పిలువవే?
కోకిలా! యలుగరాదని పల్కవే!

9. వేదాలవీథిలో
వివరింపనేగనో
వాదాల మెండలో
వడగొట్టి పండెనో
చూడనైనా చూడవే?
కోకిలా! జాడలైనా తీయవే!

10. యోగిహృదయాలలో
దాగి రాకుండెనో
రాగిణీవలయాన
రంజిల్లుచుండెనో
వెదకుజాడలు గాంచవా?
కోకిలా! వెంటవత్తును పాడవా!

11. పట్టలేనే యతని
దిట్టలేనే యలిగి,
వేయిబాముల బెట్టి
విసిగించినా సరే
కంటబడి తేచాలునే!
కోకిలా! కాలదన్నిన జాలునే!

12. పిల్లడా? లోకాలు
కొల్లగొనుచోరుడే?
గాలించిచూచినా
కనుపడని కృష్ణుడే!
ఈవేళ కనుపించునా?
కోకిలా? ఈజీవ మిక నిల్చునా?



దిగంబర యోగి

కే. వి. బసవరాజు గారు

శ్రీ వేంకటేశ్వరునిదర్శనార్థము నేను తిరుమలకు బోతిని. ఒకనాటియుషఃకాలమున నచ్చటిపర్వతారణ్యశోభను దిలకింప నిచ్ఛవొడమి బయలుదేరితిని. కొండపై నుండి క్రిందికి పెక్కుదారు లుండెను. అందే దారి యెచ్చటికేగునో నేనెఱుగను. నిర్జనారణ్యప్రదేశమును జూడ నెంచినవాడ నగుటచే మనుష్యుల రహదారిగానుండెడి బాటలను విడిచి ఆనవాలుమాత్ర మగుపడుచుండెడి యొక్కక్రొత్తదారి బట్టి పోతిని. ఆమార్గము నిమ్నోన్నతప్రదేశములలోనుండి వంకరటింకరులుగా బోయెను. నూరుబారల దూరమునడచుసరికి చిట్టడవిలో బడితిని. నిలువెత్తున బెరిగి బారెడావల నేదియు గనుపడనంతటి దట్టముగా బెనచికొనిపోయిన ముండ్లడొంకలనడుమనుండి నడచుచుంటిని. ఒకమనుష్యుడుగూడ గొన్నిచోటుల నొదిగి ప్రక్కగా నడువవలసినంతటి యిరుకుగ నాదారి యుండెను. ప్రక్క డొంకలలోనుండి సర్పాదిక్రూరజంతువులువచ్చి పైబడునేమో యని గుండెలు కొట్టుకొనసాగెను. మఱికొంత నడచుసరి కాబాటయొకప్రక్కకు మఱలెను. అచ్చటనుండి యొకలోయవంటి పల్లపుప్రదేశమునకు దిగెను. ఆలోయలోనుండి కొంతనెత్తముతో సరిగానుండునట్లు పెరిగి లోపలిభాగ మగుపడకుండ బెద్దచెట్లావరించియుండెను. ఆ దుర్గమప్రదేశములో నడుగులజాడమాత్రము కనుపడెను. కానిమ్మని తెగించి దిక్కృతితో ముందడుగువైచితిని. అచ్చట నొకచాపరాతిబండ యుండెను. దాని నెక్కి నలుదిక్కులు చూచితిని.

బాలభానుని యరుణకిరణప్రసారముచే జివురుజొంపములు కెంపుబంతులవలె నింపు నింపుచుండెను. [illegible]పూవుల వెగటువాసనకు గోరింటపూవుల ఘుమాయింపు విరుగుడుగా నుండెను. ప్రకృతిశోభ కానందమగ్నుడనగు నాకన్నులకొకవైపునగల వెందడొంకచాటున నొక మనుష్యాకారము గోచర మయ్యెను. ఆనందమున కాశ్చర్యముతోడయి నన్నచ్చటి కీడ్చికొనిపోయినది. గుడుగుడు గుంచముగా డొంకలచుట్టుదిరిగి సందుచేసికొని యాగురి వెందముందుజేరి చూచితిని.

దిగంబరుడు, గూనిమూపు పైకి వ్రేలాడు కుఱుచ కెంజడలవాడు, ధూళిధూసరితదేహుడు, పద్మాసనాసీనుడు, బక్క-

పలుచనివాఁడు, ఒక యోగి కడుపువెన్నుతో నంటబెట్టుకొని కన్నులు సగముమూతలు పడియుండ బ్రహ్మతేజస్సు వెదలగ్రక్కుచు పరమాత్మానుభూతిలో మునిగియున్నాడు. నేను గిక్కురుమనకుండ నరగడియ నిలబడిచూచి యొకప్రక్కను జతికిలబడినాను. ఎందులకు నిరీక్షించుచుంటినో, ఎంత కాలము నిరీక్షింతునో, ఏమికోరి నిరీక్షించుచున్నానో నాకే తెలియదు. నాదృష్టి యాయోగియందు స్తంభించెను. తెప్పయినను వ్రాల్చితినో లేదో చెప్పజాలను.

ఒకటి రెండుగడియల కాయసపెట్ట కదలజొచ్చెను. కల్జువంటి వెన్నెముక వంగజొచ్చెను. కనుతెప్ప లల్లాడజొచ్చెను. చిన్నయూపిరి బయలువెడలి మీసము లెగురజొచ్చెను. మెల్లన గనులువిచ్చి యా బైరాగి నన్ను జూచెను. బుస్సుమని యొక్క నిట్టూర్పు విడిచెను నేను ప్రణమిల్లితిని. కనుబొమ లెగురవైచి, తలపంకించి, గుప్పిటచేయి యూపి నీ వెవడ వను నర్థముకల సన్న జేసెను.

సామాన్యముగా బైరాగులు హిందూస్థాని మాటాడుదురు. వారిలో జాలమందికి తెలుగు వచ్చియుండదు. నాకు హిందూస్థాని రాదు. తప్పో, యొప్పో యిట్లంటిని. "మై తెలంగీ బ్రాహ్మణ్ హై" నా కాశ్చర్యకరముగా నాతడు "నీ కేమికావలెను?" అని స్వచ్ఛముగు తెలుగున ప్రశ్నించెను. ఆయనకు దెనుగువచ్చుట నాకు హిందీవచ్చినదానికంటె తృప్తినిడెను. మా కిట్లు సంభాషణము సాగెను.

నేను:—స్వాముల సేవగోరి వచ్చితిని.

యోగి:—స్వామికొండపైనున్నాడు; పొమ్ము.

నేను:—వారిదర్శనముమాత్రమే సులభము. అనుగ్రహము దుర్లభము.

యోగి:—నాయునికి నీ వెట్లు తెలిసికొంటివి?

నేను:—వేంకటేశ్వరుని ప్రేరణమువలన.

యోగి చివాలున లేచి నడువసాగెను. నేనును లేచి వెంబడించితిని. ఎంతదూరము



"స్వామికొండపై నున్నాడు; పొమ్ము"

పోవుదునో కాని పదిబారలు నడచినపిదప యోగి తిరిగిచూచి "నీకు నాతో నేమిపని? వచ్చినదారినే బొమ్ము" అనెను.

నేను:—మిమ్ము సేవింపుచు మీ వెంట నుండెదను. వెనుకకు బోవనొల్లను.

యోగి:—ఓయీ! నీవు రాజాలవు. సంసారసుఖలంపటుల కీయడవిలో జోటులేదు.

నేను:—నాకు సంసారమం దిచ్ఛలేదు. మీ పాదసేవఁ జేయుచు నీయడవియందే వసించెదను.

యోగి:—నీకు భార్యయు బిడ్డలు నున్నారా?

నేను:—ఉన్నారు.

యోగి:—వారి నేమిచేయుదువు?

నేను:—దైవవశము చేయుదును.

యోగి:—నీకు నాతో నేమిపని?

నేను:—నన్ను దరింపజేయుడు. మీ దాసునిగా జేసికొనుడు.

యోగి:—తరణోపాయము లడవిలోకంటె నింటిలోనే పెక్కులున్నవి. అచ్చటనే యభ్యసింపుము.

నేను:—స్వామీ! గురువులేనిదే యెట్లు తరింపగలను?

యోగి:—నీకుటుంబజనులే నీకు గురువులు. అన్వయించుకొనుము.

నేను:—సంసారానుభవము లేమిచే స్వాములిట్లు సెలవిచ్చుచున్నారు. అదికాంతాకనకములకు బట్టుగొమ్మ.

యోగి:—కాంతాకనకమంత్రము లుపాసించి సిద్ధుడవైతివేని మోక్షము కరతలామలకమే.

నేను:—మహాత్మా! శాస్త్రవిరుద్ధమగు దారిని జూపి నన్ను భ్రమపెట్టుచున్నారు.

యోగి:—శాస్త్రజన్యజ్ఞానముకంటె ననుభవజ్ఞానము గొప్పది. కావున ననుభవసిద్ధుడవు గమ్ము. పొమ్ము.

నేను:—స్వామీ! మీయనుభవ మదియేనా?

యోగి:—అవును. ఇక నీవు రావలదు. పొమ్ము.—అని యోగి దారిబట్టెను. నేనును వెంబడించితిని.

యోగి:—వత్సా! నీమూర్ఖతమాని వెనుకకేగుము. నీవు నన్ను వెంబడింపజాలవు.

నేను:—[సాష్టాంగపడి] "మహాత్మా! మీయనుభవమును నాకు దెలిపి నన్ను తరింపజేయుడు" అని రెండుపాదములు పట్టుకొంటిని. యోగికి మనసు కరగెను కాబోలు. గులకసూదిరాళ్లపై గుతిలపడిన నన్ను లేవదీసినాడు. నేనును లేచి కాలితో రాళ్ల నవలికి ద్రోసికొని కూర్చుండబోవ యోగి నవ్వి "ఇంతేకదా?" అనినాడు. అదేమో యిప్పటికిని నాకర్థముకాలేదు.

యోగి:—వత్సా! నీవు నేడు నా తపస్సునకంతరాయ మొనరించితివి. నిన్ను ద్రోసిపుచ్చ లేకున్నాడను. అందుకు గారణములు రెండు. దైవికమగు మనసంఘటనము, నీకుగల మోక్షేచ్ఛ; కాని విద్యా

సంపూర్తికి "ఓనమాలు" చెప్పుచున్నావు. అందుకు సంసారమే తగిన బడి. ఇది యధికారస్థానము. అచ్చటఁ బనికిరానివా రిచ్చటను బనికిరారు. ఇది నాయనుభవము. ఇఁక కేమికావలెను?

నేను:—మహాత్మా! మీచరిత్రమును వినినగాని మీసంసారానుభూతి యెట్టిదో నా కర్థముకాదు. అనుగ్రహించి యానతిండు.

యోగి:—నాయనా! మనయీదైవికసమావేశమునకు ఫలము నాపూర్వచరిత్రస్మరణము కాబోలును. అందువలన నీకేమియు లాభముండదు. కాని నావైరాగ్యలత కదియొక దోహదమగుగాక! ఇన్నివిధముల బ్రార్థించువానిని ద్రోసిపుచ్చుట యహంభావ మనిపించికొనును. కావున మూఁడుమాటలలో ముదిముక్కలతో కథ ముగింతును. వినుము:

నేనొక యాంధ్రబ్రాహ్మణపండితపుత్త్రుడను. మాతండ్రి ధనికుఁడు. ఏకపుత్త్రుడ నగుటచే నల్లారుముద్దుగా బెంచిరి. నాబాల్యమునందే తండ్రిగారు గతించిరి. అంతటితో నే నింటియజమానుఁడనైతిని. మాతండ్రిగారు నాకొక కులీనయగు కన్యకను వివాహమొనర్చిరి. నాకుఁ బదునెనిమిదేండ్లు వచ్చుసరి కామె కాపురమునకు వచ్చెను.

నాయనా! మఱచిన మాటలను మనసునకు దెచ్చికొని చెప్పెడి నామాటలు నీకింపుగానుండవు. అంతరంగము నన్ను సంధించి కొనెదవేని యర్థోపలబ్ధితో నంతగా బని యుండదు.

పెత్తనము చేతికివచ్చినదిమొదలు నేను పూలరంగడనై యిల్లును, దేహమును గుల్ల చేసికొంటిని. గృహలక్ష్మివచ్చుసరికి ధనలక్ష్మి లేచిపోయినది. అప్పటికి నాకుగలయాస్తి నాభార్యకు బెండ్లినాడుంచిన నగలుమాత్రమే. నాచరిత్రము విని నాగడుసరిమామగారా నగలను తనయొద్దనుంచి బొందున పుస్తెతో నాభార్యను గాపురమున కంపినాడు. ఎటులయినను దండ్రిగారియొద్దనుండి సొమ్ములు తెమ్మని నాభార్యను నిర్బంధించితిని. నాభార్య నానిర్బంధమును దండ్రికి వినుపించినచో దన్ను నాయొద్దకు బంపడనికాబోలు చెప్పదాయెను. తండ్రి నిరాకరించినమాటలకు మృదువులగు పర్యాయపదములను గల్పించి నాకు జెప్పుచుండెడిది. మా యిరువురినడుమను ఆమె కాపురము దుర్భరముగా నుండెను. ఇది గాదుపనియని నామామగారికి కఠినశిక్ష విధించితిని.

నేను:—ఏమిశిక్ష?

యోగి:—నాభార్యను విడిచి దేశాంతరము లేచిపోవుట. ఇంతకంటె నల్లుండ్రు మామలకు విధించెడి శిక్షయేమి? ఒకసంవత్సరము కంటఁబడలేదు. నాభార్య బెంగగొని మంచముపట్టెను. ఆమె యవస్థ జూడలేక మాపిసినారిమామగారు వ్యయప్రయాసలకోర్చి నాకొఱకు దేశమంతయు వెదకించెను. వారికి దొరకకుండ వారి యవస్థలుచూచి నాసమర్థతకు నేనేమెచ్చికొంటిని. ఇఁక నేను మనుష్యయత్నము వలన దొరకననియెంచి "మాయల్లుడు

వచ్చి మాయమ్మాయికాపురము కుదుట బడినవో వేంకటేశ్వరునకు మాయమ్మాయిచేత నిలువుదో పిచ్చెద"నని మ్రొక్కి మీదుకట్టిరట. శనివారపుదీపారాధనలు, ఏకభుక్తములు, మొదలుపెట్టిరి. మామగారి కాపాదమస్తకమును పంగనామములమయమై పోయెను. నాభార్య మేనత్తయగు ముసలమ్మకు ప్రతిదినము రాత్రిళ్లు గంగిరెద్దువాండ్రు వచ్చినట్లును, ఎద్దుపై బడి క్రుమ్మినట్లును కలలు రాదొడగెను. నా భార్యకు స్వప్నములో ముత్తైదువులువచ్చి "నేను అలమేలుమంగమ్మ" నని పసుపుకుంకుమ లీయసాగిరి. ఇంతలో నాకును అత్తవారింటివైపు కాలుసాగెను.

నేను:—అహాహా! స్వామిసాక్షాత్కారము. "కలౌ వేంకటనాయకః" అన్నమాట నిజము.

యోగి:—నీలాగుననే ప్రజలలో వేంకటేశ్వరునిపై విశ్వాసము మెండయ్యెను. ఏ యింటజూచినను పూజలు మ్రొక్కుబడులు మితిమీరెను. అడ్డబొట్టులవారుగూడ అవసరమునుబట్టి నిలువుబొట్టులవారయిరి.

నేను:—మీకెప్పుడును స్వామి కనుపడినట్లు చెప్పరేమి?

యోగి:—అయ్యో! కనుపడకేమి? ప్రతి దినమును పట్టెవర్ధనాలతో నామామగారువచ్చి నా భార్యనగలన్నియు నొలిచి నాకిచ్చినట్లు కలలు వచ్చుచునేయుండెను. ఆమాట మూటగట్టుకొని నామామగారికి చెప్పటయు, వారు దానికి సంతానలాభమో, సంపల్లాభమో ఫలముచెప్పటయు నేను మామత్తవారియింటికి పోయినది మొదలనేకసారులు జరిగెను. నేను వారి యిల్లు చేరినదిమొదలు దేవుని వీరావేశము హెచ్చు.గాసాగెను. నాయిల్లాలికి ఆరోగ్యము శీఘ్రములోనే కలిగెను. గణాచారి గమళ్లవెంకమ్మ గజ్జెలుకట్టుకొని వచ్చి మాటిమాటికి "నీయల్లుని తీసుకు వచ్చిన నన్నుమఱచిపోయినావా? నాకొండకువచ్చి నిలువుదోపెప్పుడిచ్చెదవు?" అని ప్రాణములు కొఱుకసాగెను. విసిగి మామగారు వైకుంఠైకాదశికి తిరుపతి ప్రయాణము నిశ్చయించిరి. ఇది యంతయు నేనచ్చటికేగిన రెండునెలలకే.

నేను:—మీమామగారికిని మీకునుగల కలహకారణ మేలాగు కుదిరినది?

యోగి:—అడుగవలసిన ప్రశ్న మడిగితివి. నేను బుద్ధిగలిగియుంటిననెడి విశ్వాసము వారందఱికిని గలిగెను. అందుచే నెలరోజులగుసరికి నాభార్య నగలతో నాయొద్ద నిద్రించుట కాజ్ఞనిచ్చిరి. అతివిస్తరమేల? వైకుంఠైకాదశి సేవనగా దిరుపతి జేరితిమి. సకుటుంబపరివారముగా బోయి యొకసత్రమున మంచిగదులలోవిడిసితిమి. భోజనాదికము లయిన పిదప నించుక విశ్రమించి కొండపై చిత్రములు చూచుటకు సికారికి బయలుదేరితిమి. ఆనాడు గొప్పసాహుకార్లు గుడిలో మ్రొక్కుబడి పెండ్లి చేసికొనుచుండిరి.ముఖమంటపమున కాళ్వేటినగరపుకల్యాణియనువేశ్యవేషము

మేజువాణి జరుగుచుండెను. పెండ్లివారు సభ చేసిరి. ప్రేక్షకులు త్రొక్కులాడుచుండిరి. అదేమో చూతమని మావారిని దప్పించి కొని యామూకలో దూరితిని. ఆకళ్యాణి రూప గానాభినయసమ్మోహములో బడి యుండనిచో జనులు త్రొక్కిడి బాధకు ప్రాణములు విడిచి యుందును. ఎంతకాల ముంటినో నేనెఱుగను. మేజువాణిముగిసి, కళ్యాణి విడిదిలో ప్రవేశించి నాకంటికి దూరమయి, నేను సత్రములో జేరు వఱకు రాత్రి పదిగంటలయినది. మా వాండ్రు నాకై బెంగపెట్టుకొని కూర్చుండిరి. ఏవో టింకములతికి, మెతుకులు గతికి ప్రక్కపై జేరితిని. ప్రయాణశ్రాంతులై యందఱును తెప్పవాల్చుట తడవుగా నిద్రించిరి. మామామగారు చిరుగుర్రున కారంభించిరి. నేను లేపి యిట్లంటిని. "మామగారు! ఇది రహదారిసత్రము. మన మెంతగదులలో నున్నను జాగ్రత్త మంచిది. కనుక నగలు తీసి పెట్టెలో బెట్టి మఱనిద్రింపుడు." నామామగారు తన మొలలోని తాళపుగుత్తి విసరి "జాగ్రత్తచేసి నీదగ్గిరనే యుంచుము" అనిరి. నాభార్యను లేపి ముక్కుపుడకసహితము తీయించి బట్టలడుగున పెట్టెలో బెట్టి సరుదు సరి కరగంటయయ్యెను. అంతలో మా మామగారు నిద్రావశులయి గుఱ్ఱుపెట్టిరి. ఆయనకు నిద్రాభంగముసేయనొల్లక తాళపుగుత్తి నామొలలోనే యుంచితిని. ఆయనకు నాయం దమితవిశ్వాసము గలుగుటచేతనే నేనాయనతాళముపట్టుట తటస్థించినది. నేనును నడుమువాల్చితిని. కాని కంటిమీద కునుకురాలేదు. దేహమచ్చటనేయుంచి కామరూపముతో సంచరించుచుంటిని. కొట్టివేసినట్లు లందఱును గాఢనిద్రలో నుండిరి. నాయనా! ఆపైని వారివృత్తాంత మేమయినదో నాకింతవఱకును దెలియదు.

నేను:—ఎందువలన? తామచ్చటనే పండుకొంటిరికదా?

యోగి:—లేదు.

నేను:—ఎచ్చటికేగితిరి?

యోగి:—కార్వేటినగరమునకు.

నేను:—ఏల?

యోగి:—నిలువుదోపిచ్చుటకు.

నేను:—ఎవరికి?

యోగి:—కార్వేటినగరపు కళ్యాణికి.

నేను:—[నిశ్చేష్టుఁడనై మాటాడ లేకుంటిని.]

యోగి:—ఏత్నా! అట్లు వెలవెలపోయెద వేమి?

నేను: మిమ్ముగూర్చిన యీవిషయమును నమ్మజాలకున్నాను.

యోగి:—అట్లయిన నాయీప్రయాసమంతయు వ్యర్థము. ఇక నీవు పోవచ్చును.

నేను:—మహాత్మా! క్షమించి పైవృత్తాంత మానతిండు.

యోగి:—ఓయీ! నామాటలం దసత్యభ్రాంతి వదలి వినుము. తెల్లవారుజామున

నగలపెట్టెనెత్తినిబెట్టుకొని భోగమువాండ్ర బండ్లవెనుకబడి కార్వేటినగరపు దారిని బట్టితిని.

నేను:—ఆ బరువును మీ రెట్లు మోవగలిగితిరి ?

యోగి:—నేనా మోచినది ? నామోహావేశము. పెట్టెనుగాదు. ఒప్పుకొనెనేని కళ్యాణినిగూడ మోచియుందును.

నేను:—అంతదూరము నడచినను మీకు గాళ్లులాగలేదు.

యోగి:—అప్పుడు లాగలేదు. తలచికొనినచో నిప్పుడు లాగుచుండును. నాయనా! కథ సాగనిమ్ము. వారితో మాట మంతి కలిపి మచ్చికచేసికొంటిని. ఊరిసమీపమునకేగుసరికి బండిపై జేరగలిగితిని. కొంగుదాకి కొంతాస దీర్చికొన్నాడను. ఓయీ! తలవంచికొందువేమి ? సిగ్గుపడకుము. ఇప్పటినాస్థితినిబట్టి లజ్జాకరమేకాని యప్పటిదృష్టిలో నది ప్రయోజకత్వమే.

నేను:—స్వామీ ! తరువాత.

యోగి:—వేంకటేశ్వరునిమ్రొక్కుబడిని వెలకాంతకు దీర్చితిని. కాని దానికంటె వేంకటేశ్వరుడే సులభు డనిపించినాడు. ఆయన భక్తులకు వరములిచ్చును. కళ్యాణి నాకు వరప్రదాయిని కాలేదు. అభయహస్తముమాత్రము లభించెను. పెండ్లిలో నొకలతాధికారిపై కళ్యాణి కన్ను వేసినది. వలపన్నినది. ఆచేప యదివఱకొక గాలములో దగుల్కొనియుండుటచే దీనిలో బడలేదు. ఆకోమటిబిడ్డడు అదివఱకే యొక వెలకాంతవలపులో జిక్కియుండెను. అందు నాకొకపదవి లభించినది. ఏమనగా! కళ్యాణి యావైశ్యునికి రాయబారముజరుపుటకు నన్ను నమ్మిన బంటుగా నేలెను. అది గొప్పయదృష్టమని యుబ్బి తబ్బిబ్బయితిని.

కళ్యాణిజాబులు కోమటికి రహస్యముగా నేనందజేయుచున్న సంగతి వానియుంపుడుకత్తెకు దెలిసెను. ఆవీథిలో నేనడుగుపెట్టినపుడెల్ల వాతొత్తు నన్ను బత్తులడల దిట్టుచుండెను. ఇప్పుడు సీతలమెక్కిత్రొక్కుచున్న యీసిగ్గు నాకప్పుడు మొగమైనను జూపలేదు. అది నాయదృష్టమే సుమా ?

నేను:—సిగ్గుమాలినతన మదృష్టమా ?

యోగి:—పాపపుణ్యములలో దేనియందైననుసరే తుదముట్టసాగినప్పుడే కాని ముక్తి చేకూరదు. ప్రారంభమందే విరక్తియో, తృప్తియో గలిగినది తుదముట్టదు. అప్పుడు నాకు సిగ్గు గలిగినచో నేనీస్థితికి వచ్చియుండను. తరువాత వినుము. "దూషణభూషణతిరస్కారములు దేహమునకేకాని యాత్మకులేవ" ను మహావాక్యము ననుసంధించుకొంటిని. కళ్యాణి కార్యసిద్ధియే నాకు ముక్తియని కోమటి విటుని తొత్తుగుమ్మము చుట్టు కుక్కవలె దిరిగితిని.

నేను:—శివశివ ! (అని చెవులుమూసికొన్నాడను.)

యోగి:— 'కుక్కపోలిక' నీవోపమానమని యేనా? దానివలె దండప్రహారములకు గుఱికాకుండనిచో దానికంటె కొంత మే లనిపించుకొనియుందును. ఓయీ! ఎంత సేపు నవ్వాచికొందువో చూచెదను లెమ్ము.

నేను:— తరువాత వినిపింపుడు.

యోగి:— అడుగవలసిన ప్రశ్నలడుగజాలని నీవంటివిగ్గిరి సత్యమును గ్రహింపజాలడు. వ్రతము చెడినను ఫలముదక్కినదాయని యడుగుము. నేను తినిన దెబ్బలన్నియును కళ్యాణి చేతితో నిమిరినంత నే మానిపోవు నని యాసపడితిని. బిక్కమొగముతో నేను గళ్యాణిదగ్గఱకు బోయితిని. "ఏమి వార్త" లని కళ్యాణి గంపెడాసతో నన్న డిగెను. "వార్తలేమియును లేవుగాని వా తలివిగో" యని దెబ్బలు చూపించితిని. వత్సా! అప్పుడామె యేమిచేసినదో చెప్పుము. నీ తెలివి చూతము.

నేను:— సరే, కళ్యాణికటాక్షము వచ్చియుండును.

యోగి:— కటాక్షము. కంటితోఁగాదు. కాలితో. వట్టిదికాదు; "అప్రయోజకపు ముండకొడుకా" అను బిరుదుతో. బాబా! తలయెత్తుము. నీ వౌచిత్యము నెఱుగవు. ఎఱిగినచో "మేలు! బలీ! సెబాసు!" అని సాధువాదముచేసి యుండవా?

నేను:— మీరూరకుంటిరా?

యోగి:— చిన్నప్పటిచదువు జ్ఞాపకమువచ్చినది.

నేను:— ఆ చదువేది?

యోగి:— కలముకాగితము నిటు దెమ్ము-వ్రాసి యిచ్చెదను. నేను జేబులోనికలముకాగితము నిచ్చితిని. ఆయనవ్రాసి మడతపెట్టి "ఓయీ! నీవావలకుబోయినప్పు డొంటరిగా జదువుకొనుము. నీవు మొదట నీగురువెవ్వ"రని యడిగితివికాదా? ఇప్పుడు నీవే నిర్ణయింపుము.

నేను:— (సాష్టాంగపడి) మహాత్మా! నాకు ముక్తిమార్గముజూపుడు.

యోగి:— నేను తిరిగి తిరుపతిదారిబట్టితిని. నీవును వచ్చినదారినేపట్టుము.

నేను కన్నులుమూసికొని నిమిషముండి లేచి చూచితిని. శ్రీవేంకటేశ్వరస్వామి గర్భాలయములో దేవుని ముందుపడియుంటిని. కొంతసేపు విభ్రాంతుడనై యుండి లేచితిని. స్వామి కెఱఁగి బయటికిబోయి కాగితమువిప్పి చూచుకొంటిని. అం దీ శ్లోకము వ్రాయబడి యున్నది.

"శ్లో. యాం చింతయామి సతతం మయి సా విరక్తా, సాప్యన్యమిచ్ఛతిజనం సజనోన్యసక్తః;
అస్మత్కృతేచ పరితుష్యతి కాచిదన్యా,
ధిక్తాంచ, తంచ, మదనంచ, ఇమాంచ, మాంచ."

ఆహా! మహాత్ములచరిత్రము లద్భుత జనకములుకదా!

సూర్యాస్తమయము

విద్వాన్ కజ్జి కామేశం గారు

ఘనచండత్వముఁ బాసివేవిరివిన్నై గాఢాగ్నిసంతప్తమౌ
పెనముం బోలెను నెఱ్ఱవారి దినకృద్బింబం బదస్తాద్రి నం
దినసీడెంతయు దీర్ఘమయ్యెఁ దనపైఁ దేజస్వి దూరంబుగాఁ
గను వృద్ధిం గను టబ్బురం బెయని లోకంబుం బ్రబోధింపఁగాన్:

ఉ. దిక్కులకెల్ల దివ్యతరదీప్తుల నిచ్చిన లోకబాంధవుం
డక్కట యస్తమించు నిఁక నారయరాదు పదంబు సేరుఁ డిం
కెక్కడికేఁగువారమని యిండ్లకుఁ జేరె ద్విజాళి, తేజముం
దక్కియినుండు దద్దయు నడంగుట గాంచుచు మెల్లమెల్లఁగాన్.

["ఆరయరాదు" అర్థాంతరమున "నేక్షేతాదిత్యముద్యంత మస్తంయంతం కదాచన" అనువిధిని గమనింపవలెను.]

["మెల్లమెల్లగాన్." అర్థద్వయమునందును "ప్రాయోభృత్యాస్త్యజంతి ప్రచలిత విభవం స్వామినం సేవమానాః" అనుసూక్తిని గమనింపవలెను.]

క. ఎంతయుఁ దేజముగల్గిన, నెంతయు మిన్నందియున్న నెంత తిరిగినన్
అంతంబు తప్పదని వేదాంతము బోధించె సూర్యుఁ డస్తంగతుఁడై.

క. ఎంత కరబలముకలిగిన, నెంత ప్రతాపంబునున్న నెంత వెలిఁగినన్
అంతయుఁ గాలవశంబని, యెంతయు బోధించె నినుఁడు హీనప్రభుఁడై.

మత్త. సుంతయుం దనుజూడరాకయె చొక్కిపుట్టినదాదిగా
సంతతప్రభతోడ వెల్గినచండభానుఁడు గ్రుంకినన్
అంతనెంతయు నెఱ్ఱకాంతులు హత్తె నాడెన సంతయున్
జింత చచ్చినఁ బుల్లచావదు సిద్ధమంచును దెల్పుచున్.

చ. పటుతరతేజమున్ విడిచి భాస్కరుఁ డస్తము నందినంతఁ జీఁ
కటిమయమయ్యె నక్కట జగంబు సమస్తము దుర్నివారమై

యట ఘనమిత్రుఁడస్తమును నందఁగ జాడ్యము నంధకారము
ద్భటమయి గ్రమ్ముచుంట యది భావ్యమెయౌఁగద యెంచి చూడఁగన్.

["జాడ్యము" అర్థాంతరమున "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్," అనుసూక్తిని గమనింపవలెను.]

చ. జనులకు నెల్లపట్టులను సౌఖ్యమొకూర్చుచు దుర్నిరీక్షుఁడై
యినుఁ డుదయించి యున్నతిని యెందును దాపములేకయుండి యా
యినుఁ డటులేగినంతటన యెక్కడనుండియొ యొక్కటొక్క టే
కనఁబడెడిన్ గ్రమక్రమముగాను గ్రహంబులు భాసురాకృతిన్.

["సౌఖ్యమె" అర్థాంతరమున "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అను సూక్తిని గమనింపవలెను.]

చ. కలకల నెల్లరుల్లసిల గబ్బిన హ్లాదముఁ గొల్పుచుండి తా
నలఘునమైన తేజము నొకప్పుడు చూపనిరాజనందె పో
చులకగ మచ్చగానఁబడుఁ జూడుఁడటంచును బోధసేయుచున్
లలితకలంకితోఁచె గగనంబున సర్వకళాప్రపూర్ణుఁడై.

["సర్వకళాప్రపూర్ణుఁడై" అర్థాంతరమున "బోధించు" అనుక్రియపట్టున ఈ విశేషణము సాభిప్రాయమైయున్నదని గ్రహింపవలెను.]

తే. గీ. మచ్చపడకయె మనవలె మచ్చపడిన, పిదప నట్టిట్టు వంకలు పెట్టికొనుచు
నెంతకాలము తిరుగుదు రిలను మనుజు, లంచు బోధించెను గలంకి స్వానుభవము.

ఉ. ఘోరతరప్రతాపమును గొల్పి నినుం డతఁ డస్తమించి త
చ్చారుకళాప్రపూర్ణుఁడగు చల్లనిరా జుదయింప నంతయున్
భోరుసెలంగఁ బొంగుచు సముద్రుఁడు దద్దయు మిన్నుముట్టఁ దా
నారయ లోకధర్మమది యచ్చెరువందఁగనేల దానికిన్.

ఉ. చండితనంబు మీఱఁగను చయ్యన నెవ్వరియడ్డులేక వే
ఱొండును బాటులేక మఱి యోటమి యించుకయైన నెప్డు లే
కుండఁగఁ గర్ణరంధ్రములు హోరునఁ జిల్లులువోవుచుండఁ జీ
రండల దృశ్యరూపమొనరన్ విహరించెడి రాత్రియంతయున్.

["హోరున" అర్థాంతరమున "తమ దుశ్చరిత్రవలన గలిగిన ఘోషవలన" అని గ్రహింపవలెను.]



చెన్నపురి నేపియరుపార్కులో జరిగిన సభయందు మహాత్మునకు స్వాగతపత్ర సమర్పణము



చెన్నపురి తిరువల్లిక్కేణిలో నాలుగవదగు స్త్రీల పాటిప్రదర్శనము—మహాత్మునకు స్వాగతము.

ప్రెస్‌ఫోటో బీరో, చెన్నపురి.

ఉ. అరుదుగ పీర్లపండుగకు నంతట జేగురుపూసి తోడుతన్
విరివిగ నల్లపట్టులను బెల్లుగఁ జల్లిన వెల్లచుక్కలన్
దురకలగోడమించుగతి దోరపుమిన్ను చెలంగె లెక్కకుం
దొరకని తారకావళులతోడ వెలుంగుచు వింతగొల్పుచున్.

ఉ. శ్రీలనుమించి చెందములు చిందములాడఁగఁ జేరి యొక్కచో
వేలుపులాడుచున్ దిగువపెట్టిన దింపుడు పేకముక్కనా
లాలితమయ్యె మిన్ను కవిరాజ సుకీర్తితచందదాకృతిన్
వేలకొలందిచుక్క లవిపెల్లుగ వెల్గుచుఁ దేజరిల్లినన్.

క. చంద్రుఁడుమధ్యను దారక, లందందును జంద్రికయును నంతట నలరన్
బృందారకులాడెడి పే,కందన రెడి యానుకరణి గగనము వెలిఁగెన్.

చ. అరుదుగ నాటకంబున మహావిభుపాత్ర ధరించినట్టి యా
సరసనటుండుదాల్చిన ప్రశస్తపుదుస్తుల మించు ముచ్చె బం
గరు నగిషీలనొప్పు ఘనకంచుకమో యన నేత్రపర్వమై
కరము వెలింగె మిన్నదియు గణ్యులసత్తరచారుతారలన్.

మ. జలమై చంద్రికయొప్పఁ బూర్ణవిలసచ్చంద్రుండు లోమట్టునై
యలరం గానలయంచులందుఁ గనవా నానీటిబొట్లట్లు చు
క్కలు నెంతేనియుఁ జెన్నుమీఱఁగను నాకాశంబుచూడన్ మహా
కలశంబై గనుపట్టె నుజ్జ్వలతరాకారంబు శోభిల్లఁగాన్.

మ. తగదర్బారులయప్డు భాసురహర్మ్యోత్తంసంబు మీఁదం ధగ
ద్ధగితంబై కమనీయమై ప్రవిలసద్రత్నావళీ చిత్రితం
బగు కల్యాణమనంగ సంబరము నేత్రానందముం గొల్పుచున్
బాగడన్ మించెను వేలులకేలగుచున్ జుక్కల్ విజృంభించినన్.

క. మినుకుమినుక్కని చుక్కలు, ఘనముగ నుదయింప మిన్ను కరము వెలింగెన్
తనకావలిదెస దీపము, తనరగఁ జూపట్టు వెదుఱుతడకయనంగన్.

మ. అలరన్ గోడలు పేకముక్కలయి భళా! యాకంచుకంబై లసత్
కలశంబై యలజీన్సునై తడకయై తానిట్లు లేపట్టునన్
పలురూపంబుల నల్లమానిసికిఁ గన్పట్టున్ నభం బెన్నఁగా
నలభూతంబుల చిత్రమే యిదిగదా యాశ్చర్యమింకేటికిన్.

[“ఆశ్చర్య మింకేటికిన్” “ఇంకను ఈరీతిని ఎంతైనను వర్ణింపవచ్చును. కాని యది యాశ్చర్యము కా”దని భావము.]

N. B. శుక్లపక్షరాత్రులును కృష్ణపక్షరాత్రులును యథాయోగముగ వర్ణింపఁబడినవి. సహృదయులు పక్షద్వయైక్యవిరోధమును శంకింపరాదు.

ఇల్లఱికము

పాలపర్తి ఆంజనేయులు గారు

౧

జగపతిరాజు గొప్పశ్రీమంతుఁడు. విశాఖపట్టణ మంతటిలో వీరికిఁ గల పలుకుబడి మఱియొకరికి లేదు. జమీందారిపాయఁగ నివసించును. ఈయనకు జమీందా రను బిరుదొకటి లేదు గాని సాలుకు పాతిక ముప్పదివేలు వచ్చు గొప్పయెస్టేటుమాత్రమున్నది. విశాఖపట్టణము బీచిరోడ్డుమీఁద నొక విశాలమైన యారామముమధ్య వీరిమేడ గలదు. ఆతోఁట నానావిధఫలపుష్పశోభితములయిన తరులతాగుల్మాదులతోడను, నిర్మలసలిలపూరితమయిన తటాకముచేతను విరాజిల్లుచు వినోదవిహారము సల్పువిలాసవంతులను, చిత్తశాంతి నభిలషించు విరాగులను, నాహ్వానించుచుండెను. ఆమేడ ముందుభాగములో నొక విశాలమయిన చావడిలో యెస్టేటు తాణేదారులు, గుమస్తాలు, పారాజవానులు గలరు. అంతర్మహలునందు జగపతిరాజుగారు కాపుర ముండియుండిరి. వీరెంత విద్యావంతులయినను, నవనాగరికులయినను పూర్వాచారముల నిసుమంతయైనను వదలలేదు. గృహమర్యాదలను, కులకట్టుబాటులను బహుజాగ్రత్తతో కనిపెట్టుచుందురు. వీరి కిద్దరు కొమార్తెలు మాత్రము గలరు. వారిమీఁద జగపతిరాజున కత్యంతప్రేమ. వారు క్రిందనడచిన పాదములు కందిపోవునని యెంచును. పుత్రులు లేనికారణమున వారిని మిక్కిలి గారాబముతో నరచేతులలోఁ బెంచుచుండెను. జగపతిరాజునకు తనపుత్రికల నత్తవారింటికిఁ బంపుట కిష్టము లేదు. కావున పెద్దకొమార్తెను, సామాన్య కుటుంబమునకుఁ జెందిన యొక చక్కని చిన్నవాని కిచ్చి వివాహముచేసి యల్లునిఁ గూఁతును నింటఁ బెట్టుకొనెను. రెండవకొమార్తెసహితము మీఁదేరినపిల్ల యగుటచే వివాహముఁ జేయఁ దొందరపడుచుండెను.

౨

శ్రీమహారాజులుంగారు విజయనగరములోఁ గళాశాలను స్థాపించినప్పటినుండియు క్షత్రియబాలురుసహితము ఉన్నతవిద్యాభ్యాసమున కలవడిరి. భోజనాదివసతుల నేర్పఱచి బాలు రుత్తమవిద్య నార్జించుటకు శ్రీరాజుగారు ప్రోత్సాహ మొసంగుచుండిరి.

విజయనగరమున కనతిదూరమున చిట్టివలస యను గ్రామమున్నది. రామరాజు చాల బీదవాఁడయినను గ్రామములో మర్యాదగలవాఁడను వాసిఁగాంచియున్నాఁడు. వంగసమును బట్టిచూడ రామరా జొకప్పుడు

బ్రతికి చెడినవాఁడని తెలియుచున్నది. ఆయనకు పదియెకరముల మెట్టభూమిమాత్రము గలదు. ఒక్కఁడే కుమారుఁడు. నరసింహరాజు మంచి అందమయిన చిన్నవాఁడు. బుద్ధిమంతుఁడు. తెలివితేటలు గలవాఁడు. చిన్ననాఁటనుండి విద్యయందాసక్తిగలవాఁడగుటచే నెటులనో తండ్రిని ఒప్పించి తోడి బ్రాహ్మణబాలురతోపాటు విజయనగరము వెళ్లి కాలేజిలో విద్యనభ్యసించుచుండెను. విద్యార్థులందఱిలో రూపమందే కాక గుణసంపదయందును నరసింహరాజు మిన్నయై యుండెను. మెట్రిక్యులేషన్ పరీక్షలో పిల్లలందఱిలోను మొదటివాఁడుగఁ గృతార్థుఁడగుటచే నుత్తమవిద్యాగరచుటకుఁ దగిన వసతి లేకపోయినను, ఉపాధ్యాయులయొక్కయు, తోడిస్నేహితుల యొక్కయు, ప్రోత్సాహముచేత కాలేజితరగతిలోఁ బ్రవేశించెను. ఇంతవఱకుఁ జెప్పించిన చదువుకే తండ్రి అప్పుచేయవలసివచ్చెను. కాని, పిల్లవాఁడక్కఱకువచ్చి గొప్పయుద్యోగము చేయునను గంపెఁడాశతో అప్పులోనప్పని ఋణముచేసి ప్రతినెల కావలసిన పైకము పంపుచుండెను. ఇట్లుండ ఎఫ్. ఎ. పరీక్ష కాకపూర్వమె తండ్రి స్వర్గస్థుఁ డాయెను. తండ్రి చనిపోయిన దుఃఖమొకవంకను, ముందుగతిదోఁపక యొకవంకను గ్రుంగుచున్నను సహజ ప్రతిభాశాలియగుటచేఁ బరీక్షలో జయమొందెను. కాని పరీక్షలో జయమొందితినని యానందించుట కతఁడు నోఁచుకొనలేదు. ముందుచేయునది తోఁపక యతఁడు కుందుచుండెను. బి. ఎ. చదువవలెననెడియాశయొకవంకను, లేమియొక వైపునను నతనిని బాధింపఁజొచ్చెను. కాని యతనితల్లి యతనికి ధైర్యముఁ జెప్పి యెచటనో సొమ్ముఁ దెచ్చియిచ్చి అతనిని విజయనగరము పంపివేసెను.

౩

'వ్రణబాధకన్న ఋణబాధ ఎక్కు'వనుట లోకవిదితముగదా! సీతమ్మ కుమారుని విద్యకై పలుపాట్లు పడవలసివచ్చెను. పొలముల పరులపాలుచేసి మృగతృష్ణంబోలు విజాతీయవిద్యకై నగరసీమల కెగఁబ్రాకు జానపదుల దుస్థితి నేఁడు మనము కన్నులారఁ గాంచుచున్నాము. ఋణదాతలు సీతమ్మను బాధింపఁజొచ్చిరి. ఈబాధ కోర్వఁజాలక కుమారునితోఁ దనయవస్థను జెప్పక, పొలమమ్మిన యెక్కువసొమ్ము వచ్చుననిమాత్రము చెప్పి పొలమమ్ముటకు నిశ్చయించెను. అప్పులు తీర్చినది. శేషించిన ధనముతోఁ బిల్లవానిచదువు ప్రథమవత్సరమైనను గడచునట్లులేదు. ఆమె మాత్రము ఇరుగుపొరుగువారికిఁ బాలుపెరుగమ్మి గుట్టుగ జీవయాత్ర గడుపుచుండెను.

౪

జగపతిరాజుకొమార్తెకు వివాహముచేయవలెనని తొందరపడుచుండెను. ప్రేమావతికి షోడశవర్షములు నిండి సంప్రాప్తయౌవనయైనది. మేలిమిబంగారును మించిన దేహకాంతిచేతను, పొడుగు పొట్టి కాని దేహపరిమాణముచేతను ఆమెతనూవిలాసము ఒప్పియుండెను. నిండుచందురునివంటి మోము, విశాలనయనములు, వంకరలు దిరిగిన ముంగురులు,

తుమ్మెదరెక్కల ధిక్కరించు నిడుదలయిన నల్లని కురులు, ఆమెలావణ్యము, చూచు వారల మోహింపఁజేయుచుండెను. యౌవనవతులు యువకులఁ బెండ్లాడఁగోరుట ప్రకృతి ధర్మము. తల్లిదండ్రులు, ధనము, ప్రసాదింపగల సమస్తసౌఖ్యము లామెకుఁ గరతలామలకములైనను ఆమె యేలకో చింతాక్రాంతచిత్తయై అతిభారముతో రోజులు పుచ్చుచుండెను. అట్లగుట, తల్లిదండ్రు లామెకుఁ దగిన వరునిఁ దెచ్చి పరిణయముచేయ యత్నించుచుండిరి.

సాటివారలలో యుక్తవయస్కులైన బాలు రుండినను జగపతిరాజు నభీష్టముఁ జెల్లించువారెవరును లేకుండిరి. శ్రీమంతులు తమ తనయుల నత్తవారింట నిల్లరికముంచ నిష్టపడరు. తన ముద్దుతనయ నత్తవారింటికిఁ బంపుట గర్హ్యముగా జగపతిరాజుకుఁ దోఁచుచుండెను. సంబంధ మెక్కడను కుదుర లేదు. కర్తవ్యము దోఁపక ఆందోళిత హృదయుఁడై విచారించుచుండెను. ఇట్లుండ నొకనాఁడు విజయనగరము కాలేజి ప్రిన్సిపాలుగారియొద్దనుండి ఉత్తరము వచ్చెను. ఆయుత్తరమువిప్పి చూచుకొని సంతోషచిత్తుఁడై భార్యతోఁ జెప్పి వెంటనే విజయనగరము బయలుదేరి వెళ్లెను. రైలు దిగి జగపతిరాజు సరాసరి ప్రిన్సిపాలుగారి ఆఫీసుగదిలోనికి వెళ్లెను. శ్రీరామావతారముగారు జగపతిరాజుకుఁ జిరపరిచితులు. కుశలప్రశ్నలైనపిమ్మట తమదృష్టిలోనున్న బాలురఁ గూర్చి రామావతారముగారు సవిస్తరముగా ముచ్చటించిరి. వారిలో జగపతిరాజుకోరికల ననుసరించి నరసింహారాజు అన్నివిధములఁ దగియుండునని వారు సలహానిచ్చిరి. జగపతిరాజు పిల్లవానినిజూడఁ గుతూహలము గలవాఁడయి వానిని బిలుపింపఁ గోరెను. నరసింహారాజు వచ్చి ప్రిన్సిపాలుగారికి నమస్కరించి నిలుచుండెను. జగపతిరాజు వానిని బ్రక్కనున్న బల్లపైఁ గూర్చుండఁగోరెను.

నరసింహారాజు కప్పటికి ఇరువదియొక్క సంవత్సరములు. మామూలు గోరంచుపంచ, షర్టు, ఉత్తరీయము మాత్రమప్పు డతను ధరించియుండెను. అవియుఁ గొంతవఱకు మాసియుండెను. ఆమలినాంబరములనుండి యతని శరీరకాంతి నివురుకప్పిన నిప్పువలె అచ్చటచ్చట తళతళలాడుచుండెను. విశాలమైన ఫాలము, కలువరేకులవంటి కన్నుదోయి, ఉంగరములు దిరిగిన ముంగురులు, యతని ధీప్రభావమును, అందమును బ్రస్ఫుటము చేయుచుండెను. నరసింహారాజు ముఖలక్షణముల నవలోకించి భ్రమచెంది జగపతిరాజు రెప్పవాల్పక అట్టె చూచుచుండెను. నరసింహారాజు సందర్భమును గ్రహించినవాఁడై సిగ్గుచేఁ దలవంచుకొని కూర్చుండెను.

రామా: అబ్బాయి! మీ దేవూరు?

నర: మాది చిట్టివలస.

రామ: మీనాయనగారి పేరేమి?

నర: రామరాజుగారు.

నరసింహారాజునుగూర్చి రామావతారముగారు అంతయు నెఱిఁగినవారగుటచే ఆప్రశంస కట్టిపెట్టి నరసింహారాజును సంబోధించి 'జగపతిరాజుగారు గొప్పశ్రీమంతులు, పేరుప్రతి

ష్ఠగలవారు. వారిపిల్లను నీకిచ్చి వివాహము చేయవలెనని కోరుచున్నారు. నీయభిప్రాయమేమి?

నరసింహరాజు సిగ్గుపడుచు "నాకేం తెలుస్తుంది. మాఅమ్మగారు పెద్దది ఉన్నది. ఆమెయిష్ట ప్రకారము జరుగవలసి ఉంటుంది. నాదేమి లేదు." అని జవాబు చెప్పెను. అంతట నరసింహరాజు వెళ్లిపోయెను

జగ: రామావతారంగారూ! మీరు మిత్రులైనందుకు నాకీసంబంధము కుదిర్చిపెట్టవలె. పిల్లవాడిని చూస్తే చక్కగా ఉన్నాడు. నాకు విడిచిపెట్ట బుద్ధి పుట్టలేదు. వాళ్లు బీదవాళ్లయినప్పటికి వంశము మంచిదే. వారి బీదతనంతో మనకేమి? పిల్లవాఁడు మనయింట్లోనే వుంటాడుగా. ఇది మించిపోనీకండి.

రామ: పిల్లవాడు మాకాలేజి పిల్లలందరిలో బుద్ధిమంతుడు. బీదవాడయినను నీచగుణములేమి లేవు. మీగృహము నలంకరించదగినవాడే. కాని చదివేది ఇంగ్లీషు. మన ఆచారాలు, పద్ధతులు నచ్చుతాయా, తీరా మీయింట్లో యిల్లరికము ఉంటాడో ఉండడో, అదే చిక్కుగా వున్నది.

జగ: 'ధనమూల మిదంజగత్.' మీకు తెలియనిదేముంది? పట్నముపంపి ఎం. ఎ. చెప్పిస్తాను. అతనికి ఎంతకావలెనంటె అంత. ఖర్చుపెట్టుకొంటానికి యిస్తాను. ఆవిషయమున నాకేం భయములేదు. మీరు చేయతగిన సహాయం మాత్రం చేయండి.

రామ: అందుకేమాత్రం అభ్యంతరముండదు.

అంతట జగపతిరాజు ప్రిన్సుపాలుగారి వద్ద సెలవుపుచ్చుకొని విశాఖపట్టణము చేరెను.

౫

జగపతిరాజు భార్యతో జరిగినవృత్తాంతమంతయుఁ జెప్పుచు, "పిల్లవాడు మనప్రేమకొఱకే పుట్టినట్లున్నాడు. అందమందుగాని, విద్యయందుగాని, గుణమందుగాని కొఱతావంతయు లేదు. కడు బీదకుటుంబము మాత్రమగును. నిజముగా ఆయింట పుట్టదగినవాడు కాడు" అని పలికెను.

భార్య: వాళ్లు బీదవాళ్లయితే మనకేం, భాగ్యవంతులైతే మనకేం? మనపిల్ల వెళ్లి వాళ్ల గుడిసెల్లో కాపురము చేయబోతుందా? మనము వెళ్లి విందులు గుడువబోవుచున్నామా? వస్తారు; నాలుగు మెతుకులు తిని మనయింట్లోనే పడివుంటారు. ఆలస్యమెందుకు? మన పురోహితుణ్ణి గుమస్తాను చీటివలన పంపించండి.

జగ: అవును; నీవన్నమాట నిజమే. అలాగే పంపుతాను.

౬

గుమస్తా పురోహితుఁడు యిద్దరు చీటివలన వెళ్లిరి. రామరాజుగారి యిల్లు పెద్దవీథినే ఉన్నది. వారి ఇంటిగుర్తు తెలుసుకొని వీరిద్దరు వెళ్లి వారియింటి అరుగుమీఁదనే కూర్చుండఁబోయిరి. వారెవరో యెందుకు వచ్చిరో నరసింహరాజు తల్లి సీతమ్మకుఁ దెలి

యడు. అయినను గృహస్థధర్మము ననుసరించి మర్యాదచేసెను.

సీతమ్మ: శాస్త్రుల్లుగారూ, మన దేగ్రామము? ఏంపనిమీద దయచేశారు.

పురో: మాది విశాఖపట్టణము. రామరాజు గారి యిల్లు యిదేనా?

సీతమ్మ: అవును. ఇదే. మమ్మన్ని మీరేం యెరిగివున్నారు?

పురో: ఎఱుగకేంలెండి. రామరాజుగారుచాల మంచివారు; నిదానస్థులు. బ్రాహ్మణభక్తి గలవారు. మంచివంశం. మీకు పిల్లలెంత మందమ్మా?

సీతమ్మ: నాకు ఒక్కడే పిల్లడు బాబు. విజయనగరంలో చదువుతున్నాడు.

పురో: వివాహమయిందా?

సీతమ్మ: చదువయితేగాని చేసుకోనన్నాడు బాబుగారు. అలాగే కానిమ్మని వూరుకున్నాను.

పురో: చదువుకుంటాంలే పెండ్లి చేసుకోకూడదా? ముద్దుముచ్చటలు చిన్నతనంలో చూడాలిగాని, గడ్డంమీసాలు వచ్చిన యేంబాగుంటుంది?

సీతమ్మ: పెద్దదాన్ని నాకు ముద్దుముచ్చట చూచుకోవాలెననివుంటే మాత్రం బీదవాళ్లకు పిల్లని యెవరిస్తారు?

గుమాస్తా: సంబంధముంటే చేస్తారా?

సీతమ్మ: చేస్తారా అంటె నేనేంచేస్తా బాబుగారు. డబ్బా? దుగ్గానా? కాస్తకూస్తతో అవుతుందా? లేదా అంటె మంగళసూత్రం చేయించి మూడుముళ్లు అప్పోసొప్పో చేసి వేయించగలను గాని ఇంకేం చేస్తాను. ఆరోజువచ్చి నేనంతవఱకు బ్రతికివుంటే మాట గద!

గుమాస్తా: మీరు బాగావుండగానే చేసి కళ్లతో చూచి సంతోషిస్తే మంచిది. మీకేం కష్టంగాని, డబ్బుఖర్చుగాని లేకుండా గొప్పయింటిపిల్లను తెచ్చి పెళ్లి చేసేభారం నాది. మీకదంతా ఎందుకు? మీకిష్టమేనా?

సీతమ్మ: ఇష్టంలేకేం బాబుగారు. ఎక్కడైనా సంబంధం ఉన్నదా?

పురో: సంబంధం లేకేం. కాని మీరొక్క సంగతికి తలవూగిస్తే చాలు. పిల్లి



సీతమ్మ: ఇష్టంలేకేం బాబుగారు. ఎక్కడైనా సంబంధం ఉన్నదా?

గొప్పయింటిపిల్ల. అతిసుకుమారంగా, గారాబంగా జమీందారిపాయగా పెరిగింది. పిల్లను యిచటికి పంపటానికి యిష్టపడరు. పిల్లవాడినే తమవద్ద వుంచుకొని పెద్దచదువులు చెప్పించి ఆ స్తికొంత ముట్టచెప్పాలని వున్నది. ఈపద్ధతి మీకిష్టమేనా?

సీతమ్మ: ఏంచెప్పను బాబు. నాకు ఒక్కపిల్లవాడు. వాడు కండ్లముందర లేకపోతే నాకేం తోస్తుంది. నేనేం కష్టాలుపడ్డావాడు సుఖంగా వుండాలనే. అయినా మేము సామాన్యులం. అంతగొప్పవారితో మాకు సంబంధమేమిటి? అది ఎట్లా పొసగుతుంది.

గుమాస్తా: అదంతా మీకేల? కుదిర్చే భారం మాది. కొడుకును కోడల్ని చూచుకొంటూ మీరుకూడా అచటనే వుండవచ్చు. నే జెప్పినసంగతి మాత్రము మీకిష్టమేనా?

సీతమ్మ: నాయిష్టానికేం లేండి. ఎక్కడైనా వాడు సుఖంగా వున్నాడంటె చాలు. అయితె ఎవరిపిల్ల బాబుగారూ!

పురో: విశాఖపట్టణంలో జగపతిరాజుగారి రెండవకోమార్తె. పదహారు సంవత్సరాలు. పిల్ల చక్కని చుక్క. మంచి వంగసం. ఈమాసంలో బహుళంలో ముహూర్తం. మేము అందుకొఱకే వచ్చినాము. అయన వారి గుమాస్తా. నేను వారి పురోహితుణ్ణి. మారాజుగారు విజయనగరంవెళ్లి పిల్లవాణ్ణిచూచి మాట్లాడినారు. ఇక మీరు 'సరె' నంటె అయిందన్నమాటే.

నరసింహారాజు తల్లి ఆశ్చర్యపడి సిగ్గుచేగడపదాఁటి లోనికివెళ్లి తలుపుచాటున నిలువఁబడెను.

పురో: అమ్మా, మీరుపెద్దలు. మేము బ్రాహ్మణులము. మీయింట్లకు రానివారమా? మీయుద్దేశమేమి ?

సీతమ్మ: చెప్పరేం బాబు; నేనింకా యెవరో దారినపొయ్యేవారని అనుకొన్నాను. ఇంతలెక్కజరిగిందాక నేనుమాత్రం వేరే యేంచెప్పతాను. పిల్లవాడికి కబురు పంపి మీకు తెలుపుతాను.

గుమాస్తా: ఇంక పిల్లవాడికి కబురెందుకు? మీఅబ్బాయి 'మాఅమ్మగారి యిష్ట'మని మారాజుగారితో చెప్పినాడు. మీపురోహితుణ్ణి పిలిపించండి తాంబూలాలు పుచ్చుకోవచ్చును.

అంతట నరసింహారాజు తల్లి పురోహితునకుఁ గబురుపంపి తాంబూలములు పుచ్చుకొనెను. ఆరోజు పురోహితుని గృహముననే విందు లారగించి వారిద్దరును మఱునాఁడు విశాఖపట్టణముచేరి శుభవార్త యజమానుల కెఱుకపరచి బహుమానములఁ బడసిరి.

౭

రూపసియు, విద్యావంతుఁడును, సుగుణఖనియు, నైన యల్లుఁడు దొఱకినాఁడను సంతసమున జగపతిరాజు వివాహప్రయత్నముల నతివిరివిగాఁ జేయుచుండెను. గృహప్రాంగణమున విశాలమైన పందిళ్లువేయించెను. పందిళ్లకుఁగట్టఁబడిన ధవళవసనముల తెల్లఁదనము

సుధాకరునిధావళ్యమునధిక్కరించుచుండెను. పత్రపుష్పపతాకములచే నావరణమంతయు నలంకరింపబడెను. చిత్రకారులు గృహమునంతయు నలంకరించి శోభాయమానముగఁ జేసిరి. జగపతిరాజు బంధువులు మిత్రపరివార సహితముగ విచ్చేసిరి. నరసింహరాజునకు బంధుకోటి అంతగ లేదు. అందుచేతఁ దోడి సహాధ్యాయులను సహితము కొంత మందిని దీసికొనివచ్చెను. వియ్యాలవారు ఎక్కువ మంది లేనందున విడిదికిఁ బ్రత్యేకముగ నేర్పాటులేమియు జరుగలేదు.

వధూవరులు మంగళస్నానము లాచరించి చిత్రవిచిత్రముగ గనులపండువుగ నలంకరింపఁబడిన వివాహవేదికపై నాసీనులైరి. మంగళతూర్యనినాదములు మిన్నుముట్ట, విప్రులాశీర్వాదములు చేయ జగపతిరాజు నరసింహరాజు పాదములఁగడిగి కన్యాదానముచేసి పాణిగ్రహణమహోత్సవము జరిపించెను.

౮

వివాహానంతరము అల్లుని కర్చుకై జగపతిరాజు ప్రతినెల యేబదిరూపాయలు పంపుచుండెను. అందుఁగొంత పైకము మిగిల్చి నరసింహరాజు తల్లికిఁబంపుచుండెను. నెలకొక్కపర్యాయమైనను నరసింహరాజు తల్లినిజూచి వచ్చెడివాఁడు. దసరా సంక్రాంతి సెలవులకు మాత్రము అత్తవారింటికి వెళ్లెను బి. ఎ. యూనివర్సిటీపరీక్ష యైనవెంటనే స్వగ్రామమునకువెళ్లి తల్లితోఁ గొన్నిదినములు గడసి తర్వాత అత్తవారి యింటికి వెళ్లెను. తల్లిని జూచుటకై నరసింహరాజు తనయల్లుఁడైన పిదపఁగూడ చిట్టివలసకు వెళ్లి యాపూరికొంపలో నుండుట జగపతిరాజు చాల అవమానముగా నెంచుచుండెను. ప్రథమములోనే అభ్యంతరపెట్టిన బాగుండదని ఓపికతో నుండెను.

మే నెలలో విద్యార్థులందఱు పరీక్షాఫలితములకై చకోరపక్షులవలె నెదురుచూచుచుండిరి. ప్రతిదినము విద్యార్థులు పోస్టాఫీసుకు వెళ్లి పేపర్లు చింపి యాతురతతో నంబర్లకై వెదకుచుండిరి. ఇట్లుండ నొకనాఁడు నరసింహరాజునకు బట్టనమునుండి తంతివార్త వచ్చెను. తంతి యెచటనుండి వచ్చినదా యని యింటిలోనివారందఱు భీతచిత్తులై తత్తరపడుచుండిరి. ఇంతలో నరసింహరాజు మేడ దిగివచ్చి టెలిగ్రాము చింపి చూచి తాను పరీక్షలో రాజధానిలో ప్రథముఁడుగాఁ గృతార్థుఁడైనట్లు తనప్రొఫెసరు తంతి నంపినట్లు తెలియఁజేయ నందఱును సంతోషమునఁ దేలియాడిరి. వెనుక నుండి వచ్చుచున్న ప్రేమావతి యావర్తమానమువిని ప్రఫుల్లవదనయై భర్తతోఁ గలిసి మేడమీఁదికి వెళ్లిపోయెను. పిమ్మట లడ్డూలను దెప్పించి అందరికిని ప్రేమావతి స్వయముగఁ బంచిపెట్టెను.

నరసింహరాజు విశాఖపట్టణమునకు వచ్చి నెలరోజులకుఁబైన నైనది. తానుబరీక్షలో జయమొందినసంగతి నరసింహరాజు వెంటనే తల్లికి ఉత్తరము వ్రాసెను. అతను స్వయముగ వెళ్లి తల్లి యానందమును ఇనుమడింపఁజేసి తానును యానంద మొంద నభిలషించుచుండెను. కాని ఈసంతోషసమయమునఁ దానొక్కఁడే పోవుటకన్న భార్యనుగూడఁ దీసికొనివెళ్లినఁ దల్లి

మేరలేని యానందవార్ధిమునుంగునని యోచించెను. వివాహమైనపిదప ప్రేమావతి అత్తవారిల్లుత్రొక్కి యెఱుఁగదు. నరసింహారాజు తల్లియు మఱల వియ్యాలవారి యింటికి వచ్చియుండలేదు. ఈకతమున భార్యను దప్పక తీసికొని వెళ్లవలెనను గట్టిఅభిలాష మనమునఁ బాదుకొనెను. ఇందలి కష్టనిష్ఠురముల నాతఁ డారయకపోలేదు. కాని నాలుగురోజులు చూచి వచ్చుటకు వెళ్లినంతమాత్రమున నెట్టి లోపము, గౌరవహాని కలుగఁజాలదని యాతఁ డెంచెను. ఎట్టకేలకు భోజనానంతరము మామగారితో నీప్రస్తావనఁ దెచ్చుటకు నిశ్చయించెను.

జగపతిరాజు భోజనముచేసి విశ్రాంతిగఁ దాంబూలము వేసికొనుచుండెను. నరసింహారాజు యిష్టాగోష్ఠి కొంతయైన పిమ్మట, కంపితహృదయముతో "మామగారూ! నేను పరీక్ష అయినపిమ్మట మాఅమ్మగారివద్దకు వెళ్లియుండలేదు. ఈసంతోషసమయమున నేనొక్కడనేకాక మీకొమార్తెను సహితము దీసికొనివెళ్లి నాలుగురోజులు మాఅమ్మగారితో గడపి రావలెనని యున్నది." అని సవినయముగఁ బలికెను. ఈమాటవినినతోడనే జగపతిరాజు కోపచూపుతో నొక్కపర్యాయము నరసింహారాజను గ్రిందినుండి మీఁదికిఁజూచి "ఏమి!మాపిల్లనుమీపూరుతీసికొనివెళ్లుతావు? ఇట్టి తలబిరుసుమాటల నిక నావద్ద మాటాడకుము. మాపిల్లను మీయింటికి పంపేయెడల నిన్ను యిక్కడ ఉంచుకొను టెందులకు?" అని కోపముతో గర్జించెను.



"ఏమి! మాపిల్లను మీవూరు తీసికొనివెళ్లుతావు?"

నర: "మీకు చాలకోపమువచ్చినది. నా వివాహమైన పిమ్మట మాఅమ్మగారొక్క పర్యాయమైనను కోడలిని చూచియుండ లేదు. అందువలననే పంపమని కోరియుంటి?" అని శాంతముగ పలికెను.

జగపతిరాజు వినఁనట్లు నిర్లక్ష్యభావముతో నూరకుండెను. నరసింహారాజు తనకుఁ గలిగిన పరిభవమునకుఁ గుందుచు నటనుండి లేచి వెళ్లిపోయెను.

౯

రాత్రి శయనగృహమున నరసింహారాజు మోమున వన్నెదక్కి విచారగ్రస్తుఁడై కుర్చీలోఁ గూర్చుండియుండెను. ప్రేమావతి పూర్వోక్తమగు నుదంతము నంతను వినియేయుండెను.

గదివాకిటనుండియే భర్తచింతాక్రాంతచిత్తుఁడై యుండుటఁజూచి మొగము చిట్లించుకొనెను. ప్రేమావతి సహితము తల్లిదండ్రులవలెనె తా నత్తవారింటికిఁబోవనవసరములేదనియెయెంచు చుండెను. సమస్తభోగము లిచట జరుగు చుండ వాని నన్నిటిని విడిచిపెట్టి మట్టికొంప లలో నేల మగ్గవలెనని యామెతలంపు. తాను వచ్చునప్పటికి వాడుమొగము పెట్టుకొని కూర్చుండియున్న నరసింహరాజును జూచి సహింపఁజాలకపోయెను. నరసింహరాజు మనో గతవ్యాకులత నణుమాత్రమైనను ఆమె గ్రహింపలేదు. అంతియెకాదు! ఆగ్రహము సహితము వచ్చెను. భార్యను సంతోషపెట్టుటయె భర్తకు ముఖ్యకర్తవ్యమని యామె అభిప్రాయము. అంతట బిరబిర భర్తయొద్దకువెళ్లి "నన్ను చిట్టివలసకు బంపనన్నారనియేనా కొంపమునిగి పోయినట్లు విచారించుచున్నారు" అని కోపముతోఁ బలికెను.

"అవును. కొంతవఱకదియె కారణము"

"అయితే, అచట మేడలా, మిద్దెలా, ఎలెక్ట్రిక్ దీపాలా, ఫాన్సు, పంపులా, కోచి బండ్లు, మోటార్లా? ఏమిభాగ్యము బోర్లబడ్డ దని వెళ్లడం ?"

"ఎందుకా? మాఅమ్మగారిని చూచుటకు? పెండ్లియై సంవత్సరము దాటిపోయినను ఆమె తిరిగి నిన్నెప్పుడు చూచియుండలేదు. పెద్దతనంలో కోడలు దగ్గరనుండుటకు నోచుకొనకపోయినను చూడవలెననియైన యుండదా?"



"నన్ను చిట్టివలసకుబంపనన్నారనియేనా కొంప మునిగిపోయినట్లు విచారించుచున్నారు."

"చూచుటకే యైనచో యిచటికే ఆమెరాకూడదా? మానాయనగారెన్ని పర్యాయములు కబురుపంపినను ఆమె రాలేదు. అదేమి గొప్పతనమో? అయినా పల్లెటూళ్లలో పడివుండువారలకు పట్టణములకు రాగిట్టదు "

"ఆహా ! మా అమ్మే యిచటికి రావలె! నీవు మాత్ర మచటికి వెళ్ల కూడదు."

"ఏమి! అంతఆశ్చర్యపడుచున్నారు. దీనిలో వింతయేమున్నది. ఆమెకు యేమి లేదు; మీరు; అంతేకదా! ఆటిసితిలో మీ అమ్మగారుగాని, మీరుగాని నా కిచట జరిగినట్లు జరిగించగలరా ? ఇక నన్నుగూడ ఆ పాడుఊళ్లు కీడ్చుకొని పోవుటెందులకు?"

"నిజమె. నేను ఆమెకొడుకును. ఆమె నాతల్లి. పెద్దతనంలో ఆమెవద్ద కనిపెట్టుకొని యుండి ఆమెరోజులు వెళ్లబుచ్చుట నావిధి. నీవుకూడ వచ్చిన మంచిదని చెప్పినాను".

"మీరుమాత్రము వెళ్లిన ఎన్నిరోజు లుందురు? బహుశః ఒకవారమో, పదిరోజులో."

"ఓహో! వెళ్లితే అసలే వెళ్లుతాను. లేదా, అథమము మాఅమ్మగారు బ్రతికియున్నంతవఱకు తిరిగి రాను. అందువల్లనే నీవు కూడ వస్తే బాగావుంటుంది" అని నరసింహరాజు విషయమంత బయటకుఁ దీయుటకుఁ బలికెను.

"నేను రాను. మీరుకూడ వారంరోజులకంటె యెక్కువ యుండుటకు వీలులేదు."

"ఓహో! బాగానేవున్నది. నీవు రానూ రావు; నేను వెళ్లనూ కూడదు. ఇది పోలీసు జబర్దస్తీకి మించిపోయించే. నీవు వస్తే వస్తావు? నేను వెళ్లుటమాత్రము నిశ్చయము."

"మీఅమ్మ మిమ్ముల నిచ్చివేసినప్పుడు యిట్టిషరతు లేమి కోరలేదు. మీరు మా స్వాధీనము. మీఅమ్మ కెట్టిఅధికారం మీమీద లేదు. గతిలేక యిల్లరికము వచ్చిన తర్వాత యింక హక్కేమిటి? ఇల్లరికము వచ్చిన అల్లుడు ఇంట్లో పెండ్లాము చెప్పు చేతల క్రింద వుండవలె. అతని యిష్టము సాగదు. ఇందుకేనా మా నాన్నగారు మీకొఱకు ఇంత సొమ్ము కర్చుపెట్టినది. ఇందుకేనా చదువు చెప్పించినది? తినియుండలేక అనవసర కలహమునకు కాలు దువ్వుచున్నారు. అవసరమైతే మీఅమ్మే వచ్చును. ఈపోరిక నేను పడలేను" అని చివాలున లేచి హంసతూలికాతల్పమువలె మెత్తగా నమర్పఁబడిన శయ్యపైఁ బడి నిద్రపోయెను.

తెలిసి తెలియని భార్య ప్రల్లదపుపలుకులు ములుకులై హృదయమున నాట నరసింహరాజు మారుమాటాడక కదలక మెదలక కుప్పకూలి కుర్చీలోఁ గూర్చుండెను. ప్రేమావతి నిద్రించినది. నరసింహరాజు మనమున జంఝామారుతమువలె నొక గొప్పతుపాను వీచుచుండెను. భావము లుత్తుంగతరంగములవలె లేచి విరిగిపడుచుండెను. "ఆహా! ఏమి! ఐశ్వర్యము మహాభాగ్యమని అందఱుచెప్పెదరు. ఇదెంత వెఱ్ఱిమాట! ఈచిన్నది బంగరుతూగుటుయ్యెలలో చుట్టఁబట్టిగదా యొరులకష్టసుఖములనింతకైనను గ్రహింపఁజాలకున్నది. చివఱకు తనమేలు తానైనను నెఱుఁగకయున్నది. ధనమె సమస్తమని తలంచుచున్నది. సమస్తసౌఖ్యములు, తల్లిదండ్రులు, ధనము ప్రసాదింపగలరని యెంచుచున్నది. ధనముగాని, తల్లిదండ్రులుగాని ప్రసాదింపజాలని దాంపత్యానురాగరసకుంభమును కాలితోఁదన్ని బోర్లద్రోసికొనుచున్నది. భర్త బానిసీడనియెంచుటచేగదా ఈయబల ప్రణయమహిమను గుర్తింపజాలకయున్నది! పురుషులు సహితము అహంకారధూర్వహులై స్త్రీలను బానిసలుగా తలంచుచున్నారు. ఇది మనదేశ దౌర్భాగ్యముగదా! స్త్రీపురుషాన్యోన్యత మృగ్యమైన గృహములు గృహములా? అవి శ్మశానములు గావా? అట్టి గృహములు దయ్యాలకొంప

వలె చొచ్చుటకు భీతిగొల్పునుగదా! నిలువ నీడలేని యెడారులుగదా! అవి మనసాంఘిక మూఢాచారముల నిందింపవలెగాని యాబాలికను నిందించిన ప్రయోజనమేమి?"

"సంపదల దులదూగినంతకాలము దారిద్ర్యముయొక్క కష్టనిష్ఠురముల నెవరును దెలియజాలరు. ఐశ్వర్యము స్వర్గధామమునకే కాక ప్రేమరాజ్యమునకు సహితము పెట్టనిగోడయై యడ్డుపడుచున్నది. నేనిచటనున్నంతకాలము ప్రణయమహిమనుగాని, దాంపత్యధర్మమునుగాని ఈమె గుర్తెరుంగ జాలదు. అనురాగనిజానుభవము స్వాతంత్ర్యముందే కలదు."

"స్త్రీ పురుషులు పరస్పరము ఒకరికొఱకొకరు ఆత్మసమర్పణము చేసినప్పుడె పార్వతీపరమేశ్వరుల లీలామూర్తి గోచరమగును. బజారునుండి అన్నివస్తువులు దెచ్చినటులనె నన్నును నామామగా రామెకు దెచ్చి యిచ్చిరి. నేనుసహితము ఆమెయిచ్చవచ్చినటుల నాడుకొనుట కేర్పడిన యాటవస్తువునని యీమెతలచుచున్నది. అందలి నౌకరుల వలెనె నేనును ఆమె యభీష్టముల నెరవేర్చుట కేర్పడిన నౌకరునని యామెభావించుచున్నది. అంతకన్న నెక్కువఉత్తమాదర్శముగాని, భావముగాని ఆమె మనమున లేదు. కూపస్థమండూకమువలె నాలుగుగోడలమధ్య బెరిగిన ఆడువారలకు ప్రపంచజ్ఞాన ముండజాలదుగదా! ఎట్టి శ్రీమంతులకైనను సామాన్యజనులతో గలసిమెలసి తిరిగి విద్యాబుద్ధులు గఱచిననే ప్రాపంచకజ్ఞాన మలవడును. అంధప్రాయముగ వచ్చుచున్న యాచారముల మాపుమాపినగాని సంఘము నావరించిన యజ్ఞానతిమిరము బాయజాలదు." (త్రుళ్లిపడి లేచి కూర్చుండి) "ఎందుకీ పిచ్చియాలోచనములు! కర్తవ్యమేమి? కేవలమజ్ఞానముచే ఈమె యిట్లు ప్రవర్తించినదనుట నిశ్చయము. కాని, ధనములేనప్పుడుగాని ధనమువిలువ తెలియదు. కావున నేను కొంతకాల మజ్ఞాతవాసము చేసినగాని యీమె సతీధర్మమును గ్రహింపజాలదు. ఇంతటి పరిభవము జరిగినపిమ్మటకూడ నిచట నేనెట్లుండ నేర్తు! ఇంత చదువు జదువుకొని పొట్టపోసికొన జాలనా! లేనిచో నీయింతికై నామానప్రాణముల మంటగలిపి యామె కూడిగము చేయుచు బడియుండవలెగదా! ఇట్టి నీచపుబ్రతుకు బ్రతుకుటకన్న ప్రాణముల దొఱగిన మేలే యగు. ఏమైనను అగుగాక! నేనిక నీయింట నొక గడియ యైనను నిలువజాలను. నామనము తపించుచున్నది. నాకు శాంతిలేదు. నేపోయెద"నని చెంగున లేచి నిద్రావశయై యున్న ప్రేమావతివంకఁజూచి యొక నిట్టూర్పు విడిచి గుండె రాయిచేసుకొని యర్ధరాత్రి యనియైన జంకక నరసింహారాజు యిలు వెడలిపోయెను.

౧౦

తెల్లవారినది. ప్రేమావతి నిద్రనుండి లేచి కనులు నులుముకొని అటునిటు చూచినది. మంచముపై భర్తలేఁడు. ఆమెకేదియో చెడుకలకూడ వచ్చియుండెను. ఆమెగుండెలలో పెద్దరాయిపడినట్లుండెను. గదిఅంతయు వెదకినది. నరసింహారాజు ఎందును గానరాఁడు. అప్రయత్నముగానె యామె కెప్పు

మని కేకవేసెను. ఇంటిలోనివారందఱు పరుగు పరుగున వచ్చిరి. తనభర్త యొందును గానరాఁడని ఆమె యేడ్వసాగెను ఇల్లువాకిలి అంతయు వెదకిరి. ఇంతలో పారావాఁడు రాత్రి రెండుజాములకె చిన్నబాబుగా రెచటికో వెళ్లిరనియు, తాను వెంట వచ్చెదనన్నను వలదని చెప్పిరనియు, ఒకచీటిని మాత్రము తనకిచ్చిరని యు చెప్పి యాచీటిని యిచ్చెను. అది ప్రేమావతికి వ్రాయఁబడినది.

"ప్రియమైన ప్రేమావతికి, శ్రీమంతులకు కష్టనిష్ఠురములుగాని, మంచిచెడ్డలుగాని తెలియవు. ధనమే వారికి సర్వస్వము. బీదలు భాగ్యవంతులతో సాటి కాజాలరు. వారికిని వీరికిని సంబంధ బాంధవ్యము లసంభవములు. నీవు భాగ్యవంతుని ముద్దుబిడ్డవు. నేను దరిద్రురాలి తనయుఁడను. నేను నిన్ను బోషింపజాలను. నాకట్టిసమర్థత కలిగినప్పుడె నిన్ను తీసికొని వెళ్లెద. నేనిట నుండి మనజాలను. నాతల్లియే నాకు సర్వస్వము. నాకు కుబేరునిధనమంతయు నిచ్చినను నాతల్లిని విడిచియుండజాలను. దైవము నిన్ననుగ్రహించుగాక."

—నరసింహరాజు.

ప్రేమావతి ఉత్తరము జదువుకొని గ్రుడ్లనీళ్లు కుక్కుకొని, దుఃఖము పొంగిరా గడితలుపులు వేసికొని గతరాత్రివృత్తాంతమును దలఁచుకొని విచారపడసాగెను.

౧౧

దినములు వారములైనవి. వారములు నెలలైనవి. నరసింహరాజు జాడ తెలియరాదు. ప్రేమావతి విచారమునకు మేర లేదు. ఆమె యేకాంతమున నిట్లు తలపోయఁ దొడఁగెను. "నాతండ్రి యాడినమాటలకే నొచ్చుకొని కుందుచున్న నాభర్తను నేను సహితము మూఢురాలనై నోట వచింపరాని పలుకులు పలికితిని. నాకంత మప్పుడు నొక్కుకొనిపోయినను మేలయ్యెడిది గదా! అబ్బా! నేనెట్లు భరింతు నీవియోగము! నాపతి నన్ను విడిచి వెళ్లినప్పుడుగదా సతికి పతియే గతియని తెలియవచ్చినది. గాఢమోహమున దగిలియుంటి నని నేనే యెఱుంగనైతిగా! నాభర్త నాకు వశుడైనా డనుకొంటిగాని నన్నే వశపరచుకొన్న సంగతి తెలియదాయెను. అకటా! నాహృదయము హరించినాడుగదా! స్త్రీకి అనురాగవంతుడైన పతియె ధనము, తల్లియు, తండ్రియు, సర్వము నని నేడుగదా సుబోధకమయ్యె. నాపతి నాచెంత జేరినావలపుల దీర్చుచున్నంతకాలము పతియె



"ప్రేమావతి ఉత్తరము జదువుకొని..........గతరాత్రి వృత్తాంతమును దలఁచుకొని విచారపడసాగెను."

వ్వరు? కాకిచే కబురంపినను నాపతి యెచట నున్నను మారుమాటాడక పోవుదాన. హా! దైవమా! నాదుడుకుదనమునకు దగిన ప్రాయశ్చిత్తము చేసితివి. ఇకనైనను నాపైకరుణించి నాపతిచెంత నన్ను జేర్చుము. ఇవియే నీకనేక ప్రణామములు. నీశరణు చొచ్చినాను. రక్షింపుము" అని పరిపరివిధములఁ బరితపించుచు ప్రేమాపతి కాలము పుచ్చుచుండెను. మఱియు మునుపటివలె సకలాభరణభూషితయై విలాసినివలె నుండక సామాన్యురాలివలె జీవితము గడుపుచుండెను. ఆభరణములఁ దీసివైచినది. శయనగృహమందలి యలంకారముల నన్నిటిఁ దీసివేసినది. నౌకరులెంతమంది యున్నను గృహకృత్యముల నెరవేర్చుటకు వారికై యెదురుచూడక యెల్లపనుల నవసరము కలిగినప్పుడెల్ల నామెయే చేయుచుండెను. అన్నిపనులఁ దల్లికంటె ముందుగ నామెయె చేయుచుండెను. తల్లి సయితము పనిసందడిని విచారముమరచి పోవునేమోయని ఆమెపనుల కడ్డుచెప్పుటలేదు. విశ్రాంతి సమయములందు సద్గ్రంథములతోఁ గాలక్షేపము చేయుచుండెను. ఇదివఱ కెంత భోగియో యిప్పుడంత విరాగియై చూచువారల కాశ్చర్యము గొల్పుచుండెను. ఆమె వైరాగ్యముఁజూచి తల్లిదండ్రు లొక్కొక్కప్పుడు సంతృప్తిని మఱియొకప్పుడు విచారమును బొందుచుండిరి. చిట్టివలసలో నరసింహారాజు తల్లియు లేదు. ఆమె యెచటికివెళ్లినదో యూరివారి కెవ్వరికిఁ దెలియదు.

ప్ర థ మ భా గ ము

తొలి ముద్దు

మునిమాణిక్యం నరసింహారావు, [సాహితీసమితి]

వెచ్చవెచ్చని తొలిముద్దు బెట్టుకొనగ
అతివ నీమోవి నామోవి నంటినపుడె
విరిగిపడునట్లు తిరిగి యీ విశ్వమెల్ల
కప్పువడిపోయె గాఢాంధకార పటలి

శుష్కపత్రంబువోలె సంక్షోభ మొందు
ఈ ప్రకృతినెల్ల నొకట దహించివేయ
ఏడునాల్కల జాపుచు బాడబాగ్ని
అబ్ధినుద్భూతమయ్యె భయావహముగ

క్షోణిపై శైలశిఖరముల్ కుప్పగూల
అతితరంబుగవీచు ఝంఝానిలమున
వేడిరక్తంబుచిమ్మట పెట్టినట్లు
హృదయనాళాలు తాపంపురొదలు పెట్టె

యౌవనపుకావిపూత లనందగిలిన
సంజ, చీకటిచాటున జారిపోవ
జీవితామృతకలశంబు చేతబట్టి
త్రావబోయిన నామేను తల్లడిల్లె

శ్రీకృష్ణదేవరాయల యఱవమంత్రులు

ఆ. రంగస్వామి సరస్వతి గారు, బి. ఏ.

వైశాఖమాసము 'భారతి'లో "ద్రవిడ వాఙ్మయము : ఆంధ్రులు" అను వ్యాసములో కృష్ణరాయల యాస్థానమున గొంద అఱవకవులు పండితులు నుండినది మాత్రమేకాక యతని మంత్రివర్గములో గూడ గొందఱు ద్రవిడు లుండినట్లు సూచింపబడినది. అట్లు సూచించినమంత్రి 'అఱంవళర్త మొదలారి.' ఇతనికే 'అఱ మాతుజ్ఞ'అనియు,'శేమ్బ్యార్ అఱమాతుజ్ఞ' అనియు నామాంతరము లుండినట్లు ద్రవిడవాఙ్మయమునుండి యెత్తి చూపబడెను. అయిన నీమంత్రినిగూర్చి శాసనము లెచ్చటనైన గలవా? కేవల మేదో గ్రంథమునందలి వాక్యములచేతను, చాటుపద్యములచేతను మాత్రమే యీయనవిషయము మనకు తెలియుచున్నదా? చాటుపద్యములలో మాత్రము దొఱకిన విషయము చరిత్రకంత విలువగలది యనదగునా? వెనుకటికాలమువా రాచాటుపద్యముల వ్రాసియుండరాదా? ఇట్టి సంశయములు కొందఱకు పొడమవచ్చును. ఈ విషయమై శాసనములను వెదుకగా నందుకూడ ఈ యఱవమంత్రియొక్కపే రగపడెను. వానిలోని విషయము గవర్న్మెంటు శాసనపరిశోధక శాఖవారి సాంవత్సరిక నివేదికలో నుండి యిందు వ్రాయుదును. 1921-వ సంవత్సరము శాసనములలో 370-వ నెంబరు శాసన మాతనిగూర్చినది. ఈశాసనము దక్షిణార్కాడు జిల్లాలో తిరువది అను ప్రసిద్ధమైన శైవక్షేత్రమందలి వీరట్టానేశ్వరుని యాలయమం దున్నది. ఈశాసనమందు కృష్ణరాయలతండ్రి యగు "నరసానాయకుడు" ఆ శివాలయము లోని యభిషేకమంటపమందు ప్రతిదినమును ఏబది దీపములును, మహామంటపమందు నూరుదీపములును వెలిగించుటకును, 'చాముండి నాచ్చియార్' అను నమ్మవారి గుడియందు నైవేద్యమునకును తిరుమూరుపట్టు సీమలోని ఆలంగాల్క్కప్పం అను గ్రామమును దానముచేసినట్లు తెలియుచున్నది. నరసానాయకునికి ఈ శాసనమందు అఱంవళర్త్తనయినారు కార్యకర్తగా నగుపడుచున్నాడు. ఈశాసనము వికారిసంవత్సరమున వేయించినది. దీనికి సరియగు క్రీస్తు సంవత్సరము 1480 అగును.

ఈ మంత్రియొక్క మఱొక శాసనము 1921-వ సంవత్సరపు 450 నెంబరుగలది. ఇది దక్షిణార్కాడుజిల్లాలోని తిరువెణ్ణైనల్లూ రను శైవదివ్యదేశ మందలి వీరట్టానేశ్వరుని యాల

యమం దున్నది. మహామండలేశ్వర సాళువ నరసింగరాయల కాలమున ప్లవసంవత్సరమున తిరువడిసీమలోని దేవాలయముల మందలను మేపెడు గొల్లవారు 'శదక్కడమై' అను పన్నును చెల్లింపలేక యితర ప్రదేశములకు వలసపోగా నాపన్ను నరసానాయకుని కార్యకర్తయైన అఱంవళర్తనయనారుయొక్క ప్రార్థనపై తగ్గింపబడెను. ఈ శాసనము ముందుదహరించిన దానిపిదప ప్లవసంవత్సరమున వేయించబడినది. దీనికి సరియగు క్రీస్తు సంవత్సరము 1482 అగును.

ఇంకొకశాసనము 1921 వ సంవత్సరపు 473 నెంబరు గలది. ఇందలిరాజు 'కుమార మల్లికార్జున రాయులు.' ఈరాజు సాళువ నరసింగరాయలును, కృష్ణరాయలతండ్రియగు నరసానాయకుడును తా మస్వతంత్రులు గాక పూర్వము సేనాధిపతిగా నుండినవాడు. ఈశాసనముగూడ తిరువెణ్ణెనెల్లూరునందే దొరకినది. దీనికాలము శాలి 1407 అనగా క్రీ 1485. ఇందు విజయనగరసామ్రాజ్యమునకు జేరిన వళుదిలంపట్టురాజ్యము అను చిన్న మండలములోని 'కైక్కోళర్' అను సాలె జాతివారికి వారియుత్సవములయందు పల్లకి, శంఖము మొదలగు బిరుదచిహ్నములను కాంచీపురమునందలి కైక్కోళజాతివారివలెనే యుపయోగించునట్లు 'అరంవళర్తనయినారు' శాసనము చేసెను.

ఈమూడునుగాక నీయఱంవళర్త మొదలియారు శాసనములు కొన్ని కలవు. అందొకటి తామ్రశాసనము. ఈ తామ్రశాసనము ['Rangachariya's Index') అనుశాసనసూచియందు ఉత్తరార్కాడుజిల్లాలోని నెం 532రు గలది. ఈశాసన మింకను గవర్నమెంటుశాసనశాఖవారిచేతికి వచ్చి పరీక్షింపబడలేదు. ఇది 'తిరువణ్ణామలై' అను నరుణాచలక్షేత్రమున పరెయనాడు మఠమను మఠములో నున్నది. ఈశాసనమునందు 'అలెయరుంకొండతంబిరాను' అను పండారసన్న్యాసికి అరంవళర్త మొదలియారును, 56 దేశములమహాజనులును చేతి యొకమఠము కట్టించిన దేకాక యా దేవాలయమందలి యమ్మవారిగుడివిమానము కట్టించి, దేవస్థానమునకును, పండారములకును 'మేలప్పాళయము' అనుగ్రామమును, గ్రామమునందు జరుగు పెండ్లిండ్లయందు అరుపణములు, బియ్యము, వస్త్రము నీయవలసిన ఏర్పాటు చేయబడినది. ఈశాసనము పూర్ణముగా శోధించిన నింకను విశేష విషయములు బయలువెడలవచ్చును. ఈపై మూడుశాసనములనుండియు నీ'అరంవళర్త మొదలియారు విజయనగర సామ్రాజ్యమున కుమార మల్లికార్జునరాయలకాలము మొదలుకొని సాళువనరసింగరాయలు నరసానాయకుడు ఈరాజుల కాలములలోనుండి కృష్ణరాయలకాలములోగూడ ప్రసిద్ధుడై యుండినట్లు తేలుచున్నది. కృష్ణరాయలకాలమున నీమంత్రి చాల వయసుచెల్లినవాడై యుండవలెను. కనుకనే యాయన పేరు వెనుకకాలమందలి శాసనములలో మన కగుపడకుండుటకు కారణమగునేమో? చాలకాలము విజయ

నగరము 'హంపి'లో నివసించియుండుటచేతనే యీమంత్రికి ద్రవిడవాఙ్మయమున 'అంపి అఱమాతుఙ్గ' అని పేరయియుండవలెను.

'తిరువాహూర్' క్షేత్రమునందలి యర్చకుల విషయమై 'తత్త్వప్రకాశుఁడ'ను కవి వ్రాసిన పద్యములో కృష్ణరాయల మంత్రి మఱొకని పేరగపడుచున్నది. [1]ఇందలి

మరువు పుగఙ్జ కృష్ణమహారాశరాణై
అరియువడమలై యారాణై,


అను వాక్యములో 'వడమలై యార్' అనునది యింకొకమంత్రి పేరుగాఁ గనుపడుచున్నది. అఱవమున 'వడమలై' అనగా నుత్తరపర్వతము. ఈపదము కొన్ని ప్రదేశములలో హిమవత్పర్వతమునకును, కొన్ని ప్రదేశములలో 'తిరుమల'తిరుపతి దేవస్థానమునకు పర్యాయపదముగా వాడబడును. అందుచేత నీ'వడమలయార్' అనుపదము 'తిరుమల' అను పేరుగల్గిన సాళువతిమ్మరసును గూర్చినదని కొందఱభిప్రాయపడిరి. అయిన 'సాళువ తిమ్మ' అని సరిగా లేక యింతటి విళంబిత ప్రతీతికమగు పదమును కవిత్వమర్యాద దెలిసినవా రెవరును ప్రయోగించియుండరు. 'వడమలైయార్' అను పదము దక్షిణదేశములో సాధారణముగా పురుషులకు నామముగానున్నది. ఆపేరుగల్గినమంత్రి యొకడు కృష్ణరాయలయాస్థానిలో నుండవలెను. అతనిగూర్చి వాఙ్మయమునందలి యీచాటుగాథగాక వేఱేమైన సమాచారము తెలియునా? శాసనములలో నెందైన నత డుదాహృతుఁడా? 1921 సంవత్సరము 307 నెంబరు శాసనములో నీమంత్రి పేరగపడుచున్నది. ఈశాసనము చెంగల్పట్టుమండలములోని 'అరశర్ కోవిల్' అను గ్రామమున నున్నది. ఇందు అరశర్ కోవిల్ గ్రామమునకు క్రొత్తగావచ్చి కాపురము లేర్పఱచుకొనురయితులకు ఒకసంవత్సరముపన్ను లేకుండనుఅంతకుపిదపవారీయుపన్నులనిర్ణయమును ప్రచురించియున్నది. ఈశాసనములోని రాజు కృష్ణరాయలే. ఇది భావసంవత్సరము కార్తికమాసము ముప్పదవతేదిన ప్రకటించినది. దీనికి సరియయిన క్రీస్తుసంవత్సరము 1514 15. ఈ శాసనములో కృష్ణదేవరాయలకు దక్షిణదేశ రాజప్రతినిధియై 'కరణిక' బిరుదమును వహించిన మంగరసయ పేర్కొనబడినాడు. ఈ మంగరసయ్యకు పుణ్యముగా 'వడమలైయారు' ఈశాసనమును వేయించెనట. కరణికమంగరసయ్యయొక్క శాసనము లనేకము లిదివఱకే మనకు తెలిసియున్నవి. ఇతడును కృష్ణరాయలకుపూర్వము నరసానాయకుడు, వీరనరసింగరాయల కాలములలోకూడ సేనాధిపతిగా నుండెను. కృష్ణరాయలు 'ఆముక్తమాల్యద'లో యామునాచార్యుల రాజనీత్యుపన్యాససందర్భమున మంత్రిగా నొకని నియమించునపు డతడు తనతండ్రి తాతలకాలము నుండి వచ్చినవాడుగానుండిన మంచిదని చెప్పినాడు. ఈయుపదేశమును రాయలు తనయాచరణానుభవములనుండి గ్రంథమున జొన్పియుండవలెను. ఇట్లే రాయలయాస్థానమునందలి యితర ప్రసిద్ధపురుషులనుగూర్చి మనకు క్రొత్తగా తెలిసినదాని క్రమేణ ప్రకటించుచుందును.

౧. ఈతనివిషయము 'ద్రవిడవాఙ్మయము—ఆంధ్రులు' అను వ్యాసమున నీపత్రికలోనే వెనుక చర్చించియున్నాము.

సార్నాదు స్తూపములు


కొ. నరసింహాచారి గారు

సార్నాదు పూర్వమొకప్పు డున్నత స్థితియం దుండిన బౌద్ధుల పుణ్యక్షేత్రమైన పట్టణము. ఇది వారణాసికి 4 మైళ్ల ఉత్తరమున ఘాజీపురమార్గమున కనతిదూరమునమున్నది. ప్రస్తుతము సార్నాదుకు



క. ప్రధాన ఆలయము. గ. జగత్ సింగు స్తూపము. చ. స్తూపగర్భిత స్తూపము. జ. స్తూపము.
త. అశోక స్తంభము (భారతి సం.౧, ౧౧ వ సంచిక ౧౩౫ పుట చూ.) ద. ఆలయము. న. ఆలయము.

పోవుటకు వారణాసి-ఘాజీపురమార్గమునుండి చీలి రావలసియున్నను, పూర్వకాలమున వారణాసినుండి సారనాథుకు భిన్నగా నొకమార్గ ముండినట్లు చిహ్నములు కొన్నిగలవు. ఈపట్టణము సుప్రసిద్ధ బౌద్ధక్షేత్రమైయుండిన కాలమున నందు గొప్ప 'విహారము'ను ఆశ్రమములును, మఠములును, స్తూపములును, దేవాలయములును, గణనాతీతములుగనుండి ప్రాచ్యదేశములగు బర్మా, జపాన్, చీనా దేశములనుండి బౌద్ధయాత్రికులు వచ్చుచు పోవుచుండిన దేశముగా నుండెను. గౌతమబుద్ధుడు తనచే నూతనముగ నెలకొల్పబడిన మోక్షమార్గమును లోకమునకు వెల్లడిచేసిన ప్రసమ్మప్రదేశమగుటవల్లనే ఈపట్టణము బౌద్ధప్రపంచమున ప్రసిద్ధపుణ్యక్షేత్రమయి వెలింగెను. గౌతముడు గయయందు బోధివృక్షముక్రింద దపమాచరించి బుద్ధుడై వారణాసికేరి తత్సమీపమున నీసారనాథదునందే ప్రాణిహింసను గర్హించుచు సర్వప్రాణి సమత్వమును గుణించిన ప్రథమోపన్యాస మొనరించెను. ఇదియే బుద్ధుడు తనమతము స్థాపించిన మొదటిదేశము. ఇదిగాక బుద్ధుని జన్మక్షేత్రము 'కపిలవస్తు', తప మాచరించిన 'గయ', నిర్వాణమొందిన 'కుశీనగరము' బౌద్ధప్రపంచములోని యత్యుత్తమ పుణ్యక్షేత్రములు.




ఆలయములలో శంఖమునుంచుటకు ఉపయోగింపబడుచుండిన పీఠము

బౌద్ధులు సారనాథమును 'మృగదావ' (కురంగారామ) మను పేర నెఱిగియుండిరి. బుద్ధుడు ఈమృగారామమున 'న్యాయచక్ర'మును (ప్రథమమతబోధ) త్రిప్పుటవల్ల నిరుగడల కురంగములు గలచక్రము బౌద్ధుల మతచిహ్నమయి యొప్పుచున్నది. ఈచిహ్నము ప్రస్తుతకాలమునగూడ బౌద్ధులచే ధరింపబడు చున్నది. టిబెటు దేశమున గల బౌద్ధగురువులగు 'డలాయిలామా'లకు గూడ నీ కురంగచక్రచిహ్నమే మతచిహ్నముగా నున్నది.


సారనాథము బౌద్ధులకే కాక జైనులకును పుణ్యక్షేత్రమై యున్నది. ఇందు జైనుల ఏకాదశతీర్థంకర బిరుదాంకితుడును 'సింహపురి' (సింహపూర్) వాసుడునైన శ్రీఅంశనాథుని జ్ఞాపకార్థ దిగంబరులను జైనశాఖవారిచే క్రీ. శ. సం. 1824 న గట్టబడిన దేవాలయము కలదు. సారనాథమున 'ధర్మేక్ష' (ధర్మ లేక న్యాయవిచక్షణము) యనుప్రదేశమున నొక గొప్పస్తూపము కలదు. దీనికిప్పుడు 'ధామేక్ స్తూప'మని పేరు. (భారతి సంపుటి ౧, ౧౧వ సంచిక, ౧౩౫ పుట చూడుడు)

బౌద్ధచక్రవర్తి యగు అశోకుడు సారనాథమునందొక గొప్పస్తూపమును స్తంభమును కట్టించెను. క్రీ. శ. 400—411 మధ్యకాలమున నుత్తరహిందూస్థానమందంతటను సంచరించిన ఫాహియాను చీనాయాత్రికుడు కురంగారామమున 4 గొప్పశిఖరములను, బౌద్ధసన్న్యాసులకై కట్టిన 2 మఠములను తానుచూచినట్లు వ్రాసియుండెను. క్రీ. శ. 640 సం. హియన్‌త్సాంగను మరియొక చీనాయాత్రికుడు వందలకొలది దేవాలయములను, 200 అడుగుల యున్నతి గలిగి శిఖరమున హేమమయమగు ఆమ్రఫలముచే నలంకరింపబడిన గొప్ప విహారమును, ఈవిహారమున న్యాయచక్రము త్రిప్పుచుండు బుద్ధుని గొప్పవిగ్రహమును చూచినట్లు వ్రాసియుండెను. ఆకాలమున 1700 మఠసన్న్యాసు లుండినట్లు ఆతడు చూచియుండెనట.

సారనాథు క్షీణదశకు కారణ మిదమిత్థమని నిర్ణయింపుటకు నాధారము లెవ్వియు కానరాకున్నను ఈ దురంతము ఆకస్మికమయి దారుణ మయినదనియు, బుద్ధిపూర్వక దౌర్జన్యమువలన దేబడినదియు నని యచ్చట త్రవ్వితీయబడిన శిథిలములవలన నెరుగబడియున్నది. క్షీణ




న. 1 ఆలయముయొక్క ప్లానును, ఎత్తును



జ. స్తూపముయొక్క ప్లాను, ఎత్తు

దశ ప్రారంభించినవెనుక తగసముద్ధారకులు లేకున్న కాల దేవత యసహాయముగ నాశీనదశను ప్రాప్తిజేయ గలు

గును. కాలక్రమమున మహాస్తూపాదులు నాశములు కాగా నొకటిరెండుమాత్రము శిథిలములుకాక నిలిచి యున్నవి.



౧౮. ఆలయముయొక్క ప్లాను ఎత్తును.

ఇనుపకమ్ములచే నొకదాని కొకటి చేర్చి బిగియింపబడిన శిలలు గలదగుటచే ధర్మేకు (ధామేక్) స్తూపమును, అక్బరు చక్రవర్తిచే తనతండ్రి జ్ఞాపకార్థము గట్టబడిన శిఖరము గలదగుటచే, చక్రవర్తిపైగల గౌరవమువల్ల నాశకులచే, తాకబడకుండిన చౌఖండి స్తూపమును శిథిలములు కాక నిలచియున్నవి. చాలమట్టునకు సారనాథములోని శిథిలమైన కట్టడములన్నియు నధికారపదవియందుండిన వారి గృహనిర్మాణాది స్వోపయోగార్థమును, అయోమార్గముల వేయుటకును రాళ్లకొఱకు త్రవ్వబడి పాడుచేయబడినవి వారివారికి సాధ్యమయినంతవరకును త్రవ్వగా జిక్కిన శిలావిగ్రహములు, విలువగల లోహపదార్థములను, ధనమును (నిక్షేపము) బండ్లకెక్కించుకొని పోబడినవి కాన చరిత్రకారులకు కావలసినంత యాధారములు లేనందున నీక్షేత్రమునుగురించి పూర్ణముగా నెఱుంగదగు భాగ్యము మనకు లేకున్నది.




మంజుశ్రీ విగ్రహము

క్రీ. శ. 1815 సం. న స్వార్థపరత్వము లేక కర్నల్ మక్కెంజిగా రీస్థలమును త్రవ్వించిరి. తదనంతరమున క్రీ.శ. 1835—36లో జనరల్ కన్నింగ్ హాముగా రీస్థలమును త్రవ్వించినపుడు బౌద్ధసన్న్యాసుల వసతమును

దేవాలయమును, కనుగొనగలిగిరి. దేవాలయసమీపమున వారికి శిలావిగ్రహము లనేకములు దొరకినవి. 1848-52 సం.లో కిట్టోగారు ధర్మేక్ష (ధామేక్) స్తూపముచుట్టును ద్రవ్వింపగా ననేక స్తూపములు, ఆలయములు, చైత్య శాల యను గొనదగిన యొకకట్టడమును కనుగొనిరి.

జగత్ సింగు స్తూపము

18వ శతాబ్దాంతమున వారణాసిరాజగు చేత్ సింగుని మంత్రియగు జగత్ సింగుయొక్క గృహనిర్మాణము నకై కావలసిన రాళ్లకొఱకు ద్రవ్వించు చుండగా నీస్తూపము బయటబడెను. జగత్ సింహుని పనివారు త్రవ్వ



౯. జగత్ సింగు స్తూపము

నప్పుడొక ధనాగారమునుగూడ నిండుగనుగొని యందలి వస్తువులన్నిటి దాటవేసిరి.

ఈస్తూపము వలయగర్భితవలయములతో గట్టబడి యున్నది. అన్నింటికిని లోపలనున్న వలయముయొక్క వ్యాసము అ-44.—అం-3. దానిపైనుండు వలయము యొక్క వ్యాసము. అ. 55—అం. 3ను కలిగియున్నది.

ఈస్తూపము, ఒకదానిపై నొకటిగా బోర్లించబడిన గిన్నెలవలె నప్పుడప్పుడును కట్టబడిన స్తూపసముదాయమై యున్నది. ఇది ఇటికలతోను, మట్టితోను, కట్టబడి పైపూతకుమాత్రము గార యుపయోగింపబడి యున్నది.

ఇటికలు సాధారణముగా 20 × 3½ × 2¾ అంగుళముల మొదలు 15 × 12½ × 3 అంగుళముల వరకు పరిమాణభేదములు గలిగియున్నవి.

దేవాలయము


ఇది సమచతురమై ప్రతిప్రక్కను 68 అడుగుల పొడవుగలిగియున్నది. ప్రతిప్రక్కయందును చిత్రమున గనుపఱచినరీతి వంగణములు ముందునకు వచ్చియున్నవి. ఇదికూడ నిటికలతో కట్టబడి కుడ్యము లన్నియు దళములై బలిష్ఠములై యెంతభారమునైన మోవగలిగి యున్నవి.

అశోక స్తంభము

పై నుదహరింపబడిన యాలయమునకు పశ్చిమమున నొక్క స్తంభము కలదు. ఇది విఱిగి శిథిలమై యున్నది. దీనియునికినిజూడ దీనిని బుద్ధిపూర్వకముగా విఱుగగొట్టినందున ప్రక్కనున్న యాలయముపై నొరిగియున్నట్లు తోచును. స్తంభశిఖరమున నలువైపుల జూచుచుండు నాలుగుసింహములు వీపులు చేరినట్లుగా చెక్కబడియున్నవి. (భారతి సం-౧, ౧౧-వ సంచిక ౧౩౪ పుట చూడుడు.)

ఇందు రెండుసింహములముఖములు మాత్రము ఆలయకుడ్యమునకు దగులుటవలన భిన్నములై యున్నవి. ప్రస్తుతము చిక్కిన యాధారములబట్టిచూడ నీ స్తంభము భూమట్టమునకుపైన 38½ అ. ఎత్తు గలిగి యొక్కరాతితో జేయబడియున్నది. పీఠమున దీనివ్యాసము 3½అ. శిఖరమున అ.1—అం.10 కలిగియున్నది. శిఖరము మాత్రము 7అ. ఉన్నతిగలిగి ఒకగంటయు, దానిపై నొకవలయపీఠమును, దానిపై 4 సింహములును, వాటిపై నొకచక్రమును గలిగి యున్నది. ఈశిఖరమునగల చక్రమే 'ధర్మచక్ర' మన బరగుచున్నది. దీనియందు 32 ఆకులు (Spokes) కలవు. సింహములక్రిందగల పీఠమున నొక్కొక్కదానియందును 24 ఆకులుగల 4 చక్రములును, వాటిమధ్య సింహ, గజ, వృషభ, అశ్వరూపములు చెక్కబడియున్నవి.

ఈ స్తంభము హిందూదేశమున నిప్పటివరకును కనుగొనబడిన పురాతనవస్తువులయం దద్వితీయ సౌందర్యము కలదై యున్నది. 2000 సంవత్సరములకు ముందు ఇసుకరాతి (Sand-stone)తో జేయబడిన దైనను చక్కగా నునుపు జేయబడినందున పాలరాతివలె ప్రతిఫలింపజేయు గుణముగలదై కమనీయముగా నున్నది.



ఒకస్తూపముపై నొకస్తూపముగా కాలక్రమమున గట్టుచు రాబడినస్తూపము

రామాయణమునందలి వానరు లెవరు? వారేరి?

కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారు

శ్రీమద్రామాయణమును బాగుగఁ బరిశీలించి చూచిన విద్వాంసులు రామసేవకులగువానరులు ప్రస్తుతకాలమునందలి వానరములు కారనియు వారొక జాతి మానవులనియుఁ దెలుపుచున్నారు. ఆ యూహానే బలపఱచుచు నేనొక వ్యాసమును వ్రాసి శ్రీ శారదలోఁ బ్రచురించినాను. నావ్యాసమును సరిగఁ జూచుకొనక కొన్ని యాక్షేపణముల మహారాజశ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు శ్రీభారతిలోఁ బ్రచురించిరి.

హీనజాతి యన నేమి?

నేను వానరులను హీనజాతి* యంటిననియు, వారుచండాలాదులవంటి నిమ్నజాతులు కారనియు, శ్రీ పంతులవారు లిఖించిరి. వానరులు తక్కువవారలని నేను వ్రాసితినిగాని, దానిచే వారు చండాలాదులవంటి నిమ్న జాతులనుభావముతో నే నట్లు వ్రాయలేదు. దేహనిర్మాణమునందును, జ్ఞానస్థానమగు మెదడు నందును గొంత తక్కువవారని నా తాత్పర్యము.

వానరుల తోఁకలు

"పైపెచ్చు వారికి తోఁకలున్నట్లు" నేను వ్రాసితినని శ్రీపంతులవారు వింతపడఁజొచ్చిరి. వీరి వింత నాకు వింతను బుట్టించుచున్నది. పైపెచ్చు వారికి తోఁకలున్నవని నేను గల్పించి వ్రాయలేదు. శ్రీమద్రామాయణమే వారికి వాలములున్నట్లు తెలుపుచున్నది. నే నీవానరుల విషయములో రామాయణము చెప్పు లక్షణములనే కైకొంటిని. కాని క్రొత్తలక్షణముల వ్రాయలేదు.

కావున వీరు వాలములుగలట్టియు, పరిపూర్ణమానవత్వమునకు రానట్టియు నొకవిధమగు మానవజాతియని విజ్ఞులు వ్రాసినరీతిగా నేనును వ్రాసితిని. శ్రీమద్రామాయణకాలమునందు వాలములుగల హీనమానవజాతి యొకటి యుండెడిదని తోఁచెడిని. వారు కొన్ని మృగలక్షణములును, గొన్ని మానవలక్షణములును గలిగియుండెడివారు. తోఁకలుండెడివి. ఈ యంశములు రామాయణముం బట్టియే తెలియవచ్చుచున్నవి. వానరు లన తక్కువనరు లని యర్థము. దేనియందు దక్కువయన దేహనిర్మాణ సౌభాగ్యమునందును, బుద్ధివిభవమునందును, రామాది మానవులకంటెఁ దక్కువయని భావము.

తోఁకలుగల మానవజాతి యిప్పుడేది? వారెక్కడ?

అని శ్రీవీరభద్రరావుగారు ప్రశ్నించుచున్నారు. వా రిప్పుడున్నారని నేను తెలిపియుండలేదు. పూర్వము రామాయణకాలములో మనభారతవర్షములో వాలములు గల హీనమానవు లుండెడివారు. రామాయణకాలము మిక్కిలి ప్రాచీనము. అప్పుడున్న జంతుజాలమునకును, నిప్పుడున్న జంతుజాలమునకును, గొంతభేదము కలదు. భూమి పరిణామమును బొందుచు రాఁగా రాఁగా జాత్యంతరపరిణామము లనేకములు జరుగుచున్నవని శాస్త్రములు తెలుపుచున్నవి. వేదములు మానవుఁడు సృష్టిలోఁ దుదివాఁడని ఘోషించుచున్నవి. "బైబిలు"ను నిట్లే తెలుపుచున్నది. మనసాంఖ్యశాస్త్రమును, పాశ్చాత్యులప్రకృతిశాస్త్రములును దీనినే రూఢిచేయుచున్నవి. డార్విన్

* నావ్యాసములో హీనమానవు లను పదమునే నేను వాడలేదు. హీననాగరకతగల ప్రాకృతమానవు లని, పశుత్వముగల ప్రాకృతమానవులని వ్రాసితిని. అట్లనుటయే హీనమానవు లనుటగాఁ బ్రస్తుతము తీసికొందము.

మున్నగు పశ్చిమదేశవిద్వాంసులు చెప్పినదియు నిట్టిదియే. భగవంతుని దశావతారములును దీనినే బోధించుచున్న వందురు. ముందు పాదాదికములులేని జలచరములు పుట్టినవి. యీయపాత్తులనుండి సపాత్తులగు కూర్మాదులు పుట్టినవి. ఈకూర్మాదులు విశేష భాగము జలమునందును, నీష ద్భాగము స్థలమునందును నుండునవి. వీనినుండి యీష ద్భాగము జలమునందున్న, విశేష భాగము స్థలమునందును నుండువరాహాదులు పుట్టినవి. ఈచతుష్పాత్తులనుండి విశేష భాగము చతుష్పాత్తులుగాను నొకింత ద్విపాత్తులుగాను సంచరించు వానరాదిజంతువులు పుట్టినవి. సదా ద్విపాత్తుగా నుండునరునకును విశేష భాగము చతుష్పాత్తుగా నుండువానరమునకును నడుమ సంబంధముకలుపు మఱికొన్ని జాతు లుండియుండును. స్వల్పముగ చతుష్పాత్తుగను, విశేషము ద్విపాత్తుగను నుండుజాతి యొకటి యీనడుమ నుండియుండవచ్చును. వారే రామాయణము నందలి వానరజాతి కావచ్చును. ఈయూహ సమస్తశాస్త్రములకు సమ్మతముగను శ్రీమద్రామాయణవర్ణిత వానరుల కనుకూలముగను నున్నది.

ఇటీవలి పరిశోధనము లేమి చెప్పుచున్నవి?

ఇక్కాలమునందలి భూగర్భ పరిశోధకులు నరవానరములకు సంబంధముకలుపు నడిమిజాతు లుండెడివని కనిపెట్టిరి. ఆ యంశము 9-2-25 తేదిగల యాంధ్ర పత్రికలో "మనిషి పుఱ్ఱెవంటి కోతిపుఱ్ఱె" యను శీర్షిక క్రిందఁ బ్రచురింపఁబడి యున్నది.

"లండన్ ఫిబ్రవరి 4:—ఉదయం11-40, బుచానా ల్యాండులో విట్వాటర్సాండు విశ్వవిద్యాలయ పండితుడు తాంగాదగ్గర 50 అడుగుల లోతుగల సున్నపురాళ్లలో పాతిపెట్టబడిన ఒక కోతిపుఱ్ఱె గన్పట్టెను. ఇది బాలకాలమునాఁటి క్రిందిపుఱ్ఱెగా గాన్పించుచున్నది. ఇది మనిషివంటి పెద్దకోతి పుఱ్ఱెవలె గన్పించుచున్నదట. ఇది మనిషిపుఱ్ఱెగాదని డాక్టరుగా రనుచున్నారు. "గొరిల్లా" 'చింపజీ' అను కోతులపుఱ్ఱెవలె నున్నదనుచున్నారు. మాట్లాడుటకు శక్తిలేకపోయెను గాని మాటలగుర్తులు చిహ్నము లున్నటుల గన్పించెను." ఇత్యాది వార్తను ప్రచురించుచు పత్రికాధిపతు లీక్రింది సంపాదకీయ వ్యాసము నీవిధమై ప్రచురించిరి.

"కోతినుండి నరుడు జనించెనని డార్విను సిద్ధాంతము దెలిపియుండెను. దీనిని శాస్త్రజ్ఞులు వేదవాక్యములవలె పరిగణించుచున్నారు. కాని మానవులకు మాట లెట్టుల యబ్బెను? సంజ్ఞ లెట్టుల దెలిసెను? ఈ ప్రశ్నలకు జవాబు దెలియక పాశ్చాత్య శాస్త్రజ్ఞులు గందరగోళ పడుచున్నారు. మానవుని రూపుగల తోకలేనికోతులు గలవుగాని, వానికయినను మానవునిశక్తులు లేవు."

ఇటీవల నొక జర్మను శాస్త్రజ్ఞుఁడు రేబది యడుగుల లోతున నొకపుఱ్ఱెను కనుగొనెను. దానిని పరిశోధింపగ, మానవుఁడును కోతియు గాక మాటలాడి సంజ్ఞలను దెలిసికొనగల వేరొక మధ్యరకపు జాతికిది సంబంధించి యుండెనని యాతఁడు కనిపెట్టెను. ఈ జాతిని కోతినిబోలు మానవులని పిలుచుటకు బదులుగ, మానవునిబోలు కోతులని పిలుచుట భావ్యముగ నుండునని యాతఁడు సూచించుచున్నాడు. ఇట్టివారు పురాణాదులలో వర్ణించినవానరు లగుదురా? ఇట్టి పరిశోధనముల వలన రామాయణమునందలి భాషాజ్ఞానాదులుగల హీన మానవులు పూర్వకాలమం దుండియుండుట సంభవమే యని బుద్ధిమంతు లూహింపకపోరని తలంచెదను. వానరుల నాగరకత మున్నగునవి రామాదినరుల నాగరికత కంటె నెట్లు తక్కువగ నున్నవో, వానరులందు, నరులందు లేని పశులక్షణము లేవో, యా వానరులందుఁ గేవల వానరాది పశువులందు లేని నరత్వమేదో, నేను శ్రీశారదలో వ్రాసిన వ్యాసమునందు స్పష్టపఱచి యున్నాను. ఇప్పటికిని గొంచెముగనో, గొప్పగనో వాలము గల మానవజాతి యొకటి కలదని లోకజ్ఞులు చెప్పుచున్నారు. ఆయంశమును నావ్యాసములో వ్రాసియున్నాను. ఇంతకంటె గొప్పగనో సమముగనో వాలము గల జాతియొకటి మనభారతవర్షమునఁ బూర్వకాలమున నుండి యుండవచ్చును. అట్లేల యూహింపవలయుననిన శ్రీమద్రామాయణ మట్టియూహలు పుట్టించుచున్నది గావున నట్లు తలంపనైయున్నది. తొల్లి మనభారతవ ములో హంసాదు లుండెడివని మనగ్రంథములఁబట్టి తెలియవచ్చుచున్నది. కాని యిప్పుడవి యిచట గానరావు అట్లే రామాయణ కాలమునందలి మానవలక్షణములు గల వానరు లిప్పుడు కాన్పింపనందునఁ బూర్వకాలమునందును లేరని తలంపరాదు. కాలము గడచినకొలఁదిఁ బూర్వ

కాలపుజాతు లనేకములు నాశనము నందుచున్నవి. అటు జాగ్రత్త వహింపకున్న నిప్పటిజాతులును గొన్ని యచిరకాలములోనే నాశనము నొందఁగలవు. నశించినజాతుల ప్రధ్వంసా భావము ప్రాగభావమనుకొనుట తగదు. అకాలమునందున్న యీవానరులు జనస్థానము నందలి నరవరులగు ఋషుల సహవాసమువలన గొంత నాగరికతను జెంది విద్యాబుద్ధులు సంపాదించుకొని కిష్కింధా రాజ్యస్థాపనము జేసికొని, గృహాదికములు కట్టుకొని వానిలో నివసించెడివారు. కాని కిష్కింధాపురమున నివసించు వానరశ్రేష్ఠులయందే నాగరకత యుండెడిదిగాని వానరసంఘమునం దంతటను సామాన్యముగ నుండెడిది గాదు. మూఁడువంతులు నాగరకులు కానివానరులు మృగతుల్యులై, నివసింప గృహాదికములు లేక చెట్లలో పులు మున్నగువానిలో నివసించెడివారు. సుగ్రీవుని ప్రెగ్గడ యగు హనుమంతుఁడు హీనమానవుఁ డెట్లగునని పంతులవారు శంకించిరి. పింగళకుని ప్రగ్గడలగు కరటకదమనకులు ప్రగ్గడలై నంతమాత్రమున నాగరకులగు మానవులగుదురా? రాజునకు దగిన మంత్రు లుండుదురు. మృగమునకు మంత్రి మృగమే. వానరులకు వానరులే మంత్రులు. పరమ నాగరకులగు పాశ్చాత్యుల సంపర్కముచేఁ బాతాళలోకము (అమెరికా)నందలి యాటవికులలోఁ గొందఱు హూణ విద్యాదికమును నేర్చి ప్రజ్ఞావంతులై నంతమాత్రమున నా దేశస్థులందఱును నాగరకు లెట్లుగారో యట్లే జనస్థానము నందలి ఋషులసహవాసమువలన సంస్కృతవిద్య నొక కొందఱు హనుమదాదివానరు లభ్యసించినను, వారిజాతి నంతను విశేషనాగరికతగల జాతియని తెలుపుట కవకాశము లేదు. వానరరాజగు సుగ్రీవునకు హనుమదాదులు ప్రగ్గడలైనను నరరాజగు రామునకు దాసులే కాన వానరులు నరులకంటె గొంత తక్కువవారు. హనుమదాదులు హీనమానవులుకాని వానరులు కారని నేను వ్రాసినట్లు వీరభద్రరావుగారు లిఖించిరి. నే నెచ్చటను నట్లు చెప్పి యుండలేదు. హనుమదాదు లిప్పటి వానరములు (క్రోఁతులు) కారంటినే కాని వానరులు (హీనమానవులు)కారనలేదు. హనుమ యెట్టిహీనవానరుఁడో రామసేన యగు తక్కిన వానరసంఘమంతయు నట్టి హీనమానవజాతి యనియే నేను వ్రాసియున్నాను.

వీరభద్రరావుగారి వానరులు

శ్రీ వీరభద్రరావుగారు ప్రస్తుతకాలమునందలి పల్లెకాపులే కపులనియు, మరకాడులే మర్కటములనియు నేమేమో వ్రాసి యాంధ్రులే వానరులనిరి. ఇప్పటిపల్లెకాపులగు మర్కాడులు మున్నగువారికిని రామాయణమునందు వర్ణింపఁబడినవానరులకును నేవిధమగుసంబంధమును గానరాదు. కపిశబ్దమునందును క, పలు కలవు. కాపుశబ్దమునందును క, పలు కలవు. ఈవర్ణసంబంధమునుబట్టియే కపులది కాపులది జాతియొక్కటియని వీరుతలంచిరి కాఁబోలు! ఈబాదరాయణసంబంధముంబట్టి కాపులే కపులగుచోఁ గాపులనబడువారెల్లరు గపులుకాక పల్లెకాపులు మాత్రమే కపులగుట యెట్లో శ్రీపంతులవారు తెలిపి యుండలేదు.

ఈండ్ర వారింగూర్చి

అక్కరములపోలికఁబట్టి యిట్టిభావముల మనము తేల్తుమేని కాపుకులజులగు కార్చెర్ల శ్రీనివాసరావుగారు వ్రాసినరీతిగా నీండ్రవా రింద్రకులులు గావలసి వచ్చును. ఇంద్ర శబ్దమునుండియే యీండ్ర శబ్దము పుట్టినది. ఈండ్రవా రింద్రకులులు కాఁబట్టియే వీరాకాశగంగతో సంబంధము గలవారుగానున్నారు. మన దేశమునందుఁగల యీడిగకాపులు వీరు తొల్లి యింద్రత్వమనఁగాఁ బ్రభుత్వముచేసిరని తెలుపుచున్నది. ఈట్ అనగాఁ బ్రభువు. దానికి "ఇఁక" ప్రత్యయముచేర్పగా "ఈడిక" యైనది. ఈడికనుండి యీడిగశబ్దము పుట్టినది. ఈట్ లనగా నింద్రులని దీనిభావము. ఈరీతిగఁ దెలుపుమనచ్చిన సత్యచారిత్ర మడుగంటదా! అది యట్లుండ మనవీరభద్రరావుగారు కపులనుగూర్చిన కథలోనుండి శూద్రులు పవిత్రులా యపవిత్రులా యను నంశములోనికి గంతిసి నేనుశూద్రులును బవిత్రులే యని కవిరాజు వన్నవాయిసీతారామరాజుగారి గ్రంథపీఠికలో వ్రాసిన యంశమును సధిక్షేపింపఁ జొచ్చిరి. శూద్రులును బవిత్రులే యని నేను నాయిష్టమువచ్చినట్లు దెలుపలేదు. పంచమవేదమగు భారతమును ప్రమాణముగా నిచ్చి యాయంశమును జెప్పినాను. అయ్యది "సర్వేవర్ణా ఋజనః" అనితెలుపుచున్నది. అన్నివర్ణములనఁగా బ్రాహ్మణ,క్షత్రియ, వైశ్యశూద్రులుపవిత్రులనిదీనిభావము. ఈవాక్యమునాం

గ్లభాషలోనిఁ బఠిత రత్నము చేసి "All the four castes are holy,, అని మన్మథనాథ దత్తుగారు లిఖించి యున్నారు.

ఇట్టి ప్రమాణములంబట్టి శూద్రులును పవిత్రులే యని నేను వ్రాసియున్నాను. శ్రీపంతులవారి వాదము నంతను నీవ్యాసములో ఖండించుట కవసరము లేదు. ఇది యిందులకు స్థానముంగాదు. గాన మరియొకపరి దానిం గూర్చి ముచ్చటించెద.

రామాయణకాలమందలి రామసేవకులగు వానరులు మానవత్వమునందు (దేహనిర్మాణము నందును, మెదడు యొక్క ప్రమాణమునందును) కొంత కొంతను కొంత పశుత్వమును, కలవారగుటచే వారిని హీనమానవులంటినే కాని యపవిత్రులను తలంపున నే నట్లన లేదని లోకము తలంచుగాక! శ్రీమద్రామాయణమునందలి వానరులు పల్లె కాపులు మున్నగువారివలె దేహాదిధర్మములచే నరత్వ పరిపూర్తి నందినవారు కారనియు, స్వల్పముగ పశుత్వమును నధికముగ మానవత్వమునుగల యొక మిశ్రజాతివారని లోకము గ్రహించుకొనును గాక.

చలముతీఱెనె? కన్నులు చల్లవడెనె?

గున్నేపల్లి అక్షయలింగము గారు

కలికి! నీకరుణాకటాక్షముల కెపుడు
దూరమైతినో? యపుడె దుర్వారతాప
వహ్నికీలల దహియింపఁబడితిఁ గాని
కాయమును బాయు భాగ్యమ్ముఁ గాంచనైతి.

లలివహించిన నీబాహులతలఁ జిక్కి
యుల్లమలరించు నీధుచెయ్వులకుఁ జొక్కి
యనుభవించిననాఁటి సౌఖ్యంపుఁ బెంపు
మరలఁగల్గునె? యెన్ని జన్మాలకైన.

అకట! నీదుకటాక్షమాలికల నాకుఁ
గట్టువడునట్టి భాగ్యంబె గలిగియున్నఁ
జేనఁటినైనె దైవ మిటు సాహసించి నన్ను
దూరదేశాలపాల్సేసి ద్రోహియగునె?

అక్కటా! దైవమును దూఱ నర్హమౌనె?
నిష్కళంకప్రపూతమై నెగడు నీదు
ప్రేమ మెప్పుడు వెల్వడె భిన్నగతిని
నపుడె దూరదేశాల పాలైతిఁ గాదె?

ఎన్నొ చిత్రాలఁ జూచితి నెన్ని యేని
వింతలను గంటిఁ గాని యేవంతనైన
ముద్దులొలికెడునీదు నెమ్మొగము వోలె
హాయి నొసఁగూర్పవయ్యె; నేమందు నకట!

ఎందు వెడలిన వింత లెన్నెన్ని గన్న
నీమృదూక్తియు, నీవ్యక్తి, నీదురక్తి
తలఁపునకువచ్చి నామది తాపమునకుఁ
బాలుపడఁజొచ్చె నీకెంతజాలి లేదొ?

అంతరించెనె? నీదుగాఢానురక్తి
సున్నయయ్యెనె? నాపయినున్న వలపు
పూజ్యమయ్యెనె? నాఁటి నీమోహమెల్ల
చలము తీఱెనె? కన్నులు చల్లవడెనె?

నక్షత్ర ప్రజాపతి

నిడుమోలు కనకసుందరం గారు, బి. ఏ.

ఆకలములు దినుచు కారడవుల నివసించి, సృష్టిరహస్యాలోచనముచే భగవదారాధన మొనర్చుచుండిన ఋషిపుంగవు లతి ప్రాచీనకాలమందే భగవంతుని యనంత ప్రభావమును ప్రకటించు జ్యోతిర్మండలములగూర్చి పరమోత్కృష్టమగు జ్ఞానమును సంపాదించి మనకు ప్రసాదించియుండిరి. బ్రహ్మప్రోక్తమని ప్రతీతివడసిన వేదములయందు సయితము,సూర్యారాధనక్రమము నిర్వచింపబడియున్నది. (ఋగ్వేదము 1 మం. 115 ఋక్కు చూడుడు)

సూర్యుడు

'వాజీనీతి సూర్యస్యయోషా' (7 మం. 75 ఋ)

యని ఉషాకన్యానాథుడుగను,

'ఉద్వేతి సుభగో విశ్వచక్షుః
సాధారణః సూర్యోమానుషాణామ్
చక్షుర్మిత్రస్య వరుణస్యదేవ
శ్చర్మేవయః సమవివ్యక్తమాంసి' (7మం. 63 ఋ)

యని వరుణమిత్రుల నేత్రముగను,

'ఉదుతిష్ఠ సవితః శ్రుధ్యాస్య
హిరణ్యపాణే ప్రభృతా వృతస్య'

యని హిరణ్యపాణి (బంగారుచేతులు గలవాడు)గను వర్ణించి,

'అయుక్త సప్త హరితః సధస్థా
ద్యార్యం వహంతీసూర్యంఘృతాచీ' (7 మం.60ఋ)

యని ఏడుగుర్రములరథము నెక్కి వచ్చునని సూచింపబడియున్నది.

వేదములయందు సూర్యునిగూర్చిన వర్ణనమేతప్ప, తదితర నక్షత్రముల వర్ణనముగాని, చంద్రుండు రాసులయునికిని గూర్చిగాని సూచించియుండలేదు. కాని బ్రాహ్మణములందు మాత్రము, ఒక్కసూర్యుని గూర్చియేకాక, తదితర నక్షత్రములను గొన్నిటినిగూర్చి యుదహరింప బడియున్నది. తైత్తిరీయబ్రాహ్మణమున (1 కాండ 5 ప్రపాఠక 2 అనువాకము)పుణ్య నక్షత్రమన నెద్దియో, యారీతిని నిర్వచించియున్నారు.

'యత్పుణ్యం నక్షత్రం తద్బట కుర్వీతోపవ్యుషమ్
యదావై సూర్యం ఉదేతి అథనక్షత్రం నైతి యా
వతి తత్ర సూర్యో గచ్ఛేత్ యత్రజఘన్యం పశ్యేత్'

దీనివలన, మనము పుణ్యనక్షత్రమును చూచుటకు, సూర్యదుషఃకాలమున నానక్షత్రము క్రిందుగా నున్నంతవరకే చూడవలయునని గ్రహింపవలసియున్నది. ఒకనక్షత్రము ప్రత్యూషోదయమైన సమయమునుండి, అది ప్రాతఃకాలమున ఊర్ధ్వబిందుప్రాంతములకు చేరువరకును, దానిని చూడవచ్చునని యిది సూచించుచున్నది. ఈయనువాకమునందే నక్షత్రప్రజాపతిని యిట్లు వర్ణించుచున్నది:—

మహోన్నతాకారుడగు దివ్యపురుషు నొకని నిర్మించియుండిరి. ఆతని యన్యాంగములసూచించుటకు వారు చిత్త, నిష్ఠ్య, విశాఖ, అనూరాధ అను నాల్గురాసుల నేరికొనిరి. ఇరువదియారు రాసులలో నీనాల్గింటినే వారేల ప్రత్యేకముగ గ్రహించిరో, మన మొకించుక శ్రద్ధతో విచారించిన గ్రహింపగలుగుదుము. 'చిత్'; (జ్ఞానము)నకు స్థానమగు శిరస్సు 'చిత్త' 'విశాఖ' (ద్విశాఖ) రెండు కొమ్మల వలె చీలిపోయిన యూరుద్వయము,'విశాఖ'; ఊరువులకు దిగువ భాగము(అను + ఊరు + అధః) 'అనూరాధ'; నిష్ఠ్య (ధనిష్ఠ) కుకూడ నిట్టి యర్థమేదియో యుండి యుండవచ్చును. సత్య నిష్ఠా (దీక్షా) పరమగు హృదయమును, '(ధ)నిష్ఠ' సూచించునటుల వర్ణింపబడియుండవచ్చును. ఈరీతిని, ప్రజాపతియొక్క నాల్గు ముఖ్యాంగములసూచించుట కెన్నుకొనబడిన నాల్గురాసులును సార్థకనామము గలవైయుండి యుండవచ్చును. కాని, యిదియంతయు నొక్క యూహయే. బ్రాహ్మణముల రచించిన కవి హృదయ మిద మిత్థమని యెవరుచెప్పగలరు?

ఈనక్షత్రప్రజాపతి నొక్కసారి వినా నోవీథియందూహింపుడు! హస్తానక్షత్రమాతని హస్తము, 'చిత్త'యాతని శిరస్సు...అశ్విన్యాదినక్షత్రములు అపమండలము (Ecliptic) యొక్కభాగములనియు, నవి యాకాశమున పశ్చిమమునుండి తూర్పునకు వరుసక్రమమున ...డియుండుననియు, నాకాశమును పరిశీ...శి వారెల్ల రెరుగుదురు. ఈయపమండల... 'హస్త'కుపిమ్మటనే 'చిత్త' వచ్చుట వలన, నక్షత్రప్రజాపతి హస్తమునకు దిగువనే ఆతని శిరముండినటుల యీచిత్తరువు ప్రదర్శించుచున్నది. అనగా, నక్షత్రప్రజాపతి 'ఊర్ధ్వబాహుడై' యున్నటుల వర్ణింపబడియున్నాడు. ఆతడు హస్తములను శిరమునకు పైగా నెత్తుకొనియున్నాడు. ఊర్ధ్వబాహుడగు నిట్టివ్యక్తిని నిర్మించుటయందలి పరమార్థము గ్రహించుటకు తైత్తిరీయ సంహితయందలి (౪, ౨, ౫, ౧) యీసందర్భమును చూడుడు:

'పురుషమాత్రేణ విమిమతే
యజ్ఞేన వై పురుషస్సంమితే
యజ్ఞపురుషైవైనంవిమిమాతే
యావాన్పురుష ఊర్ధ్వబాహుస్తావాన్భవతి.'

అనగా యజ్ఞపురుషునితో పోల్చిచూచినపుడు, యజ్ఞమునొనర్చువాడు, ఆతని చేతులెత్తిన నెంతయెత్తునకుపోవునో అంతయెత్తునకు పెరుగును. సాధారణముగా, నొకమానవుని యెత్తు యెంత యనినపుడు, ఆతని మస్తకము యెంత యెత్తుననున్నదో యనియే మనము గ్రహింపవలసియున్నది. కాని, యంతకుమించిన వృద్ధియంతయు నాతని యాధ్యాత్మిక వృద్ధిగనే మనమెంచవలెను. శరీరముయొక్క పరిమాణము పెరిగినకొలదిని, ఉన్నతప్రదేశమును చేతితో నందుకొనగలిగినట్లే, ఆధ్యాత్మికజ్ఞానమభివృద్ధిచెందినకొలదిని, జ్ఞానము క్రమముగ సమున్నతస్థానముల నాక్రమింపగలుగును. కాని, 'యెత్తినచేతియంతయెత్తున పెరుగుట' యనునది కొంత గూఢార్థమును కలిగియుండవచ్చును. జ్ఞానియగువాడు, సర్వ

వ్యాప్తమగు ప్రేమవలన తన దేహము నతిక్రమించి, సర్వవ్యాపియగు మహాపురుషునితో లీనమగును. వేదచరిత్రమున, సృష్టికర్తయగు విశ్వకర్మ ఆదర్శప్రాయమగు నొకయజ్ఞము నొనర్చి తానే, ఆహితాగ్నియందు దుమికి, సర్వవ్యాపియై, సర్వాత్ముడాయెను. అదియే అతనిఆధ్యాత్మిక పరిణామము. అటులనే, యజ్ఞమునొనర్చెడి ప్రతిమానవుడును, నిశ్చలమగు నట్టి యాధ్యాత్మికస్థితినే పొంది సర్వవ్యాపి యగును. నక్షత్రములనగా, "నశింపనివి" యని వ్యాఖ్యాన మొనర్చినచో, నివియే, అట్టి నిశ్చలమును, మరణరహితమునగు నుత్కృష్టస్థితిని సూచించుటకు అర్హములు. యజ్ఞకర్మలనొనర్చెడి ప్రతిమానవుడును, జగమున కాదర్శప్రాయుడగు, విశ్వకర్మను, అనగా ప్రజాపతిని పూజింపవలసియున్నది. కావున నీనక్షత్ర హస్తమునుబట్టి, యూర్ధ్వబాహుడగు నక్షత్ర ప్రజాపతి నిర్మించుట చూడగా హస్తనక్షత్రము ప్రతియేటను సూర్యోదయమునకు పూర్వము ప్రాగుదయమగుచు నరులెల్లరును 'ఋతజు'లై యుండవలెనని నిరంతరముద్బోధించుటకేమో యనునట్లున్నది.

ఇది బ్రాహ్మణములందు వర్ణింపబడిన నక్షత్ర ప్రజాపతి చరితముకాని, పురాణములందీపురుషుని వర్ణనమతి చిత్రముగను, సంపూర్ణముగను చేయబడియున్నది. మత్స్యపురాణమున, శివుడా నక్షత్రపురుష నర్చించువిధానము నారదున కుపదేశించుచు, నాతని నిట్లు వర్ణించి యున్నాడు.

"(౧) మూలే (నమోవిశ్వధరాయ) పాదౌగుల్ఫా (ననన్తాయచ) (౨) రోహిణీ(షు) జంఘేతు (పూజ్యే వరదాయ చైవ ద్వేజానునీ) (౩) చాశ్వికుమార ఋక్షే. (౪) పూర్వా (౫) త్తరాషాఢ యుగే ఊరూ (౬) పూ(౭)ర్వోత్తరా ఫల్గుని యుగ్మకేద, మేఢ్రం కటిం ...(౮)కృత్తికా,(౯×౧౦) భాద్రపదద్వయేదపార్శ్వే, కుక్షిద్వయం (వారద) (౧౧) రేవతీషు. పృష్ఠంగనిష్ఠా (౧౨) (౧౩) విశాఖా...సుభజాశ్చ..., (౧౪) హస్తే పిహస్తౌ... (౧౫) పునర్వసా వంగుళీ పర్వభాగా. (భుజంగ నక్షత్ర దినేనఖాని సమ్పూజయేన్మత్స్య శరీరిణశ్చ, కూర్మస్యపాదౌ శరణం ప్రపద్యే) (౧౬) జ్యేష్ఠాసు కంఠే...(౧౭) శ్రవణేన సమ్యక్ (౧౮) పుష్యేముఖం (౧౯) స్వాతీషుదన్తాగ్రం...(౨౦) మఘాసునాసా... (౨౧) మృగోత్తమాంగేనయనే...లలాట (౨౨) చిత్రా ...శిరో(ఖిల్యాజ్యం) (౨౩) భరణీషు...(౨౪) ఆర్ద్రా సుకేశాః, (మత్స్య పురాణము—౫౪-(౧౦-౨౦)"

నక్షత్రపురుషుని సర్వాంగకములు,యిరువదినాలుగు రాసులతో పోల్చి వర్ణించినటుల యీపైన పొందుపరచిన భాగమునుండి విదితము కాగలదు. ఇటులనే బృహత్సంహిత (౫౮, ౧౦౫)యందు నక్షత్రపురుషుడొకడు వర్ణింపబడి యున్నాడు. బృహజ్జాతకమందు (అధ్యా ౧ శ్లో ౪), పండ్రెండురాసులనుకూర్చి 'కాలపురుషుడు' నిర్మింపబడియున్నాడు.



'ఫైజీ' కృత ఫారసీ రామాయణమునందలి చిత్రము

* 'ఫైజుజీ' కృత ఫారిసి రామాయణమునందలి పత్రము.

* దీనిని పదునాఱవశతాబ్దమున అక్బరుచక్రవర్తియాజ్ఞానుసారము ఆతని ఆస్థానపండితుడగు ' బదౌని ' అనువారదు రచించినట్లు చరిత్ర తెలుపుచున్నది. కాని 'సువర్ణమాల'యందు ప్రకటించినట్లు ' ఫెయిజీ' కృతముగా చూపట్టదు.

వైరాగ్యపంచకము

చింతలపూడి శేషగిరిరావుగారు

ఉ. రుజఠరాగ్ని పీడితున కూరటఁగూర్పవె యుంఛవృత్తిచే
దొరకిననాల్గు గింజలవి? తోయము గ్రుక్కెఁడు శాంతిసేయదే?
యరయ నయత్నలబ్ధమలినాంబర ఖండముఁగట్టఁ గూడదే?
పరమనృపాధమాధములఁ బండితు లేలనుగొల్వ? నక్కటా!

గీ. మరణపర్యంతమిట్టు లమానుషముగ, నుదరపోషణ మాత్రకై యుర్విమీఁదఁ
బ్రభుని సేవన మొనరించి పడసినట్టి, ధనముధనమౌనె? యద్దిదంధనముగాక!
కననుదూధ గోవర్ధనధనము ధనము! ధాత్రి నాధనంజయువివర్ధనము ధనము!
(?)తలఁపగాఁ బండితసమారాధనము ధనము! కనుక నిదె సుసాధన మబాధనము ధనము!


గీ. ఇదె! దురీశ్వరద్వారబహిర్వితర్ది, కాదురాసికా! మా నమస్కారమమ్మ!
అమితనిరపాయమై యంజనాభమగుచు, మును ధనంజయు స్యందనభూషణమ్ము
గాఁగ పరలిన ధనమె పో! కలదు మాకు.

మ. చతురంభోధిపరీతమై తనరు నీక్ష్మాచక్రమం దొక్కచో
శతభాగంబునకేను రాజనని మోజన్ గర్వ సంరంభుఁడై
పతితుండైన నృపాధమాధముని నే వర్ణింప; నారుక్మిణీ
పతి, జీర్ణాంబరుఁడీయ దోసెఁడటుకుల్ భక్షించి యవ్వానినిన్
మితిలేనట్టి ధనాఢ్యుఁగా సలిపె, స్వామిన్ వానిఁ గీర్తించెదన్.

గీ. జలధిగర్భంబునం దురు జ్వాలతోడ, నాకులముగ మండెడు బడబాగ్నిపగిది
మాఁకుజఠరాగ్ని మండినమండుఁగాక! ధరనముత్ఫుల్లమల్లీమతల్లికాప
రిమళము దనరు మావాగ్ఝరిని వృథావ్యయంబు సేతుమె? నరవరయాచ్ఞకొఱకు.

* * * * *

గీ. చెంతఁబిత్రార్జితమ్ము సుమంత లేదు, లేశమును స్వార్జితంబైన లేదు మాకు
గాని పైతామహంబయి కాచునట్టి, యాస్తిగలదు వలసినంత హస్తిగిరిని.



వేదాంత విమర్శ

సుపర్ల రామశాస్త్రి గారు

మంగళాచరణము

"విధర్తారం హవామహే, వసోః కువిద్వనాతినః సవితారం నృచక్షసమ్."

ఓం, నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సంప్రదాయ కర్తృభ్యో వంశఋషిభ్యో గురుభ్యో నమోమహద్భ్యః.

ప్రమాణములు

మనము చిలుకను చూచుచున్నప్పుడు మరియొకరు మనసమీపమునకు వచ్చి "అయ్యా! దేనిని చూచుచున్నారండి?" అని ప్రశ్నచేయగా, "చిలుకను చూచుచున్నానండి" అని సమాధానమును చెప్పుదుము. "అయ్యా! కొంగనుచూచుచు చిలుకనంటున్నారేమి?" అని వాడు మరల ప్రశ్నచేయగా, 'పాపమయ్యా, నీకు కొంచెము దృష్టితగ్గినట్లున్నది. ఇదెక్కడకొంగ, చిలుకేనయ్యా' అనిచెప్పగా, 'కాదు కాదండీ, కొంగే' అని యెన్నిపర్యాయములు బోధపరచినను, మనమువానిమాట నమ్ముదుమా? ఈలాగునవే మన జ్ఞానేంద్రియములలో నేయింద్రియము చేతనైనను మనము గ్రహించెడు విషయమునకు విరుద్ధముగ నెవ్వరేమిచెప్పినను దాని నెంతమాత్రము మనము నమ్మము. కనుక ఇంద్రియమునకును వస్తువునకును అవ్యవహిత సంబంధమువలన పుట్టినజ్ఞానమే ప్రత్యక్ష ప్రమాణము.

అనుమానము

అన్నివిషయములలోను మన యనుభవము చేతనే యథార్థమును తెలుసుకొనజాలము. కాబట్టి కొన్నికొన్ని విషయములలో మన యూహలచేతనే నిజమును తెలిసికొనవలసియున్నది. ఇట్టి యూహలే అనుమాన ప్రమాణము.

శబ్దప్రమాణము

ఒకమనిషి, తాను బ్రతికియున్నంతకాలము విమర్శించినను, అనుభవముచేతను, యుక్తిచేతను అన్నివిషయములయందును నిజమును కనుగొనుట సాధ్యము కాదు. కనుక ప్రాచీన బుద్ధిశాలురు, అదే పూనుకుని బహుపట్టుదలతో అనేక సంవత్సరములు విచారణచేసిచేసి ఇదమిత్థమని నిర్ణయించి వ్రాసిన గ్రంథములను చదివిచదివి యథార్థజ్ఞానమును సంపాదించుకొనుటయు అత్యావశ్యకమే. కావున మావిషయములో నిజమును తెలిసికొనుటకు గొప్పవారు అత్యనుభవశాలురై బహు బుద్ధిమంతులని ప్రసిద్ధికెక్కిన అనేక మహర్షులవలన యావిర్భవించిన గ్రంథములను చదువుటకన్న సుపాయాంతరము లేదు. మనమతగ్రంథములలో ప్రధానమయినదియు, భారతులందరిచేతను పరోక్షాత్కృష్టమని వేయినోళ్ల పొగడబడుచున్నదియును, సర్వవిషయములను నిరాఘాటముగ చెప్పుచున్నదియును వేదముగావున నీ వేదమేశబ్దప్రమాణము.

శబ్దవిచారము

మతవిషయమున మనము విచారణము చేయవలయునెని, శ్రుతి, యుక్తి, అనుభవము, యీమూటిని అనుసరించియే విమర్శింపవలయును. యుక్త్యనుభవములు పరిపక్వమగునపుడు శబ్దప్రమాణమును దీసికొనవలయును. ఈశబ్దము మహర్షులయొక్క తపస్సునుపురించి భగవద్దత్తమైన స్ఫురణవలన బుట్టినదిగాని వారివారి బుద్ధ్యనుసారముగ రచించినదిగాదు. కావున మహర్షులు సమాధియందున్నపుడు భగవద్దత్త స్ఫురణవలన యావిర్భవించినది కనుకనే మనప్రత్యక్షానుమానములకు పరిపడనివిషయములలో శబ్దమున చెప్పబడినదే నిజమని నమ్మవలయును.

ఈశ్రుతులు:— 1 ఋక్కులు; 2. యజుస్సులు; 3. సామములు 4. అథర్వణము, అని నాలుగు విధములు గనున్నది.

ఇందు పాదనియమము గలిగి ఛందస్సుతో గూడిన మంత్రములు ఋక్కులు.

పాదనియమముగాని ఛందస్సుగాని లేక కేవల వాక్యరూపముగనున్నవి యజుస్సులు.

గానముచేయుటకు తగియున్నవి సామములు.

మంత్రములయర్థమును ఎలె మంత్రముచే సాధింపదగిన పనులనుచేయుక్రమము సయితమును తెలియ జేయు వేదభాగములు బ్రాహ్మణములు (అథర్వణములు) అని చెప్పబడును.

ఇట్టివేదముయొక్క పూర్వభాగమున వాయు, అగ్ని మొదలగు పంచభూతములయొక్క స్తోత్రములును, ఆపంచభూతములయందు నధిష్ఠించియున్న దేవతలయొక్క ప్రీతినిమిత్తము చేయదగిన యాగాదికర్మలును మాత్రమే చెప్పబడియున్నవి.

క్రమక్రమముగ నా మహర్షులలో సమాధినిష్ఠులైనకొలది తత్త్వవిచారమనీమ. భగవదనుగ్రహమువలన బుట్టినది. ఈతత్త్వవిచారము ప్రభవించిన పైని వారికి సమాధినిగలిగిన స్ఫురత్తువలన మరియొకవిధమైన వేదముద యించినది. అపుడు వారు మొదటి వేదభాగమునకు పూర్వభాగమనియు, రెండవభాగమునకు ఉత్తరభాగమనియు నామకరణముచేసిరి. ఉత్తరభాగమున బ్రహ్మమునుగూర్చియు, జీవపరమాత్మలయొక్క సంబంధమునుగూర్చియు బాగుగ చర్చింపబడియున్నది. ఈవేదభాగములకే ఉపనిషత్తులని పేరు. వీటియందు కర్మలవలన నేమియు ప్రయోజనము లేదనియును, తత్త్వవిచారమే మోక్షసాధనమని యును స్పష్టముగ నుపదేశింపబడినది.

మతములు.

ఈ యుపనిషత్తులనే యాధారముగ జేసికొని,

1. కపిలుడు సాంఖ్యమతమును;
2. కాణాదుడు వైశేషికమతమును;
3. గౌతముడు న్యాయమతమును;
4. పతంజలి యోగమతమును;
5. జైమిని మీమాంసాశాస్త్రమును,
6. వ్యాసులు వేదాంతమతమును

వ్రాసిరి. ఈయారును షడ్దర్శనము లనబడును. ఈషడ్దర్శనములలో నేదైననొకటి యుపనిషన్మతము గావచ్చును. కాని ఆరును కానేరవు. లేదా యీ యారింటికిని భిన్నమైనదిగను గూడ నుండవచ్చును. కాని యీ యారు నెన్నడును కానేరవు. ఈ యారింటియందును కొన్ని గుణములవలె దోషములుగూడ నుండుటచేత నేదైన నొక్కటి నిజమనియు తక్కినవి యబద్ధమనియును చెప్పుట కవకాశము కానరాదు.

షడ్దర్శన సామాన్య ధర్మములు

ఈ మతస్థులవారును,

1 ఆత్మనిత్యము.

2 పరమాణువులు నిత్యము.

3 ఈపరమాణువులు స్థూలవస్తు నిర్మాణ కారణములు.

4 జీవాత్మ దేహ సంబంధమును గలిగి యున్నపుడే శుభాశుభ కర్మజన్యఫలము ననుభవించును. జ్ఞానాదిశక్తులను గలిగియుండును.

5 ఈ శుభాశుభకర్మజన్యఫలానుభవము స్వర్గః రకములయందున్న సుఖదుఃఖానుభవముతో సమాప్తినొందక కుండలోని నీటిని తీసివేసిన పైని యాకుండ నంటియున్న పాచివలె కొంత నిలిచియుండినందున దాని ననుభవించుటకు జీవాత్మ జన్మించును.

6 సమస్తకర్మలు బంధహేతువులయి జీవాత్మకు జననమరణములను కలుగచేయుచున్నందున, ముముక్షువు పాపకర్మలను చేయుటయే మాని, పుణ్యకర్మలనుచేయుచు ఫలత్యాగము చేసి, కనక, కాష్ఠ, సుహృత్, అరి, ఉదాసీన, బంధువులయందు సమబుద్ధికలిగి, అన్నిటి

సంబంధమును విడిచికొని యుండవలయును.

అని బోధించుచున్నారు.

మతకర్తల యభిప్రాయములు

సాంఖ్యయోగము పేరునకు భిన్నముగానున్నను వాటిసిద్ధాంతములు పరస్పరభిన్నములుకావు. ఈరెండు మతములవారును:—

1. ప్రకృతి స్వతంత్రము.
2. ఇదే జగత్కారణము.
3. ఆత్మప్రకృతులు అనాదిసంబంధులు.
4. ప్రకృతిపరిణామమే బుద్ధి.
5. ప్రకృతియొక్క కర్తృత్వము ఆత్మయందు ఆరోపింపబడినది.
6. ఇంద్రియములద్వారమున బుద్ధిపరిణమించుటయే తెలివి.

అని చెప్పుచున్నారు.

[సాంఖ్యులు ఈశ్వరుడు లేనేలేడందురు. యోగమతమువారు ఈశ్వరసత్తనంగీకరించినను అతనిప్రాముఖ్యమును ఒప్పుకొనరు. కావున, ముఖ్యాంశములలో నీరెండు మతములకును విశేషభేదమున్నట్లు కనిపించదు.]

న్యాయ, వైశేషికశాస్త్రములు యుక్తివాదమును గూర్చియు, పదార్థములనుగూర్చియు చెప్పును. ఈయుభయమతములవారును:

1. పరమాణు సంయోగమువలన ప్రపంచము పుట్టుచున్నది.
2. ఈయణువులు ఒకనిచే సృష్టములు కావు.
3. ఇవి నిత్యములు. అదృష్టముచే సంయోగించును.
4. జీవులు అపరిమితములు, నిత్యులు.
5. జీవుడు దేహాధిష్ఠాత.
6. ఈజీవుడు వేదోదిత కర్మలాచరించి ఆత్యంతిక దుఃఖనివృత్తినొంది సుఖదుఃఖముల ననుభవింపక యుండుటే ముక్తి.

యనియును చెప్పుచున్నారు.

[ఈజీవస్థితికిని పాషాణస్థితికిని ఏవిధమైన భేదము కానరాదుగావున, ఇది పాషాణముక్తియని యాక్షేపించుటకు నవకాశమున్నది.]

మరి కొంతికాలము పోయినతరువాత, వైశేషిక, న్యాయగ్రంథ వ్యాఖ్యాతలు

1. పరమేశ్వరు డున్నాడు.
2. ఈయన జగత్తునకు నిమిత్తకారణము.
3. పరమాణువులు ఉపాదాన కారణము.
4. జగత్తు సావయవము గావున సృష్టము.
5 సృష్టికర్త, జీవభిన్నుడు, సర్వశక్తికలవాడు.
6 ఆయన అనుమానప్రమాణబోధ్యుడు.

అని చెప్పుచున్నారు.

[7. ముక్తియందు గౌతమ కాణాదులలో నేకీభవించు చున్నారు. (అనగా పాషాణముక్తి).]

జైమిని విరచిత మీమాంసాశాస్త్రమునకు

పూర్వమీమాంస, కర్మమీమాంస

అని రెండుపేర్లు.

1. దీనియందు తత్త్వవిచారము సున్న.
2. బ్రాహ్మణములచేతను మంత్రములచేతను చెప్పబడిన కర్మలను గురించి విస్తారముగ వ్రాయబడినది.
3. ఇందు, వేదవిహిత కర్మాచరణమే పరమార్థము.
4. వేదములు నిత్యములు.

5. దీనియందు మహాత్వమున్నది.

అని మాత్రము వ్రాయబడినది.

ఈమతస్థులలో నెల్ల అగ్రగణ్యుడయిన భాట్టులు

1. అఫలాపేక్షగ యజ్ఞాదులను చేసినచో మోక్షము లభించును.
2. వేదమంత్రమే దేవత.
3. ఫలమును ప్రసాదించు చేతనమైన దేవుడు మరియొకడు లేడు.

అని వ్రాసియున్నాడు.

గ్రంథారంభము

ఉత్తరమీమాంస

ఇది వ్యాసవిరచితము. దీనికి వేదాంతశాస్త్రమని యును బ్రహ్మసూత్రములనియును రెండునామములు.

దీనికి 1. శంకరాచార్యులు, 2. రామానుజాచార్యులు, 3. మధ్వాచార్యులు ఒక్కొక్క రొకొక్క భాష్యమును వ్రాసినారు.

శంకరులు అద్వైతమతమును, రామానుజులు విశిష్టాద్వైతమతమును, మధ్వాచార్యులు ద్వైతమతమును స్థాపించినారు. ఈమూటిలో నేదైన నొక్కటియే వ్యాసమతము కావచ్చును. లేదా మూటికంటె భిన్నము కూడ కావచ్చును. ఈముగ్గురు భాష్యకర్తలును కొంత వరకునైన వ్యాసమతము ననుసరించుచునుండవచ్చును. కొంత వరకు ననుసరింపక పోవచ్చును. ప్రస్తుత మీ మతత్రయము లోను మిక్కిలి ప్రాచీనము అద్వైతము. అనేకులు దీనిన వలంబించుచున్నారు. అద్వైతమతభాష్యకర్త శంకరులు.

1. ఆదియం దొక్క బ్రహ్మమే యున్నది.
2. అది సత్యజ్ఞానానందాత్మకము, నిర్వికారము, నిరవయవము, నిత్యము, నిర్దోషము, సర్వవ్యాపకము.
3. జగత్తు, పరమార్థముగ సత్యముకాదు. వ్యావహారిక సత్యము.
4. మాయ(అవిద్య)కు బ్రహ్మములోబడినది.
5. ఈవిద్య అబద్ధము (మిథ్య), జడము, సవికారము, సావయవము, అనాది.
6. దీనియందు, ఆచ్ఛాదక, విక్షేప, అనెడు రెండుశక్తు లున్నవి.
7. జీవులన్నియు బ్రహ్మమే.
8. అవిద్య (మాయ) తన యాచ్ఛాదక శక్తిచే జీవుని తనస్వరూపమును తెలిసికొనలేకుండ జేయుచున్నది.
9. విక్షేపశక్తిచే, జీవుని తనకు రూపభేదమున్నట్లు భ్రమపెట్టుచున్నది.
10. 'తత్త్వమసి' ఇత్యాది వాక్యజన్యజ్ఞానమువలన, అవిద్యనశించి స్వస్వరూపజ్ఞాన ముదయించుటయే మోక్ష

మనియును సిద్ధాంతీకరించినారు.

[అద్వైతులు బ్రహ్మసత్త నొప్పికొన్నను, అబ్రహ్మము తానేయనుటచే, భగవదాజ్ఞకు లోబడి ఆయన నుపాసించుట సంభవించదు గాన, భగవంతుడు లేడనెడు నాస్తికులకును, ఈఅద్వైతులకును భేదమేమియును లేదు. కనుకనే వీరు ప్రచ్ఛన్నబౌద్ధులని లోకములో ప్రవాద ముండవలసే యున్నది.]

మరియు నీయద్వైతులలో మరికొందరు:—

1. ఒక్కసూర్యుడు, నీటికుండలలోను ప్రతిఫలించినట్లు, బ్రహ్మము మానవుల యొక్కయంతఃకరణములయందు ప్రతిఫలించును.
2. ఆనీటికుండలయందు అనేకసూర్యబింబములవలె గనుపడినట్లు అంతఃకరణములలో బ్రహ్మము అనేకరూపములుగ దోచును.
3. ఆకాశమునందున్న సూర్యబింబమున

కును, ఘటాదులయందున్న ప్రతిబింబములకును భేదము లేనట్లుగనే, బ్రహ్మమునకును అంతఃకరణలయందు ప్రతిఫలించిన బ్రహ్మ ప్రతిబింబములకును భేదము లే

దని చెప్పుచున్నారు.

[ఘటాదులలో సూర్యుడు ప్రతిఫలించినట్లే అంతః కరణలలో బ్రహ్మము ప్రతిఫలించు నని చెప్పినయెడల ఘటాదులయందు సూర్యబింబము లేనట్లే అంతఃకరణల యందును ఆత్మలును లేవు అని చెప్పవలయును. ఈ యాత్మలు మిథ్యలగునెడలవాటికి, జ్ఞానము, తత్త్వవిచారము, లోకవ్యాపారము ఎట్లు సంభవించును? అను పూర్వపక్షము జాగరూకమయియున్నది]

రామానుజులు, విశిష్టాద్వైతభాష్యకర్త. ఈయన

1. జీవునకును, ఈశ్వరునకుగల గుణములే యున్నవి.
2. జీవుడుపరమాత్మకు లోబడి యుండవలెను.
3. ఈశ్వరుడే విష్ణువు. ఇతనికి దివ్యమంగళ విగ్రహ మున్నది.
4. మోక్షస్థానము వైకుంఠము.
5. లక్ష్మి యాతని భార్య

యనియును సిద్ధాంతపరిచినారు.

విశిష్టాద్వైతమున:—

[1. ఈశ్వరునకు రూపమున్నది. 2. భార్య గలదు, అని సాధించుట కష్టతరము.]

మధ్వాచార్యులు ద్వైత భాష్యకర్త.

1. జీవేశ్వరులకు భేదమున్నది.
2. ఈశ్వరుడు విష్ణువు.
3. జీవులు పరస్పర విలక్షణులు.
4. ఈశ్వరునకు రూపమున్నది.
5. పరలోకమునందుగూడ జీవులు పూర్వ రూపముతో సమానరూపములతోనే పరమపదమును బొందుదురు.

అని సిద్ధాంతము చేసినారు.

ద్వైతమతమునందు మరణానంతరమున జీవులకు పూర్వదేహ సమానదేహములే యుండును అని సాధించుట కష్టాత్కష్టతరము.

ఇన్ని భాష్యములనుబట్టి యాలోచించినను వ్యాసాభిప్రాయ మేమో స్పష్టపడినట్లు కానరాదు. కావున వ్యాసాభిప్రాయ మెట్టిదో శ్రుతి, యుక్త్యనుభవములచే విచారింప బడును.

బ్రహ్మసూత్రరచనా కారణము

ద్వాపరమున 12 సంవత్సరములు క్షామము పెట్టినది. అనేకమహర్షులు కరవుతీరువరకు తమ్ము పోషించవని గౌతముని వేడిరి. అత డందులకంగీకరించెను. కొంత కాలమునకు దేశము సుభిక్షమయినది. మహర్షులతనిమహిమకు మత్సరపడి యాతనికపకీర్తిబుట్టించిపోవుదమని యాలోచించి, దర్భతో గోవుజేసి యాగౌతముని అగ్నిహోత్రగృహమున విడిచిరి. గౌతములు దానిని చిన్న దర్భపుడకతో గొట్ట నది మాయగోవుగాన మృతినొందినది. ఈమునులు, "ఓగౌతమా! నీవు గోహత్యచేసిన పరమపాపాత్ముడవుగాన నీతో మాట్లాడకూడదు. నీపాపిష్ఠియన్నము తినగూడదు. మేము నీయాశ్రమమును విడిచిపోవుచున్నాము." అని పలుక నాగౌతముడు "ఓమహాత్ములారా! నాయందు దయచేసి నన్ను పునీతునిజేయుడి. అని ప్రార్థించుచున్నాను."అని గౌతముడా మునులను వేడె వారు, "సరే, స్నానమాడిరా? ప్రాయశ్చిత్తము చేసెదము." అనగా గౌతముడు స్నానార్థము బోవుచు, 'ఏమి యీయాశ్చర్యము దర్భకర్రతో గొట్టినమాత్రమున నావు చచ్చునా! దీనినిజము గనుగొనవలయును." అని యాలోచించి యాతడు దివ్యదృష్టిజూడ నీమునులాచరించిన దుశ్చేష్ట యాతనికి స్పష్టముగ దెలిసెను. పిదప నతడు స్నానమాడి యాహ్నికముదీర్చుకొని యాశ్రమమునకేతెంచి మునులనుజూచి, "మునులారా! మీరందరు కృతఘ్నులుగాన మీయందు గాయత్రి పరిభ్రష్టయగుగాక!

మీ బ్రహ్మజ్ఞానము నశించుగాక!" యని శపించెను. మును లయందు బ్రహ్మజ్ఞానము నశించినచో జ్ఞానోపదేష్టలు లేనందున క్రమక్రమముగ లోకము నిరీశ్వర మగునని పర మాత్మ, విష్ణువునకు తాను వ్యాసరూపమున నవతరించి యతి సులభముగ బ్రహ్మజ్ఞానము మనుజులకు కలిగేటట్లు చేయవలయునని సంకల్పము నుబుట్టించెను.

విష్ణువట్లవతరించి జ్ఞానోదయమునకు ముఖ్యకార ణములయిన యుపనిషత్తుల యర్థము సులభముగ బోధ పడుటకు బ్రహ్మసూత్రములను వ్రాసెను. కావున,

[గౌతమశాపమున మానవులయందు నష్టప్రాయ మయిన బ్రహ్మజ్ఞానముయొక్క పునరుద్ధరణార్థము, వ్యా సరూపమున నవతరించిన విష్ణువు బ్రహ్మసూత్రములను వ్రాసెను. కాని జీవుడే బ్రహ్మయని సాధించుటకు కాదని పురాణములలో గానవచ్చుచున్నది.]

బ్రహ్మసూత్ర రచనాక్రమము

శ్రీవ్యాసులు బ్రహ్మ సూత్రములను వ్రాయున పుడే, భాష్యకర్తలు, వారివారి యిచ్ఛానుసారముగ విషయ శ్రుతులను తీసికొనుదురేమో యని సూత్రములను తరుచుగ విషయ శ్రుతిపద ఘటితము లయ్యేటట్లుగనే వ్రాసినారు.

ఉదాహరణార్థ మీ క్రింద నొకటిరెండు సూత్ర ములను మాత్రము వ్రాయుచున్నాను.

బ్ర. సూ. 'అత స్త్వితర జ్జ్యాయోలింగాత్.'(3-4-39)

వి. శ్రు. 'అతః కనీయసా ఏవ దేవా జ్యాయసా అసురాః' ఇందు జ్యాయస్, అను మాట సూత్ర మునందును శ్రుతియందును గూడ కనబడుచున్నది.

బ్ర. సూ. 'ఉపమర్దంచ' (3-4-16)

వి. శ్రు. 'ఓమిత్యుచ్చా ర్యాంతరిత మాత్మాన మభి పశ్యేదుపమృద్య పుణ్యంచ పాపంచ కామ మాచరంతో బ్రహ్మైన వ్రజన్తి.'


ఇందు 'ఉపమృద్'పదము శ్రుతి సూత్రములలో నున్నది. ఇట్లు చాలాసూత్రములు వ్రాయవచ్చును. బుద్ధి మంతులకు నొకటిరెండు దృష్టాంతములు చాలునని విర మించుచున్నాను.

సూత్రార్థ నిర్ణయక్రమము

విషయశ్రుతియొక్క అర్థమును భాష్యకర్తలు వారివారి యిచ్ఛానుసారముగ చెప్పుచుందురేమో యని సంశయించి, వారట్లు చెప్పినయెడల నాయర్థము లేనియభి ప్రాయమునకు భిన్నమగుటవలన చదువరులకు నిజమయిన జ్ఞానము కలుగదు. వారికి ముక్తిరాదు. అపుడు భగవదా జ్ఞానుసారముగ తాను చేసిన ప్రయత్నము నిష్ఫలమగును అని విషయశ్రుత్యర్థములను, శ్లోకరూపముగ తాను నూతన ముపదేశించిన పురాణములలో విషయశ్రుతిప్రతీ కముల నుదహరించుచు నుపదేశించినారు.

కాబట్టి పురాణశ్లోకానుసారముగ విషయ శ్రుత్య ర్థమును, ఈ విషయశ్రుత్యర్థానుసారముగ సూత్రార్థమును చెప్పిన బ్రహ్మజ్ఞానము మానవహృదయములందు స్ఫురిం చును.

కావున పైని వ్రాయబడినరీతిని సూత్రార్థమును చెప్పవలయునని వ్యాసనిర్ణయము. మరియొకతీరున జెప్పిన యర్థము వ్యాసమతవిరుద్ధము, వ్యర్థము.



గులాబిపువ్వు

నాదెళ్ల వెంకట్రావుగారు, బి. ఏ.

నవమలసౌరభంబు వెదచల్లునొయారపుఁబూలరాణి, నీ
యుదయము నేనులేవఁగనె యుజ్జ్వలకాంతులఁజిమ్ము చీవు నా
యెదుటను తోఁటలోనఁ గనుపించితి వంచితలీల నంత నా
హృదయము పొంగె నిన్ననుట కెందుకొ కాని గులాబిపుష్పమా!

తే. గీ. కనులపండువుసేయు నిన్గాంచినంత, వింతసంతోషమొందె నా స్వాంతమెంతొ!
ఏమిశుభమయ్యెడునొ కాని యీదినంబు, ప్రొద్దునన లేచి నినుఁజూచు పున్నెమబ్బె.

తే. గీ. అత్తరుంబూసి మొతయున్ మెత్తనైన, జిలుగుచెంగావి వలువ సొంపొలయఁ దాల్చి
చెలువులొలికెడు సుందరీతిలకమట్లు, కులుకుచున్నావు తోఁటలోపల గులాబి!

చ. మొదటనినుంగనుంగొనఁగ మోదమదెంతయొ కల్గెఁగాని నీ
కొదవఁగనున్న పాటు మది నూహయొనర్పఁగఁ జాలిపుట్టె నే
పడనిముసాలకోయికను ప్రాణముఁ బాయుదుగాదె భామినుల్
చిదిమి శిరస్సులందు నినుఁజేర్చినయంత గులాబిపుష్పమా!

మ. అహిమస్త ప్రవిభాసిభాసురవిలాసానర్ఘ మాణిక్యముల్
గ్రహియింపన్ గమకింపఁ గన్నుమనికోరల్ చూపుగా సర్పముల్
బహుచిత్రద్యుతి బంధుర ప్రకట సత్పత్ర ప్రభాశోభియా
విహగంబు న్వెసఁబట్టఁబోవనె గురు న్వేగంబ విన్వీథికిన్.

తే. గీ. ఎదురుకొనుటకు నవయవం బేమిలేక, పాఱిపోవుటకేనియు వశముగాక
క్రూరమానవకరముల బారినిబడి, మాఱుమాటాడకక్కటా, మడియుదీవు!


మ. వనజాతాసనుఁ డెంత నిర్దయుఁడొ నీపైఁ! గానిచో నక్కటా
నినుఁగాపాడఁగలేని ముండ్లొసఁగె, నంతే కాని వేఱేమి సా
ధనసామగ్రి సృజింపఁడయ్యెను భవత్సౌందర్యమే నీకు నా
శనము౦ దెచ్చెడి హేతువౌటఁ గలిగెన్ సంతాప మెంతేనియున్.

ఉ. అందముచిందు వస్తువు లనంతము లున్నవిగాదె యీజగం
బందు ముదంబొసంగునవి యైనను కాలము రాకముందతే
చెందును కొన్ని నాశనము, చెల్వునశించి కృశించుఁ గొన్ని వా
నిం దిలకించి మానస మనిర్వచనీయవిచార మొందెడున్.


సీ. కోమలత్వనిధాన కుసుమతారుణ్యంబుఁ, బలుగాకిభ్రమరంబు పాడుచేయు
నవమానసుషమావిలసదామ్రకిసలంబుఁ, గోయిలమొదలంటఁ గొఱికివేయు
మహనీయమాధురీమహిమాస్పదఫలంబుఁ, దుంటరి పురుగెక్కి తొలిచివేయు
వనజారి సంకాశ మనుజాస్యము మశూచి, వికృతంబుగాఁ జేసి విడిచిపెట్టు

గీ. దైవయోగంబు నెవ్వరు దాటఁగలరు, భువిని జీవించినన్నాళ్లు కవులకెల్లఁ
బ్రవిమలానంద మొసఁగు నీబ్రతుకె బ్రతుకు, లలితకాంతులకోవ! గులాబిపూవ!


శ్రీకృష్ణాశ్రమము, పెద్దపాళెము, కృష్ణాజిల్లా



ఆశ్రమముయొక్క ప్రక్కవైపు




ఉపాధ్యాయులు, విద్యార్థులు



దైవప్రార్థనము



విద్యార్థులు, భోజనము



వింజమూరి పార్థసారథి అయ్యంగార్ [సాహితి సమితి సభ్యుడు]

శ్రీ నల్లపాటి హనుమంతరావుగారి ఆహ్వానాన్ని అనుసరించి ఒకనాజు ఉదయం ప్యాసెంజరులో పెదనల్లపూడి వెళ్లాను. స్టేషనుపక్క ఉన్న రోడ్డు సరాసరిపోయి దేవేంద్రపాడుకపోవు బకింగ్హామ్ కాలవదరికి చేరి బల్లకట్టుఎక్కి అవతలివడ్డుకు పోతిని. బల్లకట్టునుంచి కొంతమంది ముందుగా దిగిపోతూ ఉంటే నేనుకూడా అప్పటికే చాలాఎండ ఎక్కినందున త్వరగా పోదామని దిగబోతూ ఉంటిని. అప్పుడు బల్లకట్టుమీదఉన్న ఒకపెద్దమనిషి నన్నుచూచి, 'తాకుతావయ్యా నీయిల్లుబంగారంగాను!' అని పెద్దగా అన్నాడు. ఆ మాట్లాడుతున్న మనిషివంక తిరిగి, 'ఏం తాకుతే' అన్నాను. ఇంతట్లోకే ఇంకోమనిషి కొంచెం బిగ్గరగా, 'ఓహో! స్వదేశీపురుషులు గామాలె!' అని వికటంగా నవ్వడం ఆరంభించినాడు. ముందుగా దిగుతున్న 'ఆఅంటరానివాళ్లను' రాసుకుంటూనే నేను దిగిపోయినాను. పంచముల దౌర్భాగ్యస్థితి తలపుకు రాగానే దుర్నివారంగా కంట నీళ్లు వచ్చాయి.

ఎండవేడిమి అప్పటికే బాగా హెచ్చుటంవల్ల త్వరగా పెదపాలెం చేరుకుందామని గబగబ నడుస్తూ ఉన్నాను. కొంతదూరము పోగానే చేతిలో గ్రంథాన్నొకటి పట్టుకొని మొహంనిండా విభూతి పెండెలు తీర్చిపెట్టుకుని ఏవో కొన్ని మంత్రాలు జపిస్తూపోతున్న బ్రాహ్మణున్ని కలుసుకొన్నాను. ఆయన నావంకతిరిగి 'అయ్యా తమదేవూరు? ఎక్కడికి వెడుతున్నారు?' అని నన్ను ప్రశ్నించాడు. 'మాది గుంటూరుకాపురము, పెదపాలెం పోతున్నాను' అనినేను జవాబుచెప్పాను. అంతట ఆయన నన్ను ఎగాదిగా చూసి, 'మాల మాదిగాళ్లకు బ్రాహ్మలు చదువుచెప్పుతున్న చోటికా?' అని నన్ను మళ్లా అడిగినాడు. 'అవును, అక్కడికే' అన్నాను.

బ్రాహ్మడు కాసేపు ఊరుకొని తనలోతాను 'వినాశకాలే విపరీతబుద్ధి' అని చివర విసర్గ లోపంతో అనుకుంటున్నాడు. 'అయ్యా, ఏమిటో సెలవిస్తున్నారు' అని నేను వారిని వినయంగా అడిగినాను. 'ఏమీ లేదు. 'వినాశకాలే విపరీతబుద్ధి' అంటున్నాను. కాకపోతే మటుకు మాలవాళ్లకు మన బ్రాహ్మలు చదువుచెప్పడం ఏమిటి? మీదుమిక్కిలి వాళ్లను తాకడం! రామ రామ! ఎటువంటిదురవస్థ పట్టిందండీ మన కులగోత్రాలకు!' అని పాపమాయన అన్నాడు. 'నిజమే! తరతరాలనుంచీ వస్తూ ఉన్న ఈ ఆచారాన్ని ఇప్పుడు మార్చివేయ్యాలంటే శ్రోత్రియులైన బ్రాహ్మలూ, వేదాలేతప్ప వేరే శరణ్యం లేదని చెప్పేవాళ్లూ ఎట్లాఒప్పుకుంటారు, ఒకపాళాన్నీ' అని నేను అన్నాను. అప్పుడా బ్రాహ్మడు, 'వేదాలలో ఎక్కడా చండాలురంటే బ్రాహ్మణస్త్రీకి శూద్రునివల్ల పుట్టినవాళ్లు అని ఉన్నది. వాళ్లే అంటరాని వాళ్లు. వాళ్లనుముట్టుకున్నందువల్ల కలిగే దోషమూ, ఆదోషానికి పరిహారమూ అన్నీ శ్రుతిస్మృతులలో వ్రాసిఉన్నవి' అన్నాడు. ఆయనతో వాదప్రతివాదులకు దిగితే వట్టి కంఠశోషతప్ప వేరేమీలాభముండదనుకొని వినయంగా, 'అవధాన్లుగారూ! వెనకటికి ఒకకథ జ్ఞాపకానికి వస్తున్నది. పూర్వం అదేవూళ్లోనో ఏకగర్భవాసాన జన్మించిన అన్నా చెల్లెలూ పసితనంలో దురదృష్టవశాత్తూ కృష్ణలోపడి కొట్టుకొనిపోయినారట! వాళ్లనెవరెవరో రక్షించి పెంచుకొని పెద్దవాళ్లను చేశారట. తర్వాత కొన్ని సంవత్సరాలకి అన్నా చెల్లెళ్లకు వివాహ మయిందంట. వివాహమయిన దరిమిలా ఆపిల్లలను పెంచుకున్న వాళ్లకు పెండ్లి ఐన వాళ్లిద్దరూ ఒకతల్లిబిడ్డలని తెలిసిందట. అప్పుడు అన్నిశాస్త్రాలు చదువుకున్న పెద్దపండితుడొకాయన ఉపాయంఒకటి చెప్పినాడట. 'అన్నా చెల్లెళ్లకు

నల్లటిబట్టలుకట్టి కృష్ణలోపడేస్తే, ఆనల్లవస్త్రాలు ఎప్పు డయితే తెల్లబడిపోతాయో అప్పుడు వాళ్లకు పాప పరి హారం అవుతుంది' అన్నాడట. ఆవిధంగానే వాళ్లిద్దరూ జీడిగింజంటి నల్లటివస్త్రాలుకట్టుకొని కృష్ణలోదిగి భగవ త్ప్రార్థన చేసుకుంటూ ప్రవాహంలో పడి కొట్టుకొని పోయినారట. వాళ్లు ఒకానొక గ్రామం చేరగానే వాళ్ల నల్లటిబట్టలు తెల్లబడిపోయినాయనీ అంతటితో వాళ్ల పాపం ఊడ్చిపెట్టుకొని పోయిందనీ చెప్పుకుంటారు. అప్పటి నుంచే ఆవూరికి తెల్లటూరు అని పేరు వచ్చిందనీ చెప్పుకుంటారు. మాలవాళ్లను పాపవిముక్తులను చేసేందుకు గూడా ఇలాంటిదే ఒకటి ఏగొప్ప పండితు డన్నా ఆలోచించి ప్రజలమన్ననహా రాజు మన్ననహా పాత్రుడై మాలవాళ్లకు మహోత్కృష్టమైన ఉపకారం చేసి పుణ్యంసంపాదించుకోరాదూ!' అన్నాను. నామా టలు విని ఆయన పెదవులు చప్పరించి నాతో మాట్లాడి లాభంలేదని ఊరుకున్నాడు. తరువాత కొంతసేపటికి మే మిద్దరం చీలిపోయినాము. శ్రీకృష్ణాశ్రమం చేరుకునేసరికి రెండుఝామూ లయింది.

పెదపాలెంలో ఉన్న ఈ శ్రీకృష్ణాశ్రమం స్థాపిం చింది శ్రీయుతులు నల్లపాటి హనుమంతరావుగారు. వీరికి ముప్పైయైదు సంవత్సరాల ప్రాయముంటుంది. వీరు నియోగి బ్రాహ్మణులు, గుంటూరు తాలూకావారు. మెట్రిక్యులేషన్ పరీక్ష ప్యాసైనారు. చాలాకాలం నుంచీ, అందులో అసహాయోద్యమం దేశంలో ప్రచారం లోకి రాక ముందునుంచీ గూడా, వీరు అధోగతిలో ఉన్న పంచములను వృద్ధిలోకి తీసుకొని వచ్చేటందుకు బద్ధకంకణులై నాటినుంచియు అమితోత్సాహంతో పనిచేయుచున్నట్టివారు. దేశంలో పెద్దపెద్ద పరీక్షలు ఇచ్చిన వారుకూడా మాలవాళ్లనుతాకితే తమ కులగోత్రా లన్నీ పోతాయని చెప్పేరోజులలో వీరు విశేష భాగ్య వంతులు కాకపోయినా ధైర్యసాహసాలతో ఎటువంటి కష్టం వచ్చినా సరే లెక్కచేయక పంచములను పైకి తీసుకొని వచ్చేటందుకు పెదపాలెంలో శ్రీకృష్ణాశ్ర మాన్ని బయలుదేరదీశారు. ఆరోజుల్లో తమఉద్దేశాలు శ్లాఘించి ఆమోదించేవాళ్లు ఎక్కువమంది లేరు. ఒకవేళ ఉన్నా ధనసహాయం చేసేవాళ్లు అసలే లేరు. అటు వంటి దుస్థితిలోకూడా హనుమంతరావుగారు ఏమాత్రం జంకక అధికప్రయాసలతో ఈ ఆశ్రమాన్ని సక్రమంగా నడపడం ఆరంభించారు. కొందరు బుద్ధిమంతులు వీరిని 'మాలవాడు' అని పిలిచిన రోజులుకూడా ఉన్నాయంటే నమ్ముతారో లేదో! ఆరోజుల్లో లోకులేకాక కొందరు దగ్గిరబంధువులూ వీరిని సంఘబహిష్కారమూ, కులబహి ష్కారమూ చేశారు. ఈముఖ్య, పాపం, వారితండ్రిగారు స్వర్గస్థులైనప్పుడు శవాన్ని వాహకులుగా ఉండేటందుకు ఏవేళకూ ఒక్క బ్రాహ్మడైనా వచ్చిన పాపాన పోలే దట! తరువాత ఎట్లానో మరీ దగ్గర బంధువులకు కబురు చేస్తే వచ్చారట. ఇన్ని కష్టాలకు లోనైకూడా ఏమా త్రమూ ధైర్యం వదలక వివృద్ధ మవుతున్న సాహసో త్సాహాలతో తమ విధ్యుక్త ధర్మానికి ఎట్టి అంతరాయ మూ కలగ కుండా ఈ నాటివరకూ ఆశ్రమాన్ని సక్ర మంగా నడుపుకొని వస్తున్నారు.

వీరిని చూడగానే ప్రతివానికీ వీరు గొప్ప సద్గుణ సంపన్నులనీ, మిక్కిలి శాంతస్వభావం కలవారనీ తోచక పోదు. నిరాడంబరముగా ఖద్దరు దుస్తులు ధరించి వీరు వీధివెంట వెడుతూ ఉంటే వీరి ముఖ లక్షణాలుచూసిన ప్రతివానికీ వీరియందు సదభిప్రాయం కలగక పోదు. ఆశ్రమమందు వీరు నిరంతర నివాసమువల్ల విద్యార్థుల కందరికీ ఆదర్శప్రాయులై ఉండి వాళ్ల ఆత్మలలో ప్రేమ, భక్తి, శాంతము ఇత్యాది సద్గుణకోటి వర్ధిల్ల చేయు చున్నారు.

ప్రపంచములో మనకు అనుభవము ఉన్నంత వరకూ ఏ కొద్దిమందోతప్ప ఏదైనా ఒకపని చేయడానికి స్వలాభమో కాకపోతే గౌరవమో అపేక్షించి చేస్తు న్నారు. అందులో విశేషంగా యువకులు ఏసందర్భము వల్లనో తమకు కలిగిన తాత్కాలికోత్సాహంవల్ల ఏదో ఒక గొప్పకార్యం చేయడానికి పూనుకొని కొంతకాలం పనిచేసిన తర్వాత ఆ ఉత్సాహం క్షీణించిపోగా అంత వరకు చేసుకొని వచ్చిన దాన్ని నిష్ఫలం చేసుకుంటారు. శ్రీ హనుమంతరావు చేస్తున్నటువంటి సత్కార్యం ఆవిధ మైనది ఎంతమాత్రమూ కాదు. అసహాయోద్యమం ఆంధ్ర దేశంలో ఉన్మాదము కలిగించిన దానికి రెండు సంవత్స రాలకు ముందే ఈ ఆశ్రమాన్ని స్థాపించినారు. ఆరంభ శూరులవలెగాక వీరు 1918 సంవత్సరంలో ఒక చిన్న

పూరిపాకాలో పంచమ బాలురకు ఒకపాఠశాల ఏర్పరచి నారు. రానురాను ఆశ్రమం కొంతమంది దీనబంధువు లైన ధర్మాత్ముల ఆదరణాను రాగములకులోనై వృద్ధి పొందుతూ వచ్చింది. 1920 సంవత్సరాంతములో అస హాయోద్యమము విజృంభించినప్పటి నుంచీ ఆశ్రమం మరింత వృద్ధిలోకివచ్చింది. పేరు ప్రతిష్ఠలకోసం ఏమాత్రమూ ఏకోశానా ఆశించక పంచములయెడ నిష్కల్మష మైన ప్రేమతో స్థాపించినది ఈ ఆశ్రమం. అందువల్లనే కాబోలు, నిజమైనటువంటి దేశసేవ, మానవసేవ చేయు చున్న శ్రీహనుమంతరావుగారిపేరు దేశంలో తగిన ప్రసిద్ధికి రాలేదు.

స్మృతికారు లేమిచెప్పినా, శ్రోత్రియు లేమిచెప్పినా ఈ అంటరాని తనము మన దేశానికి మేరలేని కళంక మాపాదిస్తున్నదని చాలామంది సహృదయులు ఒప్పుకున్న అంశమే. సహజమైన మానవనీతికి విరుద్ధమగు భయంకరమైన దురాచార మీయంటరాని తనము. ఏడు కోట్లమంది స్వదేశీయులను పశువులకంటే హీనంగా చూస్తున్న మనమీద మనకే ఏవిధంగా అభిమాన ముంటుందో తోచకుండా ఉన్నది!

ధర్మాధర్మ విచక్షణతో పనిలేనివాళ్లు అంతేమందిని ఇంతకాలం హీనదశలో ఉంచినందుకు ఎంతఘోర మైన ప్రతిఫలము రాగలదో ఐనను తెలుసుకోవలసి ఉన్నది. ఇంతకంటె అల్పమైన పరిస్థితులవల్ల ఫ్రాంసు, రష్యా దేశాలలో జరిగినవిప్లవములే ఇందుకుసాక్ష్యములు. ఇంత అన్యాయంగా పంచములను పరంపరానుగతముగా చూస్తున్నాము. విద్యఅనేది ఏమాత్రమూ లేకుండా చతుర్వర్ణములవారి దురాగతములకు లోనై వాళ్లుఅధోగతిలో పడి కొట్టుకుంటున్నారు. కాని ఈస్థితి ఎంతోకాలము ఈవిధంగానే ఉండబోదు. నూతనాభిప్రాయములు అతి శీఘ్రముగా దేశమంతటా కలయప్రాకుతున్న ఈరోజులలో విపరీతమైనవారి స్వస్థితి వారికి తెలియరాక పోదు. అప్పుడు వాళ్లు హిందూసంఘమంతటి మీదనూ ఏవిధంగా కసితీర్చుకుంటారో ఆలోచించి అటువంటిపరిస్థితులు రానీయకుండా చేయుట ప్రతి భారతీయుని ధర్మమై ఉన్నది. ఇటువంటి బాధలు పడుతున్న మన పంచమ సోదరులకు దేవుళ్లలాగా మిషనరీలు కనబడ్డారు. విద్యలేకపోంగా కూటికి గుడ్డకు మొహంవాచి గుండెజేసిల వడిపోయిన పంచములు వందల కొందలు క్రైస్తవులుగా మారుతున్నారు. తమబిడ్డలకుఅన్నవస్త్రాలుఇచ్చిఅంటరాని వాళ్లను పరిశుద్ధులనుగా చేస్తున్న మిషనరీ దొరల సహాయ మపేక్షించి తమకు విశేషహానిచేసిన హిందూమతము వదలి మతాంతరులు కావడము సంభవిస్తున్నది. ఒక్కగుంటూరు జిల్లాలోనే మాలపల్లెలన్నీ క్రైస్తవపల్లెలైపోయినవి. కొంతకాలమయ్యేసరికి అంటరానివాళ్లంతా క్రైస్తవులుగా మారిపోయి కొత్తపేర్లతో అంటబడినవాళ్లవుతున్నారనే సంగతి గమనించినప్పుడు ఆలోచన గలవాళ్లకు నవ్వురాకపోదు. పంచములు ఈవిధముగానైనా విద్యావంతులై మనపెట్టే నానాబాధలనుంచీ విముక్తులై ఉండటం కొంతమేలే. కానివీళ్లలో జాతీయత పూర్తిగా నశించి విజాతీయమైన భావాలు కలగడమే కాకుండా హైందవులయందు ద్వేషభావము కలవాళ్లుకూడా అవుతున్నారు. మతాంతరులైన విదేశీయులు ఎంతసదుద్దేశాలతో మన పంచములకు విద్యనేర్పినప్పటికీ ఆవిద్య అక్కరకురాదు. మనవాళ్లకేమి కావలసియున్నదో వాళ్లు తెలుసుకోనలేరు. పంచములను నిజముగా ఉద్ధరించవలసిన బాధ్యత మాత్రమేకాక సామర్థ్యముకూడా మనవాళ్లకే గాని అన్యదేశీయులకులేదనే విషయము ఒక్కసారి పెదపాలెంపల్లి కృష్ణాశ్రమము దర్శించినవాళ్లకు బోధపడుతుంది.

పెదపాలెమునకు మూడు ఫర్లాంగులలో శ్రీకృష్ణాశ్రమం నిర్మాణమైనది. ఏవైపుచూసినా పచ్చని పొలాలూ, తోటలూ కన్నుల పండువుగాఉన్నవి. ఆశ్రమాన్ని ఆనుకునే ప్రవహిస్తున్న కృష్ణాకాలువ మనోహరంగా ఉంటుంది. ఈ ఆశ్రమము పూర్వకాలపు ఋషుల ఆశ్రమాలవలె శాంతికి ఉనికిపట్టై ఉన్నది. ఆశ్రమ బాలురను చూచిన వాళ్లు నిమ్నజాతి వాళ్లలాగా ఏమాత్రమూ కనపడరు. ప్రాతఃకాలమునే లేచి కాల్యాలు తీర్చుకొని వసతిగృహమునకు కావలసినమంచితీర్థము చేరబోసుకొని వంతులప్రకారము పనులన్నీ నిర్వహించుకుంటారు. ఆరు గంటల ప్రాంతాల రెండువేళలా స్నానంచేసి ఉతికి ఆర వేసుకొన్న బట్టలు కట్టుకొని అంతా కూర్చుని దైవ ప్రార్థన చేసుకుంటారు. అటుపిమ్మట చదువులప్రకు క

మిస్తారు. బాలురకు నేర్పు విద్యలలో తెలుగు భాష, రామాయణ భారతభాగవతాలు, గణితము, హిందూదేశ చరిత్ర, భూగోళశాస్త్రము, కొంచెం ఇంగ్లీషు ముఖ్యమైనవి. ప్రతి నిత్యమూ నియమిత కాలాలలో విద్యార్థులూ విద్యార్థినులూ నూలు వడుకుతారు.

ప్రస్తుతము ఈ ఆశ్రమములో ముప్పయి మంది బాలురకూ ముగ్గురు బాలికలకూ ఉచితంగా భోజనము పెట్టి విద్య గరపుతున్నారు.

ఈ ఆశ్రమ ఉద్దేశాలు

౧. ప్రస్తుతం పంచములనే వారికి భోజన వసతు లేర్పరిచి విద్య, చేతిపనులు ఉచితముగా నేర్పడం.

౨. ఇతర గ్రామములలో పాఠశాల లేర్పడడం.

3. పంచములయందు లోకులకున్న దురభి ప్రాయములు తొలగించడము.

౪. పంచములు మతాంతరులు కాకుండా చూడడము.

ఈ ఆశ్రమానికి మహాత్మా గాంధిగారి శిఫార్సు వల్ల తిలకు స్వరాజ్యనిధినుండి ౫,000 రూపాయల విరాళమును ఇచ్చిరి. గుంటూరుజిల్లా కాంగ్రెసు సంఘము వారు 700 రూపాయలను రాష్ట్రసంఘమువారు 500 రూపాయలను దీనికి దయతో విరాళము ఇచ్చిరి. పుత్తంబాకవారు కొని ఇచ్చిన యకరము స్థలములో రు 6000 కిమ్మతుగల భవన మొకదానిని నిర్మించిరి. ఇంతవరకు ఆశ్రమానికి ఇచ్చిన విరాళముల మొత్తమూ ఖర్చుపెట్టిన సొమ్మూ తదితర విషయములు ఆశ్రమ స్థాపకులు త్వరలోనే ప్రచురింపనున్నారు.

నూర్గురువిద్యార్థులకు భోజనపు వసతు లేర్పరచి గుంటూరులో 50 మంది బాలురకూ పెదపాలెములో 5 మంది బాలికలకూ విద్య నేర్పవలెనని ఆశ్రమస్థాపకులసంకల్పము. తగిన ధనమున్నచో విద్యార్థుల ఉపయోగార్థము ఒక ఆయుర్వేద వైద్యశాలకూడా పెట్టవలెనని వారి కుతూహలము.

నూర్గురువిద్యార్థుల భోజనపుఖర్చునకుగాను (జొన్నన్నము) దినమునకు పన్నెండురూపాయలు కావలెను. ఉపాధ్యాయుల వేతనములకూ తదితరఖర్చులకూ షుమారు రెండువందలరూపాయలు నెలకు కావలసియుంటుంది. ఆశ్రమమును నిరంతరాయముగా కొనసాగించడానికి అనమపక్షము ఒకలక్షరూపాయలు కావలసియున్నది.

ఈఆశ్రమాన్ని అభిమానించి సర్వవిధములతోడ్పడి ఈ ఉద్యమాన్ని వెంపొందింపచేసే భారం ఆంధ్రదేశీయులపై నున్నది.

భా గ్య ము లు

టి. శివశంకరం పిల్లే గారు

పుడమిలో నితరులు పడుసంకటముఁ జూచి, బాగుగాఁ దీర్చెడి భాగ్యమొసఁగు
జనులందు వినయంబు తనరంగ దైన్యముఁ, భయమును బాపెడి భాగ్యమొసఁగు
నాథులులేని యా నారీమణుల నేత్ర,బాష్పముల్ దుడిచెడి భాగ్యమొసఁగు
తల్లిదండ్రులులేని తనయవర్గమునెల్లఁ, బటుప్రీతిబెంచెడి భాగ్యమొసఁగు
గీ. దిక్కు దరిలేక మృతినొందు దీనతతిని, గాచి సంస్కారమొనరించు కరుణ నొసఁగు
నిదురవోయెడివారిని నదనెఱింగి, వెలయ బోధించుదయ నిమ్ము వేదవేద్య!

ఈశ్వరపూజ

ఎనమండ్ర నారాయణమూర్తి గారు

శ్రీకరు నిఖిలైకసేవ్యు, భూతేశు,
భవగహనసుపంథ బరమార్థగోప్త
సేవింప నుత్సహించితి జగత్త్రాణు—
బహుపురుషార్థ సంపాదిగా నొప్పు
తనుభిక్షనిడి కృతార్థతనొంద బనిచె
గాన నా కల్యాణకామ సంప్రీతి
ఋణవిముక్తుడ నాదు నిహపరంబులకు—
మతిమతి కల్గనో, మానవో భవము
కలిగి, నిజోల్లోలకల్లోలములను
దహశిహపెట్టి శాంతము డిందుసేసెను—
అటుగాక మోహమద్యము జారవిచ్చి
క్రోలించి తన యింద్రజాలంబు నెరపి
మైమఱపించిరో మఱచునో శివుని—
వలనుగలప్పుడే వదల నీకొడిసి .
పట్టి చిత్తంబు సత్పథమందు బెట్టి
లోకహితంబును లోకేశుపూజ
గావించి తరియింతుగాక సంసృతిని—
నలుగడ కెలగ సన్ననిచల్లగాలి
ప్రకృతిని నెలకొన్న పరమశాంతైక
రసము పోషించుభారతి నృత్తిపోలె—
మట్టురసాలనిష్కుట వీథినుండి
పికశారికలు చిత్తప్రియగానమైన
నవనవస్వర మేళనంబు గావించి
స్వాగతము దయ భాస్కరునికిం బాడె—
అవలఁ బాథోధి నిరంతరాయముగ
గొల్పునోంకార నిర్ఘోషాప్లవముల
నమరె మనస్కార మనవస్క మందె
కేదెల్ల నిజరూప రేఖలంబాసి
యలుగులవడి తల్లడిలి భూరిధాత్రి
చెఱగది వీక్షి వచ్చెడి సాధ్విపోలె
సాదరమతిసుప్రసాదంబు జిల్కె—
ఈశుభావసరాన నీశ్వరార్చనము
గావింతుగాక సంకల్పంబులన్ని
దయచేసి నిఖిలభూత ప్రపంచంబ
సమ్మతింపు—సహాయసంపత్తినింపు
కలగనియ్యకుభావ కాసారవారి
చెదరనియ్యకుమ నిల్పు శివునభివ్యక్తి—
వలచి మేల్సేయు మంగళశక్తులార!
తెలియక పాలించు దేవతలార!
నా సమయం బవిఘ్నంబుగా బ్రోచి
పావనాచారత, భావనిర్మలత
సర్వ నిసేయుడీ హృదునాశ్రయింప—
ఇంద్రియగ్రామమా, హృల్లోకమందు
దైహికవాంఛల దగలనీ కాపు—
చిత్తపుదేటి, నీశీలంబు మాని
పరిపరియిటునటు బడమూనకాగి,
యిలగలపూవులం దెల్ల వేసరక
శివచరణాంభోజసేవపై కోర్కు—
అరిషట్కమా, నీపరాక్రమంబులకు
బనినడ దిప్పు డవ్వల బెట్టుకొంత—
అడిగి దైహికదైవతారాధనముల
నాత్మరక్షణకు, ధర్మవిరుద్ధముగ
దెచ్చికొందును మాఱుతెఱవు లేనప్పుడు—
ప్రకృతిమాతృక, నీదు ప్రత్యంగమందు
బ్రత్యక్షమగు రూపభావంబులందు
నఖిరంగంబున నద్వైతశాంతి
శాశ్వతశైవంబు జాటుసామదికి.

2. విసుగనియావి, నక్కటికె
కిడని కివి త్వమార్గ్వికార్యతన్

గోపరనిశహార్తి గీడ్గొదవ
గూడని పూన్కి నభంగసింధువై
యసదృశపాండితిన్ భవము
నంతటి కాదరువై భరించు నా
కుసుమశరారి విశ్వమయు
గొల్తుమహేశు ననన్యభక్తిమై.

3. శిరమున జాహ్నవీతటిని
శీతకరుం డిరువంక గౌరియున్
గరిముఖుడున్ గరంబులన్ను
గం బభయాంకము శూలపుస్తకమున్
వరల ననంత విశ్వహిత
వైఖరితో శుభమూర్తి విఘ్నరా
డ్గురు డిరవొందు బుద్ధి బురి
గొల్చెద నా హృదయాబ్జ పీఠిపై.

4. అరనిమిషంబు వాయదు తదేకాకాంక్ష
దరితీపుపుట్టించి దాస్యమొందు
గపట, మోహిని, వంచకశివాత్మ, చంచల,
యట్టి మిన్నందించు నిట్టి మన్ను
బోనిలోజొచ్చి జెబ్బలిని మేపుచు యింత
పాపిష్ఠి దొరసాని ప్రకృతిసేవ,
సమ్మనుదాని, నీవతిమాన నిహపర
సాధనంబటు భవచ్చరణభక్తి
కాన నందీశు నెక్కి దిక్తతి వెలుంగ
సురలజయజయ నిర్ఘోష మెరసి ప్రోయ
గౌరితో బుత్రుతో ననుగ్రహము వడసి
రమ్మ నాపూజకై స్వాగతమ్ము గొమ్ము.

5. దివ్యక్షమాపూర్ణ తేజోనిదాన
పరమపూరుష! లోక పావనారంభ
దయచేసి నాదు డెందపుగద్దెమీద
నధివసించి సమర్చ లందు నాచేత—
కలుషము జోరనీదు, కఠినంబు గాదు,
పులకించు నీరూపు పొడనూపునంత—
పరసమాగమ కాంక్ష వృత్తియై వాడు
వధువొనా నీకయి వనట జెందినది
నిను జెప్ప ననలొత్తు నీదాసులన్న
జేతులజేర్చ నీభూతంబు లందు
దయజేపు, నెఱజొక్కు, త్యాగంబునింపు.

భవపాశమింక వీడదటందువేని
దానసీ సర్వోన్నత స్థానమెక్క—
నిరసింతో నీచాతి నీచంబటంచు?
తొలగుదో నేను మర్త్యుడనై కాదలచి?
కను నేటి నీమహత్త్వ పవిత్రతలకు
తగని దెయ్యది నీదు దాక్షిణ్యమునకు
నిగమాంత గుహ్యుండ వగుదు, బ్రహ్మాద్య
గమ్యుడవై తేమి, కరుణాంబు నిధివి.

పతిత పావనుడవు భక్త వశ్యుడవు:
నీకృప నీపొందు నిర్హేతుకంబు
కాదు బీజముపంట గానివాసత్త.

6. భువనోద్ధారక రేఖము
భవశరణ స్మరణ మాత్ర పదార్థంబుల్
దివిజర్షి యోగలక్ష్యము
భవ! నీపద యుగళి కిదిగొ పాద్యముగొనుమా.

7. అమృతవర్షంబయ్యె నపమృత్యుహతిక్షితి
శరణన్న మార్కండి శిరమునందు,
ఘన పిత్ర్యాణ భరంబు గాసింప సగమైన
తరి భగీరథు జను స్రాణమయ్యె,
ఫలమయి బహుభావి ఫలమయ్యెభక్తిని
బగను సాధించిన ఫల్గుణునకు,
ఆశనిపాతంబయ్యె దశల సాధుజనార్తి
ద్రోహియుంమఘోర త్రిపురములందు
నీకరస్పర్శ—జగదీశ, నేడు జన్మ
పావనంబయ్యె భవమా సంపన్నమయ్యె
నాత్మ వవనీశమైపొంగె హర్ష పూర
మునుచు గనులంట దీన నర్ఘ్యంబుగొనుమ.

8. ఉదయరవి ప్రభల్ హిమవ
దున్నతశృంగ గతాభ్రశుభ్రమల్,
మృదులకలాకలాపము ల
మేయ మణిద్యుతి హేమకుంభమల్,
వెసత్రివేణికాహృదయ
వీచి జలంబులదెచ్చి నించితిన్,

పవరుండవై గ్రహింపు సుర
　　సన్నుత యాచమ నీయకంబుగా.

9. సారెసారె నిత్యసారంబు క్షీరంబు
గోరసంబు నారికేరవారి
బున్నఫలరసంబు బూరించి వెమదీసి
రాజసంబు నీకు రమణగామి —

10. ప్రాముఖ్యంబున మేటి నీకు బ్రియతన్
　　బ్రాణంబు మత్పావనం,
బౌమందాకిని తోయమందు గొని ధ
　　న్యం మన్య భావోద్ధతిన్,
వ్యోమంబంటుదు దివ్యరుద్రననకం
　　బుత్కంఠ జెప్పన్ సుధా,
స్తోమంబై వరమయ్యె— దీనగోమను
　　స్తోకాభిషేకార్చనల్.

11. మెత్తని ధౌతవస్త్రముల
　　మేలిమి బోలిన నీకు భాంకకం,
బొత్తుదునా ప్రవాళ రుచు
　　లొల్కు భవచ్చరణాబ్జ యుగ్మకం,
బెత్తుక తన్వితీర భవ
　　మెల్ల ఫలించె పటందు గన్నులన్,
హత్తుక చొక్కనా పెదవు
　　లందున వక్షమునన్ శిరంబునన్!

12. లోకమునిందు నీకు నను
　　రూపమెకాని దిగంబరత్వ మెం
తో కృతకృత్యు జేయ స్వయ
　　ముత్సుకతన్ గ్రహియింతు సుప్రప,
న్నాకృతి దాల్చి మర్త్యులో స
　　మర్చల గావున గొమ్ముపీని స,
స్తోక శరద్విధుద్యుతుల
　　తో నటు నేసిన పట్టుపుట్టముల్.

13. వ్రతినై సంయమినై భవాద్యుతే విధి
　　ప్రాధిష్ఠితామ్నాయ సం,
హిత లోంకార శిరంబు లైశ్వరకలా
　　హ్యాద్యార్థముల్ చేర్చి కూ,
ర్చితి హర్షంబు ముఖాబ్జప త్తిక దళుకుల్
　　చిమ్మింప గాయత్రి స,
మ్మతి నేలేన్నలు పవిత్రపాత్రమనె—
　　గోనాత్మ యజ్ఞసూత్రంబిదే.

14. కలలో వైభవ మాదిలేయులకు సం
　　కల్పాగ్రమవ్యోఘకున్
గలిదు ప్రాప్త మగణ్యపుణ్యావళతన్
　　గాకొంద నీకొల్వు నే
డెలియన్ హర్షము డెల్పు టెట్లో! మణిదీ
　　ప్తిన్ దారలేకాని తా,
రలె యీ ధూపలు నీవిలాసనుమ మా
　　ప్రద్యోతన జ్యోతికిన్.

15. ఘనసార మగరు కస్తురి
మనసార గులాబినీట మర్దితమగు చం
దనమందు మెదిపి మెయిం బూ
తునొ మరువపు వీజనములతో వీతునొకో?

15. విసిని వన్నెల మెక్కి నీహారరుచి జొక్కి
　　తెమ్మరమూపెక్కి తిరుగు దిశల,
ననవిల్తు సమ్మోహనపు వన్నె మేలిమై,
　　కనుగీటు బాలభాస్కరు రహించు,
రాజత సౌవర్ణ రత్నదీప్తి నొకింత
　　కైసేయు సరస సౌగంధ్యయుక్తి,
బడమిచేడియ హాళి బులకించు పులకలో
　　భద్రహాసములో సౌభాగ్యగతులో,
యీ సుమంబులు నీపూజకై సృజించి
తొలుత బూజాఫలంబంద నలువ యిచ్చెను
సార్థకములయ్యె గాకేమి జగతి నీ వి
లాసములరాశి మతీ దేవ వాసిగాంచు.

17. బిల్వదళంబ, నీ మహిమ
　　జేర్కొనబూన శివార్చలందు సిన్,
బిల్వ దళంబుగా మహిత
　　బీజపు టక్షరమందు గాని నీ,
కొల్వ ప్రభుప్రసాదమని
　　కుల్యరొ! చిత్తపు నిత్తెమల్లలో,
కెల్వఘటింపుమా సురల
　　సేవకు ముందబడి తల్పదస్థలిన్.

18. ఇల నిలలేక నీ పదము
 లే గతిగా శిరసమ్మ దొక్క పె
ట్టెలుగిడు నా ర్తరావ మటు
 హెచ్చి జిఖిన్ సరళప్రవంపు దా,
వుల నెదజల్లు దేవతరు
 వుల్ రజతాద్రినిభోలె నీపు న,
ర్తిలి పసరించి మద్గృహము
 రెండవ తావలమట్లొనర్పవో!

19. జ్యోతిర్మయుండ వర్యమ
శీతాంశుప్రభృతియు వహ్ని జీవము నీవే—
యీ త్రైలాజ్యజ్యోతులు
నాతనివికిగాదు లావునకె మేర సుమీ.

20. పండినపరిమళ్ల బాడవల్ దాటి
మందారవని దాపి వలకానిలంబు
జలజకల్హారద్యోలల నోలలాడి
కుసుమితమాలతీకుంజంబు జేరి
యతిమంజాగతి బాడియాడెడిపట్ల—
ప్రతిఫలించు జెడంగు పసిడిపళ్లెములం
బచ్చజాదిన్నులపై నమర్చితిని
శతవిధఫలమూల శాకసారంబు
బహుదేశమృదుపాక ఘణితిలక్ష్యంబు
నై వేద్యమిదికొమ్మ దేవదేవేశ—
విశ్వభోక్త వనంత విశ్వంబునిన్న
యమితరూపగుణక్రియాప మేతముగ
జేరి నీకనుభోగ్య సిద్ధితో మునియు—
అంతటి మేటి కియ్యది యెంతపాటి
యని కొంత శంకించి యనిశరాపేక్ష
నీభవ్యకృప నెంచి నాభాగ్య మెంచి
యారటగొని యెంతో యుత్సాహపడితి.

21. కానుకలకొక్క—పూస మాంగళ్య రేఖ
యిచ్చి ప్రాఘేయము, పరిగ్రహించి సుప్ర
సాద మనోన్యన్య సారథిశ్వాససాక్షి
కమ్మకప్రంపుని డెముగై కొమ్మ దీని—

22. జయజయ మంగళాలపన
 సంగతి నీభువనైకధారకం
బయిన మహోద్ధతిన్ దవిలి
 యారసి యారసి మెచ్చి మెచ్చి త
న్మయముగబట్టు నారతియు
 నారతి, నామతి, నేను, విశ్వమం
తయు నను భాస లీనముగఁ
 దద్ద్యుతి భావ్యపవర్గమూదిరై.

23. వెలుగొందు తేజంబు విస్ఫులింగముగ
దడబడు సంద్రంపు తరగతుంపరగ
తెదరి నిన్నుండివచ్చిన నాటగోలె
తుదయు మొదలు లేని స్రోవలంబట్టి
పరితపించుచు వేయు బ్రహ్మకల్పంబు
లన వినలేని బ్రహ్మాండంబులెల్ల
ద్రిమ్మరి మితిలేని దేహముల్ దాల్చి
కడకెట్లొ శివ యోగముచే దమంత
దరియించు టేపాటి దర్పమేపాటి!
నాటికి నేడె పూర్ణప్రబోధమున
దీప్రదీక్షను నీకధీనంబు సేతు
మంత్రపుష్పము పేర మనస్సరోజంబు
నాచిత్తమును, బుద్ధి, నా యంతరాత్మ
సంకల్పములు, నభీష్టంబు, లూహలును.
నాశక్తి, యాసక్తి, నాదు సర్వస్వ
మారగించి రచింపు మద్వైతసిద్ధి
కై కొంటివేని సంకల్పంబుదీని
భవమెల్ల నీసమర్పణముగా గడపి
పరమందు నీభవ్యపద మాశ్రయించి
యిందునందున నిన్నె యెడ బాయకుండు.


24. జేజే జగత్పావన ప్రావనారంభ, జేశంకరా, చంద్రమౌళీశ్వరా, భానుకోటి ప్రభాభాసమానాంగ, గౌరీశ, విశ్వేశ, విశ్వాశ్రయా, విశ్వచైతన్య, భద్రాత్మ, నీభద్రసంకల్పమే విశ్వమూలాగ్రముల్, సర్వభూతప్రపంచంబు నీలీల, నీ తెప్పపాట్ల భవోత్పత్తినాశంబు, లీసూర్యచంద్రుల్ భవన్నేత్రముల్, సర్వతారాగ్రహంబుల్ భవత్తారహారంబు, లీయంతరిక్షంబు నీమేను, నీధర్మచేలాంచలంబష్టదిక్పాలి, నీయేండ్లు కాలంబు, నీజిహ్వవేదంబువేదాంతముస్, సర్వతత్త్వాది సారంబు నీమూర్తి, నీనంద

హాసప్రసాదంబు ధర్మార్థ కామాపవర్గాది రాజ్యాభిషేకంబు, దేవా, మహోద్దామ దివ్యప్రభావా, మహోదారకారుణ్యభావా, కృపాపాంగ నిరూపితా జన్మపాపౌఘ, నీమెప్పుకే నెంతవాడన్, మహాపారరోదోంబుధిన్ మూగి తూగాడు గోశాంతరీపంబులన్ నిండుభూతార్వద శ్రేణియందొక్క సన్నైనగానట్టి నేనేడ, నన్, లోకముల్, గన్నలోకేశుకన్నన్ గరిష్ఠుండవై నన్ను బాలించు దైవంబు శ్రేశేదు పెన్ప్రోడ పీవేడ, నీసర్వభూతంబులన్ దారతమ్యంబులే కొక్కరూపై సదా సర్వలోకైక భాగ్యంబుగానొప్పు నీదివ్యవాత్సల్య మేహేతువౌగాని సర్వాప్త సంప్రాప్తికిన్ నోతునో నోచనోయంచు దొట్రిల్లువేళన్ సుధాసారభోగంబు సంప్రాప్తమైనట్లు నీదర్శనంబయ్యె, నీప్రాపు నేకూరె భూతేశ నేధన్యుడన్ నేడు-నీభవ్య సాక్షాత్కృతి గ్రీష్మమధ్యాహ్న నీహార మట్లంతరించెన్ భవక్లేశలేశంబు లీదైహికైశ్వర్యముల్ పాయసాన్నంబు పైనీరసాన్నంబు దిన్నట్టుచేదయ్యె, స్వర్గాదిభోగేచ్ఛలెల్లన్ దివాతారలైమాసె, నింద్రత్వమున్ గైకొనన్ వేడినన్ నేడు; నీపూర్ణ భాసంబు గన్నారగన్నంతలో జూపుమేలొక్కంచి, యీద్వంద్వ భూయిష్ఠసంసార మీజంగమస్థావరాకార విశ్వంబు నీరూపులోలీనమై నీవె గాకొండు బుద్ధీంద్రియాగోచరంబయ్యె, నిన్ దక్క నేనన్యమున్ గానలేకుంటి; నింతేల, ఖద్యోతబింబంబు సన్ఫించుడున్ దక్కలోకంబిరుల్ గ్రమ్మిన ట్లైహికాముత్ర భేదంబె నిస్సీమమైమాసె—నియ్యంగద్య మెక్కాలమున్ నిల్పు, మెక్కాలమున్ నీవె నాబుద్ధి ప్రేరింపు, నిన్ జూచు కంటన్ జగంబెట్లు వీక్షింతు! నిన్ గొల్చు కేలన్ భవంబెట్లు సేవింతు? నాచేయువ్వాలం దల్ల నీదాస్యబుద్ధిన్ మదిన్ గొల్పు, నీయందు నా నెమ్మనంబీభవం బేమరంగాక-నాకిల్లిహంబందె యద్వైతభావాప్తియై నిత్యకైవల్య సంప్రాప్తిగావింపు నీశా, భవోత్థాతలీలాదురాధర్షకుంభీశ, నీసేవకుం దార్పగారాని యైశ్వర్యమేనొల్ల, నాపూనికిం బ్రోవు, నీప్రీతియేకాని లాభంబు, నిప్రీతియేకాక నర్థం పుటిత్తంబు ప్రాపింప నీకో మహాదేవదేవేశ-నీభక్తిబోషింపగానీని, నీపాదసేవా దరాయత్తుగానీని మోదంబు భేదంబుగా నంతరంగంబు కోయించి గ్రుక్కింపుతేంద్రీ!! ఇదిట్లుండ, జన్మంబు జన్మాంతరారంభ సస్యం, బనిజ్ఞాత పూర్వోత్తరంబాట నీ మేటి కేలూత లేకున్నచో సూత్రబంధచ్యుతిన్ జారి వాతాహతిన్ వ్రక్కలై నేలపాలైన కేలీపతంగంబులీలన్ భవంబెల్ల దుర్దైవమై యుందు నందుం కెడుం గాన నాపాలి దైవంబవున్ ముక్తినిర్ణేతవున్ నీవయై మోక్షనిశ్రేణిగాకెల్లు జన్మంబు సార్థంబు గావించి మోక్షాంతరాయంబుగానీని శ్రేయోదయంబెంతయున్ గూర్చి నాథ ప్రసంధాతవున్ వ్రజనర్త్యంబవై ప్రోచి పాలింపు మో సుప్రసన్నా, భవా, భక్తమందార, మృత్యుంజయా, శర్వ, శూలీ, విరూపాక్ష, మాహేశ్వరీ భూషితార్ధాంగ, గంగోత్తమాంగా, కపాలీ, కపర్దీ, హరా, సర్వశక్తీ, నమస్తే, నమస్తే, నమస్తే.

భద్రావతి ఇనుము, కలపస్రుతి పరిశ్రమ

వి. యస్. చిన్నస్వామి గారు, బి.ఏ.,

వ్యవసాయమునకు పేరుగాంచిన భారతదేశమున ఐరోపామహాసంగ్రామ సమయమున నొక్కమారుగ పరిశ్రమాభివృద్ధి గావింపవలయునను గొప్ప చలనము గలిగినది. భారతదేశమందలి అన్ని రాష్ట్రముల యందును, స్వదేశసంస్థానములయందును పరిశ్రమలు బయలుదేరినవి. స్వదేశసంస్థానములలో నెల్ల మైసూరునందలి పారిశ్రామికాభివృద్ధిని బరికించు మేని ఆశ్చర్యము గలుగక పోదు. అచట పెక్కుపరిశ్రమలు జయప్రదముగ సాగుచున్నవి. వానిలో మైసూరులోని సబ్బులపరిశ్రమ(The Mysore soap Facto·y), బెంగుళూరుమైసూరులందలి చందనతైలగ్రహణ యంత్రశాలలు (Sandalwood Oil Factories in Mysore & Bangalore), భద్రావతి ఇనుము, కలపస్రుతిపరిశ్రమ(Bhadravati Iron&wood distillation works) ముఖ్యముగ పేర్కొనదగినవి. ప్రస్తుతము మనప్రశంస శ్రీ సర్. యమ్. విశ్వేశ్వరయ్య గారు యంత్రములను తయారుచేయుటకు పనికివచ్చు పరికరముల పరిశ్రమలవిషయమై కావించుచున్న యద్భుత కృషి విషయమైనది.



మైసూరు ఇనుముపరిశ్రమాలయము

బ్రహ్మాండమగు నీపరిశ్రమను నెలకొల్పుటకు మూలధనము నూటయేబదిలక్షల రూపాయ లయ్యెను. ఇనుముపరిశ్రమ కనుకూలము లెక్కుడుగాగల అన్యదేశములీ వ్యాపారమును గుత్తగొన్నట్టు,లాభమును పొందుచున్న సమయమున, దీనికై యింత పెద్దమొత్తము వినియోగించుట కెంతయో పట్టుదల, కార్యనిర్వాహణకౌశలము, మనోధైర్యము నావశ్యకములు.

పాశ్చాత్యపద్ధతుల ననుసరించి, ఇనుము, ఉక్కుపరికరములను అధికముగ తయారుచేయుటకు తొలుదొల్త టాటాకంపెనీవారే ప్రయత్నించిరి. భారతదేశము అమూల్యములగు ఇనుపగనులకు ప్రఖ్యాతి గాంచినది. ప్రాచీన భారతదేశము లోహవిజ్ఞానమున నెంతో పేర్వుగన్నదియుండియున్నను, ఖండాంతరములనుండి దిగుమతియగుచున్న చౌక ఇనుము, ఉక్కుపరికరములవలన నిపుడు ఇక్కడ గనులనుండి త్రవ్విన యినుమును కరిగించి శుద్ధముచేయుపని సంపూర్ణముగ నశించినది. బొగ్గుగనులు, సామానుల ఎగుమతిదిగుమతులు చేయుటకు వలసిన సౌకర్యములు సమీపమున లేకుండుటవలన నవీనపద్ధతుల ననుసరించి గొప్పఇనుము పరిశ్రమాలయములను స్థాపించుటకు వీలుగాకున్నది. కాని పై సదుపాయములు కొన్నియైన నుండుటచేతనే జంషెడ్ పురమున టాటాకంపెని జయప్రదముగ సాగుచున్నది.


భారతదేశమున మైసూరురాజ్యము ఖనిజసంపదకు పేరుగన్నది. అచ్చట గనులలో చాలకాల

మునుండి బంగారము దొరకుచున్నది. ప్రపంచమునకు వలసిన మాంగనము (Manganese) చాలవరకు భారతదేశముననే లభించుచున్నది. అందు మూడువంతులు మైసూరు రాజ్యమున నుత్పత్తియగుచున్నది. నారరాయి (Asbestos), క్రోము ఇనుపరజము (Chrome iron Ore) మాగ్నిసైట్ (Magnesite), మొదలగు నితర ఖనిజములనేకములుకూడ నచట విస్తారముగ దొరకుచున్నవి. ఇట్టి లోహపుగనులుగల 46, 446 ఎకరముల భూమిని మైసూరు రాజ్యాంగమువారు కవుళ్లకిచ్చియున్నారు. భద్రావతి పరిసర ప్రదేశములయందు మిగుల విలువగల యినుము దొరకుచున్నది. కాని బొగ్గు ఆసమీపమున లభింపమిచేత ఇనుముపరిశ్రమ అధికముగ చేయుటకు వీలుగాకున్నది.

కడచిన యుద్ధసమయముననే కలపనుండి ధృతిని, కొన్ని యితరఉపయోగకరము లగు వస్తువులను, సంపాదింపనగునని యు, అది లాభకరమగు నొక ముఖ్యపరిశ్రమయనియు తేలినది. అమెరికా, జర్మనీ, ఫ్రాన్సుదేశములయందు ఏటేట వేలకొలది టన్నుల కలపనుండి ధృతి దీయుచున్నారు. విస్తారముగ అడవులు లేకుండుటచేకలప చాలతక్కువగా దొరకు ఇంగ్లాండుదేశమునగూడ ఈపరిశ్రమ సాగుచున్నది. ఇట్లు పారిశ్రామిక ప్రపంచమున, జరుగుచున్న మార్పులను, ప్రవేశించిన నవీనమార్గములను, అభివృద్ధిని మిగుల శ్రద్ధతో గమనించి శ్రీవిశ్వేశ్వరయ్యగారు తమ సూక్ష్మబుద్ధిచే పరిసరములగు పాత యినుము పరిశ్రమను సాగించు నుపాయమును కనుగొనిరి. ఇనుము గనులకు చేరువను ఎడతెగకుండ కఱ్ఱదొరకు అడవులుండుటచే ఈపరిశ్రమను సాగించి లాభమును బొందు ప్రయత్నములు జరిగెను. మిగుల కాకనిచ్చెడుబొగ్గు (Charcoal of high calorific value), పెక్కురకము లగు పిరోలిగ్నియస్ ఆసిడు (pyroligneous acid), లోహామ్లము (Sodium acetate), సున్నము, రాగి, సీసములు కూడిన అసిటేటులు (Acetates of lime, copper and lead), కలపమద్యసారము (Methyl-wood alcohol) ఫార్మలీను (Formalin), అసిటోను (Acetone), అయిడోఫారము (Iodoform), కీలు, తారు, ఇతర విధము లగు పలుచని తైలములు పైలోహపరిశ్రమ వలన లభించు ఇతరపదార్థములు. ఇవిమాత్రమే కావు; ఇంకనుఎన్నియో విలువగల పదార్థములుకూడ లభించుచున్నవి.

భారతదేశమున బొగ్గు అధికముగ తయారగుచున్నది. కాని తయారుచేయుపద్ధతివలన చాలనష్టము గలుగుచున్నది. కాల్చుచున్న కఱ్ఱకు తగినంతబొగ్గు లేకుంటలేదు. చాల కఱ్ఱ వ్యర్థమగుచున్నది. నవీనపద్ధతుల ననుసరించి కలపధృతిని ఇనుముతోగాని, ఇటికలతోగాని, పూర్తిగా మూసియుండునట్లు కట్టబడినబట్టీల (Retorts) నుండి తీయుచున్నారు. దానికి అనేకజాతులగు అడవి కఱ్ఱనుపయోగించి పరీక్షింపగా నూటికి 30 వంతులు బొగ్గు, 6 లేక 7 వంతులు తారు, $2\frac{1}{2}$ వంతులు అసిటిక్ ఆసిడు (Acetic acid) 1.3 వంతుకఱ్ఱ ధృతి (Wood spirit) లభింపగలని విశదమగుచున్నది. ఒకసంవత్సరకాలమున 6000 టన్నులకఱ్ఱను బట్టీచేయుటకుగాను వలసిన యంత్రాదులను సమకూర్చుకొనుటకు రమారమి లక్ష రూపాయలగును. ఈవిధమునను నూటికి 20 వంతులు కఱ్ఱ తరుగుచున్నది. బట్టీ వేసిన ప్రతి నూరు టన్నులకఱ్ఱనుండి కనీసము 2000 రూపాయలు విలువగల పదార్థములు దొరకుచున్నవి. నికరము 6000 టన్నులకఱ్ఱను బట్టీవేయుటకు తరుగుతో కలిపి 7,500 టన్నుల కఱ్ఱ కావలెను. ఒకటన్నువెల అధికపక్షము రు. 5లు అయిన ఈ 7,500 టన్నులు కఱ్ఱవెల 37,500 రూపాయలగును. ఈకఱ్ఱనుండిలభించువస్తువుల విలువ రు 120,000. ఉద్యోగులజీతములు, కూలీలు, మూలధనముపై వడ్డి, ఇతరములగు తరుగులు మొదలయిన వ్యయము పోగా సుమారు రెబదివేలరూపాయలకు మించుగనే నికరాదాయము తేలవచ్చును.

నవీనపద్ధతుల ననుసరించి కూడవేసిన యినుపబట్టీలలో కఱ్ఱను చేర్చవలెను. వెలుపలతయారుచేసిన నిప్పుకొలిమినుండి గొట్టములద్వారమున వేడిని ప్రవేశపెట్టి బట్టీలోచేర్చినకఱ్ఱను కాల్చవలెను. ఇట్లు చేసినచో 24 గంటలకొకమారు బట్టీ ముగియుచుండును. బట్టీనుండి లభించిన ద్రవపదార్థములు ఘనీకరణయంత్రములగుండను (Condensors) పదార్థవిభజనయంత్రములగుండను (Separators) వచ్చును. బట్టీయందలి మిగిలిన నిరుపయోగము గు వాయుపదార్థమంతయు బట్టీక్రింద మంటకొఱకుపయోగింపను. బట్టీవలన లభించిన ద్రవరూపమయినపదార్థమును కొంతకాలముంట్టె యుండనిచ్చిన మూడు వేరు వేరుపొరలుగ నేర్పడును.



మద్యసారమును ఘనీకరించు యంత్రభాగములు (Alcohol condensors)

గోధుమవన్నెయు, నలుపువన్నెయు గల రెండు పొరలకు నడుమనున్న పొరయే పిరోలిగ్నియస్ ఆసిడు (Pyroligneus acid) అనుపదార్థము. మిగిలిన క్రింది, పై పొరలు మడ్డితారును, అసెటిక్ ఆసిడు (Acetic acid) ను గలిపిన మిశ్రపదార్థము. దానినుండి ఆవిరిమూలమున అసెటిక్ ఆసిడు (Acetic acid)ను, పలుచని ఇతర తైలములను వేరుపరుపవచ్చును. పిమ్మట నిలువయున్న తారును మరలబట్టీచేసినయెడల కొన్ని చిక్కని తైలములు, కీలు, తారు, లభించును. నడిమిపొరయగుపిరోలిగ్నియస్ ఆసిడు (Pyroligneus acid)ను సున్నముతో విరిచినయెడల గోధుమవన్నెగల అసిటేట్ అఫ్ లైము (Brown acetate of lime) అనుపదార్థము లభించును. కాని సాధారణముగా ఈపిరోలిగ్నియస్ ఆసిడును (Pyrolignens acid) మరల బట్టీచేసి దానినుండి ఇతర పరిశ్రమలకు మిగుల నుపయోగించుకఱ్ఱసారాయము (Wood alcohol) ను, అసెటిక్ ఆసిడు (acetic acid)ను తయారుచేయు చున్నారు.

ఉపయోగములు


కఱ్ఱసారాయి (Wood alcohol) ని అనేక విధముల నుపయోగించుకొనవచ్చును. విశేషముగ ఫార్మలిను (farmalin) మొదలయినవానిని తయారుచేయుట కది ఉపయోగపడును. నునుపు మెరుపు గల అసెటిక్ ఆసిడు ('Glacial, acetic acid) అను పదార్థమును సంగ్రహించిన పిదప సారము కొరవడిన అసెటిక్ ఆసిడు (w:akacetic acid) ద్రవమును సున్నమును, రాగిని, సీసమును జేర్చి విరిచివేయుదురు. రాగికలసిన అసిటేటు (Copper acetate) ముఖ్యముగా రంగువేయుట కుపయోగించును. బూడిదరంగుగల సున్నపు అసిటేటు (Brown acetate of lime) ను బట్టీచేసిన దానినుండి అసిటోను (acetone) అను విలువగల పదార్థము లభించును. అసిటోను తుపాకిమందు చేయుటకు కావలసినవస్తువులలో ముఖ్యమయినది. ఇంకను పైనచెప్పిన పట్టికయందుగల యితరపదార్థము లన్నియు ఒక్కొక ముఖ్యపదార్థముతో ఉచితమైన ఒక్కొకవిరుపు పదార్థమును జేర్చి తయారుచేయుటచేత లభించుచున్నవి. భారతదేశ మంతటను కఱ్ఱబొగ్గుయొక్క ఆవశ్యకత అధికముగ గలదు. కాని అది భద్రావతి ఇనుపపరిశ్రమాలయమున ఇనుపరజమును కరగించుటకే వినియోగింపబడుచున్నది. మైసూరురాజ్యమునకును, తన్మూలమున భారతదేశమునకును, ఆయువుపట్టగు పరిశ్రమయైన ఈయినుము పరిశ్రమను ప్రారంభించునపుడు కలపస్మృతి పరిశ్రమవంటి గొప్ప పరిశ్రమ సహాయపరిశ్రమగా ఏర్పడుట మిగుల నాశ్చర్యకరమగు విషయము. కఱ్ఱబొగ్గుయొక్క సహాయమువలన భద్రావతి ఇనుముపరిశ్రమాలయమున సంవత్సరమునకు 15 మొదలు 20 వేలటన్నులవరకు పోతయినుము

ము తయారగుచున్నది. ఇంతేకాక భారతదేశమున కలప తైలాకు మద్యసారము (Methylised alcohol) బూడిదరంగుగల సున్నపు అసిటేటు (Grey acetate of lime) మైసూరునమాత్రమే తయారగుచున్నది.

భారతదేశము దారిద్ర్యపీడిత మని పలువురుచెప్పియున్నారు. ముడిపదార్థములు (Raw materials) గూడ ఇతరదేశములకంటె భారతదేశముననె అధికముగ గలవని మరికొందరు నొక్కిచెప్పియున్నారు. కాని ఇచట సామాన్యముగ పరిశ్రమాభివృద్ధిపట్ల అభిమానములేని యేర్పాటులను గావింపకుండు టెంతయుశోచనీయమయిన విషయము. ఆలోచనాశక్తి, దూరదృష్టి, కార్యదీక్ష వీని లేమియే భారతదేశముయొక్క లేమికి ముఖ్యకారణము. ఒక్కొకప్పు డిట్లుండుటయే గొప్పగా పరిగణింపబడుచున్నది కాని అది నిర్మూలించుటకు ప్రయత్నింపవలసిన రోగమునకన్న గొప్పవిషయముకాదు.

పంటచెఱుకుకంటె కట్టె వేరుగ ప్రయోజనకారి కాదని మానవసామాన్యాభిప్రాయము. చిన్న పడవలు, తెప్పలు, కాటామరములు మొదలగువానికిగూడ నుపయోగించునని జాలరివాని తలంపు. మానవోపయోగకరములగు ననేకోపకరణములను నిర్మించుటకును బనికివచ్చునని వడ్లవాని భావము. ఉపయోగమునననుసరించి ప్రతిభిన్నావస్థయందును వస్తువుయొక్క విలువ హెచ్చుచుండును. క్రమముగ రసాయన, నిర్మాణశాస్త్రవేత్తలు (Chemists & Engineers) కట్టెనుండి ధృతులను, పెక్కు ఉపయోగకరములగు వస్తువులను సంగ్రహించుచున్నారు. ఇన్నివిధములనుపయోగించునది కట్టెయేకాని ఉపయోగానుగుణముగ దానివిలువ పెరిగినది. ఎట్టి నిరుపయోగవస్తువునైన ఆర్థికాభివృద్ధికి మిగుల ప్రయోజనకారిగా మార్చుటయం దావశ్యకమయినది సహజముగు బుద్ధికుశలతయే. అందే యైశ్వర్యము నెలకొనియున్నది. దీనినిబట్టి భారతదేశ పరిస్థితులు తేటతెల్లముగ విశదముకాగలవు. ఐరోపా మహాసంగ్రామసమయమున ననేక నూత్నపరిశ్రమలు దేశమున నెలకొనినవి కాని అవి చాలవఱకు నచిరకాలము ననే నశించినవి. ఇట్టిదుస్థితికి ధనాభావము, కార్యనిర్వహణాసామర్థ్యము, వ్యాపారజ్ఞానశూన్యత, మొదలయినవే కారణము లగుచున్నవి. పరిశ్రమను ప్రారంభించుటకు బూర్వమే దాని భావ్యభివృద్ధినిగూర్చి చక్కగా నాలోచింపవలయును. లేకున్న జయప్రదముగా పరిశ్రమ సాగకపోవచ్చును.

భద్రావతి యినుపపరిశ్రమ మంచి యేర్పాట్లతో ప్రారంభమయినది. దానికి వలసిన మూలధనమును మైసూరు సంస్థాన మొసగియున్నది. కార్యనిర్వాహకులు గడుసమర్థులు. ఈపరిశ్రమయం దుత్పత్తియైన వస్తువుయొక్క విక్రయవ్యాపారాదులను వలసినంతశ్రద్ధతో పరిశీలించి జరుపుచున్నారు. కాబట్టి ఇట్టి పరిశ్రమను ప్రారంభించుటకు మంచియేర్పాటు లావశ్యకములని మఱియొకమారునొక్కిచెప్పుచున్నాను. భద్రావతిపరిశ్రమవలన లభించు వస్తువులన్నియును విస్తారముగా ఇపుడు బజారునందు విక్రయమునకు దొరకుచున్నవి. ప్రశస్తమైన ఇట్టిపరిస్థితులతోను, ఏర్పాట్లతోను ఈ పరిశ్రమ దినదినాభివృద్ధిని జెందగలదని విశ్వసించెదము. చిన్నవిగాని, పెద్దవిగాని నూతనపరిశ్రమలను పైవివరించినవిషయములను మనమునం దుంచుకొని బాగుగా ఆలోచించి ప్రారంభింపవలెను. అట్లు ప్రారంభించిన పరిశ్రమలే చిరస్థాయులై భారతదేశమునకు స్థిరసంపదలై విలసిల్లినవి.



విష్ణు సర్వోత్తమ శ్రీకృష్ణ స్తవము

సుసర్ల రామమూర్తిగారు

శ్రీ ధామంబగు నీపదద్వితయ సంసేవన్ మదిన్ గోరి, దు
ర్బాధాసంకులమైన యీవిషయ దుర్వ్యాపారముల్ మాని, ని
న్నీ ధాత్రిస్థలిఁ బెక్కుమార్గముల మౌనీంద్రుల్ నుతుల్ సేయ, లో
కాధీశా! కరుణన్ వహించెదవు కృష్ణా! విష్ణు! సర్వోత్తమా!

చతురంభోధిపరీతమౌ జగతి నిచ్చల్ పూని వర్ధిల్ల స
న్మతి రక్షింతువు నేర్పుమీఱ మఱియున్ భావింపగా లోక సం
తతికిన్ భర్తవుఁ గర్తవన్నిటికి వింతల్ నీపనుల్ గోపికా
సతులన్ గూడిన లీలలెంచగనుఁ గృష్ణా: విష్ణుసర్వోత్తమా!

సరవిన్ గోవులు ఘాసఖాదనరతిన్ జాలించె సంప్రీతిమై
నురగస్తోమము లాడఁగాఁ దోడఁగెఁ బెల్లుల్లాస మొప్పంగ, నీ
మురళీగానము నాలకించి యని సమ్మోదింతు రాహ్యల్ కడున్
దరమే నీకరుణన్ గణింపగను గృష్ణా! విష్ణు! సర్వోత్తమా!

ప్రాతఃకాలమునుండి సంభవఱకున్ బ్రాల్మ్యలికన్ మాని, యా
శాతిప్రంబున నాలుబిడ్డలకు భిక్షంబెత్తి యద్దాన ను
ద్భ్యాతంబౌ క్షుధ మాన్చు పేదయును సంతోషంబుతో లోకవి
ఖ్యాతుండౌ నిను నమ్మినా చెడఁడు కృష్ణా! విష్ణు! సర్వోత్తమా!

జగతిన్ మానవకోటికే వినుతవిజ్ఞానంబు లభ్యంబటం
చుఁ గడున్ మూర్ఖులు పల్కుచుండెదరు సంశోధింప హంసాళి కా
ర్యగురుత్వంబున క్షీరనీరముల వేఱౌ భంగి గావింపవే
జగదీశా! భవదీయ చిత్రమిది కృష్ణా! విష్ణు! సర్వోత్తమా!

తను సంబంధ సుఖంబులన్ మఱచి కాంతారప్రదేశమ్ములన్
మునులౌ వారు తపంబు సల్పెదరు నీమూర్తిన్ గనన్ గోరి, కా
నినినున్ జూడఁగఁజాల రెంతకుఁ దగన్ నీదర్శనం బిచ్చి మ
న్నన గావింపవె గోపికాతతులఁ గృష్ణా! విష్ణు! సర్వోత్తమా!

వేంగి చాళుక్యులు

మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు

౧

బాదామినగరము రాజధానిగఁ బరిపాలించిన మొదటి కీర్తివర్మ కుమారులలో నొకఁడగు సత్యాశ్రయ పృథివీవల్లభ పులకేశిమహారాజు క్రీస్తుశకము ౬౦౮ లో చాళుక్యసింహాసనము నధిష్ఠించెను. ఈతఁడు చాల పరాక్రమవంతుఁడు. పూర్వ దక్షిణ దేశములను జయింపఁ బూనికఁ గొని తన యనుజుఁడును, అప్రతిమానవీరుఁడును, విషమములైన స్థల, జల, వనదుర్గములను సాధించి విషమసిద్ధి యనుబిరుదమును వహించినవాఁడును అగు శ్రీ పృథివీవల్లభ విష్ణువర్ధనుని యౌవరాజ్యంబున కభిషిక్తుని గావించి చైత్రయాత్రకు రణభేరి మ్రోయించెను.

పులకేశి మహారాజు దండయాత్రకు బయలువెడలునప్పటికి తూర్పు సముద్రతీరమున వేఱువేఱురాజులు స్వతంత్ర రాజ్యములను గట్టుకొని పరిపాలనము నెఱపుచుండిరి. ఇప్పటి చెన్నరాజధాని కుత్తరభాగమున కళింగదేశమును గాంగవంశపురాజులు పాలించుచుండిరి. కృష్ణా గోదావరీనదులకు మధ్యస్థమయిన వేంగిదేశమును దెందులూరు రాజధానిగ విష్ణుకుండి ప్రభువు లేలుచుండిరి. కృష్ణానదికి దక్షిణభాగమును కాంచీపురము రాజధానిగ పల్లవులు పరిపాలించుచుండిరి. కళింగరాజులకు మొట్టమొదట నొకప్పుడు పిష్ఠపురము రాజధానిగ నుండెను[1] కాని యది వారి క్రింద చాలకాలముండినట్లు కన్పట్టదు. అనతికాలముననే కళింగదేశ దక్షిణభాగము విష్ణుకుండి ప్రభువుల యధీనమయ్యెను. దక్షిణ కళింగమునందలి పలి(ప్ల)కిరాష్ట్రమున విష్ణుకుండి ప్రభుప్రదత్తములైన అగ్రహారములు లేచెను[2]. అప్పటినుండియు విష్ణుకుండి ప్రభువులకు దెందులూరుపురము రాజధానిగ నుండినను పిష్ఠపురముకూడ వారిరాజ్యమున నుత్తర భాగమునందలి ప్రధానదుర్గములలో నొక్కటియై వారి దక్షిణకళింగరాజ్యమును సంరక్షించు సామంత సైన్యాధిపతుల ప్రధానస్థానముగ నుండెను. అయినను అప్పటికిని కళింగాధిపతులైన గాంగవంశరాజులు తాము గోలుపోయిన దక్షిణ కళింగరాజ్యమును మఱల సంపాదించుకొనుటకై ప్రయత్నముల నడపతడపఁ జేయకయుండలేదు. ఇట్టి సందర్భములను స్ఫురింపఁ జేయునదియే విష్ణుకుండి మూఁడవ మాధవవర్మయొక్క-పులింబూరు (పొలమూరు) శాసనము[3]. పుల

1. Ep. Ind. Vol xii P.1. 2. Ep. Ind. Vol xii P.133. 3. Cp. No. 7 of 1913—14.

కేశిమహారాజు పూర్వ దిగ్విజయయాత్రకై బయలు వెడలినప్పటికి పిష్ఠపుర మింకను విష్ణుకుండి ప్రభువుల క్రిందనే యుండెను. మహారాష్ట్రకులను, కోసలులను, కాళింగులను జయించిన చాళుక్యవాహిని శత్రుజనదుర్గమమును, దుస్సాధ్యమునైన పిష్ఠపురదుర్గమును ముట్టడించి, మహాభయంకరయుద్ధమైనపిదప దానిని స్వాధీనపఱుచుకొనెను. పులకేశిమహారాజుయొక్క యజేయవీరవాహిని దుస్సాధ్యమని యెన్నికఁగన్న పిఠాపురపుకోట నెప్పుడు లగ్గలు పట్టి స్వాధీనపఱుచుకొనెనో నాఁడె పూర్వదేశమున చాళుక్యాధికారమున కంకురార్పణ మయ్యెను.

కోసల, కళింగ, వేంగీదేశములనే కాక చాళుక్యసైన్యములు కృష్ణవేణ్ణానదిని దాటి పల్లవరాజ్యమునుకూడ జయించి శ్రీశైలము మీఁదుగా స్వదేశమయిన కుంతలమునకు మఱలిపోయెను. కాని యవిస్వదేశాభిముఖము లైనపిదప విష్ణుకుండి ప్రభువులు మఱల స్వాతంత్ర్య సంపాదనమునకుఁ జాల పెనఁగులాడియున్నారు కాని పిఠాపురదుర్గము కాని, దక్షిణ కళింగరాజ్యము కాని వారికి స్వాధీనమై యుండలేదు.


నూతనముగ ప్రాక్సముద్రతీరమున చాళుక్యాధికారమునకు లోఁబడిన రాజ్యమున మొట్టమొదట పిష్ఠపురమే 'మొదలి' దుర్గమయ్యెను. ఈ పిఠాపురదుర్గమును జయించుట క్రీస్తుశకము ౬౦౯-౬౧౦ లోగాని లేక రెండుమూఁడుసంవత్సరము లంతకుపూర్వము కాని అయియుండవచ్చును.

పులకేశిమహారాజు పిష్ఠపురదుర్గమును జయించి దానిని తన సైన్యాధిపతు లెవరియధికారముననైన నుంచియుండవచ్చును; కాని యట్టివారి పరిపాలనము తనకు సంతృప్తిగ లేనికారణముననో లేక మఱియేహేతువుచేతనో పులకేశిమహారాజు అదివఱకే యావరాజ్యమునకు పట్టాభిషిక్తుఁడైన తనయనుజుఁడగు శ్రీ సత్యాశ్రయపృథ్వీవల్లభ విష్ణువర్ధనుని తాను నూతనముగ జయించిన వేంగీరాజ్యమునకు క్రీస్తుశకము ౬౧౫ లో నధిపతిగ నియమించెను. ఈనియామకము జరిగినప్పటినుండియే విష్ణువర్ధనుని రాజ్యపరిపాలన సంవత్సర పరిగణనము ప్రారంభ మగుచున్నది. వేంగీరాజ్యమునకు అధిపతి యైనపిదపఁగూడ విష్ణువర్ధనుఁడు పశ్చిమ చాళుక్యరాజ్యముననే కొంతకాల ముండినట్లు అతని సతారా శాసనము [1] వలనఁ దెలియుచున్నది. యువరాజపదమున నుండినప్పుడే పులకేశిమహారాజుయొక్క అష్టమ విజయ రాజ్యసంవత్సరమున అనఁగా క్రీస్తుశకము ౬౧౬-౬౧౭ లో అతఁడు బాదామి చాళుక్యరాజ్యమునందలి శ్రీనిలయభోగములోని భీమరథీతీరస్థమగు అలందతీర్థమను గ్రామమును దానము చేసెనని సతారా శాసనము తెలుపుచున్నది. ఈయలందతీర్థము సతారాసమీపమునఁ గల అలుందా యైయుండునని కొందఱి యభిప్రాయము. ఈసంవత్సరముననే అతఁడు వేంగీదేశమునకు వచ్చియుండును. ఇట్లు వేంగీదేశమునకు వచ్చునపుడు కాలకంపుఁ డనునతఁడు ఇతనికి సైన్యాధిపతియై

1. Ind. Ant. Vol XIX P. 303.



గోక్లేహాలులో మద్యపాననిషేధసంఘసభ్యులకు మహాత్మునిహితోపదేశము. డాక్టరు బిసెంటమ్మగారి ఉపన్యాసము.



ఆదిద్రావిడజన సంఘమున మహాత్ముని ఉపన్యాసము

శ్రీ టి. వి. శేషగిరి అయ్యరుగారు మహాత్మునిచెంత నున్నారు

ఏ. రత్నా అండు కో., చెన్నపురి.

యతనియాజ్ఞఁ గైకొని దద్దరుఁ డను శత్రురాజు నోకనిఁ జయించెను. కాని యాదద్దరుఁ డెవ్వఁడో, ఏదేశపురాజో యింతవఱకుఁ దెలియరాలేదు. ఈకాలకంపుఁడు పట్టవర్ధన వంశజుఁడు. విష్ణువర్ధనునినాఁటినుండియు పట్టవర్ధన వంశజులు వేంగీచాళుక్యులకు నమ్మిన బంటులై అత్యంతము రాజభక్తితత్పరులై యుండిరి.

సత్యాశ్రయ పృథివీవల్లభ విష్ణువర్ధనుఁడు యువరాజుగనే వేంగీదేశమునకు వచ్చినను స్వతంత్రుఁడయియే రాజ్యమును బరిపాలింపఁదొడంగెను. అతనికి కుబ్జవిష్ణువర్ధనుఁ డని కూడ ప్రసిద్ధమైన పేరు గలదు. అది యాతని రూపము ననుసరించి వచ్చినపేరై యుండ వచ్చును. కుబ్జవిష్ణువర్ధనునిశాసనములు విశాఖపట్టణ మండలమునందలి చీపురుపల్లి, సర్వసిద్ధి తాలూకాలలో దొరకుటవలనను, అతఁడు దానమొసంగిన గ్రామములు పైనుడివిన తాలూకాలలోనే కాన్పించుచుండుటవలనను దక్షిణ కళింగరాజ్యముమాత్రమే ఆతనిస్వాధీనమున నుండినట్లును, పిష్ఠపురమును రాజధానిగఁ జేసికొని యాంధ్రదేశమున నూతనముగ సంస్థాపింపఁబడిన చాళుక్యరాజ్యమును అతఁడు పరిపాలించినట్లును విస్పష్టమగుచున్నది. పలికి(ప్జ)విషయ, దిమిలవిషయములు ఆంధ్రదేశమున చాళుక్య పరిపాలనమును కన్నులారఁ గాంచిన మొదటిదేశములు.

దెందులూరు రాజధానిగ కృష్ణా, గోదావరీ మధ్యస్థమయిన వేంగీవిషయమును బరిపాలించుచుండిన విష్ణుకుండి ప్రభువులు పులకేశి మహారాజుచే నోటువడినను అతఁడు స్వదేశమున కరిగినపిదప మఱల వారు తమ స్వాతంత్ర్యపతాకలను విప్పి తమరాజ్యమును గాపాడుకొనఁ బ్రయత్నములు సలిపియుండిరి. ఇట్టి విష్ణుకుండి ప్రభువులలో మూఁడవ మాధవవర్మ యొక్క కుమారుఁడైన మంచన్న భట్టారకుఁడు కడపటివాఁడు. కుబ్జవిష్ణువర్ధనుని కుమారుఁడైన శ్రీ పృథివీ జయసింహవల్లభుని కాలముననగాని వేంగీరాజ్యము పూర్తిగ చాళుక్యులకు స్వాధీనము కాలేదు.

మహాకవియైన దండి ఈచాళుక్య విష్ణువర్ధనునికి సమకాలికుఁడు. యువరాజుగనుండినప్పుడు విష్ణువర్ధనుని ఆతఁడంటిపెట్టుకొని యుండియు, అతనివలనఁ దనకుఁదగిన యాదర, సమ్మానములు జరుగకపోవుటవలన ఆతనికి సమకాలికుఁడై, కాంచీపురపల్లవ రాజ్యమునేలుచుండిన పల్లవరాజగు మొదటి మహేంద్రవర్మకడ నాతని యాస్థానకవిగఁ జేరి యారాజుచే మన్ననలను, మర్యాదలను బొంది ప్రసిద్ధికెక్కినవాఁడు.[1]

కుబ్జవిష్ణువర్ధనునికి మకరధ్వజుఁడు, కామధేనువు, విషమసిద్ధి యను బిరుదములుకలవు. ఈతఁడు క్రీస్తుశకము ౬౧౫ మొదలు ౬౩౩ వఱకు రాజ్యముచేసెను.

ఈతనితరువాత ఆంధ్రదేశచాళుక్య సింహాసనము నధిష్ఠించినవాఁడు ఈతనితనయుఁడైన శ్రీ పృథివీజయసింహ వల్లభుఁడు. ఈ

1. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారిచే నూతనముగ ప్రకటింపఁబడిన అవంతిసుందరీ కథాసారముచూడుఁడు.

తనితండ్రియు, నతఁడునుకూడ తాము పరమ భాగవతులమని చెప్పుకొనియున్నారు. ఈ జయసింహవల్లభుఁడు అనేకశాస్త్రార్థతత్త్వజ్ఞుఁడు; సకలలోకాశ్రయుఁడు; స్వబాహుబలోపార్జితసర్వసిద్ధియై సర్వసిద్ధియని బిరుదమును వహించినవాఁడు. చాల పరాక్రమవంతుఁడు. ఈ తనికాలమునుండియు కళింగాధిపతులైన గాంగవంశపురాజులు తాము గోలుపోయిన దక్షిణ కళింగరాజ్యమును మఱల సంపాదించుటకు చాల ప్రయత్నములు చేసియున్నట్లూహింపవలసియున్నది. ఏలయనఁగా జయసింహుని శాసనములన్నియు పిఠాపురమునకు దక్షిణముననే దొరకినవికాని విశాఖపట్టణమండలములో నొక్కటియైన నింతవఱకుఁ గాన్పింపలేదు. అందువలన పిఠాపురము మొదలుకొని చీపురుపల్లి, సర్వసిద్ధితాలూకాలవఱకుఁగల చాళుక్యరాజ్యమును మఱల కళింగాధిపతులుజయించి చాళుక్యులనుండి గైకొనిరాయని సంశయింపవలసియున్నది. పై నుడివిన తాలూకాలలో జయసింహవల్లభునికాలమునాఁటిచాళుక్య శాసనములేవియుఁగాన్పింపకపోవుటయే యిట్టియూహ కెడమిచ్చినదికాని అంతకన్న ప్రబలమైన యాధారమేమియుఁ గానరాదు. ఒకవేళ చాళుక్యులు జయసింహవల్లభుని కాలమున దక్షిణకళింగమును, దానితోపాటు పిష్టపురదుర్గమును గోలుపోయినను వారిరాజ్యము పిఠాపురము దక్షిణభాగమున బాగుగ విస్తరించెను. గుడ్డవాడివిషయము, వేంగీవిషయము, గుద్రహారవిషయము, గండేఱువాటి విషయము, చనూర్పల్లి విషయము—ఇవియన్నియు జయసింహుని కాలమున చాళుక్యాధికారమునకు లోఁబడిపోయెను. కట్టకడపట నింకను తనయధికారప్రాభవములను నిలబెట్టుకొనఁ బ్రోఁకులాడుచుండిన వేంగీవిషయాధిపతియగు విష్ణుకుండిప్రభువు మంచనభట్టారకునో, లేక యాతని సన్నిహితబంధువునో జయసింహవల్లభుఁడోడించెనని యూహించుట కవకాశముకలదు[1]. ఈ పై 'విషయము'లనన్నిటిని ఆతఁడు విష్ణుకుండిప్రభువులనుండియు, పల్లవులనుండియుఁ గైకొనియుండును. గుడ్డవాడివిషయము గోదావరీ మండలములోని యిప్పటి రామచంద్రపురము తాలూకాకును, వేంగీవిషయము ఏలూరు ప్రాంతమునకును, గుద్రహారవిషయము నూజవీడు, గుడివాడ తాలూకాలకును, గండేఱువాటి విషయము ఇప్పటిగుంటూరు, రేపల్లెతాలూకాలకును సరిపోవుచున్నది. కృష్ణానదికి దక్షిణభాగమున పల్లవరాజులు పరిపాలించుచుండినట్లు ఈవఱలో మనకుఁ దెలియును. గండేఱువాటివిషయము కృష్ణానదికి దక్షిణభాగముననుండుటవలన ప్రత్యక్షమైన శాసనప్రమాణమేమియు లేకపోయినను ఆదేశమును జయసింహవల్లభుఁడు కాంచీపుర పల్లవరాజులనోడించియే కైకొని నట్లూహించుట సమంజసము. ఈతనికి సమకాలికుఁడైన పల్లవరాజు సుప్రసిద్ధుఁడైన మొదటి మహేంద్రవర్మయొక్క కుమారుఁడగు నరసింహవర్మ. ఈతఁడు క్రీస్తుశకము ౬౩౦ మొదట ౬౬౮వఱకు రాజ్యము

1. Telugu Academy Plates of Vishnukundi Madhava Varma III, published in the Journal of Letters, Calcutta by the Late K. V. Lakshmanarao Pantulu garu

చేసినవాఁడు. తనతండ్రి కాలమునఁ దమకు చాళుక్యులచేఁ గలిగిన పరాభవాగ్ని నార్పుకొనుటకై ఈనరసింహావర్మ బహుళసైన్యములను గూర్చుకొని కుంతలదేశముపై దాడి వెడలి చాళుక్యరాజధానియైన వాతాపినగరమును ముట్టడించి పల్లవరాజ్యమును నిరంకుశ ప్రతాపముతో మైసూరు మండలమువఱకు వ్యాపింపఁజేసెను. ఈవిధమైన తొందరలలో నుండి నరసింహావర్మ తనయుత్సాహశక్తిని, మంత్రశక్తిని, ప్రభుశక్తిని అంతను చాళుక్యవిజయము నిమిత్తము వినియోగపఱిచిన కాలముననే జయసింహావల్లభుఁడు కృష్ణానదీ దక్షిణభాగమునందలి పల్లవ రాజ్యమును జయించి యుండవచ్చును. ఈతఁడు రాజ్యముచేయుచుండిన కాలముననే సుప్రసిద్ధ చీనాయాత్రికుఁడైన యువాన్ చ్వాంగ్ ఆంధ్రదేశమునకువచ్చెను. జయసింహావల్లభుని శాసనముల ననుసరించి ఒకనూతనవిషయము మనకుఁ దెలియుచున్నది.

బౌద్ధయుగమునాఁటి ధాన్యకటకము వంటి విశ్వవిద్యాలయములు చాళుక్యుల కాలమున నున్నట్లు కన్పట్టవు. పూర్వము ప్రతి అగ్రహారము నొకచిన్న విద్యాపీఠముగ నుండెను. వేదవిద్యను తామభ్యసించి ఇతరులకు బోధించుపండితోత్తములకు అగ్రహారప్రదానముఁ గావించి పూర్వపురాజులు విద్యనుపోషించియున్నారు. పూర్వము విద్యయనఁగా వైదికవిద్యయె. కాని ఇంతమాత్రమున ప్రతిఅగ్రహారమును పెద్దవిశ్వవిద్యాలయ మనుట సరి కాదు. ప్రత్యేకము విద్యాప్రదానమునకు పేర్పఱిచిన విద్యాపీఠములు కొన్ని యుండెడివి. వాటిని 'ఘటికలు', లేక 'ఘటికాస్థానములు' అనువారు. జయసింహా వల్లభుని కాలమున నాంధ్రదేశమున పేరును, పెంపునుగాంచినది 'అసనపురఘటికాస్థానము.' ఈ 'ఘటిక'లో 'సామాన్యుఁడు' (సభ్యుఁడు)గ నుండిన తైత్తిరీయ సబ్రహ్మచారియు, హారిత సగోత్రుఁడును, మండశర్మ మనుమఁడును, శివరుద్రశర్మపుత్రుఁడును అగు కాటిశర్మకు గండేఱువాటి విషయములోని నిడుంబట్లు (ఇప్పటి నిడమట్లును)దానముచేసిజయసింహావల్లభుఁడు తన విద్యాభిమానమును, విద్వత్పరిపోషణమును వ్యక్తపఱిచినాఁడు.[1] ఇట్టి ఘటికాస్థానము లాకాలమున నొక్క ఆంధ్రదేశముననే కాక కర్ణాట, ద్రమిళదేశములందును నుండినట్లు శాసనములు తెలుపుచున్నవి. పల్లవరాజుల రాజధానియైన కాంచీపురము ప్రసిద్ధికెక్కిన ఘటికాస్థానము; కదంబరాజులకు మూలపురుషుఁడైన మయూరశర్మ తనవిద్యను పరిపూర్తిచేసికొనుటకై పెక్కు ఘటికాస్థానములు తిరిగి, తిరిగి తుదకు కాంచీపురఘటికాస్థానము చేరినట్లు తెలుపఁబడినది. ఇట్లే కర్ణాటదేశమున హేంజరపట్టణము మహాఘటికాస్థానమని తెలియుచున్నది. సామవేదమున ఉత్తంకుఁడుచెప్పినరీతిని ఘటికాశ్రమ మేర్పాటుచేయఁబడినదని యొకకన్నడ శాసనమునఁ దెలుపఁబడినది. అందువలన ఘటికాస్థానమున వేదవిదులైన పండితోత్తములు తర్కప్రసంగ

1· C.P. No 7 of 1916-1917.

ములు, ధర్మమీమాంసలు చేయుచు, విద్యాపిపాసార్దితులైన విద్యార్థులకు విద్యాప్రదానముఁ గావించు విద్యాపీఠమని నిస్సంశయముగ నుడువవచ్చును. ఈయసనపుర మెచ్చటిదో యింతవఱకుఁ దెలియరాలేదు. జయసింహవల్లభుఁడు అసనపుర వాస్తవ్యుఁడగు రుద్రశర్మయనుమతియొకనికి పులింబూరు (ఇప్పటిపొలమూరు - గోదావరీ మండలమునందలి రామచంద్రపురము తాలూకాలోనిది) అను గ్రామమును దానము చేసియున్నాఁడు.[1] ఇట్లే విష్ణుకుండి మూఁడవ మాధవవర్మ పై నుడివిన రుద్రశర్మతండ్రియగు శివశర్మకు ఈ గ్రామమునే దానము చేసియున్నాఁడు.[2] ఈ జయసింహవల్లభుని సోదరునియొక్క కుమారుఁడైన రెండవ విష్ణువర్ధనుఁడుకూడ అసనపుర వాస్తవ్యుఁడును, తైత్తిరీయ సబ్రహ్మచారియు, కశ్యపగోత్రుఁడును, వేదవేదాంగేతిహాసపురాణన్యాయానేక ధర్మశాస్త్ర విదుఁడును, అగ్నిష్టోమాది పౌండరీక పర్యంతానేక క్రతుయష్టువునైన ధ్రువశర్మపౌత్రుఁడును, దోచిశర్మ పుత్రుండును, అధీత వేదద్వయుండును అగుధ్రువశర్మకు గుద్రహారవిషయములోనిపట్టివానల్లోఁ గొంత భూమి దానము చేసియున్నాఁడు.[3] ఈ విధమున అసనపురఘటికాస్థానమును, అసనపుర వాస్తవ్యులును కూడ చాళుక్యులకాలమునఁ జాల ప్రసిద్ధి వహించినట్లు శాసనములవలనఁ దెలియుచున్నది. కాని యింతవఱకు ఈయసనపుర మెచ్చటిదో తెలియరాలేదు. పెద్దాపురము దగ్గఱ హాసనపురము దిబ్బ అని పాడువడిన యొకయూరి దిబ్బ కలదు. ఒకవేళ నీయసనపురము ఆహాసనపురమై యుండునేమో. పూర్వ మొకప్పుడు ప్రసిద్ధి వహించిన పురరాజములు కాలముయొక్క దౌర్జన్యమువలన భూస్థాపితములగుట మనకుఁ దెలియని విషయము కాదు. కాని మఱియొక్క విషయముకూడ నిచ్చటఁ దెలుపవలసియున్నది. ఆదిబ్బకే హుసేనుపురము దిబ్బయనికూడ జనప్రతీతి కలదు. అసనపురము హాసనపురము, హుసేనుపురము నని జనప్రతీతిలో మాఱియుండవచ్చును. అయిన నీవిషయము నిదమిత్థ మని నిర్ణయింప వీలులేదు.

జయసింహవల్లభుఁడు ముప్పదిమూఁడేండ్లు రాజ్యముచేసెనని తరువాతి చాళుక్యశాసనములు తెలుపుచున్నవి: అనఁగా నీతఁడు క్రీస్తుశకము ౬౩౩-౩౪ మొదలు ౬౬౬-౬౬౭ వఱకు రాజ్యముచేసెను. ఈతనికాలమంతయు కళింగగాంగులతోడను, కాంచీపుర పల్లవులతోడను పోరాడి చాళుక్యరాజ్యమును స్థిరముగ నాంధ్రదేశమున స్థాపించుటకు చేసిన ప్రయత్నముతోనే సరిపోయినది. ఈతనికాలముననే చాళుక్యుల కాలమునందలి మొట్టమొదటి తెలుఁగు (శిలా) శాసనము గుంటూరుమండలమునందలి నర్సారావుపేట తాలూకాలోని విప్పఱ్ల గ్రామమునఁ గాన్పించుచు

1. Cp. No. 5 of 1913-1914.

2. Cp. No. 7 of 1913 1914. ఈ మూఁడవ మాధవవర్మ చేసిన యీయగ్రహార దానమును జయసింహవల్లభుఁడు శివశర్మకొడుకైన రుద్రశర్మకు మరల స్థిరపఱచి, అతనికి దానశాసనము నిచ్చియున్నాఁడు.

3. Ind: Ant. Vol vii p. 191.

న్నది[1]. అది యీజయసింహవల్లభుని అష్టమ విజయరాజ్య సంవత్సరమునాఁటిది. ఇదియే ఉత్తరసర్కారులలో నింతవఱకుఁ గాన్పించిన మొట్టమొదటి తెలుఁగుశాసనము (అనఁగా తెలుఁగుబాసను వ్రాయఁబడిన శాసనము). ఈజయసింహవల్లభుని నాఁటికే యతనిసోదర పుత్త్రుఁడైన రెండవ విష్ణువర్ధనుఁడు బాగుగ నెదిగి పెద్దవాఁడైనట్లు కాన్పించుచున్నది. అందువలన జయసింహవల్లభుని యొక్కయు, ఆతని సోదరుఁడును, తనతండ్రియునగు ఇంద్రభట్టారక వర్మయొక్కయు యుద్ధములందీతఁడును పాలుగొనుచు పితృ, పితృవ్యులకుఁ దోడ్పడుచుండిన ట్లూహింపవచ్చును. ఈకారణమున జయసింహుఁ డీతని నత్యంతము ప్రేమించుటచేఁ గావచ్చును ఒకశాసనమున నీవిష్ణువర్ధనుఁడు జయసింహవల్లభ తనయుఁడని తెలుపఁబడినది.[2] అదిగాక ఈజయసింహవల్లభుని రాజ్యముయొక్క అంత్యకాలమున రెండవ విష్ణువర్ధనతనయుఁడైన మంగియువరాజుకూడ పెద్దవాఁడయినట్లూహింప నవకాశముకలదు.[3] విష్ణువర్ధనుఁడును, ఆతనికుమారుఁడు మంగి యువరాజునుగూడ జయసింహవల్లభుఁడు తలపెట్టిన చాళుక్యరాజ్య సుప్రతిష్ఠాపన కార్యమును కొనసాగించి వాసియు, వన్నెయుం గాంచిరి.

పుత్త్రులు లేని కారణముననో, మఱియే హేతువుననో పృథివీవల్లభ జయసింహునిపిదప నాతనిసోదరుఁడగు ఇంద్రభట్టారక నామాంతరమునంబరగు ఇంద్రవర్మమహారాజు సింహాసనము నధిష్ఠించెను. ఇతనికి త్యాగధేనువని బిరుదముకలదు. ఇతనిసోదరుడైన జయసింహవల్లభుని కాలమున ప్రారంభమైన వేంగీ చాళుక్య, కళింగగాంగ యుద్ధములు ఇంద్రభట్టారకుని కాలమునఁగూడ నంతరింపలేదు. పృథివీమూలరాజుయొక్క గోదావరి తామ్రశాసనము[4] ననుసరించి చాళుక్యులచే నోటువడి రాజ్యపదభ్రష్టులైన రాజులందఱు తంత్రముచేసి కుట్రపన్ని యీ చాళుక్యవంశజుఁడైన ఇంద్రవర్మ మహారాజును సింహాసన భ్రష్టునింగావింప ప్రబల ప్రయత్నములంగావించిరి. ఈ యుద్ధములలో నీ పై నుడివిన పృథివీమూలరాజు మొదలగువారి సాయమున కళింగాధిపతియైన గాంగవంశజుండగు అధిరాజేంద్రుఁడు చాళుక్యరాజగు ఇంద్రవర్మను నిహతునింగావించెనని యూహింప నవకాశము కలదు; కాని యీఅధిరాజ-ఇంద్రుఁ డెవ్వరో తెలియవచ్చుటలేదు. ఇంద్రవర్మ అను పేరుగల కళింగాధిపతులు పెక్కురు గలరు. వీరిలో నేయింద్రవర్మ యీచాళుక్యాధిపతిని నిహతుంగావించెనో శాసనములవలన స్పష్ట

---

1. గుంటూరు మండలమునందలి నర్సారావుపేట తాలూకాలోని చేజర్ల గ్రామమున మఱియొక పురాతనాంధ్రశిలాశాసనముకలదు. అది విషమసిద్ధిది. విషమసిద్ధి బిరుదము మొదటివిష్ణువర్ధనునికి, రెండవవిష్ణువర్ధనునికిఁగూడనుండుటవలన అది యేవిష్ణువర్ధనునిదో నిర్ణయింప వీలులేకపోవుటవలన నేను దానిని మొట్టమొదటి తెలుఁగు శాసనముగఁ బాటింపలేదు.

2. Cp. No. 14 of 1916-1917.

3. Cp. No. 9 of 1919-1920.

4. Jour. Bo. Br. As. Soc. Vol xvi P 114: Ind. Ant. Vol xx, P 97

జరుగుటలేదు. కళింగాధిపతులపరిపాలనకాలము కూడ ఇంకను సరిగా నిర్ణయము కాలేదు. కళింగగాంగులు గాంగశకమనుపేర నొకశకమును ప్రారంభించి తాము సంగిన దానశాసనములలో గాంగేయ వంశప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరములందు శాసనకాలమును దెలిపియున్నారు. ఈగాంగశక మెప్పటినుండి ప్రారంభమైనదియు నింతవఱకు సరిగా నిశ్చయముకాలేదు. అందువలన కళింగాధిపతులైన గాంగవంశప్రభువు లెవ్వరెవ్వ రెప్పటినుండి ఎప్పటివఱకుఁ బరిపాలించినది తేలలేదు. ఈకారణమున చాళుక్య ఇంద్రవర్మ మహారాజునకు సమకాలికుఁడైన కళింగాధిపతియగు ఇంద్రవర్మను నిర్ణయించుట కష్టము. ఎట్లయిన నేమి, చాళుక్యాధిపతియైన ఇంద్రభట్టారకుఁడు సంకులసమరమున దివంగతుఁడైనను ఆతనికుమారుఁడైన విష్ణువర్ధనుఁడును, ఆతనికుమారుఁడైన మంగియువరాజును చాళుక్యరాజ్య మాంధ్రభూమినుండి యంతరింపకుండ శౌర్యప్రతాపములను జెఱపి కాపాడియున్నారు. కాని కట్టకడపటి మాటీ ఇంద్రవర్మమరణముతో చాళుక్యులు దక్షిణ కళింగాధిపత్యమును గూడఁ గోలుపోయిరని స్పష్టమగుచున్నది.

ఇంద్రభట్టారకునిపిదప ఆతనికుమారుఁడైన విష్ణురాజ నామాంతరమునం బరగు విష్ణువర్ధనుఁడు రాజ్యమునకు వచ్చెను. తరువాతి చాళుక్యశాసనముల ననుసరించి యీతఁడు క్రీస్తుశకము ౬౬౩ మొదలు ౬౭౨ వఱకు తొమ్మిదిసంవత్సరములు పరిపాలించెను. ఇతఁడు మన్వాదిప్రణీత ధర్మశాస్త్రములం దంచె వేసినచేయి. ఇతనికి విషమసిద్ధియనియు, ప్రళయాదిత్యుఁడనియు,మకరధ్వజుఁడనియు బిరుదములు కలవు. ఇతఁడు మహావితరణశాలియై సర్వలోకాశ్రయుఁడని పేరొందినవాఁడు. కమ్మరాష్ట్రము, వెలనాడు విషయము, గుద్రహారవిషయము- ఇవియన్నియు నీతని యధికారమునకు లోఁబడియుండుటచేత ఈతఁడు దక్షిణకళింగరాజ్యమును గోలుపోయినను జయసింహవల్లభసముపార్జితమైన మిగిలినచాళుక్యరాజ్య మంతయు వేంగీదక్షిణభాగమున సురక్షితముగనే యుండెను. కాంచీపుర పల్లవులవలన నీ చాళుక్యులకు తొందరలేమియు కలుగకపోవుటకును, పల్లవులు కమ్మరాష్ట్రము, వెలనాఁడు విషయము మొదలగు చాళుక్యదేశములపై దండెత్తి వెళ్లకపోవుటకును కారణము లేకపోలేదు. మొదటి నరసింహవర్మ పిదప కాంచీపుర సింహాసనమునెక్కిన పల్లవరాజు పరమేశ్వరవర్మ. ఈపరమేశ్వరవర్మ కాలము వఱకుఁగూడ బాదామి చాళుక్యులకును, కాంచీపురపల్లవులకును నిరంతరము యుద్ధములు జరుగుచు వేయుండెను. నరసింహావర్మ ప్రతాపమునకు బాదామి చాళుక్యులు కొంత కాల మొదిగి, మోసరిల్లి యుండవలసినవారైనను, పరమేశ్వరవర్మకాలమున ప్రాంతపగ మనసునునుంచుకొని సత్యాశ్రయ పృథివీవల్లభ పులకేశి తనూజుఁడైన మొదటి విక్రమాదిత్యుఁడు బలవంతుఁడై చతురంగసేనాసమేతుఁడై పల్లవరాజ్యముపై దండెత్తివచ్చి నెల్లూరు

మండలము నాక్రమించి యాతనిజయించుట యేకాక తుదకు కాంచీపట్టణమును కూడ స్వాధీనపఱుచుకొనెను. అందువలనే పల్లవరాజులు వేంగీచాళుక్యులకు జ్ఞాతులైన బాదామి చాళుక్యులవలన నోడింపఁబడి యౌద్ధత్యముఁ దక్కియుండుటచేత దక్షిణమున వేంగీచాళుక్య రాజ్యమునకు వారివలన భయములేక యది సురక్షితముగ నుండుటకుఁ గారణమయ్యెను. ఈ రెండవ విష్ణువర్ధనుఁడు ఇతని పితృవ్యునివలెను, పితామహునివలెను భాగవతోత్తముఁడని కాక పరమ మాహేశ్వరుఁడని యొకానొక శాసనమున వర్ణింపఁబడి యుండుటచే నీతఁడు శైవమతము నవలంబించిన శైవమతాభిమానియని యూహింపఁబడియున్నది. అంతియేకాక ఈతఁడు ఇతని కుమారుఁడైన మంగి యువరాజుయొక్క యొకానొకశాసనమున 'అనేకసమరసంఘట్టోపలబ్ధవిజయ యశః ప్రసూత్యామోద గంధాధివాసితసకలదిఙ్మండలుఁ'డనియు, 'నానాశాస్త్రాభ్యాసోపబృంహిత విమలవిశాలబుద్ధి' యనియు, 'త్యాగౌదార్య ధైర్యశాంత్యాది గుణాలంకృతుఁ'డనియు వర్ణింపఁబడియున్నాఁడు.

ఈతనిపిదప వేంగీచాళుక్య సింహాసనము నధిష్ఠించినవాఁడు విష్ణువర్ధన కుమారుఁడైన మంగియువరాజు. ఈతనికి మంగి మహారాజు, మంగి వర్మ, మంగి యువరాజు, విజయాదిత్యుఁడు అని నామాంతరములు కలవు.[1] ఈతఁడు సమతిశయిత పితృగుణశక్తి సంపన్నుఁడు; అస్త్రశస్త్రాది విద్యాప్రయోగములందు విజయసిద్ధియగుట విజయసిద్ధియని బిరుదము వహించినవాఁడు; సర్వలోకాశ్రయుఁడు; సమస్తభువనాశ్రయుఁడు. ఈతఁడు క్రీస్తుశకము ౬౭౨ మొదలు ౭౦౧ వఱకు ౨౯ సంవత్సరములు పరిపాలించెను. ఇతనికి జయసింహవల్లభుఁడు, విష్ణువర్ధనుఁడు, కోకిలివర్మ అని మువ్వురు పుత్రులును, పృథివీపోత్తి[2] అను నొకకూఁతురును గలరు.

మంగియువరాజుపిదప అతనిజ్యేష్ఠపుత్రుఁడైన జయసింహవల్లభుఁడు రాజ్యమునకు వచ్చెను. ఈతఁడు క్రీస్తుశకము ౭౦౧ మొదలు ౭౧౪ వఱకు పదుమూఁడు సంవత్సరములు రాజ్యము చేసెను. ఈతనికి సర్వసిద్ధి, సర్వలోకాశ్రయ బిరుదములు కలవు. మొట్టమొదటిమాఱు మహమ్మదీయు లీతనికాలముననే హిందూదేశముపై దండయాత్రలు సలుపఁ దొడంగిరి. క్రీస్తుశకము ౭౧౦-౧౧లో కాసిమ్ కుమారుడైన మహమ్మదు సైన్యాధిపత్యము క్రింద అరబ్బులు సింధుదేశముపై నెత్తివచ్చి, తుదకు దానిని స్వాధీనముచేసికొని, రాజ్యమును స్థాపించి మొట్టమొదటిమాఱు భారతభూమిని చంద్రధ్వజమును బాదుకొల్పిరి. ఈజయసింహవల్లభుని కాలమున పేర్కొనఁదగిన విశేష మిది యొక్కటియే.

ఇంకను ఈతనికాలమునాఁటికి బాదామి చాళుక్యులకును, కాంచీపుర పల్లవులకును

1. భారతి, సం. ౧, సం. ౧౨. పుట ౭౧.　　2. భారతి-సం.౧, సం. ౧౨; Cp. No. 10 of 1919-20

వైరము లంతరింపలేదు. ఉభయులునుగూడ వీరిపైవారును, వారిపై వీరును కత్తిదూయుచు మహాభయంకర యుద్ధముల దక్షిణాపథమును వీరవర్యుల వేఁడిరక్తముతోఁ దడుపుచునే యుండిరి. ఇతరదేశము లీవిధమున సంక్షోభము నొందుచున్నను వేంగీచాళుక్యరాజ్యము నిమ్మకు నీరెత్తినట్లు చలనములేక ప్రశాంతముగనే యున్నదని ఇంతవఱకుఁ గాన్పించిన శాసనముల ననుసరించి యూహింపవచ్చును.

ఈతనిపిదప నితని సవతితల్లికొడుకును, విష్ణువర్ధనుని యగ్రజుఁడును అగు కోకిలివర్మ వేంగీచాళుక్యసింహాసనమునధిష్ఠించెను. ఈతనికి కొక్కిలియనియు, విక్రమాదిత్యభట్టారకుఁడనియు నామాంతరములుకలవు. ఇతఁడు విజయసిద్ధియని బిరుదము వహించినవాఁడు. అగ్రజుఁడైన విష్ణువర్ధనుఁ డుండఁగా నీతఁడెట్లు రాజ్యమునకువచ్చెనో బోధపడకున్నది. ఇందుల కొక్క కారణము నూహింపవచ్చును.

కాంచీపురపల్లవులు కృష్ణానదికి దక్షిణభాగమునఁ దమరాజ్యమును గోలుపోయినను వైరము కారణముగ నిరంతరము వారికి బాదామిచాళుక్యులతో యుద్ధములు సంభవించుచుండుటచేత వేంగీచాళుక్యులతో స్నేహభావమున నుండకపోయినచోఁ దమరాజ్యమున కుత్తరమునుండి వారివలన ముప్పు వాటిల్లునని వారితో మైత్రిం బాటించి యుండవచ్చును. మొదటి నరసింహవర్మ తరువాత కాంచీపురసింహాసనము నెక్కిన మొదటి పరమేశ్వరవర్మ కాలముననే కాంచీపురము కొంతకాలము బాదామిచాళుక్యాధికారమునకు లోఁబడియుండెను. పరమేశ్వరవర్మ తరువాత రాజ్యమునకు వచ్చినవాఁడు రెండవ నరసింహవర్మ. ఈతనితోను, ఈతని కుమారుఁడైన రెండవ పరమేశ్వరవర్మతోను కుట్రచేసి వారిసాయమును బొంది కోకిలివర్మ చాళుక్యసింహాసనము నెక్కియుండును. ఈతఁడు ఎంతకుట్రచేసి రాజ్యమును సంపాదించినను పల్లవుల సాయములేనిదే తన రాజ్యమును నిలుపుకొనలేక పోయెను. కాని పల్లవు లీతనికి చాలకాలము సాయముచేయుటకు వీలుచిక్కలేదు. ఏలయన వారికి బాదామిచాళుక్యులతోడి వైరమటులుండ వారిలో వారికే సింహాసనమునకై తగవులు సంభవించెను. రెండవ నరసింహవర్మ దాయాదియైన రెండ నందివర్మ బలవంతుఁడై రెండవ పరమేశ్వరవర్మను పదభ్రష్టునిం గావించి తాను పల్లవరాజ్యమున కధిపతికావలెనని తంత్రములు పన్నఁజొచ్చెను. ఇంటిలో నిటువంటి కలహములు సంభవించుటచే రెండవ పరమేశ్వరవర్మ కోకిలివర్మకు సాయముచేయుటకు వీలుపడదయ్యెను. ముందాతఁడు తనరాజపదమును తాను కాపాడుకొనవలసిన యావశ్యకత సంభవించెను. ఈతరుణమును జూచి అగ్రజుఁడైన విష్ణువర్ధనుఁడు విజృంభించి బలవంతుఁడై వేంగీచాళుక్య సింహాసనమును స్వాధీనపఱచుకొని తనయనుజుఁడైన కోకిలివర్మను దేశమునుండి వెళ్లఁగొట్టెను. తుదకు కాంచీపురమున రెండవపరమేశ్వరవర్మయు, వేంగిలో కోకిలివర్మయుఁ గూడ రాజ్యపదభ్రష్టులైరి. ఈ కారణమున

కోకిలివర్మ వేంగీచాళుక్య రాజ్యమును ఆఱు మాసములు మాత్రమే పరిపాలించుట సంభవించెను.

దేశమునుండి వెళ్లఁగొట్టఁబడిన కోకిలివర్మ గత్యంతరముఁగానక కళింగమునకుఁబోయి యచ్చట పూర్వముచాళుక్యులు కోలుపోయిన దేశమును మఱల సంపాదించి యచ్చట స్వతంత్రుఁడై పరిపాలనము నెఱపెను. ఇంతవఱకు మనకు దొరకిన ఆతనియొక్కయు, ఆతనిసంతతివారి యొక్కయు శాసనములు అప్పటివే; మధ్యమకళింగములోని భోగపురవిషయమున-అనఁగా నిప్పటి సర్వసిద్ధి తాలూకాలో దొరకినవే.[1]

ఈ కోకిలివర్మకు మంగి యువరాజను కుమారుఁడుకలఁడు. ఈతనికిని విజయసిద్ధియను బిరుదము కలదు. ఈతఁడును మధ్యమకళింగమును పరిపాలించినవాఁడే. ఈతనిశాసనము కూడ నొకటి పైనుడివిన తాలూకాలోనే దొరకినది. మంగియువరాజనామము ధరించిన చాళుక్యులలో నీతఁడు రెండవవాఁడగుటచే నితనిని రెండవ మంగిరాజందురు. ఈతని కుమారుఁడు వినయాదిత్యమహారాజు. ఈతని శాసనము లింతవఱ కేవియు దొరకలేదు. ఇతనిపుత్త్రుఁడు (రెండవ) కోకిలివర్మ మహారాజు. ఈతనికి 'అనివారిత' బిరుదము కలదు. ఈతఁ డనివారితశక్తిత్రయ సంపన్నుఁడు. ఈతనిశాసనములుకూడ రెండు దొరకినవి.[2] ఇతఁడును తాత ముత్తాతలవలెనే ఎలమంచి(యల్లమంచిలి) రాజధానిగా మధ్యమకళింగము నేలెను. ఈవిధమున కోకిలివర్మయొక్కయు, ఆతని సంతతివారి యొక్కయు శాసనములన్నియు కళింగములోనే దొరకుటవలనను, వారు తమశాసనములందుఁదాము మధ్యమకళింగమును పాలించితిమని చెప్పకొనియుండుటచేతను వేంగీదేశమునుండి తఱుమఁగొట్టఁబడినపిదప కోకిలివర్మ సంతతివారికి మఱల వేంగీచాళుక్యరాజ్యము లభింపలేదనుట స్పష్టము. మనకోకిలివర్మను గుఱించికాని, ఆతని సంతతివారిని గుఱించికాని యింతకెక్కువ తెలియరాదు.

మొదటి మంగియువరాజు కుమారుఁడైన విష్ణువర్ధనుఁడు కోకిలివర్మను వెళ్లఁగొట్టి తాను క్రీస్తుశకము ౭౧౪ లో రాజ్యమునకు వచ్చి ౩౭ ఏండ్లు-అనఁగా ౭౫౧ వఱకు రాజ్యముచేసెను. ఈతనికి విష్ణురాజనియు నామాంతరముకలదు. ఇతఁడు విషమసిద్ధి బిరుదాం

1. Cp. No. 13 of 1908-1909 : C p. No 12 of 1908-1909

2. Cp. No 10 of 1908-1909; Cp. No. 11 of 1908-1909. ఈ శాసనములందు పేర్కొనఁబడిన కోకిలివర్మ లేక కక్కులి మహారాజును, మొదటి మంగి యువరాజు కుమారుఁడైన కోకిలివర్మ మహారాజును ఒక్కరుకారని నాయభిప్రాయము. ఈ కోకిలివర్మ మంగియువరాజు పౌత్రుఁడు; వినయాదిత్య మహారాజు పుత్రుఁడు. మొదటికోకిలివర్మకువలెఁగాక ఈతనికి అనివారిత బిరుదముకలదు. మొదటి కోకిలివర్మ కుమారుఁడైన రెండవమంగియువరాజు నెఱుంగుదుము గనుక వినయాదిత్యుఁ డీతని కుమారుఁడనియు, రెండవకోకిలివర్మ ఈ రెండవ మంగియువరాజు పౌత్రుఁ డనియు, వినయాదిత్యునిపుత్రుఁడనియు నూహించుట సమంజసముగ నుండకపోదు.

చిత్తుఁడు; తండ్రివలెనే సర్వలోకాశ్రయుఁడు; సమస్త భువనాశ్రయుఁడు. ఈతనియొక్క శాసనము బెజవాడలోని 'నడుంబివసతి' అను జైనుల యాలయమునకు ఈతఁడు చేసినదానమును దెలుపుచున్నది. ఈతని కాలమున జైన, బ్రాహ్మణమతములు రెండును ఆంధ్రదేశమున వర్ధిల్లుచుండెను. జైనులకు బెజవాడ ప్రధానస్థానముగ నుండెను. ఈవిష్ణువర్ధన మహారాజు జైనుల యాలయమునకును, బ్రాహ్మణులకునుగూడ భూదానాగ్రహార దానములు చేసియుండుటచేత రెండు మతములను గూడ సమబుద్ధితో నాదరించుచుండెనని యూహింపవచ్చును. జైనమత ప్రస్తావమాంధ్రదేశమున చాళుక్యులకాలమున మొట్టమొదట నీవిష్ణువర్ధనుని శాసనములందే కన్పట్టుచున్నది.

కృష్ణా!

గుండిమెడ వెంకటసుబ్బారావుగారు

హాతమార్చి హాతమార్చి యారిపోయెఁ దనంత, పృథివి నజేయమౌ భీష్మవహ్ని!
తెగమించి తేలించి, యిగిరిపోయెఁ దనంత, దుస్తరంబైన యాద్రోణజలధి!
ఉట్లూఁతలూఁచి యెట్లో శాప హతమౌట, నడఁగెను కర్ణఝంఝానిలంబు!
రిపు రక్తదాహ సంతృప్తయై తనయంత, శాంతించె గురుపుత్త్ర శస్త్రధాటి!
గీ. ఏల నీల్గెదు, చెప్పుమా వ్రేలుమడఁచి, పేరుఁగాంచిన యేమహావీరు నీవు
విజయుచేఁ బౌరుషమునఁ గూల్పించినావొ! కృష్ణ! చెప్పుమ యేమొనర్చితివో నీవు!
సీ. భీష్మప్రతాపోగ్ర విలయాగ్ని చెలరేఁగ, భయమంది చక్రంబుఁ బట్టినావు!
ద్రోణాస్త్రధాటి మీసేన పాఱుచునుండ, శూన్యదృష్టుల దిశల్ చూచినావు!
అంగభూవర శరాహతుల ధర్మజుఁడేడ్వ, నరుచెంత వెడనవ్వు నవ్వినావు!
నారాయణాస్త్ర సంధాతయై గురుపుత్త్రుఁ, డరుదేరఁ గేల్మోడ్చి మరలినావు!
గీ. పాండుసుతులకు మేటిప్రాపకమవేమొ! దిట్టతనమున జగమేలు జెట్టివేమొ!
కలదె యింతకంటెను నైచ్యమిలను, కృష్ణ! చెపుమ, యేమిచేసితో కురుక్షేత్రమందు!
గీ. సరియె, పోనిమ్ము నీపౌరుషమున కేమి! సారథివి నీవు, నీకేమి పౌరుషంబు!
ధర్మసంరక్షణైక తత్పరుఁడ వేమొ! నిలిచెనే ధర్మమేని నీవలనఁ గృష్ణ!
సీ. ఋజుమార్గ వర్తియై యెసఁగు ధర్మజుమెడల్, వంచి యొప్పించి, బొంకించు టొకటి!
పృథుశాప నిహతమై రథము క్రుంగిన వేళ, విజయుచేఁ గర్ణుఁ గూల్పించు టొకటి!
మహి నకాల దివాస్తమయముఁ గల్పించి, వంచించి, సైంధవునిఁ జంపించు టొకటి!
ధర్మంబు విడచి, గదాయుద్ధమున భీముచే సుయోధనుఁ గూల్పఁ జేయు టొకటి!
గీ. అబ్బ!-యెంతని వివరింతు నయ్య, నీవొనర్చి యున్న యధర్మ సంతతులు, కృష్ణ!
ఒక్క నీవుమాత్రము లేక యున్న, భరత, యుద్ధమని ధర్మబద్ధమై యుండునేమొ!

సాభిప్రాయ విశేషములు

గాంధిమహాత్ముని సంచారము

జాతకకథలు సిద్ధార్థుని విజయయాత్రల నతిరమణీయముగను వివరించుచున్నవి. గౌతమబుద్ధు డేయూరికి బోయినను వేలకు వేలు ప్రజలు శ్రీమంతులు సామాన్యులు, పండితులు పామరులు, బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులు మూగుచు బుద్ధదేవుని సందర్శించుచు గృతార్థులైనవిధమును గాంధిమహాత్ముని విజయయాత్రలు సంస్మరింపజేయుచున్నవి. లోకోపకారార్థమవతరించిన మహానుభావులు, బంధువులు, స్వాములు, గురువులు, దేవులు. దుఃఖభూయిష్ఠమైన సంసారప్రవృత్తియందు దుఃఖోపశమనమునకును సుఖప్రాప్తికిని సాధనంబులను బోధించెడి మహానుభావుడు, ప్రత్యక్షమైన పరదేవత. గౌతమబుద్ధు, డనిత్యములైన రాజ్యమును, భార్యాపుత్రాదులను, భాగ్యభోగములను బరిత్యజించి లోకకల్యాణమున కాత్మసమర్పణమును జేసి శాశ్వతానందమును బడసినవిధమునను గాంధిమహాత్ముడు సర్వసంగ పరిత్యాగమును జేసి లోకహితార్థ మాత్మసమర్పణమును జేసి లోకారాధ్యతను బడయగలిగెను. గాంధిమహాత్ముడు దేశమును ప్రజలను నావరించిన దుఃఖమును తనదుఃఖమునుగను సంభావించుచు పాపపరిహారార్థ మాత్మసమర్పణమును జేయుచు లోకప్రియత్వమును బడయుచున్నవిధమును మహాత్ముని దక్షిణదేశ సంచారము విశదముచేసినది. శ్రీకృష్ణభగవానులు గీతాశాస్త్రమునందు దెలిపినటులు మహాత్ముడు సర్వత్రసమత్వమును వహించుచు నిందాస్తోత్రములను పరిగణింపకను ధర్మారాధనమును జేయుచు లోకోద్ధరణమును జేయుచున్నాడు.

'సమోஉహం సర్వభూతేషు న మే ద్వేష్యోஉస్తి న ప్రియః;
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్.'

మహాత్ముడు వారినిసందర్శించిన ప్రజలకు జాతి మతకులగౌరవభేదభావములను పాటింపకను స్వధర్మారాధనమార్గమును బోధించి సమత్వసిద్ధిని విశదముచేసెను. మనీషాపంచకమునందు శ్రీ శంకరస్వాములు బోధించిన వేదాంతార్థమును గాంధిమహాత్ము డనుష్ఠించుచు తత్త్వార్థమును నిత్యజీవనమునందు ప్రజలకు సువ్యక్తముచేసి స్వీయమాహాత్మ్యమును విశదముచేసెను. గోచిపాతరాయుని ధర్మరాజ్యప్రాభవము నాక్షేపించినవారు సయితము సందర్శనసంకీర్తనము చేయుట యవసరంబైనది. శ్రీమంతులు నిరుపేదలు, బ్రాహ్మణులు పంచములు, వృద్ధులు బాలురు, స్త్రీలు పురుషులు, వారి

మనోభీష్టములను గాంధి మహాత్మునియందు సందర్శించి యానందపరవశత్వమును బడయ గలిగిరి. మమకారాహంకారపరాయణులకు గాంధిమహాత్ముని యుపదేశాచరణములు సంతృప్తినిగలుగ జేయకపోయినను ధర్మాత్ములకు పరమానందమును గలుగజేసినవి. గాంధిమహాత్మునిసందర్శించి వారి పవిత్రోపదేశముల విన గలభాగ్యమె భాగ్యము. గతమాసాంతమునందీభాగ్యమును బడసిన దక్షిణదేశవాసులు ధన్యులు.

* * *

ప్రజాస్వాగతము

వేనవేలు ప్రజలు మహాత్మునకు స్వాగతంబునొసంగి వారికిగల యవ్యాజభక్తి విశ్వాసములనుసహస్రముఖములను విశదముచేసిరి. మహాత్మునకు చెన్నపురినుండీ కన్యాకుమారి వరకును ప్రజలు మహోత్సవములను జేసి మంగళహారతులను సమర్పించిరి. ప్రజలు గంటలకొలదికాలము వారినిజూచి యానందించుటకు వేచియుండిరి. తిరువాన్కూరు మహారాణియును ప్రజలును నొసంగిన సత్కారాతిథ్యములు మహాత్ముని ప్రతిభ వృద్ధిని బొందుచున్న విధమును విశదముచేసినవి. చెన్నపురియందలి ప్రజలుచూపిన యుత్సాహమును మహాత్ముని ప్రతిభను విశదము చేసినది. శ్రీమహారాణీ విషయమై మహాత్ముడు యంగు ఇండియాపత్రికయందు వ్రాసిన సంకీర్తనమును శ్రీమంతులు మననము చేయుదురుగాత! చెన్నపురి కార్పొరేషను సమర్పించిన స్వాగతపత్రము మహాత్ముని ప్రతిభాతిశయమును విశదము చేసినది. పంచములు పంచమోద్ధారకుడనియును, రాజ్యాంగాందోళకులు స్వరాజ్యోద్ధారకుడనియును, స్త్రీలు స్వాతంత్ర్యధర్మోద్ధారకుడనియును, విద్యార్థులు గురువరేణ్యుడనియును, ప్రజలవతారపురుషుడనియును, భావించి యారాధించిరి. బుద్ధిజాడ్యముగల యభిమానాంధులు దివ్యప్రభావమును జూడజాలకుండుట వారిప్రారబ్ధకర్మఫలముగాని ప్రజల యుత్సాహలోపముగాదు. గాంధిమహాత్ముడనవరతముచేసెడి సత్యాహింసాధర్మములు ప్రజాపాలకులదృష్టి నుచితరీతి నాకర్షించి గాంధిమహాత్ముని సంచారమునకనురూపమైన ఫలమును భగవంతుడు ప్రసాదించుగాత!

* * *

మహాత్ముని యుపదేశములు

విజయమునకు మూలమైన ధర్మసంకల్పము మహాత్ముని యుపదేశములకు మూలబీజము. సకలమతసారమును సనాతనమునునైన 'సత్యాన్నాస్తి పరోధర్మః' 'సత్యమేవ జయతేనానృతం' ధర్మములను మహాత్ముడు సంపూర్ణమైన జీవనవిధానమునకు సమన్వయము చేయుటకు జేయుచున్న ప్రయత్నములు ప్రపంచదృష్టి నాకర్షించినవి. సత్యవ్రతానుష్ఠానమున కాధారమైన యహింసాధర్మము హింసాపూరితమైన వర్తమాన యుగమునుద్ధరించుట కవసరమైనది. ఆయవసరమునకనురూపముగను భారతసంస్కారమునకు పరిపాటియైన యహింసాధర్మమును పునరుద్ధారణచేయుటకు గాంధిమహాత్ముడు ఖద్దరు యోగసాధనము నుపదేశించుచున్నాడు.

అహింసాయోగాభ్యాసమునకును, మానవ ధర్మారాధనమునకును, దుఃఖనివృత్తికిని, స్వరాజ్య సంపాదనమునకును ఖద్దరుయోగసాధనమును మహాత్ముడుపదేశించుచున్నను, ప్రజల దృష్టి జయజయధ్వానములందు లగ్నమైన విధమునను ఖద్దరునందు లగ్నముగాకుండుట ప్రారబ్ధకర్మఫలముగ నున్నది. గాంధిమహాత్ముడు తనసంచారమునం దన్ని సందర్భములందును ఖద్దరుయోగము నుపదేశించెను. మహాత్ముడు తిరిగి రెండుమూడుమాసములకు దక్షిణదేశసంచారమును జేయుట కేతెంచనున్నాడు. అప్పటికైనను మహాత్ముడు ప్రార్థించునట్లు ప్రజలు ఖద్దరుధారణమును జేయుచు సత్యాగ్రహదీక్షార్హతను బడయుదురని విశ్వసించుట కవకాశములు గన్పట్టకున్నవి. సభావేదికలయందు గంభీరోపన్యాసములను జేసెడి నాయకులకే చిత్తశుద్ధి గలుగనపుడు జనసామాన్యమును నిందించుట యనుచితము. ప్రజలు గాంధిమహాత్ముని సందర్శించుటకు జూపిన యుత్సాహము నందొకపాలైనను కార్యాచరణమునందు జూపిన మహాత్ముని సంచారము సార్థకమై భారతమాత ధన్యతను బడయగలదు. ప్రజోత్సాహ మపారముగను వ్యక్తమగుచున్నను నిరంకుశప్రభుత్వమునకు ప్రబోధోదయముగలుగకను నధికారదార్ఢ్యము యథేచ్ఛగను నేలుచున్నది. ప్రజలకు గాంధిమహాత్ముడుకోరునట్లు ప్రతిఘటన సామర్థ్యము గలుగనంతవరకును భారతమాతకు తరణోపాయము దుర్లభముగ నున్నది.

* * *

ప్రభుత్వనిర్లక్ష్యము

నిరంకుశప్రభుత్వము ప్రజాశయముల పట్లను జూపుచున్న నిర్లక్ష్యప్రతిఘటన భావములు దినదినాభివృద్ధిని గాంచుచున్నవి. వంగ రాష్ట్రనిర్బంధశాసనమును సామ్రాజ్యశాసన సభలును ప్రజలునునిరసించినను రీడింగుప్రభువు సమర్థించి నిరంకుశాధికారప్రాబల్యమును విశదముచేసెను. సామ్రాజ్యశాసనసభయును రాష్ట్రీయశాసన సభలును చేసిన తీర్మానములును నిర్ణయములును మృతాక్షరములుగ నున్నవి. సమర్థనాధికార వినియోగమే పరిపాలనమునకు సామాన్యలక్షణముగ బరిణమించినది. మాంటుఫర్డు సంస్కరణముల నిరుపయోగత్వము విశదమైనది. సంస్కరణములు కోట్లరూప్యముల వ్యయమును మాత్రము ప్రసాదించినవి. సంస్కరణములు ప్రజాస్వాతంత్ర్యమును స్వరాజ్యమును వెనుకబెట్టినవిగాని ముందునకు నడుపలేదు. నిరంకుశాధికారవర్గమునకు వేతనాధికారములు ప్రతిబంధకములు లేకను వృద్ధినిబొందుచున్న విధమును గ్రేటుబ్రిటనునందలి వ్యవహారములును విశదముచేయుచున్నవి. పౌరసేవోద్యోగవర్గము యొక్క ప్రయోజనములను రక్షించుటయందుగల యభిమానము భారతరాజ్యాంగవికాసమును జేయుటయందు బర్కెన్‌హెడ్డు ప్రభువునకు గాని రీడింగుప్రభువునకు గాని రాష్ట్రపాలకులకుగాని గనుపడదు.

* * *

పౌరసేవోద్యోగవర్గము

లీకమిషను సిఫార్సులను సామ్రాజ్య శాసనసభ నిరాకరించినను వానినాచరణమునందు బెట్టుటకు పార్లమెంటునందు బర్కెను హెడ్డు ప్రభువు శాసనమును ప్రవేశపెట్టి సంస్కరణముల దౌర్బల్యమును వ్యక్తము చేసెను. రాజ్యాంగములందు బ్రిటీషుపౌర సేవోద్యోగుల ప్రాబల్యమును తగ్గించుటకు బదులు శాసనము వృద్ధిచేయుచున్నది. సంవత్సరమునకు కోటిరూప్యములకు మించినవ్యయ

భారము గలుగుచున్నది. పౌరసేవోద్యోగుల మీదను శాసనసభలకును మంత్రులకును నింత వఱకును గల స్వల్పాధికారమును సయితమంతరింప జేయుచున్నది. భారతీయులు స్వరాజ్యమును గోరుచుండగను బ్రిటీషు ప్రభుత్వము దుర్భరమైన పౌరసేవోద్యోగపాశమును దృఢముగనుబంధించుచున్నది. దేశక్షేమమునకుసాధనములైన సంస్కరణములను విమర్శించుటకు బ్రిటీషు ప్రభుత్వవర్గము నిరాకరించుచు దేశారిష్టములకు మూలమైన నిరంకుశవర్గమును చిరకాలమురక్షించుటకు బూనుకొనుచున్నది. కర్నలు వెడ్జివుడ్డు రాజ్యాంగసంస్కరణములు వర్తమాన పరిస్థితులందు వికాసమునుబొందుట కవకాశములులేవని విశదము చేసెను. రీడింగు ప్రభువును నితరాధికారులును జేయబూనిన స్వదేశయాత్రకు నిరంకుశాధికార సంరక్షణమే ఫలమని పరిస్థితులు విశదము చేయుచున్నవి. రాజ్యాంగములందు నిరంకుశాధికారవర్గమును, వారియభిమానులును భారతీయుల సహకారమును దుర్లభము చేయుచు స్వరాజ్యపక్షనాయకుల సహకారమునుగోరుట విచిత్రముగనున్నది. స్వరాజ్యపక్షనాయకులు దేశబంధు దాసుమోతీలాల్ నెహ్రూ, విట్టలుభాయి పటేలుగార్లుమొదలగువారు ప్రతిష్టంభనతంత్రము నవలంబించి ప్రభుత్వపరాజయమును జేసినను ప్రభుత్వవ్యవహారములు ధ్రువపత్రసాధనమునను యథాప్రకారము సాగుచున్నవి. బర్కెన్ హెడ్డు ప్రభువు దాసుగారిని దార్జన్యమార్గనిరసనమున కభినందించుచు ప్రభుత్వదార్జన్యమార్గవ్యాపనమునకు తోడ్పాటును కోరుట నిరంకుశప్రభుత్వము నావహించిన యవినయమును దెలుపుచున్నది. ఆత్మగౌరవముగల భారతీయులు ప్రభుత్వమునకు దోడ్పడుట దుర్లభమని దాసుమోతీలాలునెహ్రూ మొదలగు వారిప్రసంగములును శాసనసభలవ్యవహారములును విశదము చేసినవి. స్వరాజ్యపక్షప్రాబల్యములేకను ప్రభుత్వావలంబనపక్షముగల చెన్నరాష్ట్రమునందు సయితము గోషెనుప్రభువు ధ్రువపత్రసాధనము నవలంబించుట సంస్కరణముల దుర్విపాకమును విశదముచేయుచున్నది. నిరంకుశవర్గమునందు హృదయపరివర్తనము గలుగకపోయినను దాసుగారిసాహచర్యమును బర్కెన్ హెడ్డు ప్రభువును వారియనుచరులును నుపేక్షించుట బాలిశభావమును విశదముచేయుచున్నది. భావికాలమందు స్వరాజ్యపక్షదంశనీతి యేరూపముదాల్చినను గతించిన రెండేండ్లయందును నవలంబించిన ప్రతిఘటనసాధనము నిరంకుశప్రభుత్వమునకు జ్ఞానోదయమును గలుగజేయజాలి యున్నను నిరంకుశదుర్గమునందు సుఖాసీనమైన నిరంకుశవర్గమునకు జ్ఞానోదయము గలుగలేదని నిత్యవ్యవహారములు విశదముచేసినవి. భారతరాజ్యాంగవ్యవహారములు నిరంకుశాధికారబలమును భారతీయులదుర్బలమును వేయినోళ్లను తెలుపుచున్నవి. భారతీయులందఱును పరస్పరవిభేదములను విసర్జించి యేకోన్ముఖులై పాటుపడవలసిన యవసరమును, గాంధిమహాత్ముడు తనయాచరణములవలనను ఉపదేశములమూలమునను చేయుచున్న త్యాగప్రభావమును గ్రహించి వారి ప్రయత్నములకు దోడ్పడి స్వధర్మనిర్వహణమును జేసి మాతృదేశవిమోచనమునకును లోకకల్యాణమునకును దోడ్పడి ధన్యవాదములను బడయుదురుగాత!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

Edited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty Street, G. T. Madras.